
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 78

సోమవారం 9-6-2025



మిస్‌యూనివర్స్‌కు మన తెలుగు తేజాలు -11లో



చదువు 'కొంటు'న్నారా?
పెరిగిపోతున్న ఫీజులు.. ముందస్తు ప్రణాళికతో సాధించడం సులభమే -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్


మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు



ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి. మొయితీ వర్గం నాయకులను పోలీసులు శనివారం అరెస్టు చేయడంతో ఆ వర్గం ప్రజలు ఆదివారం వీధుల్లోకి వచ్చారు. నిరసనలతో హోరెత్తించారు. పోలీసులతో ఘర్షణకు దిగారు.

- వివరాలు 6లో▶

6,133కు చేరిన కరోనా యాక్టివ్ కేసులు



దేశంలో కరోనా వైరస్ ఉధృతి పెరుగుతూనే ఉంది. మొత్తం కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కు చేరుకుంది. గత 48 గంటల్లో 769 కొత్త కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది.

- వివరాలు 6లో▶

అనుమానాలు ఉంటే హైకోర్టుకెళ్లండి



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ కొట్టిపారేసింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు భావిస్తే హైకోర్టుకు వెళ్లొచ్చని ఈసీ వర్గాలు స్పష్టంచేశాయి.

- వివరాలు 6లో▶

నేడు సిట్ ముందుకు ప్రభాకర్‌రావు

రాష్ట్ర ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆ విభాగం మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు సోమవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. అనేక నివేదికలను క్రోడీకరించిన పోలీసులు ప్రశ్నావళి సిద్ధం చేశారు.

- వివరాలు 14లో▶



ముగ్గురికే పట్టం

మంత్రివర్గంలోకి గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి



రాజ్‌భవన్‌లో వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, గడ్డం వివేక్‌తో మంత్రులుగా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సీఎం రేవంత్

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

- దైవసాక్షిగా ప్రమాణం చేసిన ముగ్గురు.. హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు
- సరిగ్గా 9 నిమిషాల్లో ముగిసిన కార్యక్రమం.. 12:13–12:22 గంటల మధ్య ప్రమాణం
- ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత కుదిరిన ముహూర్తం.. 15కు చేరిన కేబినెట్ సభ్యుల సంఖ్య
- ఇంకా మూడు బెర్తులు ఖాళీనే..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రులుగా గడ్డం వివేక్ వెంకటస్వామి (చెన్నూరు), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి), వాకిటి శ్రీహరి ముదిరాజ్ (మక్తల్)లు ప్రమాణ స్వీకారం చేశారు. ఊహించినట్టుగానే ఈ దఫాలో ఈ ముగ్గురికే మంత్రులుగా అవకాశం లభించింది. ఆదివారం మధ్యాహ్నం 12:13 నిమిషాలకు రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ముగ్గురు మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సరిగ్గా 9 నిమిషాల్లో ముగిసింది. జాతీయ గీతాలాపన అనంతరం తొలుత వివేక్ వెంకటస్వామి, ఆ తర్వాత అడ్లూరి లక్ష్మణ్, అనంతరం వాకిటి శ్రీహరిల చేత గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రమాణం చేయించారు. దైవ సాక్షిగానే వివేక్ ఇంగ్లిష్‌లో, మిగిలిన ఇద్దరు తెలుగులో ప్రమాణం చేశారు. ఈ ముగ్గురిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్ రెడ్డిలు పూలబొకేలు ఇచ్చి అభినందించారు. ప్రమాణ స్వీకారం అనంతరం మరోమారు జాతీయగీతాలాపనతో 12:22 నిమిషాలకు ప్రమాణ మిగతా 2వ పేజీలో ▶

సామాజిక న్యాయానికే పెద్దపీట
ఇద్దరు ఎస్సీ, ఒక బీసీ సామాజిక వర్గ నేతకు కేబినెట్ విస్తరణలో చోటు

2లో

అసంతృప్తులు.. బుజ్జగింపులు
ఆశావహులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ పెద్దలు



మహిళా సాధికారతకు 11 ఏళ్లుగా కృషి

'నారీ శక్తి అన్‌స్టాపబుల్' అంటూ ప్రధాని మోదీ ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఫొటో

ప్రభుత్వ అండతో వారి కలలు సాకారం: ప్రధాని మోదీ

దేశంలో మహిళల అభివృద్ధి, సాధికారతకు తమ ప్రభుత్వం 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'మహిళల నేతృత్వంలో అభివృద్ధి'కి ప్రభుత్వం కొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. సైన్స్, విద్య, క్రీడలు, స్టార్టప్స్, సైనిక దళాలు సహా అన్ని రంగాల్లో నారీమణులు అద్భుతాలు సృష్టిస్తున్నారని, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. 6లో



చిన్నకారు చిన్నబోతోంది!

- 2019–20లో 46.5% సేల్స్ ఈ విభాగం నుంచే
- 2023–24లో 27.7%కి దిగొచ్చిన వాటా
- సామాన్యుడికి భారంగా మారిన ధరలు.. భారీగా తగ్గిన ఎంట్రీ లెవెల్ కార్ల విక్రయాలు

3లో



నయా మోసం.. కాల్‌ఫార్వర్డింగ్ ఫిషింగ్

- కొరియర్ పేరుతో కాల్ చేసి వివరాలు సేకరిస్తున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న టీజీ సైబర్ సెక్యూరిటీ అధికారులు

14లో



మాగంటి భౌతికకాయానికి నివాళులర్పించి ఆయన కుమారుడిని ఓదారుస్తున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, పువ్వాడ, సుధీర్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మాగంటి కన్నుమూత

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

- కన్నీటిపర్యంతమైన మాజీ సీఎం కేసీఆర్
- పాడెమోసిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు
- అధికార లాంఛనాలతో మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గోపీనాథ్
- సీఎం రేవంత్, మంత్రులు, ప్రముఖుల సంతాపం

- వివరాలు 5లో



ఇంటర్ కాలేజీల ఇష్టారాజ్యం

గుర్తింపు లేకున్నా అడ్మిషన్ల జోరు
గుర్తింపు వచ్చినవి సగం కూడా లేవు
మొద్దు నిద్రలో అధికారులు
ఆందోళనలో తల్లిదండ్రులు

3లో

స్కూలింగ్ బీజేపీలో.. కాలేజీ చంద్రబాబు వద్ద..

ఉద్యోగం రాహుల్ వద్ద



సిక్కిం మాజీ గవర్నర్ దివంగత రామారావు సతీమణి వసంతకుమారికి పుస్తకం అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

బీజేపీలో చాలామందితో నాకు మంచి సంబంధాలు

- ప్రజలతో మమేకమయ్యేవాళ్లే రాజకీయాల్లో రాణిస్తారు
- దత్తాత్రేయ 'ఆత్మకథ'పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి
- పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్
- హాజరైన వెంకయ్య, చంద్రబాబు, పలువురు గవర్నర్లు
- సమాజం కోసం పనిచేయడమే రాజకీయం: దత్తాత్రేయ

సాక్షి, హైదరాబాద్: ప్రజలతో నిత్యం సంబంధాలు కొనసాగించే వారికే నాయకుడిగా గుర్తింపు వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారంతా నిరంతరం ప్రజల్లో ఉంటేనే విజయం సాధిస్తారని పేర్కొన్నారు. తాను స్కూలింగ్ బీజేపీలో, కాలేజీలో టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద చేసి, ఉద్యోగం రాహుల్‌గాంధీ వద్ద చేస్తున్నా అని వ్యాఖ్యానించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ'పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లో మిగతా 3వ పేజీలో ▶

మంత్రుల ప్రొఫైల్

గడ్డం వివేక్

పూర్తిపేరు: గడ్డం వివేక్ వెంకటస్వామి
పుట్టిన తేదీ: 30 నవంబర్, 1957
తల్లిదండ్రులు: కళావతి–గడ్డం వెంకటస్వామి
సామాజికవర్గం: ఎస్సీ (మాల)
చదువు: ఎంబీబీఎస్ (ఓయూ)
భార్య: సరోజ
పిల్లలు: వృత్తిక, వంశీ, వెంకట్, వైష్ణవి
రాజకీయ జీవితం: 2009–2014 వరకు పెద్దపల్లి ఎంపీ
ప్రస్తుతం: 2023 నుంచి చెన్నూర్ ఎమ్మెల్యే

వాకిటి శ్రీహరి

పేరు: వాకిటి శ్రీహరి
పుట్టిన తేదీ: 01 నవంబర్, 1972
విద్యాభ్యాసం: డిగ్రీ (బీఏ)
తల్లిదండ్రులు: రాములమ్మ–నర్సింహులు
భార్య: వాకిటి లలిత (బీకాం, ఎంఏ, బీఈడీ)
పిల్లలు: అచ్యుత్‌రాం (జాతీయ స్థాయి క్రికెట్ ప్లేయర్), అమిత్‌సాయి
రాజకీయ జీవితం: సర్పంచ్ (2006–12), జెడ్పీటీసీ సభ్యుడు (2014–18), నారాయణపేట డీసీసీ అధ్యక్షుడిగా
ప్రస్తుతం: 2023 నుంచి మక్తల్ ఎమ్మెల్యే

అడ్లూరి

పేరు: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
పుట్టిన తేదీ: 01 ఏప్రిల్, 1968
విద్యాభ్యాసం: ఇంటర్
తల్లిదండ్రులు: లక్ష్మి – నాగయ్య
భార్య: కాంతకుమారి (ఎకనామిక్స్ లెక్చరర్)
పిల్లలు: హరీశ్వర్
రాజకీయ జీవితం: ఎన్‌ఎస్‌యూఐ నుంచి యూత్ కాంగ్రెస్ వరకు వివిధ హోదాల్లో పని చేశారు. 2006లో ధర్మారం జెడ్పీటీసీగా ఎన్నిక, 2010–12 వరకు కరీంనగర్ జెడ్పీచైర్మన్. 2013–14 వరకు ఏపీ షెడ్యూల్ కాస్ట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్
ప్రస్తుతం: 2023 నుంచి ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్

వెనుకబడిన వర్గాల గొంతునవుతా

తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కేబినెట్‌లో చోటు దక్కడం సంతోషంగా ఉంది. తెలంగాణలో బీసీ కులగణన చేసిన తర్వాత.. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేలా నాకు అవకాశం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. పార్టీని నమ్ముకుంటే పదవులు వెతుక్కుంటూ వస్తాయనే దానికి నేనే నిదర్శనం. వెనుకబడిన వర్గాల గొంతునై.. వారి అభ్యున్నతికి కృషి చేస్తా. మంత్రివర్గంలో ఏ బాధ్యత ఇచ్చినా, పరిపూర్ణంగా నిర్వహిస్తా.

– వాకిటి శ్రీహరి, మంత్రి

సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం

సామాన్య కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో దక్కిన గౌరవం. పార్టీని అంటిపెట్టుకొని కష్టపడితే తప్పకుండా గుర్తింపు ఉంటుందన డానికి నా మంత్రి పదవే నిదర్శనం. నన్ను నమ్మి గెలిపించిన ధర్మపురి ప్రజల ఆశలు నెరవేర్చేలా పనిచేస్తా, ముఖ్యమంత్రి, అధిష్టానం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్ సారథ్యంలో అన్ని వర్గాలకు అవకాశాలు దక్కుతాయి. అందులో భాగంగానే మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాకు మంత్రి పదవి లభించింది.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి

ముగ్గురికే పట్టం

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమం ముగిసింది. నూతన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ జి ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కొత్త మంత్రుల కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలు, కేబినెట్ మంత్రులు గ్రూప్ ఫొటో దిగారు.

మరో మూడు బెర్తులు ఖాళీగానే...

కొత్తగా ముగ్గురు ప్రమాణం చేయడంతో రాష్ట్ర మంత్రివర్గ సభ్యుల సంఖ్య 15కు చేరింది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, మరో 11 మంది కేబినెట్‌లో ఉన్నారు. వీరికి తోడు మరో ముగ్గురు కొత్తగా మంత్రులు కాగా, ఇంకా మూడు బెర్తులు ఖాళీగానే ఉండిపోయాయి. ఈ మూడు బెర్తులను కూడా వీలున్నంత త్వరలోనే భర్తీ చేయాలనే యోచనలో అధిష్టానం ఉన్నట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రెండో దఫా కేబినెట్ విస్తరణ ఉంటుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన సరిగ్గా సంవత్సరం ఏడు నెలల తర్వాత విస్తరణకు ముహూర్తం కుదిరింది. 2023, డిసెంబర్ 7న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా, మళ్లీ 2025, జూన్ 8న తొలిదఫా విస్తరణ జరిగింది. అదిగో.. ఇదిగో అంటూ పలుమార్లు వాయిదా పడిన అనంతరం ఎట్టకేలకు ముగ్గురిని కేబినెట్‌లో తీసుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలతో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, ఉత్తమ్, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి

సామాజిక న్యాయానికే పెద్దపీట

ఇద్దరు ఎస్సీ, ఒక బీసీ సామాజిక వర్గ నేతకు కేబినెట్ విస్తరణలో చోటు

తాజా విస్తరణతో ఎనిమిదికి చేరనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మంత్రుల సంఖ్య
- కేబినెట్‌లో సగానికి పైగా బడుగు, బలహీనవర్గాల నేతలు
- సీఎం రేవంత్‌తో కలిసి నలుగురు రెడ్డి మంత్రులు. వెలమ, బ్రాహ్మణ, కమ్మ వర్గాల నుంచి ఒక్కొక్కరు
- మలి విస్తరణలోనూ బీసీ, ఎస్టీలకు అవకాశం ... చీఫ్ విప్ పదవి రెడ్డి సామాజికవర్గానికే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సామాజిక న్యాయానికే పెద్దపీట వేసింది. ఇప్పటికే ఉన్న కేబినెట్ కూర్పును బేరీజు వేసుకొని మరీ సామాజిక న్యాయం కల్పించామనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లేలా మంత్రులను ఎంపిక చేసింది. ఇద్దరు ఎస్సీ, ఒక బీసీ నాయకుడికి మాత్రమే విస్తరణలో అవకాశం కల్పించింది. విస్తరణకు ముందు రాష్ట్ర కేబినెట్‌లో ఉన్న 12 మంది మంత్రుల్లో (ముఖ్యమంత్రితో సహా) నలుగురు రెడ్డి, వెలమ, బ్రాహ్మణ, కమ్మ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఏడుగురు అగ్రవర్ణాలకు చెందిన మంత్రులున్నారు. వీరితోపాటు ఇద్దరు బీసీ, ఇద్దరు ఎస్సీ, ఒక ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు కేబినెట్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో మరో ముగ్గురు బీసీ, ఎస్సీ నేతలకు కేబినెట్‌లో అవకాశం కల్పించింది. దీంతో ప్రస్తుతం కేబినెట్‌లోని 15 మంది సభ్యుల్లో అగ్రవర్ణాల కంటే అధికంగా 8 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలకు స్థానం కల్పించినట్టయ్యింది. ఓసీ నేతలను ఏడుగురికి మాత్రమే పరిమితం చేసింది. కేబినెట్‌లో ఓసీల కంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులను ఎక్కువ మందికి అవకాశం కల్పించడం ద్వారా సగానికిపైగా ఆయా సామాజిక వర్గాలకు చెందిన నేతలుండేలా జాగ్రత్త తీసుకుందని స్పష్టమవుతోంది. ఇందుకోసం రెడ్డి సామాజిక వర్గాల నేతల్లో మంత్రి పదవులు చేపట్టేందుకు అర్హులైన సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వెలమ వర్గానికి చెందిన ప్రేమ్‌సాగర్‌రావు లాంటి నేతలను కూడా పట్టించుకోలేదు. ఇదే క్రమంలో సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్, ప్రేమ్‌సాగర్‌రావుకు అవకాశం ఇవ్వాలన్న డిప్యూటీ సీఎం భట్టిల విజ్ఞప్తులు, మంత్రి పదవి ఇస్తామని అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజగోపాల్‌రెడ్డికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ అధిష్టానం పక్కన పెట్టడం గమనార్హం.

కీలక పదవులూ వారికే

మంత్రివర్గం సంగతి అటుంచితే.. అసెంబ్లీలో మిగిలిన పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకే ప్రాధాన్యం లభించింది. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ (ఎస్సీ) ఉండగా ఎస్టీ (లంబాడా) వర్గానికి చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించనుంది. ప్రస్తుతం విప్‌గా ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ఎస్సీ)కి మంత్రివర్గంలో అవకాశం కల్పించగా, మిగిలిన ఇద్దరు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్యలు బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే. ఈ నేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్థానంలో ఖాళీ అయిన విప్‌తోపాటు చీఫ్ విప్ పదవులు మాత్రమే అగ్రవర్ణాలకు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. లేదంటే అడ్లూరి లక్ష్మణ్ స్థానాన్ని మరోమారు ఎస్సీ నేతతో భర్తీ చేస్తే..ఒక్క చీఫ్ విప్ మాత్రమే రెడ్డి సామాజికవర్గానికి వస్తుంది. ఈ పదవిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిలలో ఒకరిని వరించే అవకాశాలున్నాయి. స్థానిక ఎన్నికల అనంతరం మరోమారు కేబినెట్ విస్తరణ ఉంటుందనే వార్తలు కూడా వస్తున్నాయి. ఆదివారం జరిగిన విస్తరణ అనంతరం కేబినెట్‌లో నియమించుకునేందుకు వీలున్న మూడు స్థానాలను అప్పుడు భర్తీ చేయొచ్చు. అప్పుడు కూడా కేవలం ఒక్కటి మాత్రమే అగ్రవర్ణాలకు వస్తుందని, ఒకటి బీసీ, మరొటి ఎస్టీ లేదా మైనార్టీ సామాజికవర్గాలకు కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. మొత్తం మీద తాజా విస్తరణ తరహాలోనే భవిష్యత్‌లో జరిగే విస్తరణలోనూ అగ్రవర్ణాలతో పోలిస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అగ్రవర్ణాలకు ఇతర పదవులు కేటాయించాలనే యోచనలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉన్నట్టు అర్థమవుతోంది.

తెలంగాణ కేబినెట్ కూర్పు ఇలా..

సామాజిక వర్గం	మంత్రుల సంఖ్య
రెడ్డి	4
ఎస్సీ	4
బీసీ	3
ఎస్టీ	1
వెలమ	1
కమ్మ	1
బ్రాహ్మణ	1

ఆ శాఖలతోనే సర్దుబాటు?

సీఎం రేవంత్ వద్ద మున్సిపల్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమం, కార్మిక, పశుసంవర్ధకం, విద్య, హోం, మైనింగ్
- కోర్ అర్బన్ తెలంగాణ శాఖను తన వద్దనే ఉంచుకునే యోచనలో సీఎం

సాక్షి, హైదరాబాద్: కొత్త మంత్రులకు ఏఏ శాఖలు కేటాయిస్తారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న శాఖల నుంచే కొన్ని శాఖలను కేటాయిస్తారా? లేక ఇతర మంత్రుల వద్ద ఉన్న శాఖలను ప్రక్షాళన చేస్తారా చూడాలి. అయితే..ఇప్పుడిప్పుడే పాలన కుదురుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుతానికి శాఖల ప్రక్షాళన వరకు వెళ్లే అవకాశం లేదని, తన వద్ద ఉన్న శాఖలనే కొత్త మంత్రులకు విభజించే యోచనలో సీఎం ఉన్నారని తెలుస్తోంది. ప్రస్తుతానికి సీఎం రేవంత్‌రెడ్డి వద్ద సాధారణ పరిపాలన శాఖతోపాటు హోం, విద్య, మున్సిపల్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమం, కార్మిక, పశుసంవర్ధకం, మైనింగ్ తదితర శాఖలున్నాయి. ఇందులో మున్సిపల్ శాఖను రెండుగా విభజించి ఒకటి తన వద్దనే ఉంచుకొని, మరోటి ఇచ్చే అవకాశాలున్నాయి. ఇక, విద్యాశాఖను ఎవ్వరికీ ఇవ్వబోనని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ముగ్గురూ తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలే కావడంతో అక్రమఫోన్ ట్యాపింగ్, ఇతర కీలక కేసులున్న నేపథ్యంలో ప్రాధాన్యమైన హోంశాఖను వారికి అప్పగించకపోవచ్చనే చర్చ జరుగుతోంది. కార్మిక, పశుసంవర్ధకం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం, మైనింగ్ శాఖలను కొత్త మంత్రులకు అప్పగించనున్నట్టు తెలుస్తోంది. దీనిపై నేడో, రేపో అధికారిక ప్రకటన వెలువడుతుందని తెలుస్తోంది. కొత్తగా మంత్రుల కోసం సచివాలయంలో ఫ్లోర్‌లు, చాంబర్‌ల కేటాయింపు అనంతరం ఒకట్రెండు రోజుల్లో కొత్త మంత్రులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

కర్ణాటక తరహాలో పురపాలికల విభజన

కర్ణాటకలో బెంగళూరు, పరిసర పట్టణ ప్రాంతాలకు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంత్రిగా ఉండగా, మిగిలిన కర్ణాటక రాష్ట్రానికి మరో మంత్రి ఉన్నారు. కర్ణాటకలో ఉన్న తరహాలోనే కోర్ ఏరియాకు ఒకరు, మిగిలిన మున్సిపాలిటీలకు మరొకరిని మంత్రులుగా నియమిస్తారని సమాచారం. అయితే, కోర్ ఏరియాను తన వద్దే ఉంచుకోవాలని రేవంత్ భావిస్తున్నారు. మూసీ పునర్నిర్మాణం, ఫోర్త్ సిటీ ఏర్పాటు తదితర కీలకాంశాలు చేపట్టాల్సి ఉన్నందున, హెచ్‌ఎండీఏతోపాటు తాను నిర్మించతలపెట్టిన ఫోర్త్‌సిటీ పరిధిని మినహాయించి రాష్ట్రంలోని ఇతర పట్టణ ప్రాంతాలను ఒక మంత్రికి అప్పగించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతానికి పురపాలక శాఖ కార్యదర్శులకు కూడా ఇదే తరహాలో పని విభజన చేయడం గమనార్హం.

ఎవరికి.. ఏ శాఖ!

సామాజిక, ప్రాంతాల వారీగా సమీకరణల నేపథ్యంలో కొత్త మంత్రులకు ఇచ్చే శాఖలపై చర్చ జరుగుతోంది. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వాకాటి శ్రీహరికి మత్స్య, పశుసంవర్ధక శాఖతో మరో ముఖ్యమైన శాఖ ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతోంది. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమం, వివేక్‌కు కార్మిక, ఉపాధి కల్పన శాఖ ఇవ్వొచ్చని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏరియా కూడా సింగరేణి బెల్ట్ కావడం, గతంలోనూ ఈ శాఖను ఆయన సోదరుడు వినోద్ చూసిన నేపథ్యంలో కార్మిక శాఖ కేటాయించవచ్చనే ప్రచారం జరుగుతోంది. దీనితోపాటు మరో ముఖ్యమైన శాఖ కూడా ఇచ్చే అవకాశాలున్నాయి.

కేబినెట్‌కు దూరంగా.. ఆ మూడు జిల్లాలు

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రాతినిధ్యం ఇంకా పెండింగే

సాక్షి, హైదరాబాద్: తాజా మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చోటు లభించగా, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రాతినిధ్యం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. తొలి విడత కేబినెట్‌లో చోటు దక్కని నాలుగు జిల్లాల్లో ఆదిలాబాద్ నుంచి వివేక్ మంత్రిగా ప్రమాణం చేయగా, గతంలో ప్రాతినిధ్యం ఉన్న మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల నుంచే మరో ఇద్దరు మంత్రులయ్యారు. అయితే కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి కేబినెట్‌లో ఇప్పటికే ఇద్దరు చొప్పున ఉండగా, ఇప్పుడు ఒకొక్కరి చేరికతో ఆ రెండు జిల్లాల ప్రాతినిధ్యం మూడుకు పెరిగింది. కరీంనగర్ నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తోడుగా ఇప్పుడు అడ్లూరి లక్ష్మణ్ చేరారు. సీఎం రేవంత్‌తోపాటు జూపల్లి కృష్ణారావులు మహబూబ్‌నగర్ నుంచి మంత్రివర్గంలో ఇప్పటికే ఉండగా కొత్తగా వాకిటి శ్రీహరి చేరారు. దీంతో ఇప్పటికే ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లా (భట్టి, పొంగులేటి, తుమ్మల) సరసన కరీంనగర్, మహబూబ్‌నగర్‌లు కూడా చేరాయి.

భవిష్యత్‌లో ఏమవుతుందో..?

మరోమారు కేబినెట్ విస్తరణ జరిగితే మాత్రం నిజామాబాద్ జిల్లాకు స్థానం ఖాయమని..సీనియర్ నేత పి.సుదర్శన్‌రెడ్డి పేరును ఈసారే ప్రకటించాల్సి ఉన్నా సామాజిక సమీకరణల నేపథ్యంలో సాధ్యం కాక చివరి క్షణంలో తొలగించారని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. ఇప్పటికే స్పీకర్ పోస్టు ఉన్న రంగారెడ్డి జిల్లా ఈసారికి చీఫ్ విప్ పదవితో సరిపెట్టుకోవాల్సిందేనని, మంత్రి పదవికి అనుకూల సమీకరణలు ఈ జిల్లాలో లేవని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అనూహ్య పరిణామాలు జరిగితే తప్ప రంగారెడ్డి జిల్లాకు మంత్రిపదవి కష్టమేనని వ్యాఖ్యానిస్తున్నారు. హైదరాబాద్‌లోనూ నేతల కొరత కారణంగా కేబినెట్ బెర్తు ఎలా భర్తీ చేయాలో ఆ పార్టీ అధిష్టానానికి కూడా అర్థం కావడం లేదని తెలుస్తోంది.

అసంతృప్తులు.. బుజ్జగింపులు

ఆశావహులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ పెద్దలు
- కేబినెట్‌లో చోటు దక్కని సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావుల నివాసాలకు మీనాక్షి, మహేశ్‌గౌడ్
- రాజగోపాల్‌రెడ్డిని కలిసేందుకు యత్నాలు.. అందుబాటులోకి రాని నల్లగొండ ఫైర్ బ్రాండ్
- 42శాతం జనాభా ఉన్న జిల్లాలకు అవకాశం ఇవ్వకపోతే ఎలా?: మల్‌రెడ్డి ఆవేదన



టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: మంత్రివర్గ విస్తరణలో అవకాశం దక్కని నేతల్లో పార్టీ పట్ల అసంతృప్తికి తావివ్వకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఇన్‌చార్జ్ సెక్రటరీలు విశ్వనాథన్, విష్ణునాథ్ సహా రాష్ట్ర నేతలకు సూచనలు చేసింది. అసంతృప్త నేతలతో నేరుగా మాట్లాడాలని చెప్పింది. ఈ మేరకు ఆదివారం మీనాక్షి నటరాజన్‌కు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఫోన్‌లో మాట్లాడి కీలక సూచనలు చేశారు. భవిష్యత్‌లో కచ్చితంగా అవకాశాలు దక్కుతాయనే భరోసా ఇవ్వాలని సూచించారు. అవసరమైతే అసంతృప్త నేతలను ఢిల్లీకి తీసుకురావాలని సైతం సూచించినట్టు సమాచారం. రాష్ట్రంలో అసంతృప్తులు చల్లారే వరకు ఇన్‌చార్జ్‌తో సహా సెక్రటరీలు హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దీంతో మంత్రి పదవి ఆశించి..విస్తరణలో చోటు దక్కని నేతలను బుజ్జగించే పని ఆదివారం ఉదయమే ప్రారంభమైంది. కేబినెట్‌లో చోటు దక్కిన వారి పేర్లు బయటకు వచ్చిన అరగంటలోపే టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అప్రమత్తమయ్యారు. అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను తీసుకొని ఆయన ముఖ్య నేతల ఇళ్లకు వెళ్లి వారిని బుజ్జగించారు. నిజామాబాద్ సీనియర్ నేత పి.సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్‌కు చెందిన ప్రేమ్‌సాగర్‌రావు, రంగారెడ్డి జిల్లా నేత మల్‌రెడ్డిలను వారి నివాసాలకు వెళ్లి కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణల నేపథ్యంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, భవిష్యత్‌లో వచ్చే అవకాశాల్లో కచ్చితంగా ప్రాధాన్యం ఇస్తామని వారికి హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

- సుదర్శన్‌రెడ్డితో అర గంటకుపైగా మీనాక్షి, మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌లు కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తన ఆవేదనను సుదర్శన్‌రెడ్డి వెలిబుచ్చగా, మరోమారు తప్పకుండా అవకాశం ఇస్తామని మీనాక్షి చెప్పినట్టు తెలిసింది.
- ఆ తర్వాత ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లు గంటకు పైగా చర్చలు జరిపారు. గత కొన్ని దశాబ్దాలుగా పార్టీకి తాను చేస్తున్న సేవలను వివరించిన ప్రేమ్‌సాగర్‌రావు.. అకారణంగా తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం.
- రంగారెడ్డి జిల్లా నేత మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా తనకు మంత్రి పదవి రాకపోవడానికి సామాజిక సమీకరణలే కారణమయితే తాను రాజీనామా చేస్తానని, తన స్థానంలో ఎవరినైనా గెలిపించి వారికైనా మంత్రిపదవి ఇవ్వాలని కోరినట్టు సమాచారం. రాష్ట్రంలోనే 42 శాతం జనాభా కలిగిన హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలాకు మంత్రి వర్గంలో స్థానం కల్పించక పోవడాన్ని మల్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో అరుగురు మంత్రులు ఈ జిల్లాల్లో పనిచేసినట్లు వెల్లడించారు. ఈ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడొచ్చని మల్‌రెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు.

ఈ వారంలోనే కార్యవర్గం

మంత్రివర్గ విస్తరణ కొలిక్కి వచ్చినందున టీపీసీసీ పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఈ వారంలోనే ప్రకటించే అవకాశాలున్నాయి. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, 35 మంది వైస్ ప్రెసిడెంట్‌లు, 75 మంది ప్రధాన కార్యదర్శులతో కార్యవర్గాన్ని మొదట ప్రకటించి, తర్వాత జిల్లాల అధ్యక్షుల పేర్లు ప్రకటిస్తారు.

దొరకని రాజగోపాల్

సుదర్శన్‌రెడ్డితో బుజ్జగింపుల అనంతరం నేరుగా రాజగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లాలని మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన్ను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఇద్దరు నేతలు ఆ తర్వాత కూడా రాజగోపాల్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రేమ్‌సాగర్‌రావు ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి రాజగోపాల్ ఇంటికి వెళ్దామనుకున్నా రాత్రి వరకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందుబాటులోకి రాక పోవడం గమనార్హం.

ఫస్ట్ టైమ్.. లక్కీ చాన్స్

ముగ్గురు మంత్రులూ మొదటిసారి గెలిచిన వారే

సాక్షి, హైదరాబాద్: తాజా మంత్రివర్గ విస్తరణలో అవకాశం దక్కిన ముగ్గురూ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచినవారే. 2023, డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నుంచి గడ్డం వివేక్, ధర్మపురి నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మక్తల్ సెగ్మెంట్ నుంచి వాకిటి శ్రీహరిలు విజయం సాధించి తొలిసారి శాసనసభలోకి అడుగుపెట్టారు. అయితే, వీరిని అదృష్టం వరించడంతో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచినప్పుడే మంత్రులుగా పనిచేసే అవకాశం లభించింది.

- వివేక్ వెంకటస్వామి గతంలో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. 2009–14 మధ్య కాలంలో ఆయన పెద్దపల్లి ఎంపీగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్, బీజేపీల్లోకి వెళ్లినా చట్టసభల్లోకి అడుగు పెట్టలేదు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన మంత్రి అయ్యారు.
- అడ్లూరి లక్ష్మణ్ 2006లో జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఆ తర్వాత ఎమ్మెల్యేగా, ఇప్పుడు మంత్రి దశకు చేరుకుంది.
- వాకిటి శ్రీహరి సర్పంచ్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో పలు హోదాల్లో ఆయన పనిచేశారు. ఈ ముగ్గురికి కేబినెట్‌లో చోటు లభించడంతో మంత్రివర్గంలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారి సంఖ్య ఐదుకు చేరింది. తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన పొంగులేటి, పొన్నంలు ఇప్పటికే మంత్రివర్గ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే.

ఒకే పార్లమెంట్ సెగ్మెంట్..
ముగ్గురు మంత్రులు

పెద్దపల్లిలో సరికొత్త రికార్డు

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ సరికొత్త రికార్డు సృష్టించింది. తాజా విస్తరణ తర్వాత...ఒక్క పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచే ముగ్గురు ఉండటం విశేషం. ఈ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని మంథని నుంచి గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. తాజాగా చెన్నూరు నుంచి గెలిచిన గడ్డం వివేక్ వెంకటస్వామి, ధర్మపురి నుంచి విజయం సాధించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు మంత్రులుగా అవకాశం లభించింది. అయితే ఈ ముగ్గురు మూడు కొత్త జిల్లాల పరిధిలోకి రావడం గమనార్హం. శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహించే మంథని నియోజకవర్గం పెద్దపల్లి జిల్లా పరిధిలోకి రాగా, రెండు మండలాలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కిందకువస్తాయి. చెన్నూరు నియోజకవర్గం మంచిర్యాల జిల్లా పరిధిలోకి వస్తుంది. అడ్లూరి ప్రాతినిధ్యం వహించే ధర్మపురి సెగ్మెంట్ జగిత్యాల జిల్లా కిందకు వస్తుంది.

ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు

ఖమ్మం జిల్లాలోని మధిర నుంచి గెలుపొందిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగాను, పాలేరు నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ, గృహనిర్మాణ మంత్రిగానూ, ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. ఈ ముగ్గురిదీ ఖమ్మం జిల్లాతోపాటు, ఖమ్మం పార్లమెంట్ సెగ్మెంట్ కూడా కావడం విశేషం.

ఊపిరి పీల్చుకున్న మంత్రులు

విస్తరణతోనే సరిపెట్టిన కాంగ్రెస్ అధిష్టానం

ఒకరు లేదా ఇద్దరు మంత్రులను తీసేస్తారని ముందుగా ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ముగియడంతో ఇప్పటికే కేబినెట్‌లో ఉన్న మంత్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ దఫా కేవలం విస్తరణకు మాత్రమే అధిష్టానం పరిమితం కావడం, ఉద్వాసనలను పక్కన పెట్టడంతో మరోమారు విస్తరణ జరిగేంతవరకు తమ పదవులకు వచ్చే ఢోకా ఏమీ లేదనే ధీమాతో గవర్నర్‌తో కలిసి గ్రూప్ ఫొటో దిగి రాజ్‌భవన్ నుంచి వారంతా వెళ్లిపోవడం కనిపించింది. వాస్తవానికి, ప్రస్తుత కేబినెట్‌లో మంత్రులుగా ఉన్న వారంతా సీనియర్లు, పార్టీ విధేయులు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలు, సామాజిక సమీకరణల్లో అనివార్యంగా మంత్రివర్గంలో ఉండాల్సిన వారే. ఈ జాబితా నుంచి మంత్రులుగా తొలగించడం అధిష్టానానికి కూడా కొంచెం కష్టమే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఏడాది పాటు అంతా సాఫీగానే సాగింది. ఏమైందో ఏమో కానీ, ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది తర్వాత మంత్రివర్గం నుంచి ఉద్వాసనలు ఉంటాయనే చర్చ ప్రారంభమైంది. దీంతో ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ విషయం వార్తల్లోకి వచ్చినా, ఉద్వాసనలు కూడా అనివార్యమన్న చర్చ జరిగేది. ప్రస్తుత కేబినెట్‌లోని ఒకరు లేదా ఇద్దరు మంత్రులను తప్పిస్తారనే చర్చ జరిగేది. ఇందుకు తగినట్టు కారణాల విశ్లేషణ ఉండేది. ఆయా సామాజిక వర్గాల నుంచి ఎవరిని కొత్తగా మంత్రులుగా తీసుకుంటారనే అంచనాలు కూడా వచ్చేవి. దీంతో అధిష్టానం ఏం చేస్తుందోననే గుబులు కొందరు మంత్రుల్లో కనిపించేది. కానీ, ఎలాంటి హఠాత్ పరిణామాలకు తావు లేకుండా ఆదివారం కేవలం విస్తరణ మాత్రమే జరగడంతో అటు మంత్రులు, వారి సన్నిహితులు, ఆయా నియోజకవర్గాల కార్యకర్తలు.. అంతా హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

సామాజిక న్యాయం మాతోనే సాధ్యం

కొత్త మంత్రులకు అభినందనలు తెలిపిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్


సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. కులగణన చేసి బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన వెల్లడించారు. ఆదివారం జరిగిన కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన వివేక్, లక్ష్మణ్, శ్రీహరిలను అభినందించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ కొత్త మంత్రులను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రాహుల్ ఆలోచనల మేరకే: మంత్రి పొన్నం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకే ప్రజాప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్తగా ప్రమాణం చేసిన మంత్రులను అభినందించారు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం రాహుల్‌గాంధీ ఆలోచనకు అద్దం పడుతోందని, కులగణన చేస్తే ఏమొస్తుంది అన్నవారికి ఇదే సమాధానం చెబుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం సామాజిక న్యాయానికి రోల్‌మోడల్‌గా నిలుస్తోందని ప్రభాకర్ చెప్పారు.

ఎమ్మెల్సీలకు ఆశాభంగం

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి నుంచి మంత్రులు కావాలనుకున్న వారి ఆశలు ఈసారికి గల్లంతయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ ఏర్పాటయ్యాక పలువురు ఎమ్మెల్సీలు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న నేపథ్యంలో ఈసారి తమకు అవకాశం వస్తుందనే ఆశతో పలువురు ఉన్నారు. బీసీ మహిళా కోటాలో విజయశాంతి, యువ నేతల కోటాలో అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌ల పేర్లు రేసులోకి వచ్చాయి. అనూహ్యంగా ఎమ్మెల్సీ అవకాశం దక్కించుకున్న విజయశాంతి.. అంతే అనూహ్యంగా మంత్రివర్గంలో చేరతారనే ప్రచారం జరిగింది. ఓ మైనార్టీ నేతను ముందుగా మంత్రిగా ఎంపిక చేసి ఆ తర్వాత మండలికి పంపుతారనే చర్చ కూడా జరిగింది. కానీ, ఎమ్మెల్సీ ఆశావహులను ఈసారికి కాంగ్రెస్ అధిష్టానం కరుణించలేదు. దీంతో ఇంకోసారి జరిగే విస్తరణలో అయినా తమకు అవకాశం రాకపోతుందా అనే ఎదురుచూపులు మాత్రమే కాంగ్రెస్ ఎమ్మెల్సీలకు మిగిలాయి.



చిన్న కారు.. చిన్నబోతోందా? అవుననే అంటున్నాయి గణాంకాలు. భారతీయ ప్యాసింజర్ కార్ల రంగాన్ని పరుగెత్తించడంలో ఒకప్పుడు కీలక 'ఇంజిన్'గా నిలిచిన చిన్న కార్ల అమ్మకాల్లో వేగం ఏటా తగ్గుతూ వస్తోంది. వీటి ఖరీదు ఏటా పెరుగుతూ వస్తుండడమే ఇందుకు కారణం. 2019-20లో ప్యాసింజర్ వాహన అమ్మకాలలో 46.5%గా ఉన్న చిన్న కార్ల వాటా 2023-24 నాటికి 27.7%కి వచ్చి చేరిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొనసాగుతున్న ఈ క్షీణతపై దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. భారత వాహన పరిశ్రమకు పునాదిగా గతంలో నిలిచిన ఈ విభాగంలో డిమాండ్‌ను తిరిగి రేకెత్తించడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలని పిలుపునిచ్చింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అంతవరకు ద్విచక్ర వాహనంతో తన కుటుంబాన్ని తీసుకెళ్లిన ఒక సామాన్యుడు.. చిన్న కారు కొనుక్కొని దాంట్లో తన కుటుంబాన్ని షికారుకో, ఊరికో వెళ్లడం ఒక ప్రెస్టీజ్‌గా భావించేవాడు. ధరలు కూడా తక్కువగా ఉండటంతో అప్పో సప్పో చేసి కారు కొనేసేవాడు. 5 ఏళ్ల కిందటి వరకు చిన్నకార్ల అమ్మకాలు ఇలాగే పెరిగాయి. కానీ, గత 5 ఏళ్లలో అనేక కారణాల వల్ల ధరలు పెరగడంతో చిన్న కార్ల అమ్మకాలకు పెద్ద బ్రేకే పడింది.

భారీగా తగ్గిన చిన్నకార్ల వాటా

దేశంలో 2018–19లో 15,53,598 చిన్నకార్లు అమ్ముడయ్యాయి. 2023–24లో ఈ సంఖ్య 11,68,592కి పడిపోయింది. మొత్తం ప్యాసింజర్ వాహనాల పరంగా చూస్తే.. 2018–19లో 33,77,389 అమ్ముడైతే.. 2023–24లో 42,18,746 వాహనాల అమ్మకాలు జరిగాయి. మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో చిన్న కార్ల వాటా 46 నుంచి 27.7 శాతానికి తగ్గిపోయింది. ఇందులోనూ ఎంట్రీ లెవెల్ కార్ల అమ్మకాలు భారీగా క్షీణిస్తున్నాయి.

భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) లెక్కల ప్రకారం 2018–19లో ఎంట్రీ లెవెల్ కార్లు (3.6 మీటర్ల వరకు పొడవు ఉండేవి) అన్ని కంపెనీలవి కలిపి దేశీయంగా 4,60,772 రోడ్డెక్కాయి. 2024–25లో ఈ సంఖ్య 1,33,397కు పడిపోయింది. భారత్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ, ఈ విభాగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న మారుతీ సుజుకీ కూడా అమ్మకాలు తగ్గినట్టు వెల్లడించింది. 2025 మే నెలలో ఆల్టో, ఎస్–ప్రెస్సో అమ్మకాలు.. గతేడాదితో పోలిస్తే 9,902 నుంచి 6,776 యూనిట్లకు పడిపోయాయి.

క్రమంగా కనుమరుగు..




చిన్న కార్ల అమ్మకాలను పునరుద్ధరించడానికి ప్రభుత్వ జోక్యం చాలా కీలకం. ద్విచక్ర వాహనాల నుంచి నాలుగు చక్రాల వాహనాలకు మారాలనుకునే మొదటిసారి కొనుగోలుదారులకు ప్రోత్సాహకాలు, పన్ను ప్రయోజనాలు ఇవ్వడం ద్వారా అమ్మకాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది. కార్ల కొనుగోలు సమయంలో మూడు సంవత్సరాల థర్డ్–పార్టీ బీమా ఇప్పుడు తప్పనిసరి. పెద్ద కార్ల కొనుగోలుదారులకు ఇది భారం కాదు. కానీ, మొదటిసారి చిన్న కారు కొనే బడ్జెట్ కస్టమర్లను ఈ మొత్తం ఇబ్బంది పెడుతుంది. నియంత్రణ సంబంధ ప్రమాణాలను పాటిస్తూనే పోటీ ధరలను అందించడానికి, అమ్మకాల పరిమాణాన్ని పెంచడానికి వాహన తయారీ సంస్థలు కొత్త ఆవిష్కరణలు చేయాలని నిపుణులు అంటున్నారు.

డిమాండ్ పెరిగేనా?

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎంట్రీ–లెవెల్ కార్లకు డిమాండ్ పెరుగుతుందని పరిశ్రమ ఆశిస్తోంది. సంవత్సరానికి రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయిస్తూ ఇటీవల బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదన కారణంగా ఈ ఆదాయ వర్గాలు ఎక్కువగా ఖర్చు చేస్తాయని కంపెనీలు ఆశిస్తున్నాయి. అంతేకాకుండా ఫిబ్రవరి, ఏప్రిల్, తాజాగా ఈ నెలలో రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించింది. తద్వారా లోన్లపై వడ్డీ భారం ఆ మేరకు తగ్గడం కస్టమర్లకు కలిసి వచ్చే అంశం. అయితే కొత్త మోడళ్ల భారం అని భావించే ఎంట్రీ లెవెల్ కొనుగోలుదారులు పాత కార్లను ఎంచుకోవచ్చు. ఉదాహరణకు కొత్త మారుతీ ఆల్టో కే10 బేసిక్ వేరియంట్ ధర హైదరాబాద్ ఎక్స్‌షోరూమ్‌లో 2019లో సుమారు రూ.3.4 లక్షలు. 2025లో ఇది రూ.4.23 లక్షలకు చేరింది. అంటే ధర 25% పెరిగిందన్న మాట. కొత్త సబ్ కాంపాక్ట్ మోడళ్లకు వెచ్చించే ధరలో పెద్ద, మరిన్ని ఫీచర్లు కలిగిన పాత కార్లు ఇప్పుడు లభిస్తున్నాయి.

జపాన్‌ను అనుసరిస్తే..

భారత్‌లో 1,000లో కేవలం 34 మంది వద్ద మాత్రమే ప్రస్తుతం కార్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కార్ల అమ్మకాలు పెంచేందుకు.. కొనుగోలుదారులు ద్విచక్ర వాహనాల నుంచి కార్లకు అప్‌గ్రేడ్ అయ్యే విషయంలో ఇతర దేశాలు అనుసరిస్తున్న విధానాలను భారత ప్రభుత్వం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. కొనుగోలుదారులు కార్లకు అప్‌గ్రేడ్ అవ్వడానికి జపాన్‌లో 'కేయ్' కార్లు సహాయపడ్డాయి. పెద్ద కార్లతో పోలిస్తే జపనీస్ కొనుగోలుదారులు కేయ్ మోడళ్లపై తక్కువ పన్ను, బీమా చెల్లిస్తున్నారు. దీనివల్ల యాజమాన్య ఖర్చులు తగ్గుతాయి. జపాన్‌లో అమ్ముడవుతున్న అన్ని కార్లలో కేయ్ మూడవ వంతు కలిగి ఉన్నాయంటే మార్పు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొనుగోలు సవాళ్లను పరిష్కరించడానికి చిన్న, పెద్ద కార్లను ప్రభుత్వం వేర్వేరుగా పరిగణించాలని నిపుణులు అంటున్నారు. 'భారత్‌లో కార్ల కొనుగోళ్లు ఎక్కువగా రూ.12 లక్షలకుపైగా వార్షిక ఆదాయం ఉన్న 12% కుటుంబాలకే పరిమితం అయ్యాయి. మిగిలిన 88% మంది కుటుంబాలు చిన్న కారును కూడా సొంతం చేసుకోలేని స్థితిలో ఉన్నాయి' అని మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్.సి.భార్గవ కొద్ది రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే.



ఆధారం: సియామ్

క్లుప్తంగా...

కాచిగూడ స్టేషన్ జిగేల్ జిగేల్

- రూ.2.23 కోట్లతో రైల్వేస్టేషన్‌కు ఇల్యుమినేషన్ లైటింగ్
- సోమవారం ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే స్టేషన్‌కు రూ.2.23 కోట్ల వ్యయంతో కేంద్ర పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. నిజాం కాలంలో 1916లో 'గోతిక్ శైలి'లో కాచిగూడ రైల్వేస్టేషన్ నిర్మాణం జరిగింది. దీని చారిత్రక నేపథ్యాన్ని, అద్భుతమైన నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా ప్రదర్శించేందుకు మొత్తం 785 ఇల్యుమినేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ లైట్ల వెలుగులో రైల్వేస్టేషన్ భవనం చూడముచ్చటగా కనిపించనుంది. కాచిగూడ స్టేషన్ గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకుంటూ పర్యావరణ పరిరక్షణలో కూడా తనవంతు పాత్రను పోషిస్తోంది. దీంతో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ దీనికి ప్లాటినం రేటింగ్ ఇచ్చింది. భారతీయ రైల్వేలలో ఎనర్జీ ఎఫిషియంట్ స్టేషన్‌గా కాచిగూడ రైల్వేస్టేషన్ నిలిచింది. రైల్వేలలో మొట్టమొదటి డిజిటల్ పేమెంట్ సేవలను కాచిగూడ స్టేషన్‌లోనే ప్రారంభించారు. ఇలా ఎన్నో రకాల ప్రాముఖ్యతలు సంతరించుకున్న కాచిగూడ రైల్వేస్టేషన్‌ను రూ.421.66 కోట్లతో అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు.

ఏపీ ఈఏపీసెట్‌లో సత్తా చాటిన 'నారాయణ'

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీసెట్–2025 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారని సంస్థ డైరెక్టర్లు సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో అనిరుధ్‌రెడ్డి స్టేట్ ఫస్ట్‌ర్యాంక్ కైవసం చేసుకోగా.. భానుచరణ్‌రెడ్డి 2వ ర్యాంక్, ఎ.భూపతి నితిన్ 5వ ర్యాంక్, మణిదీప్‌రెడ్డి 7వ ర్యాంక్, 10వ ర్యాంక్ సాధించారని వివరించారు. టాప్‌టెన్‌లో ఐదుగురు అత్యుత్తమ ర్యాంకులు పొందారన్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు 100లోపు ర్యాంకులను 46 మంది, 1,000లోపు ర్యాంకులను 416 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. 46 సంవత్సరాలుగా కేవలం టాప్ ర్యాంకులే పరమావధిగా రూపొందించిన నారాయణ విశిష్ట విద్యాప్రణాళిక ద్వారానే ఘన విజయాలను సాధించగలిగామని పేర్కొన్నారు. ఇంతటి విజయాలను సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.

శ్రీ చైతన్య విజయభేరి

సాక్షి, అమరావతి: ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. టాప్ 10 లోపు 8 ర్యాంకులు, 100లోపు 85 ర్యాంకులు శ్రీ చైతన్య విద్యార్థులు సాధించారు. అటు ఇంజనీరింగ్‌లోనూ, ఇటు అగ్రి/ఫార్మాలోనూ టాప్ ర్యాంకులు దక్కించుకున్నారు. అగ్రి, ఫార్మా విభాగంలో షణ్ముఖ నిశాంత్ రెండో ర్యాంక్, వినయ్ మల్లేష్ కుమార్ మూడో ర్యాంక్, యండ్రపాటి షణ్ముఖ్ నాలుగో ర్యాంక్, లక్ష్మీచరణ్ ఏడో ర్యాంక్ సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో రామచరణ్ రెడ్డి నాలుగో ర్యాంక్, సాగంటి త్రిశూల్ ఎనిమిదో ర్యాంక్, జ్ఞానరుత్విక్ సాయి తొమ్మిదో ర్యాంక్, బి.వెంకట మణి ప్రీతమ్ పదో ర్యాంక్ సాధించి సత్తా చాటారని శ్రీ చైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. పోటీ పరీక్ష ఏదైనా, పరీక్ష విధానాలు ఎలా మారినా తమ విద్యార్థులు నంబర్‌వన్‌గా నిలుస్తున్నారని వివరించారు. ఇటీవల విడుదలయిన జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లోనూ తమ విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన అధ్యాపకులను ఆమె అభినందించారు.

ఇంటర్ కాలేజీల ఇష్టారాజ్యం

- గుర్తింపు లేకున్నా అడ్మిషన్ల జోరు...
- గుర్తింపు వచ్చినవి సగం కూడా లేవు...
- మొద్దు నిద్రలో అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంటర్మీడియెట్ కాలేజీలు విద్యార్థులను చేర్చుకోవడంపై పెట్టే దృష్టి అనుబంధ గుర్తింపు తెచ్చుకోవడంపై పెట్టడం లేదు. నిబంధనలన్నీ పాటించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇలాంటి కాలేజీలపై ఇంటర్ బోర్డు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. మరో వారం రోజుల్లో ఇంటర్ మొదటి సంవత్సరం క్లాసులు మొదలవుతాయి. ఈలోగానే కాలేజీలు బోర్డు అనుమతి తీసుకోవాలి. కాలేజీల్లో చేరికలు, బోర్డ్ అనుమతులు, సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో నిత్యం అందుబాటులో ఉంచాలి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. బోర్డు అధికారులు కూడా ఈ కాలేజీలపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. గుర్తింపు విషయంలో కంగారు వద్దంటూ తల్లిదండ్రులకు నచ్చజెబుతున్నారు.

సగం కూడా పూర్తవ్వని అఫిలియేషన్

రాష్ట్రవ్యాప్తంగా 4,089 ఇంటర్ కాలేజీలున్నాయి. 3,254 కాలేజీలు అఫ్లియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిల్లో అనుబంధ గుర్తింపు పొందినవి 1,312 మాత్రమే. 1,483 కాలేజీల దరఖాస్తులను బోర్డ్ తిరస్కరించింది. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయాలని కోరింది. సరైన లొకేషన్ లేదని 1,216 కాలేజీలను పెండింగ్‌లో ఉంచారు. ప్రతీ ఏటా అఫ్లియేషన్‌కు దరఖాస్తు చేసే కాలేజీలు సైతం సరైన విధానంలో వెళ్లడం లేదని, ధ్రువపత్రాల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని బోర్డు అధికారులు అంటున్నారు. జిల్లా అధికారుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. అనుబంధ గుర్తింపు ఇచ్చిన తర్వాతే క్లాసులు నిర్వహించాలనే నిబంధన విధించాలని బోర్డు నిర్ణయించినా, జిల్లా అధికారులు మాత్రం దీన్ని అమలుచేయడం లేదు. ఈ కారణంగానే అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తవ్వడం లేదు.

రాజధాని పరిసరాల్లోనే సమస్యలు

రాజధాని పరిసర ప్రాంతాలైన మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఎక్కువగా ప్రైవేటు కాలేజీలున్నాయి. వీటిల్లో చాలావరకు బహుళ అంతస్తుల భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటిని జిల్లాలకు దూరంగా తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ కాలేజీలు దీనికి అడ్డుపడ్డాయి. కాలేజీలు దూరంగా ఉంటే విద్యార్థులను చేర్చుకోవడం కష్టమని భావిస్తున్నాయి. ఇలాంటి కాలేజీల జాబితాను అధికారులు తెప్పించారు. ప్రభుత్వానికి కూడా ఇటీవల నివేదించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ఏ నిర్ణయం తీసుకున్నారో ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. దీంతో కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. గుర్తింపు రాకుండానే విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు.

ఈసారీ అదే తంతా?

బహుళ అంతస్తుల భవనాల్లో నడిచే కాలేజీ వల్ల విద్యార్థుల ప్రాణాలకే ప్రమాదమని ఫైర్ సేఫ్టీ విభాగం 2020లోనే స్పష్టం చేసింది. ఇలాంటి భవనాలు ఫైర్ సేఫ్టీ విభాగం నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలంటూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 6–15 మీటర్ల ఎత్తున్న కాలేజీ భవనాల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. వీటిని పరిశీలించి ఫైర్ సేఫ్టీ విభాగం అనుమతినివ్వాలి. కానీ రాజధాని పరిసరాల్లో ఎక్కువగా 15 మీటర్లకుపైగా ఎత్తున్న భవనాల్లో నడుస్తున్నాయి. రెండేళ్లుగా ఫైర్‌సేఫ్టీ విభాగం ఎన్‌వోసీ ఇవ్వడం లేదు. అయినా కాలేజీలు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. పరీక్షల సమయం వరకూ విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంటోంది. చివరకు ఒక్క సంవత్సరం కోసం అనుమతి ఇవ్వడం, వచ్చే ఏడాది నుంచి ఇవ్వబోమని చెప్పడం జరుగుతోంది. వాస్తవానికి ఈ ఏడాది నుంచి ఇలాంటి కాలేజీల అనుమతి నిలిపివేయాల్సి ఉంది. కానీ ఇలాంటి చర్యలేమీ బోర్డు తీసుకోలేదు. అఫ్లియేషన్ల విషయంలో తాత్సారం తగదని తల్లిదండ్రులు అంటున్నారు.



సినీనటుడు అక్కినేని నాగార్జున తనయుడు అక్కినేని అఖిల్, జైనబ్ వివాహ రిసెప్షన్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ సెవన్ ఎకర్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు కూడా రిసెప్షన్‌కు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

నల్లమలలో భారీగా ట్రాఫిక్ జామ్



నంద్యాల–గిద్దలూరు మార్గంలో ఒడిశా నుంచి అనంతపురం వేరుశనగ బుడ్డలతో వస్తున్న లారీ ఘాట్‌రోడ్డులోని యూ టర్నింగ్ వద్ద సెల్ఫ్‌మోటార్ ఫెయిల్ అవడంతో ఆగిపోయింది. డ్రైవర్ వీరాస్వామి మరమ్మతులకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వేరే వాహనంలో నంద్యాలకు వెళ్లి మెకానిక్‌తో పాటు సెల్ఫ్‌మోటార్ తీసుకొచ్చారు. ఈ ఘటనతో నంద్యాల నుంచి గిద్దలూరు, గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లే వాహనాలు 24 గంటల పాటు నిలిచిపోయాయి. భారీ ఎత్తున ట్రాఫిక్ జామైంది. పలు వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాన్ని కొద్దిగా పక్కకు నెట్టడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

- మహానంది

ఏపీ ఈఏపీ సెట్‌లో బాలురు భళా

- ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో టాప్
- 10 ర్యాంకులు బాలుర కైవసం
- మొత్తంగా 75.67 శాతం ఉత్తీర్ణత



ఎ.అనిరుథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఫస్ట్ ర్యాంక్

సాక్షి నెట్‌వర్క్: ఏపీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, ఫార్మాడీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీ సెట్) ఫలితాల్లో అబ్బాయిలు పూర్తి ఆధిపత్యం కనబరిచారు. ఇంజినీరింగ్‌తో పాటు అగ్రికల్చర్ విభాగంలో టాప్–10 ర్యాంకులను వారే కైవసం చేసుకున్నారు. ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలను జేఎన్‌టీయూ–కాకినాడలో సెట్ చైర్మన్, వర్సిటీ వైస్ చాన్సలర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, సెట్ కన్వీనర్ వీవీ సుబ్బారావు ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,80,611 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,64,840 మంది హాజరయ్యారు. వీరిలో 1,89,748 మంది (71.65 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 1,05,436 (70.33 శాతం) మంది, బాలికలు 84,313 (73.37 శాతం) మంది ఉన్నారు. అలాగే, అగ్రికల్చర్ విభాగంలో 81,837 మంది దరఖాస్తు చేసుకోగా 75,460 మంది పరీక్ష రాశారు. వీరిలో 67,761 మంది (89.8 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 16,097 (89.92 శాతం) మంది, బాలికలు 51,664 (89.76 శాతం) మంది ఉన్నారు. మొత్తం మీద 75.67 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

తెలంగాణ విద్యార్థులకు ర్యాంకులు

ఏపీ ఈఏపీ సెట్‌లో తెలంగాణ విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన ఎ.అనిరుథ్‌రెడ్డి 96.39 స్కోర్‌తో ఒకటో ర్యాంకు సాధించగా.. హన్మకొండకు చెందిన ఎస్.త్రిశూల్ 92.58 స్కోర్‌తో ఎనిమిదో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హైదరాబాద్ చందానగర్‌కు చెందిన షణ్ముఖ నిషాంత్ 93.53 స్కోర్‌తో రెండో ర్యాంకు, హన్మకొండకు చెందిన వై.షణ్ముఖ్ 92.38 స్కోర్‌తో నాలుగో ర్యాంకు సాధించారు.

ఏపీ ఎన్నికల్లోనూ ఈవీఎంల మాయాజాలం!

- పోలింగ్ ముగిసే సమయానికి 68.12 శాతం ఓట్లు నమోదు
- తుది పోలింగ్ శాతం 81.86 శాతం నమోదైనట్లు ఈసీ వెల్లడి
- చివర్లో పెరిగిన పోలింగ్ శాతంవల్లే అనుమానాలు
- మహారాష్ట్ర తరహాలోనే ఏపీలోనూ మాయాజాలం
- 'ఎక్స్'వేదికగా రిటైర్డు ఐఏఎస్ పీవీఎస్ శర్మ ఉద్ఘాటన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల మాయాజాలం చోటుచేసుకుందనే చర్చ మరోసారి ఊపందుకుంది. మహారాష్ట్రలో ఈవీఎంల మాయాజాలంవల్లే బీజేపీ గెలిచిందని.. వచ్చే ఎన్నికల్లో బిహార్‌లోనూ అదే రీతిలో గెలిచేందుకు బీజేపీ ఎత్తులు వేస్తోందని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, రాహుల్‌గాంధీ ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసంలో ఆరోపించారు. ఈ వ్యాసాన్ని ఉటంకిస్తూ మహారాష్ట్ర తరహాలోనే ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లోనూ ఈవీఎంల మాయాజాలంతో కూటమి గెలిచిందంటూ 'ఎక్స్'వేదికగా రిటైర్డు ఐఏఎస్ పీవీఎస్ శర్మ ఉద్ఘాటించారు. ''ఆంధ్రప్రదేశ్‌లో 2024, మేలో జరిగిన ఎన్నికల్లో సా.6 గంటలకు 68.12 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ తర్వాత 81.86 శాతం ఓట్లు పోలైనట్లు తుది పోలింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. అంటే.. తొలుత ప్రకటించిన దానికి.. చివరిసారిగా ప్రకటించిన శాతానికి పోలింగ్ 13.74 శాతం ఎక్కువగా ఉంది. దీనివల్ల 46 లక్షల ఓట్లు అధికంగా పోలయ్యాయి. అంటే.. సగటున ఒక్కో నియోజకవర్గానికి 26 వేల ఓట్లు అధికంగా పోలయ్యాయి. చివర్లో పెరిగిన పోలింగ్ శాతమే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసింది''.. అంటూ తన 'ఎక్స్'ఖాతాలో పీవీఎస్ శర్మ ఆదివారం కుండబద్దలు కొట్టారు.

రాయచోటిలో అధికంగా పోలైన ఓట్లన్నీ ఒకే పార్టీకా!? : గడికోట

మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ''నేను ప్రాతినిధ్యం వహించి పోటీచేసిన రాయచోటిలో ఎన్నికలు జరిగిన తీరు, పోలింగ్ సరళి తదితర అంశాలను, గణాంకాలను పరిశీలిస్తే.. కొన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. రాయచోటికి 2012 ఉప ఎన్నిక, 2014, 2019, 2024లో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. 2012, 2014, 2019 ఎన్నికల్లో 62 వేల నుంచి 66 వేల ఓట్లు టీడీపీకి వచ్చాయి. వైఎస్సార్‌సీపీకి 92 వేల నుంచి 98 వేల మధ్య ఓట్లు వచ్చాయి. 2014తో పోలిస్తే 2019లో పోలైన ఓట్ల పెరుగుదల కేవలం 200 మాత్రమే. 2019తో పోల్చితే 2024లో 30 వేల ఓట్లు అధికంగా పోలయ్యాయి. గతంలో ఇంత పెరుగుదల ఎప్పుడూలేదు. కానీ, 2024లో వైఎస్సార్‌సీపీకి 95 వేల ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల ఫలితాలతో చూస్తే.. వైఎస్సార్‌సీపీ ఓట్లు అలానే ఉన్నాయి. కానీ, టీడీపీకి మాత్రం 96 వేల ఓట్లు వచ్చాయి. అంటే.. 2019తో పోలిస్తే 2024లో అధికంగా పోలైన 30 వేల ఓట్లు కూడా టీడీపీకే పడ్డాయని అర్థమవుతోంది. అధికంగా పోలైన ఈ 30 వేల ఓట్లు ఒకే పార్టీకి ఎలా పడతాయి? ఇది సాధ్యమేనా? ఇది నమ్మశక్యమేనా?'.. అంటూ గడికోట శ్రీకాంత్‌రెడ్డి 'ఎక్స్'లో ప్రశ్నించారు.

10న హిందీ ప్రచార సభ 90 వసంతాల వేడుక

హిమాయత్‌నగర్: తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ 90 వార్షికోత్సవ వేడుకలను ఈనెల 10న జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్లు హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి గైబువల్లి తెలిపారు. ఆదివారం అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావడేతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సెంట్రల్ హిందీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ బాబురావు కులకర్ణి తదితరులు హాజరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారికి హిందీ సేవా ప్రతిభా పురస్కారాలు, పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

స్కూలింగ్ బీజేపీలో.. కాలేజీ చంద్రబాబు వద్ద..

ఉద్యోగం రాహుల్ వద్ద

▶ మొదటి పేజీ తరువాయి

జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితోపాటు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, ఒడిశా గవర్నర్ హరిబాబు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శ్రీనివాసవర్మ, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ. 'ఇటీవల నీతి అయోగ్ సమావేశం అనంతరం భోజన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ.. నీ సహచరుడు అక్కడున్నాడు అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును చూపించారు. అందుకు నేను స్పందిస్తూ.. నా స్కూలింగ్ అంతా మీ వద్ద (బీజేపీ) జరిగింది. కాలేజీ స్టడీ ఆయన (చంద్రబాబు) దగ్గర, ఇప్పుడు ఉద్యోగం రాహుల్‌గాంధీ వద్ద చేస్తున్నా అని బదులిచ్చాను. నాకు చాలామంది బీజేపీ నేతలతో స్నేహముందని వివరించాను'అని వెల్లడించారు.



పుస్తకావిష్కరణలో దత్తాత్రేయ, రామ్‌నాథ్ కోవింద్, చంద్రబాబు, వెంకయ్య నాయుడు, కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి

దత్తాత్రేయ ప్రజల మనిషి

హోదాలతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల మధ్య ఉన్న వ్యక్తి బండారు దత్తాత్రేయ అని సీఎం రేవంత్ కొనియాడారు. 'దత్తాత్రేయ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి కాదు. ప్రజల మనిషి. అందుకే అన్నిపార్టీల నేతలు ఈ కార్యక్రమానికి వచ్చారు. గౌలిగూడ నుంచి గవర్నర్ వరకు ఎన్నో పదవుల్లో కొనసాగిన దత్తాత్రేయ నిత్యం ప్రజలు, కార్యకర్తలతోనే ఉంటారు. హైదరాబాద్‌లో మాస్ నేతలు ఇద్దరే. ఒకరు పీ.జనార్దన్‌రెడ్డి, మరొకరు బండారు దత్తాత్రేయ. నగర ప్రజలకు ఎలాంటి కష్టాలు వచ్చినా వీరిలో ఒకరికి చెప్పుకునేవారు. ప్రస్తుతం రాజకీయాల్లోకి రావాలనుకునేవారు వీళ్లను ఆదర్శంగా తీసుకోవాలి'అని సూచించారు.

కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు: రామ్‌నాథ్ కోవింద్

ఉత్తర్‌ప్రదేశ్‌లో పుట్టి పెరిగిన తాను తెలుగు రాష్ట్రాలను రెండో ఇళ్లుగా పరిగణిస్తానని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. బండారు దత్తాత్రేయతో తనకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందని తెలిపారు. దత్తాత్రేయ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కార్మికుల కోసం ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, దేశవ్యాప్తంగా ఈఎస్ఐ, ఈపీఎఫ్ఓ సేవలు మెరుగుపర్చడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 'దక్షిణ భారతదేశానికి చెందిన వ్యక్తి దత్తాత్రేయ. ఇక్కడ ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. కానీ, ఆయనను హరియాణా గవర్నర్‌గా నియమించారు. అక్కడ జీరో డిగ్రీ కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉంటుంది. అలాంటప్పుడు ఎలా పనిచేస్తారని ఆయననే అడిగాను. ఎక్కడున్నా ప్రజలకు సేవ చేయడమే తన ధర్మమని దత్తాత్రేయ చెప్పారు'అని కోవింద్ వివరించారు.

సమాజం కోసం పనిచేయడమే రాజకీయం: దత్తాత్రేయ

రాజకీయాలంటే వృత్తి, వ్యాపారం కాదని బండారు దత్తాత్రేయ అన్నారు. సమాజం కోసం పనిచేయడమే రాజకీయమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజకీయాల్లోకి రావాలనుకునే వాళ్లు సమాజంతో మమేకం అవ్వాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పోరాడితే పదవులు అవే వస్తాయని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలే తన కుటుంబమని, వాళ్లే తన ఆస్తి అని చెప్పారు. అలాయ్‌బలాయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యకక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

లేఖలకు బ్రాండ్ అంబాసిడర్: చంద్రబాబు

హైదరాబాద్ అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేసిన వ్యక్తి బండారు దత్తాత్రేయ అని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు కొనియాడారు. నిబద్ధత, అంకితభావం, జాతీయత, సేవ, సమగ్రత కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. అలాయ్ బలాయ్ అంటేనే దత్తాత్రేయ గుర్తొస్తారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను సీఎంగా ఉన్నప్పుడు పలు అంశాలపై దత్తాత్రేయ పెద్ద సంఖ్యలో లేఖలు రాశారని, ఆయన లేఖలకు బ్రాండ్ అంబాసిడర్ అని చమత్కరించారు.

దత్తాత్రేయకు వ్యక్తిగత జీవితం లేదు: వెంకయ్యనాయుడు

బండారు దత్తాత్రేయకు వ్యక్తిగత జీవితమంటూ ఏమీ లేదని, ప్రజలే ఆయన జీవితమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. ప్రస్తుత నాయకులు డైపర్స్ మార్చినట్టు పదవుల కోసం పార్టీలు మారుతుండటంతో రాజకీయాలు చులకన అయ్యాయని అన్నారు. రాజకీయాల్లో విమర్శలు సంస్కారవంతంగా ఉండాలని సూచించారు. కానీ, ఇప్పుడు వ్యక్తిగత దూషణలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు.



ఒక గదిలోని చీకటిని పారదోలే శక్తి దీపానికి ఉన్నట్టే, ఒక మనిషిలో వృద్ధినొందిన దీపం చాలామంది ఇతరుల్లోని చీకటిని పారద్రోలడానికి సాయపడగలదు.
– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 9 జూన్ 2025

రెండవ ప్రశ్న

పుస్తకం ప్రచురణ కంటే ఆ పుస్తకాన్ని సాటి రచయితకు చేరవేయడమే ఎక్కువ ఖర్చు అని తెలిసిన రోజు రచయితకు కలిగే ఇబ్బంది, బాధ అన్యులకు తెలియవు. ఎన్నో రాత్రిళ్లు జాగారం చేసి, కొన్ని మార్లు సెలవు పెట్టి, ఇంకొన్నిసార్లు అత్యవసర పనులూ ఆరోగ్య పరీక్షలూ వాయిదా వేసి, ఎలాగోలా పుస్తకం రాసి, అందుకై వేల రూపాయలు వెచ్చించి పుస్తకం ప్రచురించాక రచయితకు ప్రాథమికంగా అనిపించేది సాటి రచయితలు చదివితే బాగుండు, చదివి ఒక మాట చెప్తే బాగుండు అని!

ప్రతి కొలతకూ కొన్ని ప్రమాణాలున్నట్టే ప్రతి రచయితకూ కొన్ని ప్రమాణాలు ఉంటాయి. తాను ప్రచురించిన పుస్తకాన్ని ఏ పదిమంది చదివితే రచయితగా గుర్తింపు పొందుతాడో అతనికి అంచనా ఉంటుంది. కాని ఆ పదిమందికి పుస్తకం పంపడం ఎట్లా? వాట్సప్‌లో మెసేజ్ పెట్టాలి. అడ్రస్ తెప్పించుకోవాలి. కొరియర్ ఆఫీసుకు వెళ్లాలి. కొరియర్ చేయాలి. పుస్తకం వెల నూట యాభై అయితే కొరియర్ వెల కూడా అంతే ఉంటుంది. ఖర్చు మీద ఖర్చు. అయినా సరే పుస్తకం పంపి సంతృప్తి పడతాడు రచయిత.

అయితే పుస్తకం అందుకున్నవారు వెంటనే పుస్తకం చదివేస్తారా? కొందరు ఫ్రమ్ అడ్రస్‌ను చూసి కవర్‌ను విప్పనే విప్పరు. కొందరు కవర్ విప్పి కృతజ్ఞతల కాలమ్‌లో తన పేరేమైనా రాశాడా చూస్తారు. కొందరు ముందుమాటలు తిరగేసి– అవి రాసిన వాళ్ల పేరు చేసి – హు... ఇతగాడు ముందుమాట రాసేంతటి వాడయ్యాడా అని ఆ పగను పుస్తకం మీద చూపి పక్కన పెడతారు. కొందరి అశ్రద్ధ వల్ల– పాపము శమించుగాక– పుస్తకం వచ్చీ రాగానే న్యూస్‌పేపర్లలో కలిసిపోయి మరి కనిపించదు. పుస్తకం అందుకున్న పదిమందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా 'పుస్తకం అందింది. థ్యాంక్యూ. చదివి అభిప్రాయం తెలుపగలను' అని మెసేజ్ పెట్టరు. రచయితే చూసి చూసి 'దొరవారూ... పుస్తకం అందినదా' అని మెసేజ్ చేస్తే అప్పుడు బొటనవేలు చూపుతారు.

మనం పంపిన పుస్తకాన్ని అందుకున్నవారు చదవాలి అనే అంధ విశ్వాసం నుంచి బయట పడటం రచయితల ఆరోగ్యానికి మంచిది అనిపిస్తుంటుంది. పుస్తకం అందుకున్నవారు గతంలో మనకు తెలిసినవారు అని నేడు అనుకోకూడదు. గతంలో వారు రచయితలు కావచ్చు. గతంలో పుస్తకాలు చదువుతూ ఉండుండొచ్చు. ఇప్పుడూ సాహితీ సమావేశాల్లో అధ్యక్ష స్థానాల్లో, వక్తల స్థానాల్లో కనిపిస్తూ ఉండొచ్చు. అంతమాత్రం చేత వారు పుస్తకాలు చదువుతున్నట్టుగా భావించరాదు. కొందరు పిల్లల బాగోగుల్లో ఉంటుండొచ్చు. కొందరు ఉద్యోగ ఒత్తిడిలో ఉంటుండొచ్చు. కొందరు కుటుంబ సభ్యులూ... బంధువులూ తెచ్చే తంటాల్లో ఉంటారు. కొందరికి ఆర్థిక వ్యవహారాలు ఉంటాయి. కొందరు ఫేస్‌బుక్కుల్లో, రీల్సుల్లో జీవితాన్ని ఖర్చు చేస్తూ ఉండొచ్చు. ఇవన్నీ లేకపోయినా తోటి రచయితపై చిన్నచూపు గ్యారంటీ. అదీ గాకుంటే వ్యక్తిగత అభిరుచి చాలా ఎదిగి చాలా గొప్ప సాహిత్యపు రుచిలో 'ఈ యావరేజ్ రచన ఏం చదువుతాములే' అనుకుంటూ కూడా ఉండొచ్చు. ఇవన్నీ ఉన్నా సరే, ఒక కొత్త పుస్తకం రచయిత పంపితే చూసి నాలుగు పేజీలైనా చదివి, పుస్తకాన్ని అంచనా గట్టి, చిన్నపాటి వ్యాఖ్య చేయగల సమర్థులే వీరు. పుస్తకం పంపిన రచయితను ఆ మాత్రం ఉత్సాహపరచలేరా?

పుస్తకాలను రచయితలే చదవనప్పుడు పాఠకులు ఎందుకు చదవాలి అనే ప్రశ్న వినిపిస్తూ ఉంటుంది. నిజమే. ఒక పుస్తకం వస్తే, అది మంచి పుస్తకమైనా సరే, వర్తమానంలోని సాటి రచయితలు ఎవరూ దానిపై పోస్ట్ రాయరు. నేను చదివాను... మీరూ చదవండని రికమండ్ చేయరు. అసలు చూడనట్టే నటిస్తారు. కాని తమ పుస్తకాలు మాత్రం అందరూ చదివి, పోస్టులు రాయాలి... పాఠకులు చదవాలి అని కోరుకుంటారు. కామన్‌సెన్స్ ప్రకారం ఇదెలా సాధ్యం? మనం ఇస్తే కదా తిరిగి వస్తుంది.


క్రికెట్ వ్యాపారులు తమ క్రికెట్‌ను బుర్రల్లో ఎక్కించగలుగుతున్నారు. భక్తి ఆరాధకులు భక్తిని జనుల జీవనంలో అనుక్షణం నింపడానికి ప్రయత్నిస్తున్నారు. సినిమా బేహారులు పాలాభిషేకాలు ఎలా చేయాలో, పోస్టర్ల ముందు పొర్లుదండాలు ఎలా పెట్టాలో నరాల్లో కూరుతున్నారు. మత్తుపదార్థాలు అమ్మేవాళ్లు వాటికై జీవితాలు అంకితం చేసే స్థాయిలో సామాన్యులను బానిసలుగా మార్చగలుగుతున్నారు. వీరంతా సక్సెస్ అయినప్పుడు రచయితలందరూ కలిసి ఒకరికై ఒకరు మద్దతుగా నిలిచి ప్రజలను పాఠకులుగా మలచలేరా? క్యూలలో ఎగబడని, తొక్కిసలాటలకు చోటివ్వని, అల్పమైన కారణాలకు, ఆసక్తులకు జీవితాలను బలి ఇవ్వని వివేకవంతమైన జిజ్ఞాసువు సమాజాన్ని నిర్మించలేరా? దేశంలో సగటు మనిషి, విద్యార్థి, గృహిణి, ఉద్యోగి, వర్తకునికి అవసరమైన మేధో ఆహారమనే బుర్ర తిండి పుస్తకంలో దొరుకుతుందని ఒప్పించలేరా?

'ఇటీవల నీవు చదివిన పుస్తకం ఏది?' అనే ప్రశ్న కేవలం ఉద్యోగార్థిని ఇంటర్వ్యూల్లో అడిగేది మాత్రమే అనుకున్నన్నాళ్లు ఈ సమాజపు మేధోవికాస స్థాయి ఎదగదు. మరేం చేయాలి? మన మర్యాదల ప్రమాణాలు మారాలి. ప్రశ్నల తీరు మారాలి. సంస్కారాన్ని ఎంచేందుకు కొలమానాలు మారాలి. సమాజంలోని ప్రతి లేయర్‌లో కుశల ప్రశ్నల నమూనాను నిర్దేశించుకోవాలి. సాటి మనిషి ఎదురుపడితే మొదటి ప్రశ్న– ఎలా ఉన్నావు? అయ్యాక రెండవ ప్రశ్న– ఏ పుస్తకం చదువుతున్నావు అనేదిగానే ఉండాలి.

సవాలక్ష రుగ్మతలకు మాత్రమే కాదు అగణిత తొక్కిసలాటలకూ ఈ ప్రశ్నే టీకా.

దేశానికి వయసు మీద పడనుంది!

అభిప్రాయం



మోహన్ గురుస్వామి

యువజనుల సంఖ్య మనకు కలిసి వస్తున్న లాభం. దీన్నే డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటున్నారు. అయితే ఇది ఎంతో కాలం నిలవదు. పనిచేసే వయసులో ఉన్న యువ జనం ఎల్లకాలం ఉండరు. చూస్తుండగానే దేశం వృద్ధులతో నిండిపోతుంది. వయసు మళ్లిన జనాభా ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా మారుతుంది.

మన జనాభా 134 కోట్లు. ఇది ప్రపంచంలోనే అత్యధికం. జనబలం, ధనబలం రెంటిలో ఇండియా ఇప్పుడున్నంత గొప్పగా చరిత్రలో ఏనాడూ లేదు. దీనికి మూలాలు దాదాపు వందేళ్ల నాడు పడ్డాయి. భారత జనాభా చరిత్రలో 1921 అతి ముఖ్యమైన సంవత్సరం. దీన్ని 'ఇయర్ ఆఫ్ గ్రేట్ డివైడ్'గా వ్యవహరిస్తారు. ఆ ఏడాది మరణాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. దీంతో అప్పటి వరకూ నిలకడగా ఉన్న జనాభా వృద్ధి రేటు ఒక్కసారిగా వేగం పుంజుకుంది. 1901–1921 మధ్యకాలంలో పెరిగిన జనసంఖ్య అతిస్వల్పం. 20 కోట్ల నుంచి కేవలం 22 కోట్లకు పెరిగింది. ఇక అక్కడి నుంచి విస్ఫోటనాన్ని తలపిస్తూ దేశ జనాభా నేడున్న అసాధారణ స్థాయిని అందుకుంది. ఒక శతాబ్ద కాలంలోనే రమారమి ఆరు రెట్లు హెచ్చింది. ఈ శతాబ్దం మధ్యనాటికి ఇప్పటి జనాభాకు మరో 20–30 కోట్ల మంది కొత్తగా వచ్చి చేరతారు.

వృద్ధాప్యం – నగరీకరణ

వయస్సు రీత్యా చూస్తే, మొత్తం జనాభాలో 65 ఏళ్లు దాటిన వారు 2005లో 5 శాతం ఉండేవారు. 2050 నాటికి జనాభాలో వీరి వాటా 14.5 శాతం అవుతుంది. ఇది ఆందోళన కలిగించే పరిణామం. పెరిగే ఈ వయోవృద్ధుల కోసం కొత్త పన్ను విధానాలు, సామాజిక భద్రతా పథకాలు, ఆరోగ్య సంరక్షణ ప్రణాళికలు ఇప్పటి నుంచీ రూపొందించుకోవాలి. వయోవృద్ధులు అధికంగా ఉన్న ధనిక దేశాలను చూసి మనం ముందు నుంచీ జాగ్రత్త పడాలి. వృద్ధాప్యం ఆర్థిక వ్యవస్థకు పెను భారం.

జన సాంద్రత చిక్కబడటం మరో ఆందోళనకర అంశం. 2005లో చదరపు కిలోమీటరుకు 345 మంది ఉండగా, 2050 నాటికి ఈ సంఖ్య 504కి పెరుగుతుంది. ఇదే కాలంలో, పట్టణీకరణ అధికమై పలు కొత్త సమస్యలు సృష్టిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు 2000లో 30 కోట్ల మంది (జనాభాలో 28.7 శాతం) కాగా, వీరు 2030 నాటికి 60 కోట్లు (40.7 శాతం) అవుతారు. పట్టణ ప్రాంతాలు, వాటితో పాటు పట్టణ జనాభా ఈ స్థాయిలో పెరుగుతూ పోతే, గృహనిర్మాణం, మంచినీరు, డ్రెయినేజీ, రవాణా, ట్రాఫిక్ నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు, ఆహార పంపిణీ వ్యవస్థలు భారీస్థాయిలో ఉండాలి. పట్టణాభివృద్ధికి ఎంత పెట్టుబడీ చాలదు.

2060–70కి జనాభా స్థిరీకరణ?

ఇండియాకు ఇప్పుడు ఒనగూరుతున్న డెమోగ్రాఫిక్ డివిడెండ్ 2050 వరకే కొనసాగుతుంది. ప్రస్తుత లెక్కల ప్రకారం, 2005లో 15–64 ఏళ్ల బ్రాకెట్లో ఉన్న ప్రజల సంఖ్య జనాభాలో 62 శాతం కాగా, 2050 నాటికల్లా ఇది 67.3 శాతానికి పెరుగుతుంది. వీరంతా పనిచేయగల వారు. రానున్న కాలంలో వీరికి కోట్ల సంఖ్యలో కొత్త ఉద్యోగాల కల్పన జరగాలి. అయితే, 2045–50 మధ్య కాలంలో 15–64 ఏజ్ గ్రూప్ శాతంలో ఎలాంటి వృద్ధీ ఉండదు. ఇది జనాభా స్థిరీకరణ దశకు సంకేతం. ఆ తర్వాత నుంచీ శ్రామికుల శాతం శర వేగంతో క్షీణిస్తుంది. వయసు మళ్లిన వారి శాతం పెరుగుతూ పోతుంది. చైనా ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్య ఇదే!



యువజనుల సంఖ్య ఎక్కువుండే 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' 2050 వరకే!

జనాభా స్థిరీకరణ అంటే? కొంతకాలం పాటు జనన మరణాల రేట్లు స్థిరంగా ఉండిపోతాయి. అంటే సగటున ఒక్కో మహిళ కనే పిల్లల సంఖ్య 2.1 మందికి పరిమితమవుతుంది. దీన్ని 'రీప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీ' అంటారు. ఈ స్థాయికి ఫెర్టిలిటీ రేటు చేరినప్పుడు జనాభా స్థిరీకరణ దశలో ఉంటుంది. అంతకంటే తగ్గితే జనాభా క్షీణదశలోకి జారిపోతుంది. 'నేషనల్ పాపులేషన్ పాలసీ-2000' ప్రకారం, 2045 నాటికి ఇండియా స్థిర జనాభా స్థాయిని సాధించాలి. ఒక తరాన్ని మరో తరం భర్తీ చేయడానికి అవసరమైన 2.1 టోటల్ ఫెర్టిలిటీ రేటును 2010 నాటికి చేరుకుంటామన్న అంచనా ఆధారంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు. దీన్ని సాధించలేకపోయినందున, స్థిరీకరణ లక్ష్యాన్ని కూడా వాయిదా వేశారని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జనాభా స్థిరీకరణకు 2060ని తాజా లక్ష్యంగా పెట్టుకోవాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. పాపులేషన్ రీప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీ (2.1) సాధించిన చాలా కాలం తర్వాతే, జనాభా స్థిరీకరణ దశ ఆరంభమవుతుందన్న అంశం మనం ఇక్కడ గుర్తించాలి.

జనాభాపై ప్రణాళికా సంఘం 1996లో ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ దీనిపై అధ్యయనం చేసి, ఇండియా ఈ రీప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీ రేటును 2026 నాటికి చేరుకుంటుందని తేల్చింది. అదే రాష్ట్రాల వారీగా చూస్తే, హిందీ బెల్టులోని బిహార్ 2039కి, రాజస్థాన్ 2048కి, ఇక మధ్యప్రదేశ్ 2060 తర్వాత, ఉత్తర ప్రదేశ్ 2100 తర్వాతగానీ ఈ లెవెల్ సాధించగలవని అంచనా వేసింది. కాబట్టి జాతీయ జనాభా స్థిరీకరణ 2060 లేదా 2070 లోపు సాధ్యపడే అవకాశాల్లేవు.

సువర్ణావకాశం కోల్పోతామా?

ఈ ప్రాంతీయ అసమానతల ప్రకారం, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో జనాభా ఆందోళనకరంగా విస్ఫోటనం చెందుతుంది.

◆ 2045-50 మధ్య కాలంలో 15-64 ఏజ్ గ్రూప్ శాతంలో ఎలాంటి వృద్ధీ ఉండదు. ఇది జనాభా స్థిరీకరణ దశకు సంకేతం. ఆ తర్వాత నుంచీ శ్రామికుల శాతం శర వేగంతో క్షీణిస్తుంది. వయసు మళ్లినవారి శాతం పెరుగుతూ పోతుంది. చైనా ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్య ఇదే!

◆ హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో జనాభా ఆందోళనకరంగా విస్ఫోటనం చెందుతుంది. 1991-2050 మధ్యకాలంలో ఇండియా జనాభా 77.3 కోట్లు పెరిగితే, ఉత్తరప్రదేశ్ ఒక్క దాని వాటానే ఈ అదనపు జనాభాలో 19.8 కోట్లు ఉంటుంది. జాతీయ వ్యాప్త జనాభా వృద్ధిలో ఇది నాలుగో వంతు!

1991–2050 మధ్యకాలంలో ఇండియా జనాభా 77.3 కోట్లు పెరిగితే, ఉత్తరప్రదేశ్ ఒక్కదాని వాటానే ఈ అదనపు జనాభాలో 19.8 కోట్లు ఉంటుంది. జాతీయ వ్యాప్త జనాభా వృద్ధిలో ఇది నాలుగోవంతు! బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వలసలు పెరిగి మెట్రోపాలిటన్ పారిశ్రామిక నగరాల మీద ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

రానున్న సంవత్సరాల్లో తలసరి జీడీపీ ఎలా ఉండబోతోంది? ఇండియా ఎకనామిక్ సూపర్ పవర్ అవుతుందా అనే అంశం మీద 2005లో వరల్డ్ బ్యాంక్ ఆర్థికవేత్త స్టీఫెన్ హౌస్ వెలువరించిన అధ్యయన పత్రం ప్రకారం, 2050 నాటికి బిహార్, ఒడిశా, యూపీ, ఎంపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో తలసరి ఆదాయాలు 1,000 డాలర్ల కంటే తక్కువగా ఉంటాయి. ప్రస్తుతం ఉన్న తలసరి జీడీపీ కంటే ఇది తక్కువ. 2050లో ఉండబోయే దానికంటే కూడా కచ్చితంగా తక్కువే ఉంటుంది. ఈ రాష్ట్రాల్లోనే జనాభా వెల్లువెత్తుతోంది. రాష్ట్రాల మధ్య నెలకొనే తలసరి ఆదాయ వ్యత్యాసాలు పునఃపంపిణీ విధానాలను (పన్నుల్లో వాటా, సంక్షేమ పథకాల వంటి వాటి అమలును) తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం జరుగుతున్న దాని ప్రకారం చూస్తే, ప్రజలు పొట్ట చేతపట్టుకుని సాపేక్షంగా బీద రాష్ట్రాల నుంచి సాపేక్షంగా ధనిక రాష్ట్రాలకు వలసలు పోతారు. ఇది సామాజిక అశాంతికి దారితీస్తుంది.

2020లో ఇండియాలో 15–24 ఏళ్ళ మధ్యవయసు యువకులు 24.5 కోట్ల మంది ఉన్నారు. 2020లో నమోదైన పొదుపులు, పతాక స్థాయి ఉత్పాదక సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నట్లయితే, 2050 నాటికి అభివృద్ధి చెందిన సుసంపన్న ఆర్థిక వ్యవస్థగా దేశం ఆవిర్భవించే అవకాశం ఉండి ఉండేది. యువజనుల శాతం పరంగా ఇలాంటి సువర్ణావకాశం మళ్లీ ఎప్పటికీ రాదు. వచ్చే అర్ధ శతాబ్దంలోనైనా మనం బీదరికం ఉచ్చు నుంచి బయటపడాలంటే, మానవ అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి మీద భారీ పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఇదే! అయితే, దురదృష్టవశాత్తూ అలాంటి ప్రయత్నాలేం జరుగుతున్న దాఖలాల్లేవు.

వ్యాసకర్త విధాన నిర్ణయాల విశ్లేషకుడు, రచయిత
mohanguru@gmail.com

సోషల్ మీడియా

ఏమిటీ గోల?



కెనడాలో జరగనున్న జీ-7 శిఖరాగ్ర సమావేశానికి నరేంద్ర మోదీకి ఆహ్వానం లేనప్పుడేమో, జీ-7ను ప్రాసంగికత కోల్పోయినదిగా గోడీ మీడియా అభివర్ణిస్తుంది. చివరి నిమిషపు ఆహ్వానం అందగానే 'విశ్వగురు' అని హోరెత్తిస్తుంది. ఈ గందరగోళ కామెడీ షో నడుస్తూనే ఉంటుంది.

– సాగరికా ఘోష్, రాజ్యసభ సభ్యురాలు

ఎందుకీ గోల?



జీ–7కు ఆహ్వానం రానప్పుడేమో, ఇది భారత విదేశాంగ విధాన వైఫల్యం అని ప్రతిపక్షం అభివర్ణిస్తుంది. అదే ఆహ్వానం అందగానే, వెటకారంగా మాట్లాడుతారు. కామెడీ షో మన చుట్టూనే ఉంది.

– యూసుఫ్ ఉంరూవాలా, సంపాదకుడు

మహాత్ముడే మార్గం



మహాత్మా గాంధీ ఒక వాస్తవిక వాది. ఇప్పటి మతిలేని ప్రపంచానికి ఆయన మార్గమే శరణ్యం. ఇంకో విషయం ఏమిటంటే, రాక్షసులు ఎవరూ ఆయన్ని బహిరంగంగా వ్యతిరేకించలేరు. అది కూడా ఆయన మార్గాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక వీలు కల్పిస్తుంది.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

అంతా అరచేతిలో!



దుబాయిలో ప్రతిదానికీ ఒక యాప్ ఉంది. నువ్వు ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేదు. ఒక రూమ్, ఒక పరుపు, 5జీ డేటా కనెక్షన్‌తో ఒక ఫోన్ ఉంటే చాలు.

– హసన్ సజ్వానీ, వ్యాఖ్యాత

వాళ్లే హీరోలు



మనకు వయసు పెరిగాక, మన జీవితంలో నిజమైన హీరోలు మనకు జీవితంలో అత్యంత సన్నిహితంగా ఉన్నవాళ్లే అని అర్థమవుతుంది. అందుకే వర్తమానంలో కూడా వారి పట్ల ప్రశంసాపూర్వకంగా ఉండండి.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అదే కాంగ్రెస్ ప్రారబ్ధం!

కామెంట్



కరణ్ థాపర్

శశి థరూర్‌ను కాంగ్రెస్ గొప్ప సొత్తుగా భావిస్తుందని అనుకున్నా. పార్టీకున్న అత్యంత విలువైన సభ్యులలో ఒకరిగా, తామెంతో గర్వించదగిన వ్యక్తిగా ఆయన్ను గౌరవిస్తుందని భావించా. కానీ, పార్టీ ఆయనను ఒక ద్రోహిగా పరిగణిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక తిరుగుబాటు దారునిగా, కట్టు బాటు తప్పిన వ్యక్తిగా చూస్తోంది. నాయకత్వం థరూర్ పట్ల ముభావంగా, అంటీ ముట్టనట్లుగా ఉండటమే కాదు, అసలు ఆయన పొడ గిట్టనదిగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది.

అది అసూయతోనా? అభద్రతా భావంతోనా? లేక శత్రుత్వంతోనా? అనేక మంది కాంగ్రెస్ నాయకులకు అనేక స్థాయిలలో శశి ఎసరుపెట్టగలిగిన వ్యక్తిగా ఉన్నారనడంలో నాకెలాంటి సందేహమూ లేదు. శశిలో కనిపించే అధునాతనత్వం, వాక్పటిమ లేనివారు ఆయన్ని చూసి అసూయ పడవచ్చు. సొంతంగా విజయం సాధించగలగడంపైన కానీ, అర్హతలపైన కానీ నమ్మకం లేనివారు అభద్రతా భావానికి లోనవడం కూడా సహజం. శశికున్నంత ప్రతిభ, ప్రాచుర్యం తమకూ ఉన్నాయని, తాము ఆయనకు ఏమీ తీసిపోమని భావించేవారు ఆయనను ఒక ప్రత్యర్థిగా భావించవచ్చు. ఆ మూడు రకాలవారూ శశిని పార్టీ నుంచి బయటకు గెంటేయలేకపోయినా, ఆయన ప్రాబల్యాన్ని, స్థాయిని తగ్గించాలని బలంగా కోరుకుంటున్నారు.

రాజకీయాల్లో ఇదంతా అనివార్యమేనని మీరు అనుకోవచ్చు. మనం తరచూ చూస్తున్న తెరచాటు, వంచనాయుత రాజకీయాల్లో ఇది మామూలేనని అనుకోవచ్చు. ఇతర పార్టీలలోని యువ ప్రతిభావంతులను ఆ పార్టీలలోని సహచరులు సమానంగా చూస్తున్నారు. కనీసం, వారిని కించపరచే మార్గాలను అనుసరించడం లేదు. సగటు మానవులు, తమను మించి ఎదిగిపోగలరని భావించినవారిని చూసి సహించలేరు. అందులోనూ, రాజకీయ నాయకుల విషయంలో అది మరింత వాస్తవం. నేను దానితో విభేదించడం లేదు. దానిని అర్థం చేసుకోగలను. శశిలోని ఆత్మవిశ్వాసపు చిరునవ్వు, అతిశయం... మిగిలిన నాయకులకు చాలా కాలంగా కంటగింపుగా ఉండవచ్చు. లోలోపల కోపంతో రగిలిపోతూ ఉండవచ్చు. ఉద్దేశపూర్వకంగా కాకపోయినా, ఆయన చాలా మంది శత్రువులను పోగేసుకున్నారు.

కానీ, భారత దేశపు వాణిని వినిపించేందుకు శశి విదేశాలలో ఉన్నప్పుడు, అదీ ఆయనకు అప్పగించిన బాధ్యతలను అద్భుతంగా నిర్వహిస్తున్నప్పుడు ఆడిపోసుకోవడమే అర్థం కాకుండా ఉంది. ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడం, విలన్‌గా చిత్రించడమే విస్మయం కలిగిస్తోంది. ఇది ఆత్మవినాశనాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. అటు కాంగ్రెస్ పార్టీ గానీ, ఇటు ఆ పార్టీలోని కొందరు వ్యక్తులు గానీ దానివల్ల సంతరించుకున్న ప్రతిష్ఠ ఏమీ లేదు. పైగా, వారు సంకుచిత మనస్కులుగా, స్ఫూర్తిని ప్రదర్శించలేని వారుగా, ఇంకా చెప్పాలంటే బుద్ధిలేని వారుగా ముద్రను మూట గట్టుకుంటున్నారు. పాకిస్తానీ తండాలు ఉగ్రదాడులకు పాల్పడినపుడు, ప్రతిగా గతంలోనూ భారత్ నియంత్రణ రేఖను దాటిన దృష్టాంతాలు ఉన్నప్పటికీ, అనుకోకుండానో లేదా ఉద్దేశపూర్వకంగానో శశి వాటిని మరచిపోవడమో లేదా పట్టించుకోకపోవడమో చేసినప్పటికీ, ఇది ఆయనపై విమర్శలకు దిగడానికి మాత్రం సరైన సమయం కాదు. ఇది శశిని సరిదిద్దవలసిన సందర్భం అంతకంటే కాదు. శశి విదేశాల్లో ఉన్నప్పుడు, ప్రజా బాహుళ్యం మధ్య లేనపుడు చేయవలసిన పని కాదు. శశి మన దేశ ప్రజలకు ప్రశంసలను, అభినందనలను గడించి పెడుతున్న సమయంలో చేయాల్సిన పని అస్సలు కాదు. ఆ మూడింటి దృష్ట్యానూ ఈ సమయంలో ఆయనపై విమర్శలకు దిగడం ఆత్మహత్యా సదృశమే అవుతుంది.

మరొకటి, శశిపై ఇపుడు చేస్తున్న విమర్శలకు దేశ పౌరుల నుంచి వత్తాసు లభించడం లేదు. ఇపుడే కాదు, శశిపై అటువంటి ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించకపోవచ్చు. ప్రజలు కూడా స్వాగతిస్తారని, సానుకూలంగా స్పందిస్తారని గట్టిగా భావించినపుడు మాత్రమే చతురత కలిగిన ఏ రాజకీయ పార్టీ



◆ భారత దేశపు వాణిని వినిపించేందుకు శశి విదేశాలలో ఉన్నప్పుడు, అదీ ఆయనకు అప్పగించిన బాధ్యతలను అద్భుతంగా నిర్వహిస్తున్నప్పుడు ఆడిపోసుకోవడమే అర్థం కాకుండా ఉంది. ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడం, విలన్‌గా చిత్రించడమే విస్మయం కలిగిస్తోంది. ఇది ఆత్మవినాశనాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. అటు కాంగ్రెస్ పార్టీ కానీ, ఇటు ఆ పార్టీలోని కొందరు వ్యక్తులు కానీ దానివల్ల సంతరించుకున్న ప్రతిష్ఠ ఏమీ లేదు.

అయినా బహిరంగంగా ఆయనను మందలించే ప్రయత్నం చేయవచ్చు. ఈసారి పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది. కాంగ్రెస్ తనను తాను నవ్వులపాలు చేసుకుంది. శశిని కొనియాడేవారు ఇదివరకే కోకొల్లలుగా ఉన్నారు. ఇపుడు అభినందన చందనాలు ఆయనకు ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడ్డాయి. ప్రత్యర్థులను సున్నాలో ఉంచి, ఆయన మ్యాచ్ గెలిచే స్థితిలో ఉన్నారు.

నిజానికి, కాంగ్రెస్ ప్రతిష్ఠను మూటగట్టుకునేందుకు ఇది బంగారం లాంటి అవకాశాన్ని తెచ్చిపెట్టింది. దాన్ని చేజేతులా పాడుచేసుకుని కాంగ్రెస్ దోషిలా నిలిచే సంకటంలో పడింది. కాంగ్రెస్ శాంతంగా, ఆవేశరహితంగా ఆలోచించుకుని ఉంటే, వ్యూహాత్మకంగా, యుక్తితో వ్యవహరిస్తూ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేయగలిగిన, దెప్పిపొడుస్తూ కవ్వించగలిగిన స్థితిలో ఉండగలిగేది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. కొంత మాయోపాయాన్ని ప్రదర్శిస్తూ అయినా గడసరిగా వ్యవహరించి ఉండవలసింది.

శశిని ఆడిపోసుకునే బదులు బాహాటంగా ప్రశంసించి ఉండవలసింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి, 'చూడండి! శశి థరూర్ వంటి కాంగ్రెస్ ఎంపీలు దేశ సేవకు నిస్వార్థంగా ఎలా తరలివెళుతున్నారో! కాంగ్రెస్ నాయకుల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని ఇది నిరూపిస్తోంది. వారు లేనిదే, భారతదేశ అవసరాలు తీరేవా?' అని చెప్పుకొని ఉండాల్సింది. ఆ విధంగా, కాంగ్రెస్ తన భుజాన్ని తానే తట్టుకుని ఉండాల్సింది. దాన్ని ఎవరూ తప్పు పట్టేవారు కాదు. పైగా, చాలా మంది ప్రజలు సంతోషంగా దానికి సమ్మతి తెలిపేవారు.

కాంగ్రెస్ మరో అడుగు ముందుకు వేసి, 'మాతో సరిపోల్చదగినవారు బీజేపీలో ఎవరూ లేరు. భారత్ గొంతుకను వినిపించాలంటే, కాంగ్రెస్ గొంతుకల వల్లనే అవుతుంది. ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన దేశమైన అమెరికాకి, ఈ కారణంగానే ఒక కాంగ్రెస్ నాయకుని నేతృత్వంలో ప్రతినిధి బృందం వెళ్ళింది' అని కూడా ఘనంగా చాటుకుని ఉండవచ్చు.

నా ఈ మాటల్లో కొంత అతిశయోక్తి ఉండవచ్చు. కానీ, నేను చెప్పదలచుకున్న సంగతికి అదొక్కటే మార్గం. ఇది ఖ్యాతిని దక్కించుకోవలసిన సమయం. అదీ స్నేహపూర్వకమైన మార్గాల్లో ప్రభుత్వాన్ని ఎద్దేవా చేస్తూ పైచేయి సాధించి ఉండవచ్చు. కానీ, శశి మీద వ్యతిరేకతతో అందివచ్చిన అవకాశాన్ని అది కాలరాసుకుంది. దీన్ని అంతకంటే ఎలా భావించగలం? అదే కాంగ్రెస్ ప్రారబ్ధం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

చీకటి వెలుగులు

సాధారణంగా కష్ట సుఖాలను చీకటి వెలుగులతో పోలుస్తూ ఉంటారు. చీకటి కష్టానికి ప్రతీకగా, వెలుగు సంతోషానికి ప్రతీకగా చెపుతుంటారు. కాల చక్రంలో దుఃఖం తర్వాత సుఖం, మళ్ళీ సుఖం తర్వాత దుఃఖం వస్తూనే ఉంటాయి. ఏదీ శాశ్వతంగా ఉండదు అని చెప్పటానికే ఇలా చెబుతుంటారు.

జ్యోతిర్మయం

అయితే, పరమేశ్వరుడు పార్వతీ దేవితో చీకటి రెండు విధాలని చెబుతాడు. ఒకటి – రాత్రి వలన కలిగినట్టిది. రెండవది – శరీరం వల్ల ఏర్పడినది. రాత్రి చీకటి సూర్య కాంతి ప్రసరణ వల్ల నశిస్తుంది. దేహంలో పుట్టిన చీకటి పెద్దలు చెప్పిన శాస్త్ర, పురాణాది విషయాలు వినటం వల్ల తొలగిపోతుంది. దేహంలో పుట్టిన చీకటి అంటే అజ్ఞానం. జ్ఞానులు చీకటిని అజ్ఞానానికి ప్రతీకగా, వెలుగును విజ్ఞానానికి ప్రతీకగా చెబుతారు. అందుకే, అజ్ఞానాంధకారాన్ని విజ్ఞాన జ్యోతితో తొలగించుకోవాలని చెబుతారు.

బ్రహ్మ దేవుడు, శరీరంలోని చీకటిని తొలగించటానికి అనేక సంవత్సరాలు గొప్ప తపస్సు చేసి, ఆ తపః ఫలంగా వేదాలను, శాస్త్రాలను పొందాడు. వాటి సారాన్ని మహాభారత, భాగవతాది గ్రంథాలలో, ఉపనిషత్తులలో మానవాళికి అర్థమయ్యే రీతిలో వ్యాసాది మహర్షులు, తర్వాత కవులు పొందుపరిచారు. మానవులు చేయదగిన పనులేవో, చేయరానివేవో ఆ వేద శాస్త్ర గ్రంథాల వల్ల తెలుసుకొని, ఆచరించి, తమ అజ్ఞానాన్ని తొలగించుకోవలసి ఉంది.

మనుషులలో అహంకారాది దుర్గుణాలు గాలి తాకిడికి మబ్బులు చెదరిపోయిన విధంగా... వేద, శాస్త్రాల వినికిడి వల్ల నశిస్తాయని పరమేశ్వరుడు చెప్పాడు.

శ్రవణం మానవుని పరిపూర్ణ జ్ఞానవంతుని చేస్తుంది. ప్రాచీన కాలంలో వినికిడి జ్ఞానమే ఉండేది. బహు శాస్త్ర పాండిత్యం గల పండితుడు భారతాది గ్రంథాలను చదివి, వివరించి చెబుతుంటే, విని, ఆకళింపు చేసుకుని జ్ఞాన సముపార్జన చేసేవారు.

నవ విధ భక్తి మార్గాలలో కూడా శ్రవణమే మొదటి భక్తి సాధనంగా చెప్పారు. అభివ్యక్తి నైపుణ్యాలలోనూ శ్రవణమే మొదటిది. శ్రద్ధగా, పెద్దలు చెప్పే విషయాలు వినటం వల్ల అజ్ఞానమనే చీకటి తొలగి, విజ్ఞానమనే కాంతితో మానవులు ప్రకాశిస్తారు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.త్రయోదశి ఉ.8.54 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: విశాఖ ప.3.21 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.7.45 నుండి 9.31 వరకు, దుర్ముహూర్తం: ప.12.26 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.03 నుండి 3.55 వరకు, అమృతఘడియలు: ఉ.5.34 నుండి 7.21 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.29.

క్లుప్తంగా...

తొలి రోజు సజావుగా ఐసెట్

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఉన్నత విద్యామండలి చైర్మన్



ఐసెట్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి , పురుషోత్తం, అల్తాఫ్ హుస్సేన్, అల్వాల రవి

నల్లగొండ టూటౌన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ ఐసెట్– 2025 తొలి రోజు ఆదివారం రెండు విడతల పరీక్ష సజావుగా సాగింది. ప్రశ్నపత్రాల సెట్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, టీజీ ఐసెట్ చైర్మన్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్ ఆచార్య అల్వాల రవిలతో కలిసి ఆదివారం ఎంజీయూలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అనతి కాలంలోనే రాష్ట్ర స్థాయి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లు నిర్వహించే సామర్థ్యాన్ని నల్లగొండ ఎంజీ యూనివర్సిటీ పొందడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లోని వివిధ పరీక్షా కేంద్రాలను బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. నల్లగొండలోని ఐసెట్ పరీక్ష కేంద్రాలను వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పరిశీలించారు. ఎంజీయూలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఐసెట్ కన్వీనర్ ఆచార్య అల్వాల రవి 93 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ సరళిని సమీక్షించి తగు సూచనలు చేశారు. మొత్తం మూడు విడతల్లో నిర్వహించ తలపెట్టిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ఆదివారం ఉదయం 10 నుంచి 12:30 వరకు 93 పరీక్షా కేంద్రాల్లో, మధ్యాహ్నం రెండున్నర నుంచి 5 గంటల వరకు 91 పరీక్ష కేంద్రాల్లో రెండు విడతలుగా నిర్వహించారు. ఉదయం పరీక్షకు 21,897 మంది అభ్యర్థులు హాజరుకాగా, మధ్యాహ్నం 22,136 మంది హాజరైనట్లు కన్వీనర్ ఆచార్య అల్వాల రవి తెలిపారు. ఐసెట్ రెండో విడత ప్రశ్నపత్రాల సెట్‌ను బాలకృష్ణారెడ్డి ఎంజీయూలో విడుదల చేశారు. తొలి విడత పరీక్షకు 'ఇ'సెట్‌ను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. మూడు విడతలుగా జరగనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సెట్‌ను పరీక్షకు ముందు విడుదల చేస్తారు.

గ్రామస్తుడిని హతమార్చిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా పువ్వర్తిలో గ్రామస్తుడిని మావోయిస్టులు హత్య చేశారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పదినుంచి.. పదిహేను మంది మావోయిస్టులు పదునైన ఆయుధాలతో హత్యకు పాల్పడ్డారు. హత్యకు గల కారణాలు వెల్లడి కాలేదు. హత్య చేసిన మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి.

అమెరికాలో బేతవోలు వాసి మృతి

- స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం



నరేందర్

చిలుకూరు: ఉన్నత విద్యకు అమెరికా వెళ్లిన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామ యువకుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుని బంధువులు తెలిపిన వివరాలివి. బేతవోలు గ్రామానికి చెందిన జల్లా నాగేశ్వరరావు చిన్న కుమారుడు జల్లా నరేందర్ (25) అలియాస్ నవీన్ బీటెక్ పూర్తిచేసి నాలుగేళ్ల క్రితం ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. అక్కడ మిస్సోరీ రాష్ట్రంలోని యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఈ నెల 1వ తేదీన (భారత కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు) తన రూమ్ ఫ్రెండ్స్‌తో కలిసి కారులో వెళ్తుండగా.. కాన్సాస్ సిటీ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు వెనక సీటులో కూర్చున్న నరేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి నరేందర్ మృతదేహం చేరగానే, సోమవారం బేతవోలు లో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉన్నత విద్యకు అమెరికా వెళ్లిన తమ కుమారుడు విగతజీవిగా వస్తుండడంతో నరేందర్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

కనగల్: పిడుగుపాటుకు గురై మహిళ మృతి చెందింది. నల్లగొండ జిల్లా కనగల్ మండలం కురంపల్లిలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై కనగల్ ఎస్ఐ పి.విష్ణుమూర్తి, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. కురంపల్లి గ్రామానికి చెందిన కావలి సత్తెమ్మ (50) ఆదివారం మధ్యాహ్నం గేదెలను మేపేందుకు తోటికోడలు లక్ష్మమ్మతో కలిసి.. గ్రామ శివారులోని చెరువు భూమిలోకి వెళ్లింది. అదే సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వారిద్దరూ గేదెలను తోలుకొని ఇంటికి వస్తుండగా సత్తెమ్మపై పిడుగు పడింది. ఈ సంఘటనలో ఆమె మెడ అంతా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే మాగంటి కన్నుమూత

- ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- కన్నీటిపర్యంతమైన మాజీ సీఎం కేసీఆర్
- పాడెమోసిన బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు
- అధికార లాంఛనాలతో మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గోపీనాథ్
- సీఎం రేవంత్, మంత్రులు, ప్రముఖుల సంతాపం



గోపీనాథ్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్



గోపీనాథ్ పాడె మోస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

గచ్చిబౌలి/రాయదుర్గం: జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ శాసనసభ్యుడు, సినీ నిర్మాత మాగంటి గోపీనాథ్ (62) మరణించారు. ఈ నెల 5వ తేదీన గుండెపోటు రావటంతో ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 5.45 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గోపీనాథ్‌కు భార్య సునీత, కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తెలు అక్షరనాగ, దిశిర ఉన్నారు. గోపీనాథ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన పార్థివ దేహానికి రాయదుర్గంలోని మహాప్రస్థానంలో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కన్నీటిపర్యంతమైన కేసీఆర్

గోపీనాథ్ మృతి విషయం తెలిసిన వెంటనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇతర నేతలు ఏఐజీ ఆస్పత్రికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. గోపీనాథ్ మృతదేహాన్ని మాదాపూర్‌లోని ఆయన స్వగృహానికి తరలించిన తర్వాత మాజీ సీఎం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు అక్కడికి చేరుకొని నివాళులర్పించారు. గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్‌ను పట్టుకొని కేసీఆర్ కన్నీటిపర్యంతమయ్యారు. మాగంటి భార్య, కుమార్తెలను ఓదార్చారు. వారికి ధైర్యం చెబుతూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులతోపాటు బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, సబితారెడ్డి, కృష్ణారావు, సంతోష్‌రావు, దాసోజు శ్రవణ్ తదితరులు మాగంటి నివాసానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియలకు తరలివెళ్లే సమయంలో కేటీఆర్, హరీశ్‌రావు.. గోపీనాథ్ పాడె మోసి ఆయనతో ఉన్న అనుబంధాన్ని చాటారు. రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో గోపీనాథ్ మృతదేహానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పద్మారావుగౌడ్, పువ్వాడ అజయ్, సురేష్‌రెడ్డి, దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వర్‌రావు, కల్వకుంట్ల కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, సుధీర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సునీతారెడ్డి, కాలేరు వెంకటేష్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి..

మాగంటి గోపీనాథ్ 1963 జూన్ 2న హైదరాబాద్‌లో జన్మించారు. 1983లో ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేశారు. అప్పుడే నందమూరి తారకరామారావు కొత్తగా టీడీపీని స్థాపించటంతో, ఆయన స్ఫూర్తితో గోపీనాథ్ రాజకీయాల్లోకి వచ్చారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత హుడా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో బీఆర్‌ఎస్‌లో చేరి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. 2022లో బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

గోపీనాథ్ అంకితభావం గల నేత

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మృతికి గవర్నర్ సంతాపం
- గోపీనాథ్ మృతి బాధాకరం: సీఎం రేవంత్
- బీఆర్‌ఎస్‌కు తీరని లోటు: కేసీఆర్
- సంతాపం తెలిపిన బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోపీనాథ్ అంకితభావంతో కూడిన ప్రజా సేవకుడు, స్నేహపూర్వక నాయకుడని కొనియాడారు. గోపీనాథ్ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. గోపీనాథ్ మరణం బాధాకరమని సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గోపీనాథ్ మృతిపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా పని చేసి ప్రజల తలలో నాలుకగా మెలిగారని కొనియాడారు. గోపీనాథ్ కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన గోపీనాథ్.. ఎంతో సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరు సంపాదించారని కొనియాడారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో గోపీనాథ్ కీలకపాత్ర పోషించారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గోపీనాథ్ మృతికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు సంతాపం తెలిపారు. గోపీనాథ్ మృతితో రాష్ట్రం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. గోపీనాథ్ జీవితం అందరికీ ఆదర్శమని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. గోపీనాథ్ మృతికి బీఆర్‌ఎస్ నేతలు వద్దిరాజు రవిచంద్ర, బోయినపల్లి వినోద్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, సీపీఐ కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

వనపర్తిలో వీరగల్లు స్మారక శిలలు

వెయ్యి నుంచి 2,300 ఏళ్ల నాటివని అనుమానం



వనపర్తిలో లభ్యమైన వీరగల్లు వీరుల శిలలు


వనపర్తి టౌన్: చైతన్య, వివేకాపర్తిగా పేరున్న వనపర్తిలో క్రీస్తు పూర్వం నాటి వీరగల్లు యుద్ధ ఆనవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధంలో వీరుల మరణాలను స్మరించుకునే వీరగల్లు శిలలు వనపర్తి జిల్లా కేంద్రంలో వెలుగుచూశాయి. పట్టణంలోని పోచమ్మగుడి వద్ద శతాబ్దాల నాటి వీరగల్లు స్మారక శిలలను చరిత్ర పరిశోధకులు, చరిత్రకారులు బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శ్యాంసుందర్ గుర్తించారు. ఈ వీర శిలలలో తొమ్మిది మంది వీరుల్లో ఒక అశ్వారూఢుడైన వీరుడు బల్లెంతో, మరొక వీరుడు బల్లెం, డాలుతో కనిపిస్తున్నాయి. కొన్ని దశాబ్దాల కిందట కర్ణాటక, తెలంగాణలోని సిద్దిపేట, వనపర్తి, వికారాబాద్‌లో వీరగల్లుల ఆనవాళ్లు ఉన్నట్లు ప్రముఖ ఆంగ్ల పత్రికల్లో వార్తలు వచ్చాయి. వీరగల్లు శిలలు కొన్నేళ్ల తరబడి వనపర్తిలోని పోచమ్మ ఆలయంలో ఉన్నప్పటికీ వాటిని ఎవరూ గుర్తించలేపోయారు. ఈ క్రమంలోనే వనపర్తిలోని చిట్యాల రోడ్డులో వీరులగడ్డ అనే పేరుతో ఒక ప్రాంతం ఉండటంతో ఆ పేరు ఎలా వచ్చిందని పరిశోధకులు పరిశీలిస్తుండగా, వనపర్తి పోచమ్మ ఆలయంలో ఉన్న శిలలు వీరగల్లు విగ్రహాలని తేలింది. 150– 300 ఏళ్ల కిందట వీరుల స్మారక శిలలను వనపర్తిలోని పోచమ్మ ఆలయంలో భద్రపరిచినట్లు తెలుస్తోంది. ఇన్ని రోజులు ఈ వీరగల్లు శిలలను స్థానిక ప్రజలు దేవతామూర్తులుగా భావించారు. ఈ వీరశిలలలో సతి శిలలు నాలుగు, కత్తి ఆయుధంగా ధరించిన ఎక్కటీలు ఇద్దరు ఉన్నారు.

వనపర్తి చరిత్ర శతాబ్దాల కిందటిదే..

వీరుల స్మారక శిలలు ఒకేచోట లభించడంతో వందలు, వేల సంవత్సరాల కిందటే వనపర్తి ఒకనాటి యుద్ధరంగమై ఉంటుందని చరిత్రకారులు, పరిశోధకులు భావిస్తున్నారు. వీరగల్లు శిలలు క్రీస్తు పూర్వం నుంచి ఉన్నాయని, వీరగల్లులలో దాదాపు 40 రకాలున్నాయని, శాసనంతో కూడిన వీరగల్లులు వాటిలో ప్రత్యేకమని కొత్త తెలంగాణ చరిత్ర బృంద కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. వనపర్తికి అతి సమీపంలో ఉండే నాచహళ్లి గ్రామంలో గోపాల్ వ్యవసాయ పొలంలో కూడా శాసనంతో కూడిన గుడిలాంటి ప్రాంతంలో ఒక సతి శిల, ఒక వీరశిల ఉన్నట్లు గుర్తించామన్నారు.

సమాజ ఐక్యతకు మీడియా కృషి చేయాలి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



బీబీనగర్: సమాజంలో శాంతి స్థాపనకు మీడియా సైతం తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహాదేవ్‌పురం గ్రామ పరిధిలో గల బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి మీడియా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కులాలు, మతాల పేరిట వీడిపోతున్న సమాజాన్ని ఐక్యత వైపు నడిపించేలా మీడియా సంస్థలు, జర్నలిస్టులు అంకిత భావంతో పని చేయాలన్నారు. ఆధ్యాత్మికత, నైతిక విలువల ద్వారా సమాజంలో పాజిటివ్ వాతావరణాన్ని బ్రహ్మకుమారీస్ పెంపొందిస్తుందని అన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు మాట్లాడుతూ జర్నలిస్టుల్లో వ్యక్తిగతంగా ప్రశాంతత, సానుకూలవైఖరి పెంచాలన్న ఉద్దేశంతో సదస్సు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ మీడియా వింగ్ వైస్ చైర్మన్ సరళ, కోఆర్డినేటర్ శాంత, డైరెక్టర్లు రాజకుమారి, సునీత, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చేప ప్రసాదం పంపిణీతో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ ఖ్యాతి

- బత్తిని కుటుంబ సభ్యులకు పద్మశ్రీ అవార్డుకు కృషి : మంత్రి పొన్నం
- పలు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన ఆస్తమా రోగులు



చేప ప్రసాదం వేసుకుంటున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో పొన్నం, అనిల్‌యాదవ్, మధుయాష్కీ, మెట్టు సాయికుమార్ తదితరులు

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: చేప ప్రసాదం పంపిణీతో హైదరాబాద్ ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి వ్యాప్తి చెందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బత్తిని కుటుంబీకులు ఏటా లక్షలాది మందికి ఉచితంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారని చెప్పారు. మృగశిర కార్తెని పురస్కరించుకొని ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని సోదరులు నిర్వహించే చేప ప్రసాద కార్యక్రమాన్ని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్, రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ మధుయాష్కీలతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ మృగశిర కార్తె రోజు చేప ప్రసాదం తీసుకోవడం వల్ల ఆస్తమా వ్యాధి తగ్గుతుందని చాలామంది నమ్ముకమన్నారు. విశ్వాసానికి మరో పేరు చేప ప్రసాదం పంపిణీ అన్నారు. ప్రభుత్వ పక్షాన 15 రోజులుగా ఈ కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి వివిధ శాఖల అధికారులు కలిసి 48 గంటల పాటు పనిచేస్తున్నట్టు వెల్లడించారు. 178 సంవత్సరాలుగా లక్షలాది మందికి సేవాభావంతో సేవలందిస్తున్న బత్తిని కుటుంబీకులకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేస్తామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 1995 నుంచి చేపప్రసాదాన్ని తన కుటుంబం తీసుకుంటుందని, తమకు ఎలాంటి సమస్య లేదని వెల్లడించారు. మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ చేప ప్రసాదం పంపిణీ కోసం మత్స్యశాఖ తరఫున 1.50 లక్షల చేపపిల్లలను అందించినట్టు తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఎగ్జిబిషన్ సొసైటీ, ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాయన్నారు.కర్ణాటక ఎమ్మెల్సీ మంజునాథ్, స్థానిక కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

46 వేల చేపపిల్లల విక్రయాలు

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి వరకు 46 వేల చేప పిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో విక్రయించినట్టు అధికారులు తెలిపారు. సోమవారం వరకు 60 వేల వరకు విక్రయాలు జరగొచ్చన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మెదక్ జిల్లాకు చెందిన సత్యనారాయణ(75) చేప ప్రసాదం తీసుకునేందుకు వచ్చాడు. క్యూ లైన్లో నిలబడిన సమయంలో హార్ట్ స్ట్రోక్ వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. తక్షణమే ఆయన్ను ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి సీపీఆర్ చేసినా, ఫలితం లేకపోయింది. సత్యనారాయణ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నేపాల్ నుంచి రాక..

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల నుంచే కాకుండా నేపాల్ నుంచి కూడా చేప ప్రసాదం స్వీకరించేందుకు వచ్చారు. ఆ దేశానికి చెందిన గోఖులు కాత్రే కుటుంబ సభ్యులు చేపప్రసాదాన్ని తీసుకున్నారు. మూడేళ్లుగా తాము క్రమంగా తప్పకుండా వస్తున్నామని చెప్పారు.

భారీ బందోబస్తు

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నగర పోలీస్ జాయింట్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లితో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. అడిషనల్ డీసీపీ ఆనంద్, అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు భరత్‌కుమార్, ఏడుకొండలుతో పాటు అదనపు పోలీసు బలగాలు బందోబస్తులో పాల్గొన్నాయి.

క్వారీని సందర్శించిన మైనింగ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్



క్వారీని పరిశీలిస్తున్న మైనింగ్ ఆర్‌ఐ

మెదక్ జోన్: మెదక్ జిల్లాలో మైనింగ్ మాఫియా మాయాజాలంపై ఆదివారం 'రికార్డుల్లో మూత.. రికార్డ్ స్థాయిలో మోత' శీర్షికతో 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మెదక్ మైనింగ్ ఆర్‌ఐ లక్ష్మీనారాయణ కొల్చారం మండలం రాంపూర్‌లో కొనసాగుతున్న క్వారీని ఆదివారం సందర్శించారు. మంజీరా క్వారీని ఇప్పటికే కేసీపీ సంస్థకు కేటాయించామని స్పష్టం చేశారు. మంజీరా పేరు మీద నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ పనులు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గర్భిణిని మంచంపై మోసుకెళ్తున్న గ్రామస్తులు

దారిలేక.. అంబులెన్సు రాలేక

- మంచంపై గర్భిణి తరలింపు
- రెండు కిలోమీటర్లు మోసుకెళ్లిన గ్రామస్తులు

పినపాక: రహదారి లేక.. 108 అంబులెన్సు రాలేక.. ఒక గర్భిణి పురిటి నొప్పులతో నరకయాతన పడింది. ఆమెను రెండు కిలోమీటర్ల దూరం మంచంపై గ్రామస్తులు మోసుకెళ్లారు. అక్కడినుంచి 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం ఉమేష్‌చంద్ర నగర్‌కు చెందిన మిడియం జానకికి ఆదివారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. రహదారి సౌకర్యం లేక ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో 108 నిలిచిపోయింది. వెంటనే గ్రామస్తులు ఆమెను మంచంపై పడుకోబెట్టి.. అడవిలో నడుచుకుంటూ టి.కొత్తగూడెం గ్రామ శివారుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పురిటి నొప్పులు తీవ్రం కావడంతో.. రాత్రి 7 గంటల సమయంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు వైద్యులు తెలిపారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద నాటుపడవలు, స్పీడ్ బోట్లతో గాలిస్తున్న దృశ్యం

నదీగర్భంలో గల్లంతైన ఆరుగురి మృతదేహాలు లభ్యం

- ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగిన గాలింపు
- సహాయక చర్యల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్, ఫైర్, పోలీసు బృందాలు
- మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం

కాళేశ్వరం: వివాహ వేడుకలకు హాజరై.. సరదా కోసం ఈతకు వెళ్లి గల్లంతైన ఆరుగురు విద్యార్థుల మృతదేహాలు నదీగర్భంలో ఆదివారం లభ్యమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ ఎగువన మూడవ బ్లాక్ వద్ద గోదావరి లోతు ప్రవాహ ప్రాంతంలో అంబట్‌పల్లికి చెందిన పట్టి వెంకట్‌స్వామి ఇద్దరు కుమారులు మధుసూదన్ (18), శివమనోజ్ (15), కర్నాల సాగర్ (16), తొగరి రక్షిత్ (13), మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెద్ద రామ్‌చరణ్ (17), అదే మండలం స్తంభంపల్లి (పీపీ)కి చెందిన పసుల రాహుల్ (19)తో మేడిగడ్డ బ్యారేజీ చూసి గోదావరిలో ఈతకు వెళ్లి శనివారం సాయంత్రం 6 గంటలకు నీట మునిగారు. ఆ ఘటనలో పట్టి శివమణి (18) ప్రాణాలతో బయటపడ్డాడు.

ముమ్మర గాలింపు..

ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి భూపాలపల్లి ఏఎస్పీ నరేశ్‌కుమార్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌డీఆర్‌ఎఫ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, డీడీఆర్‌ఎఫ్, స్థానిక, సిరొంచ జాలర్లు, సింగరేణి రెస్క్యూ టీంలు స్పీడ్ బోట్లు, నాటు పడవల సాయంతో ముమ్మరంగా గాలించాయి. ఏడు గంటలపాటు సాగిన రెస్క్యూ ఆపరేషన్‌లో ఆరుగురి మృతదేహాల ఆచూకీ నీటమునిగిన ప్రాంతం నుంచి 50 మీటర్ల దూరంలో లభించింది. మృతదేహాలను వెలికి తీసి అంబులెన్స్‌ల ద్వారా మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబాలకు మృతదేహాలు అప్పగించారు. మృతుల తల్లిదండ్రులు, బంధువుల ఆర్తనాదాలతో మేడిగడ్డ ప్రాంతం శోకసంద్రంగా మారింది.

బండరాళ్లతో మోది.. పూడ్చిపెట్టి

- యువకుని దారుణ హత్య
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు
- ఘటనలో ఎనిమిది మంది నిందితులు..?



రమణారెడ్డి

మల్యాల: బండరాళ్లతో మోది.. హత్య చేసి గోతిలో పూడ్చి పెట్టిన యువకుడి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశా రు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో జరిగిన ఈ హత్యోదంతం వివరాలివి. ముత్యంపేట గ్రామానికి చెందిన ఉప్పు రమణారెడ్డిని కొంతమంది చంపి, పూడ్చిపెట్టారని అతడి సోదరుడు నిరంజన్ రెడ్డి శని వారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి దిగువ కొండగట్టులో శవాన్ని వెలికి తీశారు. దిగువ కొండగట్టులో ఈనెల 2న ఒక వివాహ హల్దీ వేడుకల్లో రమణారెడ్డికి.. స్థానిక యువకులతో వివాదం చెలరేగింది. దీంతో సుమారు ఎనిమిది మంది రమణారెడ్డిని విచక్షణారహితంగా కొడుతూ.. కొండగట్టు అంజన్న మెట్లదారి వరకు తీసుకెళ్లారని, తలపై బండరాయితో మోది, గిరి ప్రదక్షిణ కోసం చదును చేసిన దారి సమీపంలోని గుంతలో వేసి, మట్టితో పూడ్చివేశారని స్థానికులు చెబుతున్నారు. పాత కక్షలతోనే ప్రణాళిక ప్రకారం తన తమ్ముడిని బండరాళ్లతో కొట్టి చంపారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆయన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. సుమారు 8మంది రమణారెడ్డిని హ త్యచేసి పూడ్చిపెట్టినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడించినట్లు సమాచారం. మల్యా ల సీఐ నీలం రవి, ఎస్ఐ నరేశ్ కుమార్ ఆధ్వర్యంలో, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్ప గించారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని సీఐ, ఎస్ఐ తెలిపారు.

స్పేస్ మిషన్‌లో భాగస్వామ్యం నా అదృష్టం: శుభాన్షు

రేపు ఐఎస్ఎస్‌కు పయనం



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఆక్జియం–4 స్పేస్ మిషన్‌లో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా (39) చెప్పారు. మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి స్పేస్ ఎక్స్ డ్రాగన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోబోతున్నారు. అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి మంగళవారం సాయంత్రం 5.52 గంటలకు ఫాల్కన్–9 రాకెట్ ద్వారా వారి ప్రయాణం ప్రారంభం కానుంది. ఇదొక అద్భుతమైన ప్రయాణం అవుతుందని భావిస్తున్నట్లు శుభాన్షు చెప్పారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్ అయిన శుక్లా రాకేశ్ శర్మ అనంతరం 41 ఏళ్లకు అంతరిక్షంలోకి చేరుకోబోతున్న రెండో భారతీయుడిగా రికార్డు సృష్టించబోతున్నారు. ఆక్జియం మిషన్ నిమిత్తం అమెరికాలో కొద్ది నెలలుగా ప్రత్యేక శిక్షణ పొందారు. రాకేశ్ శర్మ సోవియట్ యూనియన్‌కు చెందిన సోయజ్ స్పేస్ క్రాఫ్ట్‌లో అంతరిక్షంలోకి వెళ్లి 8 రోజులుండి తిరిగొచ్చారు. ఆయనను శుభాన్షు తన స్ఫూర్తిప్రదాతగా భావిస్తుంటారు. శుక్లాతోపాటు కమాండర్ పెగ్గీ విట్సన్, మిషనల్ స్పెషలిస్టులు టిబోర్ కపూ, స్లావోజ్ ఉజ్‌నాన్స్కీ–విస్నీవెస్కీ స్పేస్‌ఎక్స్ మిషన్‌లో భాగంగా డ్రాగన్ క్యాప్సూల్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోబోతున్నారు. డ్రాగన్ క్యాప్సూల్‌కు శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తారు.

పూ పిల్స్‌తో సూపర్‌బగ్స్ ఖతం

మానవ మలంతో మాత్రల అభివృద్ధి



శరీరంలో తిష్ట వేసి ప్రాణాంతకమైన ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే సూపర్ బగ్స్‌ను తుదముట్టించడానికి బ్రిటన్ పరిశోధకులు సరికొత్త మాత్రను అభివృద్ధి చేశారు. ప్రధానంగా పేగుల్లో యాంటీబయోటిక్స్‌ను దెబ్బతీసే ఇన్ఫెక్షన్లకు విరుగుడు కనిపెట్టారు. ఈ మాత్రను మానవ మలంతో తయారు చేయడం గమనార్హం. వీటికి 'పూ పిల్స్' అని పేరు పెట్టారు. ఎండబెట్టి, పొడి చేసిన మలాన్ని ఈ మాత్రల తయారీకి ఉపయోగించారు. ఇందుకోసం ఆరోగ్యకరమైన దాతల నుంచి మలం నమూనాలు సేకరించారు. అందులో మనుషులకు మేలు చేసే బ్యాక్టీరియా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. జీర్ణం కాని వ్యర్థాలుంటే తొలగించారు. పూ పిల్స్‌లోని మంచి బ్యాక్టీరియా పేగుల అంతర్భాగంలోని సూపర్‌బగ్స్‌తో నేరుగా పోరాడి బయటకు పంపుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా పేగుల ఆరోగ్యానికి అవసరమైన బ్యాక్టీరియా వృద్ధి చెందుతున్నట్లు తేల్చారు. లండన్‌లోని గైస్ అండ్ సెయింట్ థామస్ ఆసుపత్రిలో 41 మంది రోగులపై ఈ ప్రయోగం చేశారు. వారికి పూ పిల్స్ ఇచ్చారు. ఇన్ఫెక్షన్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదకరమైన ఇన్ఫెక్షన్లను నివారించడానికి మలం మాత్రలు చక్కటి ప్రత్యామ్నాయమని డాక్టర్ బ్లెయిర్ మెరిక్ చెప్పారు. యాంటీబయాటిక్స్‌ను అడ్డుకొనే ఇన్ఫెక్షన్లకు, ఔషధాలకు లొంగని సూపర్‌బగ్స్‌కు మూలం పేగులేనని తెలిపారు. పూ పిల్స్‌తో సూపర్‌బగ్స్‌ను పేగుల నుంచి తరిమేయవచ్చని వెల్లడించారు. పూ పిల్స్ వాడకం కొత్తేమీ కాదు. క్లోస్ట్రిడియం డిఫిసైల్ బ్యాక్టీరియా వల్ల ఏర్పడే డయేరియా చికిత్సకు ఈ మాత్రలు వాడుతున్నారు. సూపర్‌బగ్స్ నియంత్రణకు పూ పిల్స్‌పై మరింత పరిశోధన చేయాలని నిర్ణయించారు.

– లండన్

40 ఏళ్లలో కరువుల తీవ్రత శాతం పెరిగింది

కాలిఫోర్నియా వర్సిటీ పరిశోధనలో వెల్లడి



కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. దాంతో కరువు కాటకాలు తప్పడం లేదు. కరువుల బెడద మరింత ఉగ్రరూపం దాలుస్తోంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రపంచవ్యాప్తంగా గత 40 ఏళ్లలో కరువుల తీవ్రత ఏకంగా 40 శాతం పెరిగినట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధనలు తేలింది. వర్షపాతం స్థిరంగా ఉన్నచోట కూడా కరువుల తీవ్ర పెరుగుతున్నట్లు వెల్లడయ్యింది. వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ అది తేమను ఒడిసిపట్టుకొనే సామర్థ్యం సైతం పెరుగుతోంది. దాంతో కరువులు తీవ్రత సైతం పైపైకి ఎగబాకుతోందని సైంటిస్టులు వెల్లడించారు. వాతావరణం వేడెక్కడానికి, కరువులు తీవ్రంగా మారడానికి మధ్య దగ్గర సంబంధం ఉందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన క్లైమేట్ హజార్డ్స్ సెంటర్ డైరెక్టర్ క్రిస్ ఫాంక్ తెలిపారు. ఈ పరిశోధన వివరాలను నేచర్ జర్నల్‌లో ప్రచురించారు. రాబోయే రోజుల్లో ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలు మరింత పెరగడమే తప్ప తగ్గిపోయే సూచనలైతే కనిపించడం లేదు. దీన్నిబట్టి చూస్తే మరింత తీవ్రమైన కరువులకు మానవాళి సిద్ధపడక తప్పదని చెప్పొచ్చు. ఈ అధ్యయనం కోసం 1901 నుంచి 2022 వరకు వాతావరణ డేటాను సేకరించి, విశ్లేషించారు. అట్మాస్పియరిక్ ఎవాపరేటివ్ డిమాండ్(ఏఈడీ) పెరుగుతుండడంతో కరువుల తీవ్రత కూడా పెరుగుతున్నట్లు తేలింది. గత 40 ఏళ్లలో ఇది 40 శాతం పెరిగినట్లు స్పష్టమయ్యింది. ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీలు పెరిగినా సరే అక్కడి వాతావరణం తేమను అధికంగా పీల్చుకుంటుంది. పంటలు, చిత్తడి నేలలు, అడవుల నుంచి తేమ వాతావరణంలోకి చేరుకుంటుంది. ఫలితంగా నేల నిస్సారమైపోతోంది. పంటలు ఎండిపోతాయి. చిత్తడి నేలలు పొడి నేలలుగా మారిపోతాయి. మరో విషయం ఏమిటంటే.. 1981–2017 నాటి సగటుతో పోలిస్తే గత ఐదేళ్లలో కరువు పరిస్థితి 74 శాతం పెరిగింది. ఈ పెరుగుదలకు 58 శాతం ఏఈడీనే కారణం. 2022లో భూగోళంపై రికార్డు స్థాయిలో 30 శాతం భూభాగం కరువునకు గురయ్యింది. దీనికి 40 శాతం ఏఈడీనే కావడం గమనార్హం.

– న్యూఢిల్లీ

మహిళా సాధికారతకు...

11 ఏళ్లుగా కృషి

ప్రభుత్వ అండతో వారి కలలు సాకారం: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో మహిళల అభివృద్ధి, సాధికారతకు తమ ప్రభుత్వం 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'మహిళల నేతృత్వంలో అభివృద్ధి'కి ప్రభుత్వం కొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. సైన్స్, విద్య, క్రీడలు, స్టార్టప్స్, సైనిక దళాలు సహా అన్ని రంగాల్లో నారీమణులు అద్భుతాలు సృష్టిస్తున్నారని, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రస్తావించారు. వాటితో నారీమణులు ఎంతో ప్రయోజనం పొందుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్, జన్‌ధన్ యోజన వంటి కార్యక్రమాలతో మన ఆడపడుచుల గౌరవం పెంచామని తెలిపారు. పేద గృహిణులకు ఉజ్వల యోజన కింద 10 కోట్లకు పైగా వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, మహిళా వ్యాపారవేత్తలకు ముద్రా రుణాలు అందజేశామని గుర్తుచేశారు. పీఎం ఆవాస్ యోజన కింద మహిళల పేరిటే ఇళ్లు ఇస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వ అండతో సోదరీమణులు వారి కలలు సాకారం చేసుకుంటున్నారని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో వారు చురుగ్గా పాల్గొంటున్నారని కొనియాడారు.



గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం


ఆడ శిశువులను కాపాడుకోవాలన్న లక్ష్యంతో తీసుకొచ్చిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమంతో అద్భుత ఫలితాలు వస్తున్నాయని, ఇదొక ఉద్యమంగా మారిందని మోదీ వివరించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. 2011–13లో ప్రతి లక్ష మందిలో 167 మంది గర్భిణులు ప్రసవాల సమయంలో మరణించేవారని, 2019–21 నాటికి అది 93కు తగ్గిందని పేర్కొన్నారు. 2019లో దేశంలో మంచినీటి కనెక్షన్ ఉన్న ఇళ్లు 3.23 కోట్లు కాగా 2025 మే నాటికి 15.64 కోట్లకు పెరిగాయన్నారు. సమాజంలో అన్ని వర్గాల మహిళల సంపూర్ణ అభివృద్ధే తమ ధ్యేయమని ప్రధాని స్పష్టం చేశారు.

మోదీ పాలనకు నేటితో పదకొండేళ్లు

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ సోమవారం 11 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్నారు. ప్రధానిగా మూడో టర్ములో ఆయన పదవీ కాలానికి సోమవారంతో ఏడాది పూర్తవనుంది. 2024 జూన్ 9న మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం తెలిసిందే. తొలి రెండు దఫాలకు భిన్నంగా మూడోసారి బీజేపీ సంపూర్ణ మెజార్టీకి కాస్త దూరంలోనే ఆగిపోయింది. దాంతో జేడీ(యూ), టీడీపీ తదితర పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. మూడో టర్మ్‌లో తొలి వార్షికోత్సవ వేడుకలకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 16 ఏళ్ల 286 రోజుల పాటు పదవిలో కొనసాగారు. ఇందిరా గాంధీ 11 ఏళ్ల 59 రోజులతో రెండో స్థానంలో ఉన్నారు. మరో రెండు నెలల్లో ఆమె రికార్డును మోదీ అధిగమించనున్నారు.

6,133కు కరోనా కేసులు

48 గంటల్లో 769 కొత్త కేసులు



న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ ఉధృతి పెరుగుతూనే ఉంది. మొత్తం కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కు చేరుకుంది. గత 48 గంటల్లో 769 కొత్త కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది. అలాగే గత 24 గంటల్లో ఆరుగురు బాధితులు మరణించినట్లు తెలియజేసింది. కేరళ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలో అత్యధిక యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా కరోనా వల్ల 65 మందికిపైగా మంది మృతి చెందారు. కరోనా తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా నిర్ధారణ పరీక్షలు, బాధితులకు వైద్య చికిత్స అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది.

మస్క్, అమెరికా ఆర్థిక మంత్రి

కొట్టుకున్నారు!

- మంత్రినే వెనకేసుకొచ్చిన ట్రంప్!
- అక్కడినుంచే విభేదాలు
- వైట్‌హౌస్ వర్గాల వెల్లడి



ఎలాన్ మస్క్ | స్కాట్ బిసెంట్

వాషింగ్టన్: అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్, లక్షల కోట్లకు అధిపతి ఎలాన్ మస్క్ మధ్య మాటల మంటలకు మూలకారణమైన ఉదంతం తాజాగా వెలుగు చూసింది. వారి మధ్య సఖ్యత చెడటానికి ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్ కారణంగా మారినట్టు ట్రంప్ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. గత ఏప్రిల్‌లో అధ్యక్ష కార్యాలయంలోని ఓవల్ ఆఫీస్‌లో భేటీ తర్వాత మస్క్, బిసెంట్ బాహాబాహీకి దిగారట! ట్రంప్ సన్నిహితుడు, పాడ్‌కాస్టర్ స్టీఫెన్ కె.బ్యానన్ ఈ మేరకు బయటపెట్టారు. వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ, వాళ్ల జీతభత్యాలను ట్రంప్ సర్కార్‌కు ఆదా చేస్తూ, లక్షల కోట్ల విదేశీ నిధులను నిలిపివేస్తూ ఆర్థిక శాఖపై తాను భారం తగ్గిస్తుంటే 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' పేరిట పన్నులను తగ్గించి ఆర్థిక శాఖపై అధ్యక్షుడు భారం పెంచుతున్నారంటూ మస్క్ తీవ్రంగా ఆక్షేపించడం తెలిసిందే. బిసెంట్‌తో ముష్టిఘాతాల పర్వం వారి మధ్య దూరాన్ని బాగా పెంచేసిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

ఓవల్ ఆఫీస్‌లో ఏం జరిగింది?

ఏప్రిల్ నెల మూడోవారంలో ఓవల్ కార్యాలయంలో ట్రంప్‌తో భేటీ సందర్భంగా అంతర్గత రెవెన్యూ విభాగ కమిషనర్‌గా మస్క్, బిసెంట్ చెరో పేరు ప్రతిపాదించారు. బిసెంట్ సూచించిన అభ్యర్థి వైపు ట్రంప్ మొగ్గారు. అవమానభారంతో వెళ్లిపోతున్న మస్క్‌తో బిసెంట్ వాగ్వాదానికి దిగారు. అది కాస్తా కొట్లాటకు దారితీసింది. 'రగ్బీ' మ్యాచ్ తరహాలో బిసెంట్‌ను మస్క్ తన భుజంతో ఎత్తి కుదేశాడు. ఇద్దరూ కొట్టుకుంటుండటంతో సిబ్బంది నిలువరించారు. ఇది ట్రంప్‌కు తెలియడంతో 'మరీ ఓవర్‌గా ఉంది' అన్నారు. అనంతరం మీడియా భేటీ సందర్భంగా మస్క్ ముఖం వాచిపోయి, కళ్లు ఎర్రబారడం కన్పించింది. కొడుకుతో ఆడుతుంటే దెబ్బలు తగిలాయని మస్క్ అప్పట్లో కవర్ చేశారు.

అనుమానాలుంటే

హైకోర్టుకు వెళ్లండి

- నేరుగా లేఖ రాస్తే బదులిస్తాం
- రాహుల్ గాంధీకి ఈసీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి కొట్టిపారేసింది. అందుకు ఆస్కారమే లేదని పేర్కొంది. ''ఎన్నికల ప్రక్రియపై అనుమానాలుంటే నేరుగా మాకు లేఖ రాయండి. బదులిస్తాం. అవకతవకలు జరిగినట్లు భావిస్తే హైకోర్టుకు వెళ్లొచ్చు. మహారాష్ట్ర పోలింగ్ కేంద్రాల సీసీటీవీ ఫుటేజీ కావాలంటూ పిటిషన్ దాఖలు చేయవచ్చు. అప్పుడు ఫుటేజీని న్యాయస్థానం క్షుణ్నంగా పరిశీలిస్తుంది'' అని ఈసీ వర్గాలు ఆదివారం స్పష్టం చేశాయి. ఎన్నికల చట్టాల ప్రకారం ఎన్నికల సమగ్రత, ఓటర్ల గోప్యతను ఈసీ కచ్చితంగా పరిరక్షిస్తుందని తెలిపాయి. ఓటర్ల గోప్యతపై దాడి చేయాలనుకోవడం సరైంది కాదని సూచించాయి. మహారాష్ట్రలో ఓటర్ల జాబితాను తారుమారు చేశారంటూ రాహుల్ చేసిన ఆరోపణలను ఖండించాయి. కాంగ్రెస్ అభ్యర్థులు స్వయంగా నియమించిన బూత్‌స్థాయి ఏజెంట్లు, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లను రాహుల్ అనుమానిస్తున్నారని ఆక్షేపించాయి. అసెంబ్లీ ఎన్నికలపై అనుమానాలు నివృత్తి చేయడానికి గత నెల 15న కాంగ్రెస్ నేతలను ఆహ్వానిస్తే ఎవరూ రాలేదని పేర్కొన్నాయి. ఎన్నికల్లో ప్రతికూల తీర్పు వస్తే ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టడం అసంబద్ధమని స్పష్టంచేశాయి.

ప్రజాతీర్పు అపహాస్యం: ఫడ్నవీస్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు ఓడిందీ సమీక్ష చేసుకోకుండా ప్రజాతీర్పును రాహుల్ అపహాస్యం చేస్తున్నారని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించడాన్ని తట్టుకోలేక నిందలు వేస్తున్నారని ఆదివారం ఓ ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో ఆరోపించారు. శనివారం రాహుల్ కూడా అదే పత్రికకు రాసిన వ్యాసంలో మహారాష్ట్ర ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ అంటూ ఆరోపణలు చేయడం తెలిసిందే. ''మహారాష్ట్రలో భారీగా బోగస్ ఓటర్లను చేర్పించారని, సాయంత్రం ఓటింగ్ శాతం అకస్మాత్తుగా పెరిగిందని అనడం పెద్ద జోక్. యువ ఓటర్ల సంఖ్య పెరగడం మామూలే. క్యూ నుంచున్న వారిని సమయం ముగిసినా ఓటేసేందుకు అనుమతిస్తారని తెలియదా?'' అని ప్రశ్నించారు.

కొలంబియా అధ్యక్ష

అభ్యర్థిపై కాల్పులు



మిగ్వెల్‌పై కాల్పులు జరిగిన క్షణం

బొగోటా(కొలంబియా): కొలంబియాలో 2026 అధ్యక్ష ఎన్నికల్లో విపక్ష డెమొక్రటిక్ సెంటర్ పార్టీ అభ్యర్థి అయిన సెనేటర్ మిగ్వెల్ ఉరిబె టర్బే (39)పై కాల్పులు జరిగాయి. శనివారం సాయంత్రం రాజధాని బొగోటాలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా వెనుక నుంచి ఒక టీనేజర్ తుపాకీతో కాల్పులకు పాల్పడ్డాడు. రెండు తూటాలు తలలోకి, ఒకటి ఛాతిలోకి దూసుకెళ్లినట్లు చెబుతున్నారు. దాంతో మిగ్వెల్ ఒక్కసారిగా కుప్పకూలారు. కాల్పుల వీడియో వైరల్‌గా మారింది. సమీప ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఆయనను హెలికాప్టర్‌లో శాంటా ఫే ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. మెదడు, వెన్నుపూస, నరాల సంబంధ శస్త్రచికిత్సలు చేశారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. మిగ్వెల్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని భార్య మారియా క్లాడియా టరజోనా వాపోయారు. దుండగున్ని ఘటనాస్థలిలోనే అదుపులోకి తీసుకున్నారు. కాల్పులకు కారణం తెలియాల్సి ఉంది. మిగ్వెల్‌కు ఎలాంటి రాజకీయ శత్రువులు లేరని తెలుస్తోంది. కొలంబియాలో 1980, 1990 దశకాల్లోనూ అధ్యక్ష అభ్యర్థులపై డ్రగ్స్ ముఠాలు దాడులు చేశాయి. వేర్వేరు కాల్పుల ఘటనల్లో మొత్తం ఐదుగురు అధ్యక్ష అభ్యర్థులను పొట్టన పెట్టుకున్నారు.

ఎవరీ మిగ్వెల్?

విపక్ష డెమొక్రటిక్ సెంటర్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా మిగ్వెల్ పేరు ఇప్పుడు కొలంబియా అంతటా మార్మోగుతోంది. మాజీ అధ్యక్షుడు అల్వారో ఉరిబే స్థాపించిన ఆ పార్టీలో మిగ్వెల్ మూడేళ్లుగా సెనేటర్‌గా ఉన్నారు. ఆయన తాత జూలియో సీజర్ టర్బే అయాలా 1978–82 మధ్య దేశాధ్యక్షునిగా చేశారు. తల్లి డయానా పాత్రికేయురాలు. 1990లో కిరాతక పాబ్లో ఎస్కోబార్ డ్రగ్స్ ముఠా ఆమెను కిడ్నాప్ చేసింది. వాటికి, కొలంబియా బలగాలకు జరిగిన కాల్పుల్లో ఆమె ప్రాణాలు కోల్పోయారు. తాత రాజకీయ వారసునిగా మిగ్వెల్ ఎదిగారు. బొగోటా సిటీ కౌన్సిల్ సభ్యునిగా, సిటీ గవర్నమెంట్ సెక్రటరీగా సేవలందించారు. 2019లో బొగోటా మేయర్‌గా పోటీచేసి ఓడిపోయారు.

బెంగాల్, తమిళనాడుల్లో

ఎన్డీఏ ప్రభుత్వాలే

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



మదుర మీనాక్షి ఆలయంలో అమిత్ షా

మదురై: తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం తథ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తమిళనాడులోని మదురైలో బీజేపీ ఆఫీసు బేరర్ల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. అవినీతిమయమైన అధికార డీఎంకేకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. టాస్మాక్ కుంభకోణంలో ప్రభుత్వ పెద్దలు దోచేసిన సొమ్ముతో రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో కనీసం రెండు తరగతి గదులు నిర్మించవచ్చన్నారు. గత పదేళ్లలో తమిళనాడుకు కేంద్రం రూ.6.8 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు.

మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు

పలు జిల్లాల్లో కర్ఫ్యూ విధింపు
మొబైల్, ఇంటర్నెట్ సేవలు రద్దు



ఇంఫాల్‌లో టైర్లకు నిరసనకారుల నిప్పు

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి. మెయితీ వర్గం నాయకులను పోలీసులు శనివారం అరెస్టు చేయడంతో ఆ వర్గం ప్రజలు ఆదివారం వీధుల్లోకి వచ్చారు. నిరసనలతో హోరెత్తించారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. నిషేధాజ్ఞలు లెక్కచేయకుండా ఆందోళనలు చేశారు. రోడ్లపై టైర్లు వేసి దహనం చేశారు. దాంతో ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్ జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా దళాల రాకపోకలు అడ్డుకొనేందుకు రోడ్లు తవ్వేశారు. దుకాణాలపై దాడులకు దిగారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. తమ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని ఇంఫాల్‌లో కొందరు ఆత్మాహుతికి ప్రయత్నించినట్లు తెలిసింది. ముందు జాగ్రత్తగా ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వం మొబైల్, ఇంటర్నెట్ సేవలు రద్దు చేసింది. కొన్నిచోట్ల కర్ఫ్యూ సైతం విధించింది. ఆంక్షలు ఐదు రోజులపాటు అమల్లో ఉంటాయని ప్రకటించింది. మరోవైపు మణిపూర్ గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఘర్షణలు కొనసాగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొందరు ఎమ్మెల్యేలు రాజభవన్‌లో గవర్నర్‌ను కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు ఆయనకు వివరించారు. మరోవైపు అస్సాంలోని జిరిబామ్ జిల్లాలోనూ నిరసన కార్యక్రమాలు జరిగాయి. మెయితీ వర్గానికి చెందిన అరంబాయ్ తెంగోల్ తెగ కీలక నాయకుడితోపాటు మరికొందరు సభ్యులు పోలీసులు శనివారం అరెస్టు చేయడం మణిపూర్, అస్సాంలో ఘర్షణలకు దారితీసింది. ఆ కీలక నాయకుడు కానన్ సింగ్ అంటున్నారు. అతడికి మెయితీల్లో గట్టి పట్టుంది. మణిపూర్‌లో 2023 నుంచి మెయితీలు, కుకీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో 260 మందికిపైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.సీఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేయడంతో ఫిబ్రవరి నుంచి రాష్ట్రపతి పాలన సాగుతోంది.

గాజాలో ఇజ్రాయెల్ కాల్పులు

ఐదుగురు పాలస్తీనియన్ల దుర్మరణం



కాల్పులకు బలైన వ్యక్తి మృతదేహంతో ర్యాలీ

గాజా: గాజాలో అన్నార్తులపై ఇజ్రాయెల్ మరోసారి కాల్పులకు తెగబడింది. ఇజ్రాయెల్, అమెరికా ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆహార పంపిణీ కేంద్రాల సమీపంలోనే ఆదివారం ఈ ఘోరం జరిగింది. కాల్పులకు ఐదుగురు పాలస్తీనా పౌరులు బలైనట్టు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. అయితే తమ దళాలపై దాడులకు ప్రయత్నించిన వారిపై ప్రతి దాడులకు దిగినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. వివాదాస్పద సామాజిక కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌తోపాటు మరికొందరు గాజాకు వస్తున్న పడవను అడ్డుకుంటామని ఇజ్రాయెల్ పేర్కొంది.

ఆస్పత్రి కింద బంకర్: దక్షిణ గాజాలో ఖాన్‌యూనిస్‌లోని యూరోపియన్ ఆస్పత్రి కింద మరో భూగర్భ సొరంగం జాడను కనుగొన్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సంబంధిత వీడియో విడుదలచేసింది. దీన్ని హమాస్ కమాండ్ సెంటర్‌గా వాడుతోందని ఆరోపించింది.

సాక్షి
కరీంనగర్

ఇంజినీరింగ్ కోర్సులపై సందేహాలా?

- జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విష్ణువర్ధన్‌తో రేపు 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం

రామగిరి: మీరు ఇంజినీరింగ్ కోర్సులు చదవాలనుకుంటున్నారా? ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలనుకుంటున్నారా? ఏ కోర్సులో చేరితే మంచి భవిష్యత్ ఉంటుంది? కొత్త కోర్సులు ఏమిటి? వాటితో ప్రయోజనాలు ఏమిటి? మీకు ఇష్టమైన కోర్సుల ఎంపిక, కొత్త కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు.. తదితర అంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే 'సాక్షి' మీకోసం మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విష్ణువర్ధన్‌తో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. ఆయనను సంప్రదించి మీ సందేహాలు నివృత్తి చేసుకోండి.

తేదీ: 10-06-2025
సమయం: మంగళవారం : ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు


డాక్టర్ బి.విష్ణువర్ధన్

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు
94935 48242

సోమవారం । 9 । జూన్ । 2025

న్యూస్‌రీల్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరిన మహేందర్ తదితరులు

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఎంపీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు, కరీంనగర్ సింగిల్‌విండో డైరెక్టర్ సాయిల్ల మహేందర్, మల్లేశం, తిరుమల్, శ్రీకాంత్ తదితరులు బీజేపీలో చేరగా సంజయ్ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బండి సంజయ్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి బీజేపీలో చేరినట్లు సింగిల్‌విండో డైరెక్టర్ మహేందర్ తెలిపారు. బీజేపీ నాయకులు ఎం.సంతోష్‌కుమార్, టి.శ్రీనివాస్, డి.రమణారెడ్డి, దీపక్, హరికృష్ణ, మోహన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఘనంగా 'సందల్ షరీఫ్'



ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు, భక్తులు

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సందల్ షరీఫ్(గ్రంథలేపనం) ఉత్సవాన్ని ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దర్గా సమీపంలోని మొల్లపల్లి, పెద్ద బిజిగిరిషరీఫ్ గ్రామాల నుంచి సందల్ షరీఫ్(గ్రంథలేపన), చాదర్లను భక్తిశ్రద్ధలతో ఆదివారం వేకువజామున దర్గాకు తీసుకొచ్చారు. దర్గాలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా అల్లై, హజ్రత్ సయ్యద్ అజ్మత్‌షావలి రహమతుల్లాఅల్లై, హజ్రత్ సయ్యద్ అక్బర్‌షావలి రహమతుల్లాఅల్లై, హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావలి రహమతుల్లాఅల్లై సమాధులకు సందల్ అలంకరింపజేసి ,చాదర్లు సమర్పించారు. మత గురువు మౌలానా యాసీన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. దర్గా ముతవల్లి మహమ్మద్ అక్బర్ అలీ, కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్, సంయుక్త కార్యదర్శి నయీమొద్దీన్ పాల్గొన్నారు.

బాక్సింగ్ జట్టు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: నిజామాబాద్ జిల్లాలో ఈనెల 10,11వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాజట్టు ఎంపిక పోటీలను ఆదివారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రీడాకారులు హాజరు కాగా.. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రపోటీలకు ఎంపిక చేశారు. జి.హరిహర, కె.నరేశ్, పి.సుకుమార్, జి.సాకేత్, స్మితిరెడ్డి, శ్రీకర్, పి.సాకేత్, సీహెచ్.వరుణ్, వి.హేమహాసిని, పవిత్ర ఎంపికయ్యారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, సంపత్ పాల్గొన్నారు.



రాజన్నా.. శరణు శరణు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని ఆదివారం 70వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు చేసిన భక్తులు కుటుంబ సభ్యులతో కలసి మొక్కులు చెల్లించుకున్నారు.



అడ్లూరి లక్ష్మణ్ అనే నేను..

- ఉమ్మడి జిల్లాకు మరో మంత్రి పదవి
- అడ్లూరి లక్ష్మణ్‌ను వరించిన అవకాశం
- విధేయతకు దక్కిన ప్రాధాన్యం
- మూడుకు చేరిన మంత్రుల సంఖ్య
- పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ముగ్గురు మంత్రులు
- కవ్వంపల్లికి విప్ ఇచ్చే అవకాశం


అడ్లూరిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ధర్మపురిలో కాంగ్రెస్ కార్యకర్తల సంబురాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంత్రిపదవుల్లో పెద్దపీట దక్కింది. ఎన్నడూ లేని విధంగా ముగ్గురు మంత్రి పదవులను దక్కించుకోగా, గడ్డం వివేక్ సైతం ఉమ్మడి జిల్లాతో అనుబంధం కలిగి ఉన్నవారే. దీంతో మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో జిల్లావాసులకు సముచిత స్థానం దక్కిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాలకు గానూ ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయగా, దానికి తగ్గట్టుగా మంత్రి పదవులు దక్కాయనే కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లానుంచి ఇప్పటికే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా కొనసాగుతుండగా, తాజాగా ధర్మపురి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన అడ్లూరి లక్ష్మణ్ ఆదివారం రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవగా, అందులో ముగ్గురికి మంత్రి పదవులు దక్కటంతో కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

అన్ని వర్గాలకు సమప్రాధాన్యం

కాంగ్రెస అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేసిన తొలిమంత్రివర్గ విస్తరణలో బ్రహ్మణ సామాజికవర్గానికి చెందిన శ్రీధర్‌బాబు, బీసీగౌడ్ నుంచి పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవులు దక్కాయి. మాదిగ సామాజికవర్గానికి చెందిన అడ్లూరి, మున్నూరు కాపు అయిన ఆది శ్రీనివాస్‌లకు ప్రభుత్వ విప్‌లుగా అవకాశం కల్పించారు. ఆదివారం రెండో విడత మంత్రివర్గ విస్తరణలో అడ్లూరికి మంత్రిపదవి లభించింది. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు చివరి నిమిషంలో కేబినెట్‌లో చోటు దక్కకపోయినా.. ప్రభుత్వ విప్ ఇచ్చే అవకాశాలున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి.

తొలిసారి ఎమ్మెల్యే.. కేబినెట్‌లోకి

సుదీర్ఘకాలంగా పార్టీలోనే కొనసాగుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి పదవిరావడం విధేయతకు పట్టం కట్టినట్లయింది. కార్మిక క్షేత్రమైన గోదావరిఖని నుంచి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లో అడుగుపెట్టిన అడ్లూరి ఎన్ఎస్‌యూఐలో స్టూడెంట్ లీడర్‌గా, యూత్ కాంగ్రెస్‌లో, జెడ్పీటీసీ, జెడ్పీచైర్మన్, కార్పొరేషన్ చైర్మన్, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొంది, ప్రభుత్వ విప్‌గా కొనసాగగా, తాజాగా కేబినెట్‌లో చోటు సంపాదించారు.

అడ్లూరి లక్ష్మణ్ నేపథ్యం

1982 నుంచి 85 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేశారు. 1986 నుంచి 94 వరకు ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 1996 నుంచి 2001 వరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. 2006లో ధర్మారం (ఎస్సీ) రిజర్వుడ్ స్థానం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి గెలిచారు. 1999లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మేడారం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2010–12 వరకు కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా పని చేశారు. 2009లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2018లో ధర్మపురి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2013–14వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశారు. 2018లో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ధర్మపురి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పై 22,039 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. 2023 డిసెంబర్ 15న ప్రభుత్వ విప్‌గా ప్రభుత్వం నియమించింది. తాజాగా ఆయనకు కేబినెట్‌లో బెర్త్ కల్పించింది.

ధర్మపురికి అచ్చొచ్చిన మంత్రి పదవి

తెలంగాణ ఏర్పాటు నుంచి జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గానికి మంత్రివర్గంలో చోటు లభిస్తోంది. 2014లో గెలిచిన కొప్పుల చీఫ్‌విప్‌గా కేబినెట్ హోదా అందుకోగా, 2018లో సంక్షేమశాఖ మంత్రిగా వ్యవహరించారు. 2023లో గెలిచిన అడ్లూరి మొదట ప్రభుత్వ విప్‌గా, తాజాగా మంత్రిపదవి చేపట్టారు.

జూన్ ఫీవర్



సాగు ఖర్చూ తడిసి మోపెడు..

ఉమ్మడి జిల్లాలో సుమారు 6,10,102 మంది రైతులు దాదాపు 12,82,207 ఎకరాల్లో వానాకాలం పంటలు పండిస్తారని అధికారులు అంచనా వేశారు. తొలకరితో పెట్టుబడి సమయం ఆసన్నమైంది. భూములను చదునుచేసి, దుక్కి దున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్దమొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పెరిగిన యాంత్రీకరణ, ఎరువులు, విత్తనాల ధరలు, కూలీల కొరత రైతులను ఏటా వేధిస్తూనే ఉన్నాయి. దీనికితోడు అకాల వర్షాలు, చీడపీడలతో దిగుబడి తగ్గి అన్నదాతలు అప్పుల్లో ఊబిలో చిక్కుకుంటున్నారు. సాగులో ఖర్చు తగ్గించుకునేందుకు విత్తనాలు సొంతగా తయారు చేసుకోవడం, ఆధునిక సాంకేతికను వినియోగించుకోవడం ద్వారా ఆదాయం పెంచుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అయినా, పిల్లల చదువులు, వ్యవసాయ పెట్టుబడులు, సీజనల్ వ్యాధులతో ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

- చదువుల ఫీజులు.. సాగు పెట్టుబడులు.. సీజనల్ వ్యాధులు
- అన్ని ఖర్చులూ ఒకే నెలలో రావడంతో సర్వత్రా ఆందోళన
- ఆర్థికభారంతో హడలెత్తిపోతున్న సామాన్య ప్రజలు

సాక్షి, పెద్దపల్లి:

వేసవి సెలవుల్లో ఆటాపాలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు.. పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.. ఇదేసమయంలో తొలకరితో ఎరువులు, విత్తనాల కొనుగోలు తదితర ఖర్చులతో సామాన్యులు 'వామ్మో.. జూన్' అని ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు వానలతో మారుతున్న వాతావరణ పరిస్థితులతో సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం.. ఇలా అన్ని రకాల ఖర్చులు ఈనెలలో రానుండటంతో ఎలా గడపాలో తెలియక ప్రజలు తికమకపడుతున్నారు. జూన్ నెల పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వణుకు పుట్టిస్తోంది.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకూ మోతే

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 938 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా అందులో సుమారు 2,26,829 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అంటేనే ఫీజులు, పుస్తకాలు, నోట్‌బుక్స్‌లతోపాటు, వాటిని భద్రపరుచుకునేందుకు బ్యాగులు, లంచ్ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, టైబెల్టులు, యూనిఫామ్స్.. ఇలా ఒక్కటేమిటి.. రకరకాల వస్తువులు ఆయా పాఠశాల్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దీంతో యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఇంటర్ కళాశాలల్లో సైతం ఏసీ క్యాంపస్‌లు, నాణ్యమైన విద్యాబోధన పేరిట రూ.లక్షల్లో ఫీజు వసూలు చేస్తుండడంతో ఆర్థికభారమైనా.. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం అప్పులు తెచ్చిమరీ చెల్లిస్తున్నారు. స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తదితర బోర్డుల పేరిట నర్సరీ చదువులకే రూ.30వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజుల దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నా.. పర్యవేక్షణ, నియంత్రణ మచ్చుకైనా కనిపించడం లేదు.

భయపెడుతున్న వైరల్ ఫీవర్

ఒకసీజన్ నుంచి మరోసీజన్‌లోకి ప్రవేశించేటప్పుడు వాతావారణం చల్లబడి వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాల తీవ్రత ఉంటుంది. దోమల బెడత పెరిగి ప్రతీ పదిమందిలో నలుగురికి జ్వరం, గొంతునొప్పి, జలుబు, దగ్గు వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. దీంతో వైద్యం కోసం తరచూ ఆస్పత్రులకు వెళ్లేపరిస్థితి నెలకొని ఉంటోంది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో సీజనల్ వ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుంది. దీంతో ఏటా జూన్, జూలైలో జ్వరాలతో ఆస్పత్రుల పాలై జేబులు గుల్లచేసుకునే వారు అధికంగానే ఉన్నారు. ఓపీ, టెస్టుల పేరిట ఆస్పత్రుల యాజమాన్యాలు పిండిపిప్పి చేస్తుండటంతో ఈవానాకాల అంటేనే జనాలు భయపడుతున్నారు. వ్యాధుల బారిన పడిన తర్వాత వైద్యఖర్చులకు భయపడడం కన్నా.. ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో డబ్బు ఆదాతోపాటు టెన్షన్ ఉండదని నిపుణులు అంటున్నారు.

పెట్టుబడులు పెరిగాయ్



వ్యవసాయం రోజురోజుకూ భారంగా మారుతంది. పెరిగిన ఖర్చులతో సాగు చేయడం కష్టంగా మారింది. ఎరువులు, విత్తనాల ధరలు, కూలీల రేట్లు పెరుగుదలలో పోటీపడుతున్నాయి. సాగు సీజన్ వచ్చిందంటే హడలెత్తిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– మహేశ్‌గౌడ్, రైతు

జూన్ అంటేనే భయం



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు యూకేజీ, మరొకరు సెకండ్ క్లాస్. జూన్ వచ్చిందంటే అడ్మిషన్లు, పుస్తకాలు, బ్యాగులు, డ్రెస్‌ల కోసం భారీగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రైవేట్ పాఠశాలలు ఏటా ఫీజులు పెంచుతూ మరింత ఆర్థిక భారం మోపుతున్నాయి.

– రాదాసు శైలజ, గృహిణి

రద్దు చేసుకున్నా.. రావాయే!

వీణవంకకు చెందిన రాజిరెడ్డి 2022 మే నెలలో అదే ప్రాంతానికి చెందిన లక్ష్మి వద్ద 2.15 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసేందుకు స్లాట్ బుక్ చేశాడు. స్లాట్‌కు రూ.1.02 లక్షలు చెల్లించగా లక్ష్మి కుటుంబసభ్యులు నిరాకరించడంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. అగ్రిమెంట్ ప్రకారం ఇచ్చిన డబ్బులను లక్ష్మి తిరిగి ఇవ్వగా ప్రభుత్వానికి చెల్లించిన స్లాట్ డబ్బులు ఏళ్లు గడిచినా రావడం లేదు. మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం. ఇది ఒక రాజిరెడ్డి పరిస్థితనుకుంటే పొరపాటే. జిల్లావ్యాప్తంగా స్లాట్ రద్దయిన వారందరిదీ ఇదే దుస్థితి.

- స్లాట్ రద్దయినా.. డబ్బుల కోసం ఏళ్లుగా పడిగాపులు
- ధరణి పోయి భూభారతి వచ్చినా అంతేనా?
- జిల్లాలో వేయి మందికి పైగా నిరీక్షణ

జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాలు: 15 (కరీంనగర్ అర్బన్ మినహా)

రద్దు చేసుకున్న స్లాట్లు: 1,034

రావాల్సిన నగదు: సుమారు రూ.2.50కోట్లు



కరీంనగర్ అర్బన్: జిల్లాలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ స్లాట్ రద్దు చేసుకున్న యజమానులు డబ్బుల కోసం అయిదేళ్లుగా పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు ఏకకాలంలో పూర్తిచేయాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం ధరణి పోర్టల్ రూపొందించగా తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.

ఏకకాలంలో రికార్డుల మార్పు

భూములు రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతులు తొలుత స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. బుకింగ్‌కు ఆయా ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువను అనుసరించి స్లాట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు చెల్లించి బుకింగ్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ తేదీని నిర్ణయించి స్లాట్ బుక్ చేసుకున్న వ్యక్తికి సమాచారం అందుతుంది. ఆ రోజు తహసీల్ కార్యాలయానికి వెళ్తే అన్ని పత్రాలను పరిశీలించి నిబంధనలు అనుసరించి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతారు.

అయిదేళ్లుగా పడిగాపులు

భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నాక భూమి కొనవద్దనుకునో.. ఆ భూమిపై ఏదైనా వివాదం ఉందనో.. అప్పుడు కాక మరో సమయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనో నిర్ణయించుకొని స్లాట్ రద్దు చేసుకున్న యజమానులకు వారు చెల్లించిన డబ్బును తిరిగి ప్రభుత్వం చెల్లించాలి. జిల్లాలో వేయి మందికి పైగా స్లాట్ రద్దు చేసుకొని తమకు రావాల్సిన డబ్బుల కోసం తహసీల్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో స్లాట్ రద్దు చేసుకున్నవారికి దాదాపు రూ.2.50 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ధరణి పోయి భూ భారతి వచ్చినా..

రాష్ట్రంలో ఆర్వోఆర్–2020తో పాటు ధరణి పోర్టల్ కూడా రద్దయింది. ఆ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్–2025(భూ భారతి చట్టం) అమల్లోకి తెచ్చింది. అయినప్పటికీ రద్దు చేసుకున్న లావాదేవీలకు సంబంధించి సొమ్ము మాత్రం పాత పద్ధతిలోనే నిలిచిపోతోంది. తిరుగు చెల్లింపులు రావడం లేదు. స్లాట్ ఫీజు ప్రభుత్వ ఖజానాలో జమవుతుందని, తిరిగి డబ్బు అక్కడి నుంచి స్లాట్ రద్దు చేసుకున్నవారికి చేరుతుందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

మొదట్లో ప్రయత్నాలు జరిగినా...

2020 నవంబర్‌కు ముందు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారానే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవి. లావాదేవీలు రద్దు చేసుకుంటే చెల్లించిన సొమ్మును ఖజానా విభాగం ద్వారా తిరిగి చెల్లించేవారు. ఆ తర్వాత వాటిని ధరణికి, తాజాగా భూ భారతి పోర్టల్‌కు బదలాయించినా.. రద్దయిన లావాదేవీల సొమ్ము తిరిగి చెల్లించడం లేదు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చాక తిరుగు చెల్లింపులు చేసేందుకు మొదట్లో ప్రయత్నాలు జరిగినా దీనిపై దృష్టి సారించే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం జరిగిందన్న వాదనలు ఉన్నాయి.



మృగశిర సందడి

సప్తగిరికాలనీ: రైతుబజార్ చేపల మార్కెట్లో సందడి

సప్తగిరికాలనీ/కరీంనగర్ కల్చరల్: మృగశిర సందర్భంగా ఆదివారం నగరంలోని మార్కెట్లు కిక్కిరిశాయి. బైపాస్ రోడ్డు, నగరశివారు ప్రాంతాల్లో చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. గ్రామీణ ప్రాంతాల్లో పట్టిన చేపలను మత్స్యకారులు నగరానికి తీసుకొచ్చి విక్రయించారు. సాధారణ రోజుల కన్నా రెట్టింపు ధరలకు విక్రయాలు జరిగాయి. కొర్రమీను, రవులు, జెల్లలు, బొమ్మెలు, చందమామలు, పచ్చి రొయ్యలకు గిరాకీ ఏర్పడింది. చేప రకాన్ని బట్టి కిలోకు రూ.250 నుంచి రూ.800 వరకు ధర పలికింది. నగరంలోని కోర్ట్‌గడ్డ రైతుబజార్, రాంనగర్ ఫిష్ మార్కెట్లలో జనం సందడి కనిపించింది.


నగరంలోని ప్రధాన మార్కెట్లో..


విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

రేషన్.. నో స్టాక్

- బియ్యం కేటాయింపులో జాప్యం
- గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలను మూసివేసిన డీలర్లు
- ఆందోళనలో లబ్ధిదారులు


తీగలగుట్టపల్లిలో మూసిఉన్న రేషన్ దుకాణం

కరీంనగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడునెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేయడం డీలర్లకు కత్తిమీద సాములా మారింది. సన్నబియ్యం కావడంతో లబ్ధిదారులు పెద్దసంఖ్యలో దుకాణాలకు తరలివస్తున్నారు. డీలర్లు దుకాణం తెరువకముందే బారులు తీరుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడు మూడు నెలల బియ్యం పొందాలంటే ఆరు పర్యాయాలు ఈపాస్ మిషన్‌లో వేలిముద్ర వేయాల్సి రావడంతో బియ్యం పంపిణీలో జాప్యం ఏర్పడుతోంది. ఈనెల 1 నుంచి డీలర్లు బియ్యం పంపిణీ చేపట్టగా శని, ఆదివారాల్లో పలు రేషన్‌దుకాణాల్లో స్టాక్ లేకపోవడంతో మూసివేశారు.

సగం కోటానే కేటాయింపు

జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించి ఒకేసారి రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో 566 రేషన్ దుకాణాల పరిధిలో మొత్తం 2,90,402 కార్డులుండగా మూడునెలలకు 16,748.667 మెట్రిక్ టన్నుల బియ్యం మంజూరైంది. మండలస్థాయి గోదాముల్లో బియ్యం స్టాక్ లేకపోవడంతో మొదటి విడతలో డీలర్లకు సగం కోటానే పంపిణీ చేశారు. సన్నబియ్యం కావడంతో పలువురు లబ్ధిదారులు బియ్యం తీసుకునేందుకు ఆసక్తి చూపుతుండడంతో ఐదారు రోజుల్లోనే స్టాక్ ఖాళీ అయింది. బియ్యం లేకపోవడంతో కరీంనగర్ సిటీతో పాటు మండలంలోని దుర్శేడ్, బొమ్మకల్, గోపాల్‌పూర్, మొగ్ధుంపూర్, తీగలగుట్టపల్లి తదితర గ్రామాల్లోని రేషన్ దుకాణాలను డీలర్లు మూసివేశారు. శనివారం బక్రీద్ పండుగ కావడంతో మండల స్టాక్ పాయింట్ నుంచి డీలర్లకు బియ్యం కేటాయించలేదు. ఆదివారం కొంతమంది డీలర్లకు బియ్యం కేటాయించగా మిగితావారిని సోమవారం రమ్మని అధికారులు సూచించారు. మూడు నెలల బియ్యం కోటాను త్వరగా కేటాయిస్తే పంపిణీకి వీలవుతుందని డీలర్లు పేర్కొంటున్నారు.



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుతం ఏ రేషన్ షాప్ చూసినా బియ్యం కోసం వచ్చిన వారితో కిక్కిరిస్తున్నాయి. మూడు నెలల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం ఒకేసారి ఇస్తామని చెప్పేసరికే బియ్యం తీసుకునేందుకు క్యూ కడుతున్నారు. కరీంనగర్‌లోని మంకమ్మతోట రేషన్ దుకాణం వద్ద క్యూలో నిల్చోనేందుకు ఓపిక లేని కొందరు ఇలా సంచులు లైన్లో పెట్టి బియ్యం కోసం ఎదురుచూశారు. వారి వరుస వచ్చాక బియ్యం తీసుకుని వెళ్లారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా.. ఒకరి మృతి



ఘటన స్థలంలో తిరుపతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట పట్టణ కేంద్రానికి చెందిన నాగుల తిరుపతి ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మృతిచెందాడు. ఎల్లారెడ్డిపేట–గొల్లపల్లి ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఆటో బోల్తా పడడంతో తీవ్ర గాయాలైన తిరుపతిని ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం వేకువ జామున మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్, పర్శరాములు, కార్తీక్ గౌడ్, ప్రదీప్, సంతోష్ పరామర్శించారు.

ట్రిమ్మర్‌కు చార్జింగ్ పెడుతూ.. విద్యుదాఘాతంతో..



తిరుపతి(ఫైల్)

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ముంజంపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో బొమ్మ గాని తిరుపతి(32)మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఉపాధిహామీ మేట్‌గా విధులు నిర్వహించే తిరుపతి తన కుమారుడికి ట్రిమ్మర్‌తో కటింగ్ చేసేందుకు ఇంటి బాత్రూం వద్ద ట్రిమ్మర్‌కు చార్జింగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి కింద పడిపోయాడు. అతడి భార్య రేణుక గమనించి కుటుంబసభ్యుల సాయంతో ధర్మారంలోని ప్రైవేటు ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించగా, వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కోనేరులో పడి ఒకరు..



రాజు(ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ ఆలయం నాంపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి గుట్టపై కోనేరులో ప్రమాదవశాత్తు పడి సాదం రాజు(32) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం భూపాల్‌నగర్ పందికుంటకు చెందిన సాదం రాజు ఈనెల 5న తిరుపతి, వేములవాడ దర్శనానికి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. ఆదివారం ఉదయం 5 గంటలకు రాజు బంధువు జక్కుల మహేందర్ వేములవాడకు వచ్చాడు. రాజుకు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. రాజు శనివారం రాత్రి తన బంధువులకు ఫోన్ చేసి నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకుంటానని చెప్పడంతో బంధువులు గుట్టపై గాలించారు. కోనేరు వద్ద రాజుకు సంబంధించిన బ్యాగు, చెప్పులు, పర్సు లభించాయి. దీంతో కోనేరులో వెతకగా మృతదేహం లభించింది. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేశారు.

సర్కార్ కాలేజీలో ఇంటర్.. బీటెక్ ఫ్రీ

- ర్యాంకుతో పనిలేదు.. పూర్తి ఫీజు ప్రభుత్వమే భరిస్తుంది
- ఎప్సెట్‌లో పదివేల ర్యాంకు దాటినా సరే.. ఇంజినీరింగ్ విద్య ఫ్రీ
- సర్కార్ కాలేజీల్లో పెరుగుతున్న ప్రవేశాలు



ఇంటింటి ప్రచారంలో డీఐఈవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రఘునందన్, లెక్చరర్లు

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లో పేరున్న పెద్ద ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగేళ్ల బీటెక్ కోర్సు చదవాలంటే ఏటా రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలు ఫీజు చెల్లించాలి. ఎప్సెట్ కౌన్సెలింగ్ ద్వారా సీటు సాధిస్తే మాత్రం రూ.35వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మిగిలిన ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు అన్నీ విద్యార్థి భరించాల్సి ఉంటుంది. ర్యాంకు రాక, మేనేజ్‌మెంట్‌లో సీటు కొనుక్కోవాలంటే ఎంచుకునే బ్రాంచ్ ఆధారంగా రూ.10లక్షల నుంచి రూ.20 లక్షలవుతుంది. హాస్టల్, స్టేషనరీ ఇతర ఖర్చులు అదనం. గతంలో ఎంసెట్ పరీక్షలో పది వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఉచితంగా లభించేది. పదివేలకు మించి ర్యాంకు వచ్చిన విద్యార్థులు పెద్ద కాలేజీల్లో చదవాలంటే లక్షలు వెచ్చించాల్సిందే.

సర్కార్ కాలేజీలో ఇంటర్ చదివితే మాత్రం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఎప్సెట్‌లో ర్యాంకు ఆధారంగా పెద్ద కళాశాలల్లో సీటు వస్తే లక్షల్లో ఉన్న ట్యూషన్ ఫీజు కూడా భరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్సెట్‌లో పదివేలకు పైగా ర్యాంకు వచ్చినా సరే పూర్తి ట్యూషన్ ఫీజును సర్కారే చెల్లిస్తుందన్నమాట. మూడేళ్లుగా ఈ విధానాన్ని అనుసరిస్తూ నిరుపేద విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేస్తోంది. మారిన ఈ నిబంధన వల్ల కార్మిక క్షేత్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు పెరగడానికి కారణమవుతోంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన బీసీ విద్యార్థులకు ఏటా రూ.35వేలు రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది. ఉన్న ఫీజులోంచి ఈ రూ.35వేలు మినహాయించుకుని మిగిలిన ఫీజు విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. మారిన నిబంధన ప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు మొత్తం ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది.

సర్కార్ కాలేజీలోనే చేరాలి



ప్రైవేట్ కళాశాలలతో పోల్చినపుడు ఏ విషయంలోనైనా ప్రభుత్వ కళాశాలలే ముందు వరుసలో ఉంటున్నాయి. ఫలితాల విషయంలోనూ రాజీ పడడం లేదు. పోటీ పరీక్షలతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్న వారిలో ప్రభుత్వ కాలేజీల పిల్లలే ఉంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. సర్కార్ కాలేజీల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలి. లక్షల విలువైన బీటెక్ లాంటి సాంకేతిక కోర్సులు ఉచితంగా చదివే అవకాశాన్ని జారవిడుచుకోవద్దు.

– వి.శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

కార్పొరేట్‌కు దీటుగా..



లక్షల్లో ఫీజులు తీసుకునే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల కన్నా మా కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు ఎక్కువగా కష్టపడుతున్నాం. పరీక్షల సమయంలో ఉదయం పూట నిద్ర మేల్కొల్పడం నుంచి పరీక్షలన్నింటిలో విజయం సాధించే వరకు అందరం కృషి చేస్తున్నాం. ఎప్సెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణనిస్తున్నాం. అపార బోధనానుభవం, ఉన్నత విద్యార్హతలున్న లెక్చరర్లు ఉంటారు కాబట్టి ప్రతిసారి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

– కనకశ్రీ విజయ రఘునందన్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



ఇక్కడ చేరిన ప్రతి విద్యార్థిని వృద్ధిలోకి తెచ్చేందుకు అన్ని విధాలా శ్రద్ధ తీసుకుంటున్నాం. మూడు నెలలకోసారి పేరెంట్స్‌తో చర్చిస్తున్నాం. వీక్లీ, మంత్లీ టెస్టులతో పాటు పాఠ్యాంశాలపై క్విజ్ నిర్వహిస్తున్నాం. విద్యార్థులను బృందాలుగా విభజించి లెక్చరర్లను కేర్ టేకర్లుగా నియమిస్తున్నాం. ముఖ్యంగా ఆడపిల్లలకు భద్రత, భవిష్యత్తుకు గర్ల్స్ కాలేజ్ బెస్ట్ అని నిరూపిస్తున్నాం.

– జి.వనజాకుమారి, ప్రిన్సిపాల్, సెస్ బాలికల జూనియర్ కళాశాల

వారసులకే వర్తింపు

- కటాఫ్ తేదీ పెంచకపోవడంతో వర్తించని పీఎం కిసాన్ పథకం
- కేంద్ర పథకానికి నోచుకోలేక పోతున్న వందలాది రైతులు



ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి

రామగుండం: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కటాఫ్ తేదీని పెంచలేదు. దీంతో లబ్ధిదారుల మరణానంతరం వారసులకే పథకం వర్తిస్తోంది. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వందలాది మంది రైతులు ఈ పథకానికి నోచుకోవడంలేదు.

ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు..

కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా అర్హతలు కలిగిన రైతు కుటుంబాలకు సాగు దశలో ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ఈ పథకం రూపొందించింది. ఇందులో భాగంగా రూ.ఆరువేల నగదును ఏడాదిలో మూడు విడతలుగా నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తూ వస్తోంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 19 విడతలుగా అర్హులైన రైతులకు పరిహారం అందజేసింది.

2019 లోపు రిజిస్ట్రేషన్ ఉన్న రైతులకు వర్తింపు..

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఆరంభం నుంచి ఉన్న రైతులకే ఆర్థిక సాయం అందుతోంది. 2019 తర్వాత భూ క్రయవిక్రయాలు జరిపిన వారిని అనర్హులుగా గుర్తిస్తున్నారు. ఫలితంగా రైతులు రాష్ట్రప్రభుత్వం అందించే రైతు భరోసాపైనే ఆధారపడుతున్నారు. పీఎం కిసాన్ పథకంలో గతంలో ఉన్న లబ్ధిదారు మృతి చెందితే వారసులకే ఆర్థిక సాయం అందుతోంది. కొత్త రైతులు చేసుకున్న దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. 2025 మేలో కొత్త రైతుల వివరాల నమోదుపై అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

అదనంగా 7వేల మందికే..

జిల్లాలోని 61,747 మంది రైతులకే పథకం ఆరంభంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అందింది. లబ్ధిదారులు మృతి చెందాక వారసులు ఆ భూములు పంచుకొని తమ వివరాలను పీఎం కిసాన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. ఇలాంటి వారికి సైతం ఈ పథకం వర్తించింది. వీరు జిల్లావ్యాప్తంగా సుమారు 7,340 మంది ఉన్నట్లు గుర్తించగా.. అదనంగా వీరే ప్రయోజనం చేకూరుతోంది. 2019 తర్వాత భూక్రయ విక్రయాలు చేసిన వారికి పైసా సాయం అందడంలేదు.

రెండేళ్ల క్రితం కొన్న



నేను రెండేళ్ల క్రితం భూమి కొనుగోలు చేసిన. పీఎం కిసాన్ పథకం ద్వారా సాయం కోసం అధికారులను సంప్రదించా. కొత్తవారికి మంజూరులేదని వారు చెప్పారు. అయినా, అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలని చెప్పారు.

– బర్పటి వెంకటేష్, రైతు, ఎగ్లాస్‌పూర్

కేంద్ర ప్రభుత్వానిదే ..



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కేంద్ర ప్రభుత్వం అధీనంలోనే ఉంది. పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న వారి గురించి క్షేత్రస్థాయిలోనే పరిశీలన చేస్తాం.

– సతీశ్, మండల వ్యవసాయాధికారి, అంతర్గాం

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



గాయపడిన సంతోష్

మంథని: ఓ యువకుడు మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరు సీసాతో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాలు.. ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన బొల్లంపల్లి సంతోష్‌గౌడ్ మంథనిలోని క్రీడా మైదానం సమీపంలో మూత్ర విసర్జన చేస్తున్నాడు. ఈక్రమంలో కారు, రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వెనక నుంచి సంతోష్ తలపై బీరుసీసాతో దాడి చేశారు. అంతేగాకుండా ఇటుకతో బాది, కాళ్లు, చేతులతో దాడిచేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంతోష్‌గౌడ్‌కు స్థానిక సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి గోదావరిఖనికి తరలించారు. కాగా సంతోష్ ఆయా పార్టీలు, అధికారులపై సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతుంటాడు. అవినీతి, అక్రమాలపై సైతం పోస్టింగ్‌లు పెడుతుంటాడు. అయితే అతడిపై ఎవరు దాడి చేశారనేది తెలియరాలేదు. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే దాడి చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్లు సీజ్

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం చెర్లకొండాపూర్ శివారులోని కుందేళ్ల గుట్ట నుంచి అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, ట్రాక్టర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు సీజ్ చేశారు. శనివారం అర్ధరాత్రి మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ అనిల్ ఆదేశాలతో ఆ ప్రాంతానికి పోలీసులు వెళ్లగా ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

పాలకుర్తి(రామగుండం): మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామశివారులో గల పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి దొంగలు ఆలయం తలుపులకు వేసి ఉన్న తాళాన్ని పగులగొట్టి అమ్మవారి పుస్తెలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన వారు గమనించి బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ పేకాటతో అప్పులు

- ఒత్తిడితో పురుగుల మందు తాగిన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి



సాయికుమార్ (ఫైల్)

జగిత్యాలక్రైం: ఓ యువకుడు ఆన్‌లైన్‌లో పేకాట ఆడి అప్పులపాలయ్యాడు. అప్పుల బాధ భరించలేక గతనెల 28న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడ సమీపంలో బీరయ్యగుడి వెనుక ప్రాంతానికి చెందిన వరద సాయికుమార్ (28) తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు కావడంతో చిన్ననాటి నుంచి గారాబంగా పెంచారు. దీంతో సాయికుమార్ ఆన్‌లైన్ పేకాటకు బానిసై బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. సాయికుమార్‌ది నిరుపేద కుటుంబం కావడంతో అప్పులు తీర్చేందుకు తల్లిదండ్రులు ఇంటిని తాకట్టుపెట్టి డబ్బులు ఇచ్చారు. కానీ, అతడు అప్పులు చెల్లించకుండా మళ్లీ ఆన్‌లైన్ పేకాట ఆడడంతో అప్పు ఇచ్చిన వారంతా తీవ్ర ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో గతనెల 28న ఇంట్లో గడ్డిమందు తాగగా, కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాల– కరీంనగర్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా కోలుకోకపోవడంతో మూడురోజుల క్రితం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు.

కుటుంబ సమస్యలతో ఒకరి ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): కుటుంబ సమస్యలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో నివసిస్తున్న బూత్కురి నవీన్ (26) ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

కృత్రిమ మేధస్సుపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): నేటి విద్యా విధానంలో కృత్రిమ మేధస్సుకు ప్రత్యేక స్థానం ఉందని, ఉపాధ్యాయులు కృత్రిమ మేధస్సుపై అవగాహన కలిగి ఉండాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి అన్నారు. తరగతి గదిలో కృత్రిమ మేధస్సు వాడకంపై ఆదివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సును సీబీఎస్ఈ నిపుణులు బి.రవికిరణ్, చారు దింగ్రాతో కలిసి ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో ఉండడానికి పైచేయి సాధించాలంటే కృత్రిమ మేధస్సు అవసరమన్నారు. అగ్ర దేశాలైన స్వీడన్, స్విట్జర్లాండ్, అమెరికా, బ్రిటన్‌లో కృత్రిమ మేధస్సుపై విశ్లేషణ జరగడంతో పాటు వినియోగిస్తున్నట్లు చెప్పారు. అలాగే అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో కృత్రిమ మేధస్సు అమలుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అవగాహన సదస్సులో భాగంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన పలు చిత్రమాలికలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రాజన్న కోడెల మృతికి కారణం దేవాదాయశాఖ మంత్రి'



గోశాలలోని కోడెలను పరిశీలిస్తున్న లక్ష్మీనరసింహారావు, నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న కోడెల మృతికి కారణం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శించారు. ఆదివారం వేములవాడ రాజన్న గోశాలను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించిన కోడెలు 33 మృతి చెందాయన్నారు. తప్పంతా వారే చేసి ఎదుటి వారిపై బురదజల్లినట్లుగా మంత్రి తీరు ఉందన్నారు. తన సిఫారసు లేఖ ద్వారా గీసుకొండకు చెందిన రాంబాబు అనే వ్యక్తికి అక్రమ పద్ధతిలో అధికారులపై ఒత్తిడి తెచ్చి 60 కోడెలను ఇచ్చింది నిజం కాదా అని అన్నారు. గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై రాంబాబు జైలుకు వెళ్లిన విషయంపై మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. భక్తుల విశ్వాసం, నమ్మకానికి ప్రతీకైన కోడెల మృత్యువాతలో మొదటి ముద్దాయి మంత్రి సురేఖ అన్నారు. కోడెల పంపిణీ నిలిచిపోయి గోశాలలో 500 ఉండాల్సిన చోట 1,300 పరిమితికి మించిపోయాయన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, మ్యాకల రవి, గోస్కుల రవి, పోలాస నరేందర్ తదితరులు ఉన్నారు.

గోశాలలో మరో కోడె మృతి

తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలో ఆదివారం అనారోగ్యంతో ఒక కోడె మృతిచెందినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గోశాలలో ఉన్న 1,300 కోడెలలో ప్రస్తుతం మొత్తం 11 కోడెలకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఎడ్లను వధించిన వ్యక్తులపై కేసు

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలోని చెరువు మత్తడి వద్ద ఎడ్లను వధించిన కేసులో పట్టణానికి చెందిన ఉమర్, గౌస్, ఆయస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు ఆదివారం తెలిపారు. మత్తడి పట్టణంలోని చెరువు సమీపంలో ఆవులను వధిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ధర్మపురి, రాయికల్ మండల పశువైద్యాధికారులు శ్రీనివాస్, వేణుగోపాల్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. వధించిన ఎడ్లను పోస్టుమార్టం నిమిత్తం ల్యాబ్‌కు తరలించామని, వధించడానికి సిద్ధంగా ఉన్న ఎడ్లను గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎడ్లను వధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెలిచాల గ్రామ శివారులోని స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో అనాథ సిద్దం రాములు మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. పెద్దపల్లి సమీపంలో చెట్లకింద నివాసం ఉంటున్న వృద్ధుడు రాములు అనారోగ్యంతో ఉన్నాడని సమాచారం రావడంతో స్పందన ఆశ్రమ నిర్వాహకులు మంచికట్ల శ్రీనివాస్ అతన్ని తీసుకవచ్చి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయిస్తుండగా, ఆదివారం వేకువజామున మృతిచెందాడు. మృతదేహానికి వెలిచాల శివారులోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు కల్యాణ్, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం శివారులో ఆదివారం బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో రాజాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ మాతంగి ప్రభాకర్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రభాకర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కేశవపట్నం శివారులో స్పీడ్ బ్రేకర్ వద్ద వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రభాకర్ కాలు విరిగిపోగా, ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని 108వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ధర్మపురిలో..

ధర్మపురి: బైక్‌ను కారు వెనక నుంచి ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సబ్బు సత్తయ్య ఆదివారం పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలు కాగా, 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో ఆదమరచి..



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నంలో మెయిన్‌రోడ్డు పక్కన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఆదివారం ఆదమరిచి నిద్రపోయాడు. కరీంనగర్– వరంగల్ జాతీయ రహదారి పక్కన సదరు వ్యక్తి నిద్ర పోవడంతో బాటసారులు, వాహనదారులు ఆందోళన చెందారు. స్థానికులు కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి నిద్రపోయిన వ్యక్తి ముఖంపై నీళ్లు చల్లి లేపి ఇంటికి పంపించారు.

ఇంత బరితెగింపా !





- పోతుగల్‌లో జోరుగా మట్టి తరలింపు
- ఇటుక బట్టీలకు వందలాది ట్రిప్పుల మట్టి
- మానేరు కెనాల్‌ను పూడ్చి టిప్పర్లలో తరలించి

ముస్తాబాద్(సిరిసిల్ల): సెలవు రోజులు అనే ధీమానో.. అధికారులు చూడకపోవచ్చనే భరోసానో కానీ మట్టి తరలింపులో బరితెగిస్తున్నారు. అనుమతులు లేకుండానే జేసీబీలతో తవ్వి టిప్పర్లలో ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. ఈక్రమంలో మానేరుకాల్వపై నుంచి టిప్పర్లు వెళ్లే అవకాశం లేకపోవడంతో కాల్వను పూడ్చి కొత్తగా రోడ్డు వేసున్నారు. ఇది కూడా మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పోతుగల్‌లోనే జరుగుతుంది. పోతుగల్ శివారులోని పంట పొలాల్లో నుంచి ఇటుకబట్టీల కోసం మూడు రోజులుగా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం సైతం జేసీబీతో మట్టిని తవ్వి టిప్పర్‌లో తరలించారు. అంతేకాకుండా మానేరు కెనాల్‌ను మట్టితో నింపి మరీ రోడ్డు వేసుకున్నారు. ఈ అక్రమ మైనింగ్‌పై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. తమ పంట పొలాల్లో నుంచి మట్టిని తీసుకునేందుకు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నామని, మైనింగ్ చేస్తున్న గోద గౌరయ్య పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సురేశ్‌ను వివరణ కోరగా.. మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. మట్టి తరలించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

'అడ్లూరి'కి అభినందన



లక్ష్మణ్‌కుమార్‌ను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కలిశారు. శాలువా కప్పి అభినందించారు.

సంబరాలు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర మంత్రి వర్గంలో ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, జి.వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవులు ఇవ్వడం పట్ల ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో సురభి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లూరి సత్యనారాయణ, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పారిజెపు కిషన్, తెలంగాణ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫయాజ్ అలీతో పాటు జి.రవీందర్, జాఫర్, దాసరి కృష్ణ, నవుల్ల అశోక్, రాకేశ్, మహేశ్, కనకయ్య, మారుతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చేప మందు పంపిణీ



చేప మందు వేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌కల్చరల్: మృగశిర కార్తె సందర్భంగా ధన్వంతరి ఆయుర్వేద కళానికేతన్ ఆధ్వర్యంలో నగరంలోని క్లాక్ టవర్ వద్ద ఆదివారం 101 వనమూలికలతో తయారు చేసిన చేప మందును పంపిణీ చేశారు. ఈ మందుతో దగ్గు, దమ్ముతో పాటు 88 వాత రోగాలు నశిస్తాయని, మందు సేవనానికి ఎలాంటి పత్యం లేదని నిర్వాహకులు తెలిపారు.

మహేందర్‌కు జ్యోతిష్య శిఖామణి పురస్కారం



కరీంనగర్‌రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు శ్రీనివాస జ్యోతిష్య పరిశోధన, వైద్య జ్యోతిష్య, వాస్తు శాస్త్ర అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో దుర్శేడ్‌కు చెందిన వేముల మహేందర్‌కు జ్యోతిష్య శిఖామణి అవార్డును ప్రదానం చేశారు. జ్యోతిష్యశాస్త్రంలో మహేందర్ చేసిన విశేష సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ ఫౌండర్ కుముదవల్లి సముద్రాల, ఆచార్య సముద్రాల, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు స్పందన



ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ప్రసన్న హరికృష్ణ

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం తెలంగాణ విద్యా సమితి, టిక్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసిన ప్రసన్న హరికృష్ణ ప్రారంభించగా.. తెలంగాణ విద్యాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండెం తారక్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా బట్టలషాపుల వద్ద శనివారం లభ్యమైన గుర్తు తెలియని మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఆదివారం గుర్తించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నగరంలోని గాంధీరోడ్డుకు చెందిన మృతుడు బోనాల సదానందం(60)గా గుర్తించి తన కుమారుడు బోనాల నరేశ్ వన్‌టౌన్ పోలీసులను సంప్రదించగా మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని అన్నారు.

మడేలేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంలో మడేలేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ మునిగాల సుదీప్ష సుధాకర్‌గౌడ్ దంపతులు ఆలయానికి విగ్రహాలను బహూకరించారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు.

డంప్ యార్డులో జంతు ఎముకలు



నగరంలోని డంపింగ్ యార్డులో మళ్లీ జంతు ఎముకలు కలకలం చెలరేగింది. ఆదివారం డంప్‌యార్డ్‌లో జంతు ఎముకల కుప్పలు దర్శనం ఇవ్వడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చెత్తాచెదారం వల్ల ఇబ్బంది పడుతున్నామని డంప్‌యార్డ్ సమస్యపై స్థానికులు ఆందోళన చేస్తుంటే.. మరోవైపు జంతు ఎముకలు తీసుకొచ్చి డంప్ యార్డ్‌లో వేయడంపై మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే నగరపాలక సంస్థకు చెందిన ట్రాక్టర్లలోనే జంతు ఎముకలు తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ డంప్‌యార్డ్‌లో జంతు కళేబరాలు వేయగా, అప్పట్లో స్థానికులు ఆందోళన చేశారు. కాగా జంతు ఎముకలను డంప్‌యార్డు నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

– కరీంనగర్ కార్పొరేషన్

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఎలగందుల మానేరులో నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఇసుక దందా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారగణం



ఎలగందుల మానేరు వాగు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్లు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల శివారు మానేరు వాగు నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఎలగందుల, ఖాజీపూర్, బావుపేట, కొండాపూర్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలుతోంది. దీనిపై పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా తమ దందాను కొనసాగిస్తున్నారు. పోలీసుల కళ్లుగప్పి ఇసుక తరలిస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది.

అధిక రేటు విక్రయిస్తూ..

కరీంనగర్ తదితర ప్రాంతాల్లో నిర్మాణాలు అధికం కావడంతో మార్కెట్‌లో ఇసుక లభ్యత తగ్గి డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకున్న ఇసుక మాఫియా అక్రమమార్గం వైపు దృష్టి సారించింది. మానేరులోని నాణ్యమైన ఇసుకను అధిక రేటుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని రోడ్లన్నీ దెబ్బతినడంతో పాటు విపరీతమైన వేగానికి స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అవసరమైన ట్రాక్టర్ల పట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తుండగా.. సహకరించని ట్రాక్టర్లపై కొరడా ఝుళిపిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కొన్ని ట్రాక్టర్లను పట్టుకోవడం.. మరికొన్ని ట్రాక్టర్లను వదిలేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటుడం పలువురికి మింగుడు పడటం లేదు. అన్ని ట్రాక్టర్లకు ఒకే విధమైన నిబంధన అనుసరించకపోవడంపై ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. గతంలో మాదిరిగా ఇక్కడ వ్యవహారాలు నడకపోవడంతో పలువురు ట్రాక్టర్ యజమానులకు ఏం చేయాలో తోచడం లేదు.

ఇకపై సీరియస్ యాక్షన్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఇకపై సీరియస్ యాక్షన్ తీసుకుంటాం. అనవసరంగా అక్రమ రవాణాకు పాల్పడుతూ ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు జైల్‌కు వెళ్లొద్దు. ప్రభుత్వం ద్వారా ఇసుక రీచ్‌కు అనుమతి తెచ్చుకొని దర్జాగా ఇసుకను రవాణా చేయాలి. ఇసుక అక్రమ రవాణాపై అర్ధరాత్రి 12 గంటలకు ఫోన్‌చేసిన స్పందించి ఆ రవాణాను అడ్డుకుంటా. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు చట్టప్రకారం మెదులుకోవాలి.

– నిరంజన్ రెడ్డి, సీఐ, కరీంనగర్ రూరల్

ఎట్టకేలకు బీటీ రోడ్డు నిర్మాణం

- రెండేళ్లకు తప్పిన తిప్పలు



నిర్మించిన బీటీ రోడ్డు

కరీంనగర్‌రూరల్: రెండున్నర సంవత్సరాల నుంచి కంకరరోడ్డులో రైతులు, వాహనదారులు పడుతున్న తిప్పలు ఎట్టకేలకు తీరాయి. బిల్లులు రాకపోవడంతో నిర్మాణ పనులను నిలిపివేసిన కాంట్రాక్టర్ ఇటీవల కంకర రోడ్డుపై బీటీ లేయర్ వేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా సాగిన బీటీరోడ్డు పనులు

కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ నుంచి ఎలబోతారం వరకు సీఆర్ఆర్ నిధులు రూ.2కోట్లతో బీటీరోడ్డు పనులను అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 2022 ఆగస్టులో ప్రారంభించారు. కాంట్రాక్టర్ పేరిట బీఆర్ఎస్ నాయకుడు జువ్వాడి రాజేశ్వర్‌రావు బీటీరోడ్డు పనులు చేపట్టారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లులను మంజూరు చేయకపోవడంతో రెండేళ్లక్రితం కంకరపోసి రోడ్డు పనులను నిలిపివేశాడు. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు కంకరరోడ్డుపై పడరానీపాట్లు పడ్డారు. కంకరరాళ్లతో వాహనాల టైర్లు చెడిపోవడంతో ద్విచక్రవాహనదారులు, ట్రాక్టర్ యజమానులు ఆర్థికంగా నష్టపోయారు. ఈక్రమంలో రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తేనే బిల్లులను మంజూరు చేస్తామని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు ప్రకటించడంతో నాలుగురోజుల క్రితం కాంట్రాక్టర్ రాజేశ్వర్‌రావు కంకరరోడ్డుపై బీటీలేయర్ వేశారు. మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ నుంచి చామనపల్లి క్రాస్‌రోడ్డు వరకు 3కిలోమీటర్ల దూరం వరకు బీటీ రోడ్డు నిర్మించారు. ఇంకా రోడ్డుకు ఇరువైపులా సైడ్ బరమ్స్ నిర్మాణం, కిలోమీటర్ సూచించే మైల్‌స్టోన్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని పీఆర్ అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు.

సమాచారం

నేడు చామనపల్లిలో భూభారతి సదస్సు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాజేశ్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే సదస్సులో భూసమస్యలున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నాయకుల వంటావార్పు

గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు మానేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. మైలారం మైసమ్మ గుట్ట వద్ద ఆదివారం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. కంటికి దగ్గరగా కాలుకు దూరంగా జిల్లా కేంద్రం ఉందని, బ్రిడ్జి నిర్మాణం చేపడితే మూడు మండలాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని, లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవీందర్, సతీష్, రామచంద్రం, ప్రశాంతి యాదవ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిగురుమామిడి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతోషంగా ఉన్నారని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్ అన్నారు. ఆదివారం చిగురుమామిడిలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆయా పార్టీల నాయకులు ఆరోపించడంలో అర్థం లేదన్నారు. చిన్నముల్కనూర్‌లో తప్పా ఏ గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లు నిర్మించలేదన్నారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు పూల లచ్చిరెడ్డి, బడుకోలు దేవేందర్‌రెడ్డి, పూదరి వేణుగోపాల్, అందె సురేశ్, గట్టు ప్రశాంత్, బొమ్మగాని వెంకటేశం, మార్క రాజు, కవ్వంపల్లి సంజీవ్ పలువురు పాల్గొన్నారు.

ఆరుగురిపై అట్రాసిటీ కేసు

జమ్మికుంట: పెళ్లి భోజన సమయంలో గొడవ పడి కులం పేరుతో దూషించిన ఆరుగురిపై ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన జూపాక పల్లవి, ఇల్లందకుంట మండలం బూజునూరు గ్రామానికి చెందిన తోడేటి అజయ్‌గౌడ్‌కు పెద్దల సమక్షంలో పెళ్లి జరిపించారు. భోజనాలు చేస్తుండగా బూజునూరు గ్రామానికి చెందిన మాచర్ల రాకేశ్, మామిడి సాయికుమార్, కొత్వాల కళ్యాణ్, తోడేటి పవన్, రౌతు రాకేశ్, ఇల్లందుల రమేశ్ గొడవ చేసి జూపాక హరీశ్, పవన్ కళ్యాణ్‌ను కులం పేరుతో దూషించారు. బాధితుల అన్న జూపాక ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.



నల్ల పోచమ్మ బోనాలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామస్తులు ఆదివారం నల్ల పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 17 కుల సంఘాల ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



డిమాండ్ల సాధనకై ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ కార్యకర్తలు(ఫైల్)

అంగన్‌వాడీలకు తీపి కబురు

- 65 ఏళ్లు నిండితే ఉద్యోగ విరమణ
- ప్రయోజనాలు పెంపు
- టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష
- ఫలించిన అంగన్‌వాడీ యూనియన్ల పోరాటం

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది. టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను పెంచుతూ ఆర్థిక శాఖ అనుమతులు జారీ చేసింది. విరమణ ప్రోత్సాహకాలను రెండింతలు చేస్తూ అనుమతులిచ్చింది. దీంతో టీచర్లు, ఆయాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విరమణ సమయంలో టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున అందించనున్నారు. జిల్లాలో నాలుగు ప్రాజెక్టు పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 68 టీచర్లు, 200 ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

జిల్లాలో నాలుగు ప్రాజెక్టులు

జిల్లాలో కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, గంగాధర, హుజూరాబాద్ అంగన్‌వాడీ ప్రాజెక్టులున్నాయి. వాటి పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల ద్వారా అంగన్‌వాడీ టీచర్లు గ్రామీణ ప్రాంత చిన్నారులు, తల్లులు, గర్భిణులకు తగిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. జిల్లాలో గర్భిణులు 3600, బాలింతలు 4663, 0–6 నెలల వయస్సు ఉన్న చిన్నారులు 10,377 మంది ఉన్నారు. వీరంతా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పోషకాహారం, తదితర వాటితో లబ్ధిపొందుతున్నారు.

ఖాళీల భర్తీకి చర్యలు

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి ఐసీడీఎస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టీచర్లు, ఆయాల పోస్టుల ఎన్ని ఖాళీగా ఉన్నాయనే వివరాలు సేకరించి అధికార యంత్రాంగానికి నివేదించారు. ఈ రెండు పోస్టులకు కనీస విద్యార్హత ఇంటర్ పాసై ఉండాలి. వయసు 18–35 ఏళ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపింది. పోస్టుల భర్తీ ఎలా చేయాలనేది నిర్ణయించలేదు. గతంలో మార్కుల ఆధారంగా భర్తీ చేసేవారు.

మా పోరాట ఫలితమే



మా పోరాట ఫలితంగానే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాన్ని ప్రభుత్వం రెండింతలు చేసింది. ఉత్తర్వులు 2024 జూలై 1 నుంచి వర్తింపజేయాలి. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసే దిశగా ప్రయత్నం చేయాలి.

– ఎడ్ల రమేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతు అవగాహన సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు, రైతులు

కొత్తపల్లి: ప్రభుత్వం రైతుల కోసం తీసుకొస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్త శాస్త్రవేత్త ఎస్ శ్రీనివాస్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం గతనెల 29 నుంచి ఈనెల 12 వరకు సంపన్న రైతు దేశానికి గర్వ కారణం అనే ఉద్దేశంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, కొత్తపల్లి రైతువేదికల్లో నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన మండలికి సంబంధించి 113 వివిధ రంగాల పరిశోధన కేంద్రాలు మన దేశంలోని పలుచోట్ల ఏర్పాటు చేయడం జరిగిందని, సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ ఇవి వివిధ వ్యవసాయ రంగాల్లో పరిశోధన చేస్తున్నాయని తెలిపారు. వరి సాగులో మెలుకువలు, ప్రకృతి సేద్యంలో అవసరమయ్యే సస్యరక్షణ విధానాలను కేవీకే శాస్త్రవేత్త ఈ.శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మండల వ్యవసాయాధికారి ఎం.కృష్ణ, ఏఈఓలు రాము, రాజేంద్రప్రసాద్, రైతు ప్రతినిధులు వాసాల రమేశ్, వేముల అనిల్‌కుమార్, న్యాలమడుగు శంకరయ్య, వెంకట్ రెడ్డి, మనోహర్ రెడ్డి, చిటుకూరి శ్రీనివాస్, ఎన్నం మల్లేశం, దుగ్గలి ఆంజనేయులు, బోనాల చంద్రయ్య, పరశురాములు, శ్రీహరి, కుంట హరీశ్, గిర్ర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంక్ చైర్మన్ విలాస్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: కొత్తగా ముగ్గురిని మంత్రులుగా తీసుకోవడం ద్వారా క్యాబినెట్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారని అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కాంగ్రెస్ అధిష్టానం పెద్దపీట వేసిందన్నారు. ముగ్గురు మంత్రులతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పడిశెట్టి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమైక్యత హైస్కూల్ పూర్వ విద్యార్థులు



భారతీయ విద్యా కేంద్ర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని సమైక్యత హైస్కూల్‌కు చెందిన 2004–05 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులకు ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్‌హాల్ వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. సమ్మేళనంలో పాఠశాల స్థాపకులు రామారావు, ఉపాధ్యాయులు రమేశ్, రణధీర్, మల్లికార్జున, కాత్యాయిని, వనితతో పాటు పూర్వవిద్యార్థులు వెంకటేశ్, సందీప్, విక్రమ్, ప్రియాంక, అనూష, స్వర్ణలత పాల్గొన్నారు.

భారతీయ విద్యా కేంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు..

కరీంనగర్‌లోని భారతీయ విద్యా కేంద్ర ఉన్నత పాఠశాల 2001–2002 బ్యాచ్ పదో తరగతి ఆదివారం నగరంలోని ప్రైవేట్ హాల్‌లో పూర్వ విద్యార్థులసమ్మేళనం నిర్వహించుకున్నారు. తమ పాత రోజులు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న విధులు, కుటుంబాల గురించి ముచ్చటించుకున్నారు. ఫన్నీ గేమ్స్‌తో సరదాగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు (65) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తుపట్టిన వారు టూటౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మానకొండూర్: మండలంలోని అన్నారానికి చెందిన తొర్రికొండ రాజవ్వ(76) వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మానకొండూర్ సీఐ సంజీవ్ తెలిపిన వివరాలు.. రాజవ్వ నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్యం, జీవితంపై విరక్తితో చెంది ఆదివారం ఇంటి సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కూతురు రాజేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

తెలుగు వెలుగులు సాకారమయ్యేనా?

- ఈ విద్యాసంవత్సరం నుంచే సీబీఎస్ఈ స్కూళ్లలో తెలుగు తప్పనిసరి చేస్తామన్న సీఎం
- ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ అన్ని రకాల స్కూళ్లలో అమలుకు ఆదేశాలు
- పక్కాగా అమలుకు వెంటనే మార్గదర్శకాలు ఇవ్వాలంటున్న టీచర్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలుగుకు మళ్లీ పూర్వ వైభవం తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. అన్ని రకాల సిలబస్ స్కూళ్లలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో తెలుగు మీడియంలో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించినవారు ఎందరో ఉన్నా, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ మీడియానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో తెలుగు ప్రాధాన్యం తగ్గిపోతోంది. అయితే మాతృ భాషలో చేసే వ్యక్తీకరణ మరే ఇతర భాషల్లోనూ రాదన్నది భాషా నిపుణుల అభిప్రాయం. ఐదో తరగతి వరకు మాతృ భాషలో బోధన ఉండాలని, 8వ తరగతి వరకు ఉంటే మరింత మేలని నూతన విద్యా విధానం చెబుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని రకాల సిలబస్ స్కూళ్లలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేస్తామని ఆ దిశగా చర్యలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి సిలబస్ కలిగిన స్కూళ్లలోనూ అమలు చేయాలని స్పష్టం చేశారు. అయితే ఈనెల 12 నుంచే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉంది.

గతంలో ఉత్తర్వులు జారీ చేసినా..

రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని తెలంగాణ (కంపల్సరీ టీచింగ్ అండ్ లెర్నింగ్ ఆఫ్ తెలుగు ఇన్ స్కూల్స్) యాక్ట్ 2018ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అదే ఏడాది జూన్ 30వ తేదీన దశల వారీగా తెలుగు అమలు కోసం జీవో 24ను కూడా జారీ చేసింది. అయినా రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా పక్కాగా అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్ర సిలబస్ కలిగిన కొన్ని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలతో పాటు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (ఐసీఎస్ఈ), ఇంటర్నేషనల్ బకలరియట్ (ఐబీ) సిలబస్ కలిగిన ఇంటర్నేషనల్ స్కూళ్లు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడం లేదు. రాష్ట్ర సిలబస్ కలిగిన చాలా ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, సీబీఎస్ఈ స్కూళ్లు తెలుగు ఆప్షనల్ సబ్జెక్టుగా మాత్రమే అమలు చేస్తున్నాయి. తప్పనిసరి కాకపోవడంతో విద్యార్థులు ఎవరూ తెలుగు సబ్జెక్టును పెద్దగా ఎంచుకోవడం లేదు. దీంతో ఆయా స్కూళ్లలో తెలుగు భాష అమలుకు నోచుకోవడం లేదు.

మెజారిటీ స్కూళ్లలో అమలు అంతంతే

ప్రస్తుతం రాష్ట్రంలో 42,901 పాఠశాలలు ఉండగా, అందులో 59,35,927 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం పాఠశాలల్లో 10,741 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిల్లో 33,93,010 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఆ స్కూళ్ల అన్నింటిలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడం లేదు. కొన్ని స్కూళ్లు అమలు చేస్తుండగా, మరికొన్ని ఆప్షనల్‌గా అమలు చేస్తున్నాయి. మరోవైపు 533 సీబీఎస్ఈ సిలబస్ కలిగిన స్కూళ్లు ఉండగా, మిగితావి ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో ప్రస్తుతం దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లోనూ తెలుగు పక్కాగా అమలుకు నోచుకోవడం లేదు.

ఇకనైనా 'తప్పనిసరి తెలుగు'అమలయ్యేనా

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ కలిగిన పాఠశాలల్లో 9, 10 తరగతులకు సంబంధించిన రాష్ట్రేతర విద్యార్థుల కోసం సింపుల్ తెలుగు పాఠ్య పుస్తకం 'వెన్నెల'ను సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరి 26వ తేదీన ఆవిష్కరించారు. ఆ సమయంలో అన్ని రకాల సిలబస్ కలిగిన స్కూళ్లలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా 2025–26 విద్యా సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. దానిని ఇప్పుడు ఆచరణలోకి తీసుకురావాల్సి ఉంది. ఇది అమల్లోకి వస్తే ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు టీచర్లకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

వెంటనే మార్గదర్శకాలు ఇవ్వాలి



సీబీఎస్ఈ స్కూళ్లలో తెలుగు సబ్జెక్టు ఉండాల్సిందే. తప్పనిసరి కాకపోవడం వల్ల పిల్లలకు మాతృభాష రావడం లేదు. నాలుగైదేళ్ల నుంచి అమలు చేస్తామంటున్నారు. ఇప్పటికీ మార్గదర్శకాలు ఇవ్వలేదు. వెంటనే ఇవ్వాలి.

– సునీల్, తెలుగు టీచర్, జగిత్యాల

అమలు చేస్తే మేలు



ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో తెలుగు టీచర్ల సంఖ్య చాలా తక్కువ. అందులోనూ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీలాంటి స్కూళ్లలో మరింత తక్కువే. ఇప్పుడు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తే తెలుగు టీచర్లకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

-కనుకు గోపి, తెలుగు పండిట్, సూర్యాపేట

అవకాశాలు పెరుగుతాయి..



తెలుగు పండిట్ శిక్షణ చేసిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ప్రతి స్కూల్లో పోస్టులు వస్తాయి. దీంతో వారి జీవితాలు మెరుగు పడతాయి.

-గిర్ని అంజాగౌడ్, పాపన్నపేట, సంగారెడ్డి

తెలుగు టీచర్లకు ప్రాధాన్యం



సీబీఎస్ఈ స్కూళ్లలో తెలుగు తప్పనిసరి చేస్తే తెలుగు టీచర్లకు ప్రాధాన్యం పెరుగుతుంది. విద్యార్థులకు మేలు జరుగుతుంది. తెలుగు భాషను రక్షించుకోవడం అందరి బాధ్యత.

– సత్యంబాబు, తెలుగు టీచర్, ఖమ్మం

ప్రథమ భాషగా చేయాలి



తెలుగును ప్రథమ భాషగా చేయాలి. అన్ని రకాల సిలబస్ కలిగిన స్కూళ్లలో కచ్చితంగా అమలు చేయాలి. ఇంగ్లిష్ మీడియంలోనూ పక్కాగా అమలు చేయాలి.

-రాంబాబు. తెలుగు టీచర్, మహబూబాబాద్

క్లుప్తంగా...

హైరిస్క్ గర్భధారణపై జాతీయ సదస్సు

పాల్గొన్న గైనకాలజిస్టులు, సర్జన్లు

హైదరాబాద్: యశోద హాస్పిటల్స్–హైటెక్‌సిటీ ప్రసూతి, గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో హైరిస్క్ గర్భధారణపై ఆదివారం జాతీయ స్థాయి సదస్సు, లైవ్‌వర్క్‌షాప్ నిర్వహించారు. 500 మందికి పైగా గైనకాలజిస్టులు, సర్జన్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఈ సదస్సులో విభిన్న వైద్య విభాగాల నుంచి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను అధిగమిస్తూ నూతన మార్గదర్శకాలు, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సంక్లిష్టమైన సర్జరీలను మరింత సులభంగా, ఖచ్చితత్వంతో ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారనానరు. యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రసూతి సమయంలో అత్యంత క్లిష్టమైన గర్భధారణలో విజయవంతంగా తల్లీబిడ్డలను క్షేమంగా కాపాడడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు.

బాలు పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: తనికెళ్ల



తనికెళ్ల భరణికి బాలు నటనా పురస్కారాన్ని అందజేస్తున్న అంబికా కృష్ణ తదితరులు

హైదరాబాద్: చరిత్ర ఉన్నంత కాలం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో కొండూరి భారతి సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ పుట్టినరోజు సందర్భంగా సినీనటులు తనికెళ్ల భరణికి ఎస్పీ బాలు నటనా పురస్కారాన్ని అందజేశారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు , తుమ్మలపల్లి రామసత్యనారాయణ, గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సినీనేపథ్య గాయకుడు వినోద్‌బాబు, రామచారి, శశికళాస్వామి విజయలక్ష్మి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 79 పాటలతో 21 మంది గాయనీ గాయకులతో నిర్వహించిన ఏకగళ స్వరార్చన అందరినీ అలరించింది.

మదర్ డెయిరీ మనుగడ ప్రశ్నార్థకం!



నష్టాల ఊబిలో సంస్థ
- బిల్లులు అందక 25 వేల మంది పాడి రైతుల్లో ఆందోళన
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని విన్నపం

ఆలేరు: మదర్ డెయిరీ (నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్–నార్ముల్) భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి దివాళా అంచున నిలబడింది. పాడి రైతులకు బకాయిలు చెల్లించలేని దీనస్థితి. శుక్రవారం ఆలేరు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. మదర్‌డెయిరీకి చేయూతపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ఉద్యోగులు, రైతులు పెట్టుకున్న కాస్తోకూస్తో ఆశలు ఆవిరయ్యాయి.

రైతులకు బకాయిలు ఇలా..

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మదర్ డెయిరీ కింద పాల ఉత్పత్తిదారుల సంఘాలు గుర్తింపు పొందినవి 300 ఉండగా.. ఓటు హక్కు లేని సభ్యులున్న సంఘాలు మరో 150 ఉన్నాయి. రైతుల వద్ద సేకరించిన పాలు రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 23 పాల శీతలీకరణ కేంద్రాలకు వస్తాయి. ఆయా సంఘాల పరిధిలోని 25వేల మంది పాడి రైతులకు ఐదు బిల్లులకు సంబంధించి సుమారు రూ.25 కోట్లు చెల్లించాల్సి ఉంది.

అప్పులు, వడ్డీలు ఇవీ..

చిట్యాల వద్ద మదర్ డెయిరీకి సుమారు 30 ఎకరాల భూమి ఉంది. ఆ స్థలంపై గడిచిన కొన్నేళ్లుగా రూ.35 కోట్ల వరకు రుణం(ఓడీ) తీసుకున్నారు. ఇందుకు నెలకు రూ.45 లక్షల వడ్డీ చెల్లిస్తున్నారు. ఇక 600 మంది ఉద్యోగులు, ఇతర సిబ్బందికి నెలకు రూ.కోటిన్నర నుంచి రూ.2 కోట్ల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. ఇతరత్రా నిర్వహణ ఖర్చులు తడిసి మోపడవుతున్నాయి.

పడిపోయిన సేల్స్..

గత రెండేళ్లగా మదర్ డెయిరీ రైతుల నుంచి సేకరించిన పాలకు, విక్రయాలకు మధ్య చాలా తేడా ఉంది. సుమారు రోజుకు లక్ష లీటర్ల పాలు సేకరిస్తే... 60వేల లీటర్లు మాత్రమే సేల్స్ ఉంటున్నాయి. దాదాపు 40వేల లీటర్ల పాలను పౌడర్‌గా చేయడం, స్కిమ్ మిల్క్ రూపంలో బయట విక్రయించాల్సిన పరిస్థితి. దాంతో లీటర్‌కు రూ.6 చొప్పున సంస్థ నష్టపోయింది. దీనికితోడు ప్రైవేట్ డెయిరీలతో సవాళ్లు ఎదురవుతున్నాయి. జీతాలు కూడా ఆలస్యమవుతున్నాయని, ఏప్రిల్ నెల జీతం జూన్‌లో చెల్లించారని ఓ ఉద్యోగి 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు.

రూ. 80 కోట్ల నష్టాల్లో ఉంది

నేను చైర్మన్ అయిన తరువాత బ్యాంకర్లతో మాట్లాడుతూ.. రుణాలను సర్దుబాటు చేస్తూ ఇంత వరకు నెట్టుకొచ్చాను. ప్రస్తుతం బ్యాంకు ఖాతా ఆపరేటింగ్ అవడంలేదు. బ్యాంకర్లు టర్నోవర్ చేయనివ్వడం లేదు. మొత్తం రూ.80 కోట్ల నష్టాల్లో సంస్థ ఉంది. సంస్థను ఆదుకోవడానికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నాం.

-మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

డబ్బులు లేవు

25 వేల మంది రైతులకు సుమారు రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. చిట్యాలలో ఉన్న 30ఎకరాలు విక్రయించి, రైతులకు బిల్లులు చెల్లించాలని పాలకమండలిలో నిర్ణయించారు. కానీ కొంతమంది డైరెక్టర్ల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

-బి.కృష్ణ, మదర్ డెయిరీ ఎండీ

అర్చకులకు ఊతం..

- ఆలయాలకు వరం
- పరిశీలనలో డీడీఎన్ఎస్ దరఖాస్తులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 726 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో డీడీఎన్ఎస్ కింద వచ్చిన దరఖాస్తులు

ఆదిలాబాద్ – 219	ఆసిఫాబాద్ – 102
మంచిర్యాల – 110	నిర్మల్ – 295



ఆదిలాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయం

దండేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన, చారిత్రాత్మక దేవాలయాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయశాఖ దూపదీప నైవేద్య పథకం(డీడీఎన్ఎస్)ను ప్రవేశపెట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత మే నెలలో డీడీఎన్ఎస్ కింద దేవాలయాలను చేర్చేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటి నుంచి గతనెల మే 24 వరకు దేవాదాయశాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కొత్తగా ఆలయాల ఎంపికకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. ఈప్రక్రియ పూర్తయితే గ్రామీణ, పురపాలికల్లోని ఆలయాలకు మహర్దశ పట్టనుంది. దేవతామూర్తులకు అర్చకులతో దూపదీప, నైవేద్య, పూజాది కార్యక్రమాలు నిరంతరం కొనసాగనున్నాయి. భక్తుల దర్శనంతోపాటు దాతల సహకారంతో సౌకర్యాలు కల్పించేందుకు వీలు కలిగే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం పథకం కింద ఉమ్మడి జిల్లాలో 729 దేవాలయాలు కొనసాగుతున్నాయి.

ఎంపిక ప్రక్రియ షురూ..

దూపదీప నైవేద్యం పథకం కింద పూజాది కార్యక్రమాలకు రూ.4 వేలు, ఆలయ అర్చకుడికి గౌరవ వేతనం రూ.6 వేలు అందజేస్తారు. ఈ పథకంలో దేవాలయాల ఎంపికకు జిల్లాస్థాయి కమిటీని నియమిస్తారు. ఇందులో దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌తోపాటు అధికారులు, ఆగమశాస్త్ర వేదపండితులు సభ్యులుగా ఉంటారు. అన్ని అర్హతలున్నా ఆలయాల సమాచారాన్ని దేవాదాయశాఖ కమిషనరేట్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి నోటిఫికేషన్ వచ్చిన తర్వాత డీడీఎన్ఎస్ పథకాన్ని అమలు చేసి మంజూరు పత్రాలు అందజేస్తారు. గత నోటిఫికేషన్ 2022 ఏప్రిల్–మే నెలలో విడుదలైంది. అప్పుడు 767 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి నోటిఫికేషన్‌కు 726 దరఖాస్తులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి దరఖాస్తుల సంఖ్య కొద్దిగా తగ్గింది. అర్హతలున్నా పలు దేవాలయాలకు రిజిస్ట్రేషన్ సక్రమంగా లేకపోవడంతో దరఖాస్తు చేయలేదు. నూతన దేవాలయాలు నిర్మించిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో అవకాశం కోల్పోయారు. కొందరు అర్చకులకు అవగాహన లేక కూడా దరఖాస్తు చేసుకోలేకపోయారు.

దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల నుంచి డీడీఎన్ఎస్ కింద దరఖాస్తులు స్వీకరించాం. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. త్వరలో జిల్లా కమిటీని ఏర్పాటు చేసి, డీడీఎన్ఎస్ కింద దరఖాస్తులు చేసుకున్న ఆలయాలను సందర్శిస్తారు. సందర్శనాంతరం నివేదికను తయారు చేసి, ఎంపిక కోసం రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనరేట్ కార్యాలయానికి పంపిస్తాం.

– ఎస్.నవీన్, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

అరటి సాగు వైపు అన్నదాతల చూపు

- పంట విస్తీర్ణం పెంచేందుకు అధికారుల ప్రణాళికలు
- సబ్సిడీలు ఇచ్చేలా రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు



జిల్లాలో సాగవుతున్న అరటి పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అరటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండగా, ఆ మేరకు ఉద్యానశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అరటి సాగు చేసే రైతులకు భారీగా సబ్సిడీలు ఇచ్చి, వరి, మొక్కజొన్న, పసుపు సాగు చేసే రైతుల దృష్టి మరల్చాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అంతేకాకుండా అరటి ఉత్పత్తులకు ఉత్తర భారతదేశంలో మంచి డిమాండ్ ఉండటంతో అక్కడి వ్యాపారులు కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ రెండురోజుల క్రితం ఉత్తర భారత వ్యాపారులు, అరటి రైతులు, ఉద్యానశాఖ అధికారులతో సమావేశమై, పంట స్థితిగతులు, మార్కెటింగ్‌పై సమీక్షించారు.

అనుకూలమైన వాతావరణం

జిల్లాలో ఏడాది పొడవునా అరటికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. దీనికి తోడు ఎర్రటి, నల్ల రేగడి నేలలు సాగుకు అనుకూలం. వ్యవసాయ బావులు ఎక్కువగా ఉండటంతో నీటికి ఢోకా ఉండదు. జిల్లాలోని జగిత్యాల రూరల్, కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మపురి మండలాలు అరటికి అనుకూలంగా ఉండే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు నివేదికలు తయారుచేసి, రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించారు.

స్థానికంగా కొనకపోవడంతో..

గతంలో జిల్లాలో 1,000 ఎకరాలకు పైగా అరటి సాగు చేసేవారు. అయితే, ఎకరాకు 25–30 మె.ట వరకు దిగుబడులు వచ్చినా లోకల్ వ్యాపారులు కొనేందుకు ససేమిరా అన్నారు. జిల్లాలో అరటి కాయలు ఉన్నా, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా తాడిపత్రి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, నాందేడ్ నుంచి కాయలు తెప్పించారు. దీంతో రైతులు పంటను తీసేశారు. ప్రస్తుతం కేవలం 10 మంది రైతులు 21 ఎకరాల్లో మాత్రమే అరటిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి సాగును వీలైనంత తగ్గించి, ఉద్యానపంటల వైపు రైతులను మళ్లించాలని చూస్తున్నారు. అరటి ఏడాది పంట కాబట్టి వేరుశనగ, పెసర వంటి పంటలు సాగు చేయవచ్చని, దీంతో మరింత ఆదాయం పెరుగుతుందని సూచిస్తున్నారు.

ఉత్తరాది వ్యాపారులు కొనుగోలు చేసేలా..

మన జిల్లాలో పండించిన అరటికాయ నాణ్యతగా ఉండి మెరుస్తూ ఉంటుంది. కాయ సైజు పెద్దగా ఉంటుంది. ఈ కాయను ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఇష్ట పడుతుంటారు. అక్కడి వ్యాపారులు ఇక్కడి అరటికాయను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే రోజుకు 5–10 టన్నుల కాయను తరలించాల్సి ఉంటుంది. కాయ సైజును బట్టి కిలోకు రూ.8–15 వరకు పెట్టేందుకు కూడా సిద్ధమైనారు. జిల్లాలో దాదాపు 10 వేల ఎకరాల్లో అరటి సాగు చేసేలా రైతులతో సమావేశాలు నిర్వహించాలని చూస్తున్నారు.

అరటి సాగుకు మళ్లీ పురుడు

అరటికి డిమాండ్ ఉండడంతో జిల్లాలో మళ్లీ సాగును ప్రోత్సహించాలని, అంతర్గాం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు మాకునూరి జితేందర్‌రావు రాష్ట్ర ఉద్యానశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఉద్యానశాఖ అధికారులు జిల్లాలో అరటి స్థితిగతులపై నివేదిక తయారు చేసారు. తాజాగా జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఉత్తర భారతదేశ వ్యాపారులు, ఆదర్శ రైతులు సమావేశమై అరటి సాగు, మార్కెటింగ్‌పై చర్చించారు. సాగుకు ముందుకు వచ్చే రైతులకు రాష్ట్ర ఉద్యానశాఖ మిషన్ ద్వారా మొక్కలు, డ్రిప్, అంతరపంటల సాగుకు భారీగా సబ్సిడీలు ఇవ్వాలని ప్రతిపాదించారు. కాగా, నాలుగైదు రోజుల్లో అరటి సాగు చేసే రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఉద్యానశాఖ భావిస్తుంది.

మంచి ఆదాయం



అరటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. గతంలో నాలుగైదు ఎకరాల్లో సాగు చేశా. దిగుబడులు బాగానే వచ్చాయి కానీ వ్యాపారులు సరైన ధరకు కొనక ఆసక్తి తగ్గిపోయింది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల వారు కొంటామనడంతో చాలా మంది రైతులు అరటి సాగుకు మొగ్గు చూపుతున్నారు.

– జితేందర్‌రావు, అభ్యుదయ రైతు, అంతర్గాం

అనుకూల వాతావరణం



అరటికి అనువైన వాతావరణం, ఎర్ర, నల్ల రేగడి నేలలు అనుకూలంగా ఉండటంతో మంచి దిగుబడులు వస్తాయి. ఇతర రాష్ట్రాల వ్యాపారులతో సంప్రదింపులు చేసి జిల్లాలో సాగు చేసిన అరటిని కొనుగోలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సాగు చేసేవారికి సబ్సిడీలు ఇవ్వాలని సూచిస్తున్నాం.

– శ్యాంప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నేటి నుంచి ఈనెల 11 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు సర్వం సిద్ధమయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల నుండి హాకీ టీంలు పాల్గొననున్నాయి. ఇప్పటికే ఐదు జిల్లాల క్రీడాకారులు చేరుకున్నారు. స్టేడియంలోని మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌లో ఏర్పాట్లను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్థసారథి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.



క్రీడాకారులకు జెర్సీలను అందిస్తున్న గోవర్ధన్ రెడ్డి

సోమవారం సాయంత్రం 5 గంటలకు పోటీల ప్రారంభోత్సవానికి ఎంపీ గోడం నగేశ్, ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరుకానునట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా క్రీడాకారులకు జెర్సీలను అందించారు. పోటీల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు.

ఈ పక్షి కనిపించిందంటే వర్షాలు వస్తున్నట్లే!



వర్షం రాకను సూచించే పైడ్ కూకూ ఆఫ్రికన్ పక్షి

మామడ: నిర్మల్ జిల్లా మామడలోని ఎకో టూరిజం ప్రాంతమైన తుర్కం, యెంగన్న చెరువులను పర్యాటకులు ఆదివారం సందర్శించారు. వలస పక్షుల అందాలను కెమెరాల్లో బంధించారు. తుర్కం చెరువు సమీపంలో పైడు కూకూ అనే ఆఫ్రికా ఖండానికి చెందిన వలస పక్షిని గుర్తించారు. ఈ పక్షి వచ్చిందంటే వర్షం వస్తున్నట్లేనని అటవీశాఖ దిమ్మదుర్తి ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఏటా కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణించి మే, జూన్ వరకు ఇక్కడి అటవీ ప్రాంతాలకు ఈ పక్షి చేరుకుంటుందని పేర్కొన్నారు.

కొండగట్టులో సెలవుల రద్దీ



మల్యాల(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. పాఠశాలల సెలవులు ముగియనుండడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. బేతాళస్వామి, సీతారామస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్యూలైన్ల ద్వారా స్వామివారలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

● మిస్ యూనివర్స్ గ్రాండ్ ఫినాలే

మిస్ యూనివర్స్‌కు మన తెలుగు తేజాలు

త్వరలో థాయిలాండ్‌లో జరగనున్న మిస్ యూనివర్స్ 2025 కోసం భారత్ నుంచి మిస్ యూనివర్స్ ఇండియాను ఎంపిక చేయడానికి పోటీలు జరిగాయి. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ ఫైనలిస్టుల ఎంపికలో మిస్ యూనివర్స్ తెలంగాణగా కశ్వీ, మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్‌గా ప్రకృతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరు పంచుకున్న విశేషాలు..

– నిర్మలారెడ్డి
ఫొటోలు: ఎస్.ఎస్.ఠాకూర్



సుస్మితాసేన్ స్ఫూర్తి

– కశ్వీ, మిస్ యూనివర్స్ తెలంగాణ

నేను మెడికల్ స్టూడెంట్‌ని. మోడల్ గా కూడా రాణిస్తున్నాను. శాస్త్రీయ నృత్యమూ నేర్చుకున్నాను. అందాల పోటీలు అంటే కేవలం బ్యూటీ గురించి మాత్రమే కాదు. మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసం, సమాజానికి మంచి చేయాలనే ఆలోచన, జీవన నైపుణ్యాల వృద్ధి.. ఇలా అన్నింటిపై ఫోకస్ ఉంటుంది. అందుకే నేను దీనిమీద దృష్టి పెట్టాను. నేను పుట్టి పెరిగింది అమెరికాలో. మా అమ్మానాన్నలు తెలంగాణ వాసులు. మిస్ యూనివర్స్ సుస్మితాసేన్ అంటే నాకు చాలా ఇష్టం. ఆమెలా ఎదగాలన్నది నా డ్రీమ్. అందుకే నన్ను నేను నిరూపించుకోవడానికి హైదరాబాద్ వచ్చాను. ఈరోజుల్లో ప్రజల్లో మానసిక అనారోగ్యం బాగా పెరుగుతోంది. దీనిపై చైతన్యం కలిగించేందుకు కృషి చేస్తున్నాను. అలాగే గృహహింస పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాను. వీటితోపాటు మూగ, చెవిటి వారికి సహాయకారిగా ఉంటూ వారి వృద్ధికి కృషి చేస్తున్నాను. ఈ విషయాలు న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాయి. తెలంగాణకు రావడానికి ముందే మా పేరెంట్స్ నుంచి, బుక్స్ నుంచి తెలంగాణ గొప్పతనం గురించి తెలుసుకున్నాను. ఇక్కడికి రావడం విజేతగా నిలవడం... చాలా సంతోషంగా ఉంది.



కాన్ఫిడెన్స్ ముఖ్యం

–ప్రకృతి కంబం, మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్

కళ్ళు మూసినా, తెరిచినా కిరీటమే కళ్ళ ముందుండేది. ఫైనలిస్ట్‌గా ఎంపికయినందుకు చాలా చాలా హ్యాపీగా ఉన్నాను. పోటీలో మన మాటల్లో, నడకలో, ప్రవర్తనలో కాన్ఫిడెన్స్‌నే ప్రధానంగా చూస్తారు. ఫైనల్ రౌండ్‌లో... త్యాగం, పాజిటివిటీ, నెగెటివిటీల గురించి అడిగారు. త్యాగం అనేది ఎప్పుడూ గొప్పదే. మన జీవితంలో చిన్న చిన్న త్యాగాలు చేస్తుంటాం. కానీ, త్యాగం వల్ల మన సెల్ఫ్ హ్యాపీగా లేకపోతే చేయకూడదు అని నేను చెప్పడం న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. గత ఏడాది ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ నుంచి పోటీ చేసి గెలుపొందాను. ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికయ్యాను. ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామో ఆ రాష్ట్ర సంస్కృతి, చరిత్ర, భాష.. ఇలా అన్నింటి గురించి తెలిసుండాలి. అమ్మానాన్న బెంగళూరులో ఉంటారు. అమ్మ వర్కింగ్ విమెన్, అక్క ప్రేరణ నాకు బ్యాక్ బోన్ అని చెప్పవచ్చు. అంతగా ఎంకరేజ్ చేస్తారు. బీకామ్‌లో డిగ్రీ చేశాను. డాన్స్ అంటే ఇష్టంతో డాన్స్ కోర్సు చేశాను. బెంగళూరులో డాన్స్ స్టూడియో ఉంది. రియాలిటీ షో చేశాను, నేను నటించిన సినిమా త్వరలో రిలీజ్ కాబోతుంది. నన్ను ఆల్ రౌండర్ అని నా ఫ్రెండ్స్ అంటుంటారు. బ్యూటీ అంటే ఫిజికల్‌గా కనిపించేదే కాదు.. మన సెల్ఫ్ కాన్ఫిడెన్స్. దానినే అన్నింటికన్నా భిన్నంగా చూపగలగాలి.

బ్యూటిప్స్

ముఖాన్ని మెరిపించే స్క్రబ్స్



ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ బ్లాక్ హెడ్స్ వస్తూనే ఉంటాయి. వీటివల్ల ముఖం కళావిహీనంగా కనిపిస్తుంది. వీటిని తీయించుకోవడం ఖర్చుతో కూడుకున్నదేగాక, సమయం కూడా వెచ్చించాలి. అయితే ఇంట్లో ఉండే దాల్చినచెక్క, నిమ్మ, పప్పు, పాలు, పంచదార, కొబ్బరి నూనె, ఉప్పుతో సులభంగా తొలగించుకోవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూద్దాం...

● చర్మంలో అతిముఖ్యమైన ప్రోటీన్ కొల్లాజెన్ విడుదలను మెరుగుపరచడంలో దాల్చినచెక్క ప్రముఖ పాత్ర పోషిస్తుంది. చర్మం మీద ఏర్పడే రంధ్రాలను దాల్చిని తగ్గిస్తుంది. నిమ్మరసంలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మంమీద రంధ్రాలను లోతుగా శుభ్రం చేస్తాయి. అందువల్ల అరచెక్క నిమ్మరసంలో టీస్పూను దాల్చిన చెక్కపొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతంలో పూతలా వేసి పదిహేను నిమిషాల పాటు మర్దనా చేయాలి. తరువాత చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే బ్లాక్‌హెడ్స్ తగ్గుముఖం పడతాయి.



● స్పూను పంచదారలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు మర్దన చేసి తరువాత కడిగేయాలి. పంచదార చర్మాన్ని లోతుగా శుభ్రంచేసి మూసుకుపోయిన రంధ్రాలను తెరవడం తోపాటు, మృతకణాలను తొలగిస్తుంది. కొబ్బరి నూనెలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడం తోపాటు, మృదువుగా మారుస్తాయి.

● అరచెక్క నిమ్మరసంలో అరటీస్పూను సాల్ట్‌వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదినిమిషాల పాటు మర్దన చేసి చల్లని నీటితో కడిగేయాలి. ఈ స్క్రబ్ వదులుగా ఉన్న చర్మాన్ని బిగుతుగా మార్చడంతో పాటు, బ్లాక్‌హెడ్స్‌ను తొలగించి చర్మం కాంతిమంతం గా మెరిసేలా చేస్తుంది.

ఆత్మదర్శిని

సంతృప్తే సంపద

మనస్సు అనేదే కల్పన. దైవం మనస్సుకు అతీతం. దైవం గురించిన ఆలోచనలు నిన్ను దైవం వద్దకు చేర్చలేవు. ఆలోచన ఏదైనా నీవు వాటిని గమనించే సాక్షిగా ఉండాలి. అహం అంతమైతేనే దైవం అనుభవమౌతుంది.

ఆలోచనలు, కోరికలు నశించాలి. చివరికి ఆత్మను గురించి కూడా ఊహించవద్దు. అందుకే బుద్ధుడు ఆత్మకూడా లేదన్నాడు. దైవాన్ని చేరుకోవాలనే కోరిక కూడా చివరికి నశించాలి. అప్పుడే, ఆ కోరికలే లేని స్థితిలోనే నీవు 'ఈ క్షణం'లోకి జారుకుంటావు. ఆ శుద్ధ చైతన్యస్థితే దైవం. అన్నిరకాల ఆలోచనలను, కోరికలను వదిలినపుడే దైవం అనుభవమౌతుంది. కోరికలు లేని స్థితే దైవం. కోరికల వెంట పడటమంటే ఎండమావులను వేటాడటం లాంటిదే. వేటాడేకొద్దీ నీ ఆత్మకు దూరమైపోతూ ఉంటావు. కోరికలు ఉండకూడదు అంటే నీ దగ్గర ఉన్నవన్నీవదిలేయటం కూడా కాదు. విషయాలతో కలవకుండా ఉండటం ముఖ్యం. కంటికి కనబడే ప్రపంచమంతా నీటిబుడగ లాంటిది. ఆత్మ ఒక్కటే సత్యం.



శరీరం–మనస్సు అశాశ్వతాలు కాబట్టే వాటితో కలిస్తే దుఃఖాన్నిస్తాయి. అందుకే చూసేవాడు నిత్యం ఉండాలి. సాక్షీచైతన్యంగా ఉండాలి.

చూస్తున్నవాడిని చూస్తూ ఉండాలి. ప్రతి పనిలోనూ ఆ చూసేవాడు లేకపోతే ఆ పనితో కలిసిపోతావు. ప్రపంచమంతా నీలోపలే ఉంది. నిన్ను నీవు తెలుసుకుంటే ఏదీ కోరుకోవు. కోరికలు లేనివాడే నిజమైన ధనవంతుడు. ఇవికావాలి, అవి కావాలి అని కోరుకోవడమే పేదరికం. లేదు అనుకునే వాడే కోరుకుంటాడు. నేను సేవచేస్తున్నాను అనే భావనకూడా అహంకారమే. ఈ అహం మాయమైనపుడే దేవుడు ఉంటాడు. నీవు సాక్షివైనప్పుడు చేసేవాడివి నీవెలా ఔతావు! నీవు ధ్యానపూర్వకంగా ఉండు. ఆత్మలో స్థిరపడి ఉండు. అప్పుడు జరగవలసింది జరుగుతూ ఉంటుంది. నీవు సాక్షిగా ఉండిపో. నీకు ఏమి కావాలో దైవమే చూసుకుంటుంది. ప్రతిక్షణాన్ని సంపూర్ణంగా ఆస్వాదించు. సంతృప్తిగా ఉండు. సంతృప్తితో ఉండడమే సన్యాసం. ఈ క్షణంలో జీవించు, అప్పుడు నీవే అత్యంత సంపన్నుడివి.



– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

సాక్షి సినిమా

నూటపదకొండో సినిమా షురూ


● బాలకృష్ణ

'వీరసింహారెడ్డి (2023)' వంటి సక్సెస్‌ఫుల్ సినిమా తర్వాత హీరో బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. బాలకృష్ణ కెరీర్‌లోని ఈ 111వ సినిమాను వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మించనున్నారు. ఈ నెల 10న బాలకృష్ణ బర్త్ డే సందర్భంగా ఆదివారం ఈ సినిమాను ప్రకటించారు. ''గోపీచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఆలోచన రేకెత్తించే హనీ


● కరుణ కుమార్, నవీన్ చంద్ర

''ఈ సినిమా ప్రేక్షకులకు ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడంతో పాటు నేటి సమాజపు తీరు తెన్నులపై ఆలోచనలు రేకెత్తిస్తుంది'' అని తన తాజా చిత్రం 'హనీ' గురించి దర్శకుడు కరుణ కుమార్ పేర్కొన్నారు. 'పలాసా', 'శ్రీదేవి సోడా సెంటర్', 'మట్కా' తర్వాత కరుణ కుమార్ దర్శకత్వంలో శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంటున్న సినిమా 'హనీ'. ''చిల్లింగ్ కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. దాదాపు ఎనభై శాతం టాకీ పూర్తయ్యింది. నటీనటుల ప్రతిభకు ఈ సబ్జెక్ట్ ఓ సవాల్'' అని చిత్రబృందం పేర్కొంది. శేఖర్ మాస్టర్, రవి పీట్ల నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో నవీన్ చంద్ర, దివ్యా పిళ్లై, దివి, రాజా రవీంద్ర ప్రధాన తారాగణం.

కొత్త పయనం


● సంగీర్తన, సుప్రజ్

సుప్రజ్, సంగీర్తనా విపిన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'పయనం'. చందు రామ్ దర్శకత్వంలో ఛాయా చిత్రాలు పతాకంపై స్వర్ణ కమల నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి సంగీత దర్శకుడు–నటుడు రఘు కుంచె కెమెరా స్విచ్చాన్ చేయగా, కొరియోగ్రాఫర్ రఘు క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా చందు రామ్ మాట్లాడుతూ– ''కొత్త కాన్సెప్ట్‌తో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం ఇది. ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో కనిపిస్తారు. ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసే అంశాలెన్నో ఉన్నాయి'' అన్నారు. ''నేటి తరం ప్రేక్షకులు మెచ్చే వైవిధ్యమైన చిత్రమిది'' అన్నారు స్వర్ణ కమల. రఘు కుంచె ఆమని, మైమ్ మధు, మెహబూబ్ భాషా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, కెమెరా: షోయబ్.

వీధిలోకొచ్చారు... థియేటర్‌కి వెళ్లారు... గోడ దూకారు!

ఒక హీరో తన సినిమా ప్రమోషన్ కోసం జనాల్లోకి వచ్చారు... ఇంకో హీరో విడుదలైన తన సినిమా ఎలా ఉందో తెలుసుకోవడానికి థియేటర్‌కి వెళ్లారు... మరో నటుడు షూటింగ్‌కి లేట్ అవుతుందని గోడ దూకేశారు... వీరు ఏం చేసినా సినిమా కోసమే. బాలీవుడ్ నటులు ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, అనుపమ్ ఖేర్ తాజాగా ఇలా హాట్ టాపిక్ అయ్యారు. ఇక ఆ విశేషాలు తెలుసుకుందాం.


● ఆమిర్ ఖాన్

వడ పావ్ చేస్తూ...

సినిమా ప్రమోషన్ కోసం ఏ అవతారం ఎత్తడానికైనా రెడీ అయిపోతారు ఆమిర్ ఖాన్. అందుకు ఓ ఉదాహరణ '3 ఇడియట్స్' (2009) సినిమా. ఈ చిత్రం విడుదల సమయంలో పంజాబ్‌లో జరిగిన పెళ్లి వేడుకలకు ఫారినర్‌లా డ్రెస్ చేసుకుని హాజరయ్యారు ఆమిర్. ఆ తర్వాత అసలు గెటప్‌లోకి మారి, అందర్నీ ఆశ్చర్యపరిచారు. తాజాగా తాను హీరోగా నటించిన 'సితారే జమీన్ పర్' ప్రచారం కోసం జనాల్లోకి వచ్చి, 'వడ పావ్' తయారు చేశారు ఆమిర్. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానుంది. ఆమిర్ ఖాన్ దర్శకత్వం వహించి, నటించిన 'తారే జమీన్ పర్' (2007)కి సీక్వెల్‌గా 'సితారే జమీన్ పర్' రూపొందింది. ఆర్ఎస్. ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ స్పోర్ట్స్ డ్రామా మూవీకి ఆమిర్ ఖాన్ ఓ నిర్మాత.


● అక్షయ్ కుమార్

రివ్యూ కోసం మాస్క్‌తో!

మామూలుగా సినిమా రిలీజ్ అయ్యాక ఎలా ఉందో తెలుసుకోవడానికి నిర్మాతలు, పంపిణీదారులు, సన్నిహితులను అడుగుతుంటారు స్టార్స్. అయితే 'హౌస్‌ఫుల్ 5' సినిమా ఎలా ఉందో స్వయంగా ప్రేక్షకులను అడిగి తెలుసుకోవాలనుకున్నారు ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్ చేసిన అక్షయ్ కుమార్. ముఖానికి మాస్క్ తొడుక్కుని ముంబైలోని ఓ థియేటర్‌కి వెళ్లి, మైక్ పట్టుకుని 'సినిమా ఎలా ఉంది' అని థియేటర్ నుంచి బయటికొస్తున్న ప్రేక్షకులను అడిగారు. ఆ వీడియో వైరల్‌గా మారింది. 'హౌస్‌ఫుల్' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందిన 'హౌస్‌ఫుల్ 5'లో సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్ ఇతర లీడ్ రోల్స్ చేశారు. తరుణ్ మన్సుఖానీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలైంది.


● అనుపమ్ ఖేర్

ఏడు పదుల వయసులో గోడ దూకి...

షూటింగ్‌కి ఆలస్యం అవుతోంది... డ్రైవర్‌ని కారు వేగం పెంచమన్నారు అనుపమ్ ఖేర్. కట్ చేస్తే... షూటింగ్ లొకేషన్‌కి చేరుకోలేదు. ఎందుకంటే కారు డెడ్ ఎండ్‌కి చేరుకుంది. రివర్స్ చేసుకుని, వెనక్కి వెళదామంటే వీలు పడలేదట. ఓ గోడ దూకితే అటు పక్క లొకేషన్ ఉంది. సాహసం చేసేద్దాం అని అనుపమ్, ఆయన టీమ్ నిర్ణయించుకున్నారు. నిచ్చెన తెచ్చారు. అనుపమ్ ఖేర్ ఆ నిచ్చెన ఎక్కి, గోడ దూకి లొకేషన్లోకి అడుగుపెట్టారు. ఇంతకీ ఈయన వయసు ఎంతో తెలుసా? 70. ఏడు పదుల వయసులో అనుపమ్ ఖేర్ ఇలా జోష్‌గా, జోరుగా గోడ దూకడం హాట్ టాపిక్ అయింది. ఆయన ఏ షూటింగ్‌లో పాల్గొనడానికి హైదరాబాద్ చేరుకున్నారంటే ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) కోసం. ఈ చిత్రంలో ఈ బాలీవుడ్ నటుడు కీలక పాత్ర చేస్తున్నారు. ఇక తాను ఇలా గోడ దూకిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వివరించి, ఆ వీడియోను షేర్ చేశారు అనుపమ్ ఖేర్. ''నా 40 ఏళ్ల సినిమా ప్రయాణంలో పలు రకాలుగా షూటింగ్ లొకేషన్స్‌కి వెళ్లాను. కానీ, ఇలా వెళ్లడం చాలా ప్రత్యేకంగా, కామెడీగా అనిపించింది'' అని రాసుకొచ్చారీ సీనియర్ నటుడు.








అక్కినేని అఖిల్ – జైనబ్ రవ్జీల వివాహ వేడుక ఈ నెల 6న కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య హైదరాబాద్‌లోని నాగార్జున స్వగృహంలో జరిగిన విషయం తెలిసిందే. ఆదివారం రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ సెవన్ ఏకర్స్‌లో జరిగిన ఈ వేడుకకు హీరోలు మహేశ్‌బాబు, రామ్‌చరణ్, నాని, 'అల్లరి' నరేశ్, నిఖిల్, దర్శకుడు సుకుమార్, నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు తదితరులు సతీసమేతంగా, హీరోలు సూర్య, సుదీప్, సుధీర్‌బాబు, అడవి శేష్, యశ్, నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నా దత్, బీవీఎస్ఎన్ ప్రసాద్, కేయల్ నారాయణ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా సునీల్ నారంగ్ రాజీనామా



తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా అధికారిక ప్రకటన వెలువడిన 24 గంటల్లోపే ఆ పదవికి రాజీనామా చేశారు సునీల్ నారంగ్. తాను రాజీనామా చేస్తున్నట్లుగా ఆదివారం టీఎఫ్‌సీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఓ లేఖ రాశారు సునీల్ నారంగ్. ''టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యాను. కానీ ఆ పదవి నుంచి తప్పుకుంటున్నట్లుగా తెలియజేస్తున్నందుకు చింతిస్తున్నాను. నా ప్రమేయం లేకుండా, నన్ను సంప్రదించకుండానే ఇండస్ట్రీలోని వారి చేత బహిరంగ ప్రకటనల్లో నా పేరు వినియోగించబడింది. నా అనుమతి లేకుండా నా పేరుతో చేసిన వ్యాఖ్యలకు నేను బాధ్యత వహించలేను. అందుకే రాజీనామా చేస్తున్నాను. ఆ లేఖను నా రాజీనామాగా స్వీకరించి, అధ్యక్ష పదవికి తగిన వారిని నియమించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా చాంబర్‌ను కోరుతున్నాను'' అని సునీల్ నారంగ్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఇక తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ బాడీ మీటింగ్‌లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించి, కొత్త కార్యవర్గాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.



అంగరంగ వైభవంగా రింకూ సింగ్, ఎంపీ ప్రియా సరోజ్ నిశ్చితార్థ వేడుక

లక్నో: భారత క్రికెటర్ రింకూ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ పార్లమెంట్ సభ్యురాలు (ఎంపీ) ప్రియా సరోజ్ ఏడడుగులు కలిసి నడిచేందుకు ఉంగరాలు మార్చుకున్నారు. దీనికి సంబంధించిన నిశ్చితార్థ వేడుక ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. రాజకీయ ప్రముఖులు హాజరై కాబోయే వధువరుల్ని ఆశీర్వదించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ తన సతీమణి, ఎంపీ డింపుల్ యాదవ్‌తో కలిసి వేడుకకు హాజరయ్యారు. పేసర్ భువనేశ్వర్, రిటైర్డ్ క్రికెటర్లు ప్రవీణ్ కుమార్, పీయూశ్ చావ్లా, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ఎంపీ జయాబచ్చన్ సహా పలువురు సమాజ్‌వాదీ పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహించడం ద్వారా వెలుగులోకి వచ్చిన రింకూ టీమిండియా తరఫున 33 టి20లు, 2 వన్డేలు ఆడాడు. కాబోయే వధువు ప్రియా తొలిసారిగా పార్లమెంట్ సభ్యురాలిగా గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో మచిలీషహర్ నుంచి గెలిచింది.

భారత్ ఖాతాలో ఆరు స్వర్ణాలు


అన్ను రాణి

తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో చివరిరోజు భారత అథెట్లు ఏకంగా అరడజను స్వర్ణ పతకాలతో మెరిశారు. మహిళల జావెలిన్ త్రోలో ఒలింపియన్ అన్ను రాణి... మహిళల 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో విత్యా రామ్‌రాజ్... మహిళల 800 మీటర్ల విభాగంలో పూజ... పురుషుల 800 మీటర్ల విభాగంలో కృషన్ కుమార్... పురుషుల జావెలిన్ త్రోలో రోహిత్ యాదవ్ పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల 4–400 మీటర్ల రిలేలో సంతోష్, విశాల్, మనూ, ధరమ్‌వీర్‌లతో కూడిన భారత బృందం (3ని:05.58 సెకన్లు) బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అన్ను రాణి జావెలిన్‌ను 56.82 మీటర్ల దూరం... రోహిత్ యాదవ్ 74.42 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచారు. విత్యా 400 మీటర్ల దూరాన్ని 56.53 సెకన్లలో పూర్తి చేసింది. పూజ 800 మీటర్లను 2ని:02.79 సెకన్లలో... కృషన్ కుమార్ 800 మీటర్ల దూరాన్ని 1ని:48.46 సెకన్లలో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో యశస్ పలాక్ష (42.22 సెకన్లు) రజత పతకాన్ని గెల్చుకున్నాడు. మహిళల లాంగ్ జంప్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణులు శైలీ సింగ్ (6.41 మీటర్లు) రజతం, అన్సీ సోజన్ (6.39 మీటర్లు) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు.

రాణించిన అభిమన్యు, రాహుల్

- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' 163/4
- రెండో అనధికారిక టెస్టు


రాహుల్

నార్తంప్టన్: ఓపెనర్ కేఎల్ రాహుల్ తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో కదంతొక్కగా... రెండో ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో భారత్ 'ఎ' భారీ ఆధిక్యంపై కన్నేసింది. ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (80; 10 ఫోర్లు), రాహుల్ (51; 9 ఫోర్లు) రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (5), మిడిలార్డర్‌లో కరుణ్ నాయర్ (15; 3 ఫోర్లు) విఫలమయ్యారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ధ్రువ్ జురేల్ (6 బ్యాటింగ్), నితీశ్ రెడ్డి (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. క్రిస్ వోక్స్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని భారత్ ప్రస్తుతం 184 పరుగులు ఆధిక్యంలో ఉంది. చేతిలో ఇంకా 6 వికెట్లున్నాయి.

భారత్‌కు స్వల్ప ఆధిక్యం

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 192/3తో మూడో రోజు ఆదివారం ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ లయన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 327 పరుగుల వద్ద ఆలౌటైంది. భారత్‌కు 21 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. క్రితంరోజు బ్యాటర్లలో జోర్డాన్ కాక్స్ (45; 7 ఫోర్లు) మెరుగ్గా ఆడగా, కెప్టెన్ జేమ్స్ ర్యూ (10) విఫలమయ్యాడు. భారత బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 4 వికెట్లు దక్కాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అల్‌కరాజ్ అదరహో

ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నిలబెట్టుకున్న స్పెయిన్ స్టార్

ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సినెర్‌పై అద్భుత విజయం

- రూ. 24 కోట్ల 91 లక్షల ప్రైజ్‌మనీ సొంతం
- 5 గంటల 29 నిమిషాల తుది పోరులో డిఫెండింగ్ చాంపియన్‌దే పైచేయి


సినెర్

పారిస్: ఊహకందని మలుపులతో సాగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) పైచేయి సాధించాడు. వరుసగా రెండో ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచాడు. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ)తో ఆదివారం జరిగిన టైటిల్ పోరులో ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ అల్‌కరాజ్ 4–6, 6–7 (4/7), 6–4, 7–6 (7/3), 7–6 (10/2)తో చిరస్మరణీయ విజయం సాధించాడు. 5 గంటల 29 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో అల్‌కరాజ్ తొలి రెండు సెట్‌లను చేజార్చుకున్నా... ఆందోళన చెందకుండా ఆడి తర్వాతి మూడు సెట్‌లలో నెగ్గి విజేతగా నిలిచాడు. నాలుగో సెట్‌లో అల్‌కరాజ్ ఏకంగా మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకోవడం విశేషం. ఈ గెలుపుతో అల్‌కరాజ్ తన కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. చాంపియన్‌గా నిలిచిన అల్‌కరాజ్‌కు 25 లక్షల 50 వేల యూరోలు (రూ. 24 కోట్ల 91 లక్షలు), రన్నరప్ సినెర్‌కు 12 లక్షల 75 వేల యూరోలు (రూ. 12 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. అల్‌కరాజ్ ఆడిన ఐదు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లోనూ విజయాన్ని అందుకోవడం విశేషం. ఇప్పటి వరకు అల్‌కరాజ్ 2025, 2024 ఫ్రెంచ్ ఓపెన్... 2023, 2024 వింబుల్డన్... 2022 యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో టైటిల్స్ సాధించాడు.

కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ ఆడిన సినెర్ తొలి రెండు సెట్‌లను సొంతం చేసుకొని టైటిల్ దిశగా సాగిపోయాడు. అయితే అల్‌కరాజ్ పట్టువీడలేదు. మూడో సెట్ నుంచి అనూహ్యంగా పుంజుకున్నాడు. మూడో సెట్‌లోని నాలుగో గేమ్‌లో, పదో గేమ్‌లో సినెర్ సర్వీస్‌లను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ సెట్‌ను 6–4తో నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. హోరాహోరీగా సాగిన నాలుగో సెట్‌లో అల్‌కరాజ్ టైబ్రేక్‌లో పైచేయి సాధించాడు. నిర్ణాయక ఐదో సెట్‌లో ఒకదశలో అల్‌కరాజ్ 5–4తో గెలుపు అంచులో నిలిచాడు. అయితే సినెర్ పదో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి స్కోరును 5–5తో సమం చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో స్కోరు 6–6తో సమమైంది. దాంతో చివరి సెట్‌లోనూ టైబ్రేక్ అనివార్యమైంది. ముందుగా 10 పాయింట్లు సాధించిన అల్‌కరాజ్ సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		సినెర్
7	ఏస్‌లు	8
7	డబుల్ ఫాల్ట్‌లు	0
7/14	బ్రేక్ పాయింట్లు	7/15
70	విన్నర్స్	53
73	అనవసర తప్పిదాలు	64
22/33	నెట్ పాయింట్లు	30/45
192	మొత్తం పాయింట్లు	193


అల్‌కరాజ్

భవిత
స్పర్థయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఎఫ్‌యూలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ (ఏపీఎఫ్‌యూ)లో.. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డిప్లొమా ఇన్ ఫిషరీస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. బోధనా మాధ్యమం: ఇంగ్లిష్.
» **అర్హత:** పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **వయసు:** 31.08.2025 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయసు 22 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.06.2025
» **వెబ్‌సైట్:** https://apfu.ap.gov.in

హెచ్‌ఎస్‌ఎల్ విశాఖపట్నంలో 26 మేనేజర్ పోస్టులు

విశాఖపట్నంలోని హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్‌ఎస్‌ఎల్).. వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26.
» **పోస్టుల వివరాలు:** అడిషనల్ జనరల్ మేనేజర్ -01, డిప్యూటీ జనరల్ మేనేజర్-01, సీనియర్ మేనేజర్-01, మేనేజర్-22, డిప్యూటీ మేనేజర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, పీజీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు ఐసీఏఐలో సభ్యులై ఉండాలి.
» **వయసు:** అడిషనల్ జనరల్ మేనేజర్‌కు 48 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.45 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు అడిషనల్ జనరల్ మేనేజర్‌కు రూ.90,000 నుంచి రూ.2,40,000, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, సీనియర్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.07.2025
» **వెబ్‌సైట్:** https://hslvizag.in

పీజీఐసీహెచ్, నోయిడాలో నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నోయిడాలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్(పీజీఐసీహెచ్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** గైనకాలజిస్ట్–01, జనరల్ సర్జన్–01, డెర్మటాలజిస్ట్–01, జనరల్ ఫిజిషియన్–01, సైకియాట్రిస్ట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ట వయో పరిమితి:** 42 ఏళ్లు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ అండ్ చైల్డ్ హెల్త్, సెక్టార్–30, నోయిడా–201303,గౌతమ బుద్ధ నగర్, ఉత్తర్‌ప్రదేశ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.07.2025.
» **వెబ్‌సైట్:** https://www.pgich.edu.in

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో చెఫ్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఒప్పంద ప్రాతిపదికన చెఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీహెచ్ఎం–సీటీ, బీహెచ్ఎం(బీఎస్సీ) కలినరీ ఆర్ట్స్/బీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.**వయసు:**50ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.75,000 నుంచి 1,00,000
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.06.2025
» **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in

సైన్స్‌లో బోధన, పరిశోధనలకు మార్గం


సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ 2025

» సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ జూన్ 2025 నోటిఫికేషన్ విడుదల
» జేఆర్ఎఫ్, పీహెచ్‌డీతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుకు మార్గం
» కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఎంపిక ప్రక్రియ
» జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.37వేల స్టైపెండ్

సైన్స్‌లో బోధన, పరిశోధనలకు అవకాశం కల్పించే సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ జూన్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్షను నిర్వహించనుంది. ఈ ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ చూపితే పరిశోధనలకు వీలు కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) పొందొచ్చు. అంతేకాకుండా పీహెచ్‌డీ అడ్మిషన్‌తో పాటు కళాశాల స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరేందుకు అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ 2025తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

సీఎస్ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్)–యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) పరీక్షను ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ద్వారా జేఆర్ఎఫ్‌కు ఎంపికతోపాటు పీహెచ్‌డీలో ప్రవేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకానికి అర్హులను ఎంపిక చేస్తారు.

ఐదు విభాగాల్లో పరీక్ష

మొత్తం ఐదు విభాగాల్లో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షను నిర్వహించనున్నారు. అవి.. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్;లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.

అర్హతలు

ఆయా విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్) తదితర రిజర్వేషన్ వర్గాలకు చెందిన అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.

వయసు

01.07.2025 నాటికి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు 30 ఏళ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్) తదితర రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

మూడు కేటగిరీలుగా ఎంపిక

- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో మూడు కేటగిరీలుగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.
- కేటగిరీ 1– 'అవార్డ్ ఆఫ్ జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం'; కేటగిరీ 2–'అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశం'; కేటగిరీ 3– 'పీహెచ్‌డీలో ప్రవేశం'. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు తమ కేటగిరీని పేర్కొనాల్సి ఉంటుంది.
- కేటగిరీ 1లో అర్హత సాధించిన వారికి.. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు అర్హత లభిస్తుంది. అదేవిధంగా కేటగిరీ 2లో అర్హత సాధించిన వారికి అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశానికి అవకాశం ఉంటుంది. అలాగే కేటగిరీ 3లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు మాత్రమే వీలుంటుంది.

200 మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష

- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షను మొత్తం 200 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)విధానంలో నిర్వహిస్తారు.
- ఈ పరీక్షలో ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్ ఉంటాయి. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో(బైలింగ్వల్) ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ఈ పరీక్ష ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు.. పార్ట్ ఏ, పార్ట్ బీ, పార్ట్ సీ ఉంటాయి.
- పార్ట్ ఏలో.. జనరల్ ఆప్టిట్యూడ్ విభాగం అందరికీ కామన్‌గా ఉంటుంది. ఇందులో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్ ఏలో అడిగే 20 ప్రశ్నల్లో 15 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ఇందులో ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు కేటాయిస్తారు. అదేవిధంగా ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.
- పార్ట్ బీలో..సంబంధిత సబ్జెక్టుపై ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఇవి సాధారణంగా ఇచ్చిన సిలబస్ నుంచే ఉంటాయి.
- పార్ట్ సీలో.. సబ్జెక్టు సంబంధిత ఉన్నత స్థాయి ప్రశ్నలు అడుగుతారు. ఇవి సదరు సబ్జెక్టులో అభ్యర్థికున్న లోతైన నైపుణ్యాన్ని పరిశీలించేలా ఉంటాయి. అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యంతోపాటు అప్లికేషన్ ఓరియెంటేషన్‌ను సైతం పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు.

సబ్జెక్టు ప్రశ్నలు ఇలా

- కెమికల్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 40 ప్రశ్నలుంటే.. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 60 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఇలా కెమికల్ సైన్సెస్‌లో మొత్తం 120 ప్రశ్నల్లో 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది.
- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 50 ప్రశ్నలుంటే.. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 80 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి 1.32 మార్కులు తగ్గిస్తారు. ఇలా ఈ విభాగంలో మొత్తం 150 ప్రశ్నల్లో 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది.
- లైఫ్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 50 ప్రశ్నలుంటే.. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 75 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఇలా లైఫ్ సైన్సెస్‌లో మొత్తం 120 ప్రశ్నల్లో 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది.
- మ్యాథమెటికల్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 40 ప్రశ్నలుంటే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి మూడు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి 0.75 మార్కులు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 60 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4.75 మార్కులు కేటాయిస్తారు. పార్ట్‌సీలో నెగిటివ్ మార్కులు లేవు. ఇలా మ్యాథమెటికల్ సైన్సెస్‌లో మొత్తం 120 ప్రశ్నల్లో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది.
- ఫిజికల్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 25 ప్రశ్నలుంటే.. ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి 3.5 మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి 0.875 మార్కులు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 30 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 5 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి 1.25 మార్కులు తగ్గిస్తారు. ఇలా ఫిజికల్ సైన్సెస్‌లో మొత్తం 75 ప్రశ్నల్లో 55 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది.

ఎంపిక ఎలా

జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ అడ్మిషన్‌లకు సంబంధించి ఎంతమంది అభ్యర్థులను ఎంపిక చేయాలో ఫలితాల కమిటీ నిర్ణయిస్తుంది. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ఫలితాలను నార్మలైజ్డ్ మార్కులతోపాటు పర్సంటైల్ విధానంలో ప్రకటిస్తారు. పరీక్షను ఒకటి కంటే ఎక్కువ షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో.. నార్మలైజేషన్‌ను ప్రక్రియను అనుసరిస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి పీహెచ్‌డీలో ప్రవేశం కల్పిస్తారు. ఇందులో నెట్ మార్కులకు 70 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది. పీహెచ్‌డీలో ప్రవేశానికి సంబంధించి నెట్ స్కోర్‌కు ఒక ఏడాది పాటు వ్యాలిడిటీ ఉంటుంది.

నెలకు రూ.37వేల జేఆర్ఎఫ్

జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37వేల స్టైపెండ్ లభిస్తుంది. దీంతోపాటు ఏడాదికి రూ.20వేల అత్యవసర గ్రాంట్‌ను కూడా అందజేస్తారు. జేఆర్ఎఫ్ అభ్యర్థి పరిశోధన తీరును ముగ్గురు సభ్యుల కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది. రెండేళ్ల జేఆర్ఎఫ్ అనంతరం అభ్యర్థి పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే.. ఎస్ఆర్ఎఫ్(సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్)కు ఎంపిక చేస్తారు. ఎస్ఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి మూడో ఏడాది నుంచి ప్రతి నెలా రూ.42వేలు చెల్లిస్తారు. అదేవిధంగా సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆయా యూనివర్సిటీలు విడుదల చేసే నోటిఫికేషన్‌ను అనుసరించి పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత పొందిన వారు యూజీసీ నిబంధనలకు అనుగుణంగా కాలేజీలు, యూనివర్సిటీల్లో బోధన పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 23.06.2025
- సీబీటీ పరీక్ష తేదీలు: 2025 జూలై 26, 27, 28
- వెబ్‌సైట్: www.nta.ac.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–మ్యాథ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	747	82,189
నిఫ్టీ ▲	252	25,003

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,530	▲	232
డోజోన్స్	42,763	▲	443
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,838	▲	27
డాక్స్	24,304	▼	19
షాంఘై	3,385	▲	1
నికాయ్	37,742	▲	187

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.79	87.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.43	118.35
€	యూరో	ఎస్‌బీఐ	95.38	99.86
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	48.10	70.11
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.22	58.06
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.09	68.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.94	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.42	24.20
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.03	12.86

చదువు కొంటున్నారా?

నాణ్యమైన విద్య.. అందని ద్రాక్ష కాదు..!

ఏటేటా భారీగా పెరిగిపోతున్న ఫీజులు	పాఠశాల విద్యకే రూ.లక్షలాది ఖర్చు	విదేశీ విద్యకు భారీగా వెచ్చించాల్సిందే	ముందస్తు ప్రణాళికతో సాధించడం సులభమే







పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి ఏదైనా ఉందంటే అది చదువు–సంస్కారం. అందుకే తల్లిదండ్రులు ఖర్చుకు వెనుకాడకుండా పిల్లలను మంచి పాఠశాలల్లో చేర్పించేందుకు తమ వంతు ప్రయత్నిస్తుంటారు. కానీ, నాణ్యమైన విద్య నేడు అందరికీ అందుబాటులో లేదు. పాఠశాల స్థాయి నుంచే పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎల్‌కేజీ, యూకేజీలకు రూ.లక్షల ఫీజులు తీసుకుంటున్న పాఠశాలలు చాలానే ఉన్నాయి. ఉన్నత విద్యకు ఇంకా అధిక మొత్తమే వెచ్చించాల్సి వస్తోంది. నాణ్యమైన చదువుల కోసమని ఈ స్థాయి ఖర్చును భరించడం మధ్యతరగతి వారికి ముందస్తు ప్రణాళికతోనే సాధ్యం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

గడిచిన దశాబ్ద కాలంలో స్కూలు ఫీజులు 150–200 శాతం వరకు పెరిగాయి. ఈ ఏడాది హైదరాబాద్, బెంగళూరులో పేరున్న పాఠశాలలు 30 శాతం వరకు ఫీజులను పెంచేశాయి. సాధారణ ద్రవ్యోల్బణం 6 శాతమే. కానీ విద్యా ద్రవ్యోల్బణం 11–12 శాతం వరకు ఉంటోంది. అంటే ఫీజులు ఏటా ఈ స్థాయిలో, ఇంతకుమించి పెరుగుతున్నాయి. దీనికి అదనంగా ట్యూషన్లు, క్రీడల్లో కోచింగ్, సంగీతం/కళలు, పుస్తకాలు, బస్సు రవాణా రూపంలో అదనంగా ఖర్చు చేయాల్సిందే. ఐఐటీల్లోనూ నాలుగేళ్ల కోసం రూ.12 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పాఠశాల చదువు తర్వాత ఐఐటీలు, ఐఐఎంలు, నిట్, బిట్ తదితర ప్రఖ్యాత సంస్థల్లో సీటు రాకపోతే.. ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపేందుకు ఇటీవలి కాలంలో చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఇందుకు పెద్ద మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తుంది. పైగా ఈ ఫీజులు ఏటేటా పెరుగుతూ పోతున్నాయి. పాఠశాల స్థాయిలో చేసే ఖర్చుకు అదనంగా.. మరోవైపు వారి ఉన్నత విద్య కోసం కావాల్సినంత సమకూర్చుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ఇందుకు ముందస్తు వ్యూహం, ప్రణాళిక తప్పకుండా అవసరం.

ప్రణాళిక..

విద్యా వ్యయాలను భరించాలంటే అది ముందస్తు ప్రణాళికతోనే సాధ్యమని సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ హర్ష్‌వర్ధన్ రుంగ్టా పేర్కొన్నారు. విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్స్ (ఫీజులు, ఆహారం, వసతి ఇతర ఖర్చులు) కోసం ప్రస్తుతం 1,00,000 డాలర్లు (సుమారు రూ.86 లక్షలు) అవుతున్నట్టు చెప్పారు. దేశాలను బట్టి ఈ వ్యయాలు మారిపోతాయన్నారు. సింగపూర్‌తో పోల్చి చూసినప్పుడు యూఎస్, కెనడాలో అధిక చార్జీలు ఉన్నట్టు తెలిపారు. పిల్లల వయసు ఏడాది, ఆలోపు ఉన్నప్పుడే పెట్టుబడుల ప్రణాళిక ఆరంభించాలని సూచించారు. ప్రైవేటు విద్యా వ్యయాలు పెరిగిపోతున్న తీరు ఆర్థిక సవాళ్లను విసురుతున్నట్టు టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ సీఈవో శైదీప్ కేవల్‌రమణి పేర్కొన్నారు. ''గత పదేళ్లలో స్కూల్ ఫీజులు 150 శాతానికి పైనే పెరగ్గా, కొన్ని యూనివర్సిటీల్లోనూ 200 శాతం మేర ఫీజులు పెరిగాయి. నాణ్యమైన విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను ఈ ఫీజులు సూచిస్తున్నాయి'' అని వివరించారు. పిల్లలు ప్రీ స్కూల్ దశకు రాక ముందే ప్రణాళిక మొదలు పెట్టాలని సూచించారు. ముందస్తుగా ఆరంభిస్తే కాంపౌండింగ్‌తో పెట్టుబడి మెరుగైన వృద్ధిని చూస్తుంది.

కాల వ్యవధి..

పిల్లల వయసు ప్రస్తుతం ఎంత? పాఠశాల విద్య, ఉన్నత విద్య కోసం ఎంత సమకూర్చుకోవాలన్న విషయాలపై స్పష్టత అవసరం. చిన్నారి వయసు మూడేళ్లు ఉందనుకుందాం. ఇక్కడి నుంచి కాలేజీ చదువులకు ఇంకా 15 ఏళ్లు మిగిలి ఉంటుంది. ఉన్నత విద్య కోసం కావాల్సినంత సమకూర్చుకునేందుకు 15 ఏళ్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించుకోవాలి. అదే సమయంలో ఇక్కడి నుంచి ప్లస్2 వరకు (ఇంటర్) అయ్యే ఖర్చులకూ సన్నద్ధత, ప్రణాళిక వేరుగా ఉండాలి. స్కూల్ ఫీజులే కాకుండా, వారికి ఇతర విభాగాల్లో తర్ఫీదు ఇప్పించాలనుకుంటే అందుకు అయ్యే వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఖర్చుకు సన్నద్ధత

విద్యా ద్రవ్యోల్బణం 11–12 శాతం చొప్పున ఉంటోంది. కనీసం 10 శాతాన్ని అంచనా కింద తీసుకుని చూసినా.. ఐఐటీల్లో బీటెక్ కోసం నాలుగేళ్లకు నేడు రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంటే.. 15 ఏళ్ల తర్వాత ఇది రూ.30 లక్షలకు చేరుతుంది. ఇంకాస్త అదనంగా పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇప్పటి వరకు మీకున్న పొదుపు పెట్టుబడులను ఒకసారి పరిశీలించండి. అవి కాకుండా, అదనంగా ఎంత సమకూర్చుకోవాలో స్పష్టతకు రావాలి. పిల్లల విద్యకు ఇప్పటి నుంచి ఎన్నేళ్లకు, ఎంత మొత్తం కావాలన్న అంచనాకు వచ్చిన తర్వాత.. ఆ మొత్తం సమకూర్చుకునేందుకు పెట్టుబడుల ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి. పెట్టుబడులకు కావాల్సినంత మిగులు లేకపోతే.. అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించాలి.

సరైన సాధనాలు..



ఇక్కడి నుంచి ఐదేళ్లు, పదేళ్లు, పదిహేనేళ్లు, పద్దెనిమిదేళ్ల కాలంలో ఎంత మొత్తం కావాలన్న అంచనాకు అనుగుణంగా పెట్టుబడులు మొదలు పెట్టాలి. అంత మొత్తం సమకూర్చేందుకు వైవిధ్యమైన పెట్టుబడుల సాధనాలను ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా పెట్టుబడిపై రాబడి ద్రవ్యోల్బణాన్ని మించేలా చూసుకున్నప్పుడే అసలు లక్ష్యం నెరవేరుతుంది. ఇందుకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మెరుగైనవి. 10 ఏళ్లు అంతకుమించిన కాలాల్లో ఇవి 12–15 శాతం స్థాయిలో వార్షిక రాబడులను ఇవ్వగలవు. అదే సమయంలో పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీలకు కేటాయించకూడదు. దీని వల్ల ఆటుపోట్ల రిస్క్ పెరుగుతుంది. డెట్ సాధనాలకూ నిర్ణీత శాతాన్ని కేటాయించుకోవాలి. ఈక్విటీ, డెట్ కలయికతో కూడిన హైబ్రిడ్ ఫండ్స్, మల్టీ అస్సెట్ ఫండ్స్‌ను ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీ అసెట్ ఫండ్ ఈక్విటీ, డెట్‌తోపాటు రియల్ ఎస్టేట్, బంగారం, వెండి తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. ఈ పథకం గత పదేళ్లలో ఏటా 13 శాతానికి పైనే రాబడిని ఇవ్వడం గమనార్హం. కాల వ్యవధి కనీసం 7–10 ఏళ్లు అంతకుమించి ఉంటేనే ఈక్విటీలకు కేటాయింపులు చేసుకోవాలి. లేదంటే డెట్ సాధనాలు అనుకూలం. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన (కుమార్తెలు ఉన్న వారు) వంటి పన్ను రహిత సాధనాలను ఎంపిక చేసుకోవచ్చు. ఫైనాన్షియల్ అడ్వైజర్ సూచనల మేరకు ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసిన తర్వాతే మిగులు నుంచే ఖర్చులకు వెళ్లాలి. తద్వారా లక్ష్య సాధన తేలిక అవుతుంది.

రక్షణ కవచాలు

అనుకోని, ఊహించని ఘటనలు చోటు చేసుకుంటే పిల్లల విద్యా లక్ష్యాలు దెబ్బతినకుండా రక్షణ కల్పించుకోవడం అవసరం. కనుక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి.. 10–20 ఏళ్లపాటు కుటుంబం జీవన అవసరాలు, పిల్లల విద్యా వ్యయాలు, వారి వివాహం ఖర్చులు, రుణాలు ఏవైనా ఉంటే అంత మేర సమ్ అష్యూర్డ్‌తో జీవిత బీమా తీసుకోవాలి. ఇందుకు అచ్చమైన టర్మ్ ఇన్సూరెన్స్‌తోపాటు.. యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను పరిశీలించొచ్చు.



సమీక్ష అవసరం..



ప్రణాళిక మేరకు ఇన్వెస్ట్ చేయడమే కాకుండా.. అవి అనుకున్న విధంగానే రాబడులను ఇస్తున్నాయా? అన్నది ఏడాదికోసారి నిపుణుల సాయంతో సమీక్షించుకోవాలి. తక్కువ రాబడి ఇస్తుంటే ఇతర సాధనాల్లోకి మారిపోవడం లేదంటే.. పెట్టుబడిని పెంచుకోవడం చేయాలి. అలాగే, అంచనాలకు మించి విద్యా వ్యయాలు పెరుగుతున్నా కూడా పెట్టుబడులను సమీక్షించుకోవాల్సిందే. కనుక పెరిగే సంపాదనకు అనుగుణంగా ఏటా పెట్టుబడుల మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లాలి.

ప్రత్యామ్నాయాలు..



పెట్టుబడులు అనుకున్న మేర రాబడులను ఇవ్వక పోవచ్చు. లేదంటే అంచనాలకు మించి ఫీజులు పెరిగి పోవచ్చు. మొత్తం మీద నిర్ణీత కాలానికి కావాల్సినంత సమకూరకపోతే అప్పుడు ఉన్నత విద్య కోసం విద్యా రుణాలను ఆశ్రయించడం ఒక మార్గం. కోర్సు పూర్తయిన అనంతరం లేదా ఉద్యోగంలో చేరిన అనంతరం చెల్లింపులు మొదలయ్యే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఆదాయపన్ను పాత విధానంలో విద్యా రుణాలపై చేసే వడ్డీ చెల్లింపుల మొత్తానికీ పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంది.

స్కాలర్‌షిప్‌లు



భారంగా మారిన విద్యా వ్యయాలను గట్టెక్కేందుకు స్కాలర్‌షిప్‌లు కూడా ఒక మార్గం. పేరొందిన సంస్థలు ఏటా నిర్ణీత సంఖ్యలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆఫర్ చేస్తుంటాయి. వీటిని సాధించేందుకు ప్రయత్నించాలి.

నిపుణుల సాయం



పిల్లల విద్యా వ్యయాలు, ద్రవ్యోల్బణం ప్రభావం, పెట్టుబడి సాధనాల ఎంపిక అన్నవి చాలా సంక్లిష్టమైనవి. ఈ విషయంలో నిపుణుల సాయం తీసుకోవడం వల్ల అనవసర ఆందోళన, గందరగోళాన్ని నివారించొచ్చు. అంతే కాదు, మెరుగైన సాధనాల ఎంపిక సాధ్యపడుతుంది. కొంత ఫీజుకు వెనుకాడకుండా వారి సాయాన్ని తీసుకోవడం మర్చిపోవద్దు. దీనివల్ల ఎంతో ముఖ్యమైన విద్యా లక్ష్యాలను సాఫీగా అధిగమించొచ్చు.

'నా చిన్నారిని ఖరీదైన ప్రైవేటు స్కూల్‌కు పంపించను'



ఫీజుల పెంపు చేయి దాటిపోతోంది. కొన్ని హైదరాబాదీ స్కూల్స్ ఈ ఏడాది 30% వరకు ఫీజులు పెంచేశాయి!

- వార్షిక సగటు ఫీజులు ఇప్పుడు రూ. 60,000–2,00,000 మధ్య ఉన్నాయి.
- ఏడాది ఫీజు అంతా ముందే చెల్లించాలని కొన్ని స్కూల్స్ డిమాండ్ చేస్తున్నాయి.
- ఒక స్కూల్ ఎల్‌కేజీకి రూ.4 లక్షలు చార్జ్ చేస్తోంది.
- విద్యా ద్రవ్యోల్బణం 12 శాతం చొప్పున పెరుగుతోంది.

ఈ ధరలతో మనం పిల్లలను స్కూల్‌కు పంపేందుకు సన్నద్ధం చేస్తున్నామా.. లేక తల్లిదండ్రులను దివాలా బాట పట్టిస్తున్నామా?

ప్రైవేటు స్కూల్స్ నేడు విద్యా సంస్థల కంటే కూడా స్టార్టప్‌ల మాదిరిగా కనిపిస్తున్నాయి''

–ఫైనాన్షియల్ అడ్వైజర్, మాజీ వెల్త్ మేనేజర్ (ఐఐఎఫ్‌ఎల్) నేహ నగర్ లింక్డ్‌ఇన్‌లో చేసిన పోస్ట్ ఇది.

న్యూ ఫండ్ ఆఫర్

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్‌ఈ 1000 ఇండెక్స్ ఫండ్



బీఎస్‌ఈలో నమోదైన టాప్–1000 కంపెనీల్లో పెట్టుబడులకు అవకాశం కల్పించే లక్ష్యంతో మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ సంస్థ.. బీఎస్‌ఈ 1000 ఇండెక్స్ ఫండ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రారంభించింది. ఈ నెల 19 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.500. అభిరూప్ ముఖర్జీ ఈ పథకానికి మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. మార్కెట్ విలువ పరంగా టాప్100 లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, తదుపరి మార్కెట్ విలువ పరంగా 150 మిడ్‌క్యాప్ కంపెనీలలో, ఆ తదుపరి 400 స్మాల్‌క్యాప్ కంపెనీల్లో, వీటి తర్వాత మార్కెట్ విలువ పరంగా 350 టాప్ మైక్రోక్యాప్ కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. టాప్250 కంపెనీలు మినహా మిగిలిన 750 కంపెనీలు స్మాల్, మైక్రోక్యాప్ కనుక అస్థిరతల రిస్క్ ఎక్కువగా ఉంటుందని ఇన్వెస్టర్లు గమనించాలి.

ఎమ్‌కే ఇన్వెస్ట్‌మెంట్ నుంచి ఎస్‌ఎంఐడీ క్యాప్ ఫండ్



న్యూఢిల్లీ: ఎమ్‌కే ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ సంస్థ తాజాగా ఎస్‌ఐఎండీ క్యాప్ గ్రోత్ ఇంజిన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. 2025–26లో రూ. 500–1,000 కోట్ల ఏయూఎం (నిర్వహణలోని అసెట్స్ పరిమాణం) లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఫండ్ ప్రధానంగా స్మాల్, మిడ్‌క్యాప్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ద్రవ్యోల్బణం .. వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టడం, కుటుంబాల ఆదాయం మెరుగుపడుతూ, వినియోగం పెరుగుతుండటం తదితర అంశాలన్నీ స్మాల్, మిడ్ క్యాప్ షేర్లలో ఇన్వెస్ట్ చేసేందుకు సానుకూలంగా నిలుస్తున్నాయని సంస్థ డైరెక్టర్ మనీష్ సంతాలియా తెలిపారు. వచ్చే 3–5 ఏళ్లలో ఈ షేర్లు మెరుగైన రాబడులు అందించే అవకాశాలు ఉన్నందున, ఇన్వెస్టింగ్‌కు అనువైనవిగా కనిపిస్తున్నాయని వివరించారు.

పాలీక్యాబ్ ఇండియా | బ్రోకరేజ్: సెంట్రమ్ బ్రోకింగ్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 6,108
టార్గెట్: రూ. 7,320
ఎందుకంటే: ఎలక్ట్రికల్ కేబుళ్లు, ప్రొడక్టుల దిగ్గజం పాలీక్యాబ్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర పనితీరు చూపింది. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ అమ్మకాలు 25 శాతం జంప్ చేసి రూ. 6,990 కోట్లను తాకాయి. వార్షిక ప్రాతిపదికన వైర్లు, కేబుళ్ల విభాగం సైతం 22 శాతం ఎగసింది. కీలక రంగాలలో బలమైన డిమాండ్ వాతావరణం కొనసాగడం ఇందుకు సహకరించింది. ఇక ఫాస్ట్ మూవింగ్ ఎలక్ట్రికల్ గూడ్స్(ఎఫ్‌ఎంఈజీ) అమ్మకాలు వార్షికంగా అన్ని ప్రొడక్టు విభాగాలలోనూ మరింత అధికంగా 33 శాతం దూసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో స్థూల మార్జిన్లు 0.2 శాతం మెరుగుపడి 25.5 శాతానికి చేరాయి. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 1.1 శాతం పుంజుకుని అంచనాలకంటే అధికంగా 14.7 శాతాన్ని తాకాయి. ఎఫ్‌ఎంఈజీ విభాగంలో టర్న్‌అరౌండ్ పరిస్థితులు, అధిక ఈపీసీ మార్జిన్లు(లోబేస్‌మీద) ఇందుకు తోడ్పాటునిచ్చాయి. దీంతో క్యూ4లో నికర లాభం 33 శాతం జంప్‌చేసి అందరి అంచనాల(రూ. 550/రూ. 620 కోట్లు)కంటే ఎగువన రూ. 730 కోట్లుగా నమోదైంది. వెరసి 2030కల్లా వైర్లు, కేబుళ్ల విభాగం వార్షికంగా 15–20 శాతం వృద్ధిని అందుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పరిశ్రమ సగటుకంటే 1.5 రెట్లు అధిక వృద్ధికాగా.. 11–13 ఇబిట్ మార్జిన్లు అంచనా వేస్తోంది. ఎగుమతుల వాటా 10 శాతానికి మించాలని ఆశిస్తోంది. ఎఫ్‌ఎంఈజీలో 8–10 శాతం ఇబిట్ మార్జిన్ల సాధనతో పరిశ్రమను మించి 2 రెట్లు వృద్ధి సాధించాలని చూస్తోంది. ఇందుకు వీలుగా రూ. 6,000–8,000 కోట్ల పెట్టుబడి వ్యయ ప్రణాళికలు ప్రకటించింది. ఎగుమతులపై ప్రత్యేక దృష్టితోపాటు, ఎఫ్‌ఎంఈజీ విభాగ భారీ వృద్ధిపై కన్నేసింది. తద్వారా మార్జిన్లు మరింత బలపడే వీలుంది.

కోల్ ఇండియా | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 399
టార్గెట్: రూ. 480
ఎందుకంటే: మైనింగ్ రంగ ప్రభుత్వ దిగ్గజం కోల్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర పనితీరు ప్రదర్శించింది. తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో మందగమన ఫలితాల తదుపరి జనవరి–మార్చి(క్యూ4)లో వృద్ధి బాటలో సాగింది. అయితే పూర్తి ఏడాదిలో ఈవేలం ప్రీమియంలు నీరసించాయి. అయితే ఈవేలం పరిమాణం పుంజుకోవడంతో ప్రీమియంలు తగ్గిన అంశాన్ని సమర్థించుకోగలిగింది. మొత్తం అమ్మకాల పరిమాణంలో ఈవేలం వాటా 10 శాతానికి చేరడం ఇందుకు దోహదపడింది. కోల్–వాషర్ సామర్థ్యం పెంపుపై ప్రత్యేక దృష్టి కారణంగా దేశీ కోకింగ్ కోల్, నాన్ కోకింగ్ కోల్ మార్కెట్లో వాటాను కోల్ ఇండియా పెంచుకోనుంది. మరోవైపు కంపెనీ యాజమాన్యం బొగ్గు గనుల విస్తరణపై దృష్టి సారించింది. ఇందుకు అవసరమైన పెట్టుబడులను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకోనుంది. అంతేకాకుండా రుణ సమీకరణ చేపట్టడం ద్వారా కూడా కొన్ని ప్రాజెక్టులను చేపట్టనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల(2025–26, 2026–27)లో అమ్మకాల పరిమాణం భారీగా పుంజుకునే అవకాశమున్నట్లు భావిస్తున్నాం. వెరసి కంపెనీ మెరుగైన ఫలితాలు సాధించనున్నట్లు అంచనా వేస్తున్నాం. భవిష్యత్‌లోనూ ఈవేలం ప్రీమియం 70 శాతంస్థాయిలో నిలకడగా కొనసాగే అవకాశముంది. క్యూ4 ఫలితాల సందర్భంగా ప్రకటించిన రూ. 5.15 తుది డివిడెండ్‌తో కలిపి గతేడాదికి మొత్తం ఒక్కో షేరుకి రూ. 26.5 చొప్పున వాటాదారులకు చెల్లించింది. ఈ ఏడాది మార్చిలో కోల్ గ్యాస్ ఇండియా పేరుతో కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. తద్వారా కోల్ నుంచి కెమికల్ విభాగంలోకి సైతం ప్రవేశించింది. గెయిల్ ఇండియా(49 శాతం వాటా)తో ఆధునిక కోల్ టు సింథటిక్ గ్యాస్(ఎస్‌ఎన్‌జీ) ప్లాంట్ కోసం ఏర్పాటు చేసిన ఈ వెంచర్‌లో మెజారిటీ వాటా(51 శాతం) తీసుకుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఆర్‌బీఐ బాటలోనే బ్యాంక్‌లు

హెచ్‌డీఎఫ్‌సీ, బీవోబీ, పీఎన్‌బీ రుణ రేట్లకు కోత



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ నిర్ణయానికి అనుగుణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రుణ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ తన మార్జినల్ కాస్ట్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్‌ఆర్) 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. జూన్ 7 నుంచే ఈ సవరణ అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. తాజా తగ్గింపుతో ఓవర్‌నైట్, ఒక నెల ఎంసీఎల్‌ఆర్ రేట్లు 8.90 శాతానికి దిగొచ్చాయి. మూడు నెలల ఎంసీఎల్‌ఆర్ రేటు సైతం 0.10 శాతం తగ్గి 8.95 శాతానికి పరిమితమైంది. ఆరు నెలలు, ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్ 0.10 శాతం తగ్గి 9.05 శాతంగా ఉంది. రెండు, మూడేళ్ల కాల ఎంసీఎల్‌ఆర్ 9.20 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గినట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. ప్రభుత్వరంగ బీవోబీ సైతం రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్)ను 0.50 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ 8.15 శాతానికి తగ్గింది. జూన్ 7 నుంచే కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. రెపో రేటును అర శాతం తగ్గిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా రుణ గ్రహీతలకు బదిలీ చేసినట్టు బీవోబీ ప్రకటించింది. పీఎన్‌బీ సైతం ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్‌ను 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్టు, ఇది ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. దీంతో గృహ రుణ రేటు 7.45 శాతం నుంచి ప్రారంభం కానుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

వర్షపాతంపై మార్కెట్ల దృష్టి	పటిష్టమైన రాబడికి మార్గం

భారీ ఏయూఎం ఉన్న స్మాల్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్




ఒక స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) భారీ స్థాయికి చేరితే.. అది పనితీరును ప్రభావితం చేస్తుందా? ఏయూఎం ఏ స్థాయి వరకు ఉంటే సురక్షితం? – రజత్

స్మాల్‌క్యాప్ పథకాలు పెద్ద స్థాయికి చేరితే పెట్టుబడుల ఆలోచనల పరంగా సమస్యను ఎదుర్కొంటాయి. స్మాల్‌క్యాప్, లార్జ్‌క్యాప్, డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్‌ల నిర్వహణ మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. వేర్వేరు మేనేజర్లు నిర్వహించే వివిధ లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను పరిశీలిస్తే వాటి పోర్ట్‌ఫోలియోలో ఏకరూపత 80 శాతం మేర ఉంటుంది. ఎందుకంటే లార్జ్‌క్యాప్ ఫండ్స్ ప్రధానంగా టాప్–100 కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. లార్జ్‌కాప్ ఫండ్స్‌తో మరో వెసులుబాటు ఏంటంటే లిక్విడిటీ సమృద్ధిగా ఉంటుంది. ఒకే రోజు రూ.100–200 కోట్ల పెట్టుబడుల లావాదేవీలు నిర్వహించినా గానీ పెద్దగా వ్యయ ప్రభావం పడదు. స్మాల్‌క్యాప్ విషయంలో ఈ సానుకూలతలు ఉండవు. ఎందుకంటే చాలా స్మాల్ క్యాప్ కంపెనీల మార్కెట్ విలువ రూ.1,000–1,500 కోట్ల స్థాయిలోనే ఉంటుంది. రూ.100–200 కోట్ల నిర్వహణ ఆస్తులు నిర్వహించే ఫండ్స్ ఈ తరహా చిన్న కంపెనీల్లో చెప్పుకోతగ్గ మేర వాటాను తీసుకోగలవు. కానీ ఎక్కువ స్థాయిలో ఏయూఎం ఉన్న స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు చిన్న కంపెనీలో 5 శాతం వాటా తీసుకోవడం సాధ్యపడదు. అంతేకాదు ఆ వాటాలను విక్రయించడం కూడా సమస్యగా మారుతుంది. కనుక స్మాల్‌క్యాప్ పథకంలో పెట్టుబడుల నిర్వహణ చాలా కష్టం. ఒక్కసారి ఏయూఎం పరంగా స్మాల్‌క్యాప్ ఫండ్ పెద్దగా మారిపోతే.. అప్పుడు ఎన్నో కొత్త ఆలోచనలు చేయాల్సి వస్తుంది. లిక్విడిటీ పరంగా చూసినా ఎక్కువ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. అన్ని కంపెనీలను గుర్తించడం కూడా సవాలే. వ్యాల్యూషన్లు ఖరీదుగా లేని కంపెనీలను గుర్తించడం కోసం ఎంతో శ్రమించాల్సి వస్తుంది. మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో విజేతలైన పథకాలకు పెట్టుబడుల ప్రవాహం వెల్లువెత్తుతుంటుంది. స్మాల్‌క్యాప్ ఫండ్ మంచి రాబడులను చూపిస్తే అందులో ఎక్కువ మంది ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. దీంతో ఏయూఎం ఇంకా పెద్దది అవుతుంది. పనితీరుపై దీని ప్రభావం కచ్చితంగా ఉంటుంది.

ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌లలో ఏది మెరుగైనది? – దినేష్ జనార్దన్

వ్యయాల పరంగా చూస్తే ఈటీఎఫ్ (ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్) పథకాలకు అనుకూలత ఎక్కువ. 5–7 బేసిస్ పాయింట్లకే ఈటీఎఫ్ పథకాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో 10–15 బేసిస్ పాయింట్ల ఎక్స్‌పెన్స్ రేషియోకి సేవలు అందించే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు సైతం ఉన్నాయి. వ్యయాల పరంగా ఈటీఎఫ్, ఇండెక్స్ ఫండ్స్ మధ్య పెద్ద వ్యత్యాసం లేదు. లిక్విడిటీ పరంగా చూస్తే, ఇండెక్స్ ఫండ్స్ విషయంలో లిక్విడిటీ పరంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈటీఎఫ్‌ల విషయంలో లిక్విడిటీ వివిధ పథకాల మధ్య కొంత భిన్నంగా ఉండొచ్చు. కొన్ని పథకాలు రోజువారీగా అధిక వ్యాల్యూమ్ (పరిమాణం)లో ట్రేడ్ అవుతుంటాయి. కనుక ఇన్వెస్ట్ చేయడానికి ముందు ఆయా పథకాల ట్రేడింగ్ పరిమాణాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇన్వెస్టర్లు పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసేట్టు అయితే ఇండెక్స్ ఫండ్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలను ఈటీఎఫ్ కోసం తెరవాల్సిన శ్రమ తప్పుతుంది. డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలున్న వారికి ఈటీఎఫ్‌లు కూడా మెరుగైన ఎంపికే అవుతుంది.





ఆదివారం ఉదయం 6.30 గంటలకే యాదగిరిగుట్టలో నిండిపోయిన వాహనాలు

దారులన్నీ యాదగిరిగుట్టకే..

- కిక్కిరిసిన యాదగిరి క్షేత్రం
- శ్రీస్వామి సన్నిధిలో 90 వేలమంది
- ధర్మ దర్శనానికి 5 గంటల సమయం
- వివిధ పూజలతో నిత్యాదాయం రూ.85.57 లక్షలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ సన్నిధితో పాటు పట్టణ పరిసరాలు, ఆధ్యాత్మిక వాడ.. ఎటు చూసినా భక్తులతో నిండిపోయింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు.. శ్రీస్వామి జన్మ నక్షత్రం స్వాతి కలిసి రావడంతో ఆదివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలు, దేశంలోని ఆయా ప్రాంతాల భక్తులు అధికంగా తరలి వచ్చారు. ఉదయం నుంచే యాదగిరీశుడి క్షేత్రానికి భక్తుల తాకిడి మొదలైంది. భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధులు, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలన్నీ నిండిపోయాయి. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 5 గంటలు, వీఐపీ దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీనృసింహస్వామిని 90 వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వివిధ పూజలతో ఆలయానికి నిత్యాదాయం రూ.85,57,558 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు, ఆలయాధికారులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేశారు. ఉదయం 5 గంటలకు కొండ కింద గల వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు వివిధ ప్రాంతాల కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు, ఈవో వెంకట్రావు పాల్గొన్నారు.



నయా మోసం.. కాల్‌ఫార్వర్డింగ్ ఫిషింగ్

- కొరియర్ సంస్థల పేరుతో కాల్ చేసి వివరాలు సేకరిస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఓటీపీ, వెరిఫికేషన్ కోడ్‌లు తెలుసుకుని ఫోన్లు హైజాక్
- కాంటాక్ట్ నంబర్లకు డబ్బుల కోసం రిక్వెస్ట్‌లు పంపుతూ మోసం
- అప్రమత్తంగా ఉండాలంటున్న టీజీ సైబర్ సెక్యూరిటీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: కాల్‌ఫార్వర్డింగ్ ఫిషింగ్ మోసం ఇప్పుడు తెరపైకి వస్తోంది. కొరియర్ సంస్థల పేరుతో సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు హెచ్చరించారు. ఈ తరహా మోసం ఎలా జరుగుతుంది.. ఎలా అప్రమత్తంగా ఉండాలన్న అంశాలతో టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటన జారీ చేశారు.

ఇలా వల వేస్తారు...

కొరియర్ సంస్థల పేరుతో, ముఖ్యంగా బ్లూడార్ట్ వంటి సంస్థల పేరిట మోసగాళ్లు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారు. మీ పేరిట కొరియర్ వచ్చిందంటూ బాధితులకు కాల్ చేస్తారు. మా కొరియర్ బాయ్ మీకు దగ్గర్లో ఉన్నాడని, లొకేషన్ గుర్తులు అవసరమని చెప్పి నమ్మకం కలిగిస్తారు. తర్వాత మీకు పంపిన లింక్‌పై క్లిక్ చేయాలని సూచిస్తారు. అలా పంపిన లింక్‌పై క్లిక్ చేయగానే ఫోన్‌లో వైరస్‌ను పంపి బాధితుల ఫోన్‌ను తమ అధీనంలోకి తీసుకుంటారు. లేదా 21 ఫోన్ నంబర్ వంటి ప్రత్యేక కోడ్ డయల్ చేయాలని చెబుతారు. ఆ తర్వాత ఫోన్‌కాల్ ఫార్వర్డింగ్ యాక్టివేట్ చేస్తారు. కాల్ ఫార్వర్డింగ్ యాక్టివేట్ అయిన తర్వాత, బాధితుల ఫోన్‌ను మోసగాళ్లు హైజాక్ చేస్తారు. ఆ తర్వాత బాధితుల ఫోన్‌కు వచ్చే కాల్స్, ఓటీపీలు, వెరిఫికేషన్ కోడ్‌లు తెలుసుకుంటారు. అదేవిధంగా వాట్సాప్ సహా అన్ని సోషల్ మీడియా యాప్‌లు, ఫోన్ గ్యాలరీపైన నియంత్రణ సైబర్ మోసగాళ్లకు వెళుతుంది. బాధితుడికి ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సహా ఇతర యాప్‌లేవీ పని చేయవు. ఇలా బాధితుడి ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు బాధితుడిగా నటిస్తూ, వారి కాంటాక్ట్స్ లో ఉన్న వ్యక్తులకు మెసేజులు పంపించి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని అభ్యర్థిస్తూ ఆర్థిక మోసాలకు పాల్పడతారు.

ఈ జాగ్రత్తలు పాటించండి..:

- మీ ఫోన్లో కాల్ ఫార్వర్డింగ్ ఫీచర్‌ను డిసేబుల్ చేయండి.
- మీ నెట్వర్క్ ప్రొవైడర్‌ను సంప్రదించి కాల్ ఫార్వర్డింగ్ ఆపేయండి.
- కొరియర్ కంపెనీలకు వారి అధికారిక వెబ్‌సైట్లో ఉన్న నంబర్లకే కాల్ చేయండి.
- తెలియని లింకులపైన క్లిక్ చేయకండి.
- లేదా ఉన్న కోడ్లు డయల్ చేయకండి.
- ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దు.
- మీ ఫోన్ కాల్ సెట్టింగ్స్, బ్యాంక్ లావాదేవీలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి.
- ఒకవేళ మోసానికి గురైనట్టు గ్రహిస్తే వెంటనే 1930కు కాల్ చేయండి లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో లేదా సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ 8712672222 వాట్సాప్ నంబర్‌లో ఫిర్యాదు చేయండి.

కీచక రాజ్యం.. ఆగని అఘాయిత్యాల పర్వం

బాలికలు, మహిళలపై అత్యాచారాలతో ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలం

- రెండు రోజులకొక అత్యాచారం
- ఏడాదిలో 188 అత్యాచారాలు.. ఇందులో 15 మంది హత్య
- చంబల్ లోయ దురాగతాలను తలపిస్తున్న రాష్ట్రం
- చోద్యం చూస్తున్న చంద్రబాబు ప్రభుత్వం



సాక్షి, అమరావతి: కీచక చంద్రబాబు ప్రభుత్వం గురివింద నీతిని వల్లె వేస్తోంది. మహిళల పట్ల ఒక్కసారిగా మొసలి కన్నీరు కారుస్తోంది. ఓ వైపు ఏపీలో అసాంఘిక శక్తులు.. మహిళలు, బాలికలపై విచ్చలవిడిగా అత్యాచారాలకు పాల్పడుతున్నా, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. మరోవైపు మహిళల భద్రత, గౌరవం, ఆత్మాభిమానం అంటూ వైఫల్యాన్ని కప్పిపుచ్చేకునేందుకు యత్నిస్తోంది. ఒకప్పటి చంబల్ లోయను తలపిస్తూ రాష్ట్రంలో మహిళలు, బాలికలపై యథేచ్ఛగా అఘాయిత్యాలతో ఆంధ్రప్రదేశ్ అంతటా భీతావహ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వాటిని కట్టడి చేయడం చేతగాని చంద్రబాబు ప్రభుత్వం.. ఎవరో ఓ ప్రైవేటు వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రతిపక్ష పార్టీకి ఆపాదిస్తూ దుష్ప్రచారానికి తెగబడుతోంది. తమ ఏడాది పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాల కుట్రకు తెగిస్తోంది. కానీ రాష్ట్రంలో రోజు రోజుకూ దిగజారుతున్న మహిళల భద్రత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

అత్యాచారాలతో అట్టుడుకుతున్న రాష్ట్రం

బాలికలు, మహిళలపై అత్యాచారాలతో రాష్ట్రం హడలిపోతోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న అత్యాచార పర్వం యావత్ దేశాన్ని భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఎంతగా అంటే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు ఏకంగా 188 మంది బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరగడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఇందులో అత్యాచారం ఆపై హత్యకు గురైన వారు 15 మంది ఉన్నారు. మరో 9 మంది బాలికలు, మహిళలు అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ లెక్కన దాదాపు ప్రతి రెండు రోజులకు ఓ అత్యాచారం చోటుచేసుకుంటోందని పోలీసు రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఒకప్పుడు చంబల్ లోయలో మహిళలపై ఈ తరహాలో అఘాయిత్యాలకు పాల్పడేవారని పత్రికలు ప్ర చురించేవి. ఆ పరిస్థితులు ప్రస్తుతం ఏపీలో నెలకొన్నాయి.

మహిళల ఆక్రందనలు పట్టని ప్రభుత్వం

రాష్ట్రంలో బాలికలు, మహిళల భద్రత రోజు రోజుకూ దిగజారుతున్నా చంద్రబాబు ప్రభుత్వం చోద్యం చూస్తోంది. బాలికలు, మహిళల భద్రత గురించి నామమాత్రంగా కూడా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దిశ వ్యవస్థ ద్వారా మహిళా భద్రత కోసం పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఆపదలో ఉన్నామని బాలికలు, మహిళలు ఆ యాప్ ద్వారా సమాచారం ఇస్తే చాలు కేవలం 5–10 నిమిషాల్లోనే పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని భద్రత కల్పించేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం.. అక్రమ కేసులు నమోదు చేసి వేధించడమే పోలీసుల ఏకైక విధి అని స్పష్టం చేసింది. దాంతో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. పోలీసులు శాంతి-భద్రతల పరిరక్షణ, మహిళా భద్రత వంటి కీలకమైన తమ విధులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. టీడీపీ నేతలకు ఏకపక్షంగా మద్యం దుకాణాల లైసెన్సులు దక్కేలా, ఇతర కాంట్రాక్టులు లభించేలా ప్రత్యర్థులు, పోటీదారులను బెదిరించడమే తమ విధి అని భావిస్తున్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు చెప్పిన వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధించడమే ఏకైక పనిగా పెట్టుకున్నారు. దాంతో రాష్ట్రంలో బాలికలు, మహిళా భద్రత గాలిలో దీపంలా కొట్టిమిట్టాడుతోంది. శ్రీవారి దివ్యక్షేత్రం తిరుపతి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం, మంత్రి లోకేశ్ నియోజకవర్గం మంగళగిరి, హోమ్ మంత్రి అనిత నియోజకవర్గం పాయకారావుపేట.. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమైపోయాయి. విద్యార్థినులు బడికి వెళ్లి ఇళ్లకు తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

టీడీపీ పెద్దల తీరే అంత..

టీడీపీ కూటమి పెద్దలు, కీలక నేతలే మహిళల గౌరవానికి భంగం కలిగిస్తూ బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండటం ప్రభుత్వ మైండ్ సెట్‌కు నిదర్శనం. 'ఆడది కనిపిస్తే ముద్దైనా పెట్టాలి.. కడుపైనా చేయాలి'అని టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. 'కారు షెడ్డులో ఉండాలి.. ఆడవాళ్లు ఇంట్లో ఉండాలి'అని దివంగత కోడెల శివ ప్రసాదరావు తదితరుల వ్యాఖ్యలే రాష్ట్రంలో బాలికలు, మహిళల భద్రత పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి తార్కాణం. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఒక మహిళా ఎమ్మార్వోను జుట్టు పట్టుకొని ఈడ్చి.. దాడి చేసినా చంద్రబాబు పట్టించుకోక పోగా, సదరు బాధితురాలినే తప్పు పట్టడం తెలిసిందే. ఇక నారా లోకేశ్ విదేశాల్లో మహిళలతో అసభ్యకరంగా వ్యవహరించిన వీడియోలు, ఫొటోలు గతంలోనే వెలుగులోకి వచ్చాయి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేడు సిట్ ముందుకు ప్రభాకర్‌రావు!

- హైదరాబాద్‌కు చేరుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్
- అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు
- విచారణకు ప్రశ్నావళి సిద్ధం చేసుకున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆ విభాగం మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు సోమవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. సుదీర్ఘకాలం అమెరికాలో తలదాచుకున్న ఆయనపై ఎల్ఓసీ, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించిన పోలీసులు ఆయన పాస్‌పోర్టునూ రద్దు చేయించారు. గత నెల్లో సుప్రీంకోర్టు స్వల్ప ఊరట ఇవ్వడంతో ప్రభాకర్‌రావు భారత్‌కు వచ్చేందుకు మార్గం సుగమమైంది. దీంతో ఆయన అమెరికాలోని భారత ఎంబసీకి పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుని, గత శుక్రవారం ఎమర్జెన్సీ సర్టిఫికెట్ పొందారు. దీని ఆధారంగా ఆయన ఆదివారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. నిర్ణీత గడువులోగా సిట్ ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉండటంతో సోమవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి రానున్నారని సమాచారం. అక్కడే అధికారుల ఎదుట విచారణకు హాజరవుతారు.

అన్ని నివేదికలు క్రోడీకరించి...

ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన తర్వాత పోలీసులు నలుగురు నిందితులు పి.రాధాకిషన్ రావు, ఎన్.భుజంగరావు, ఎం.తిరుపతన్న, డి.ప్రణీత్‌రావులను అరెస్టు చేశారు. మరో నిందితుడు శ్రవణ్‌కుమార్‌రావుకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఐదుగురితోపాటు పదుల సంఖ్యలో సాక్షుల్ని విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. టెలికం సర్వీసు ప్రొవైడర్లతోపాటు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నుంచి అనేక నివేదికలు పొందారు. వీటన్నింటినీ క్రోడీకరించిన పోలీసులు ప్రభాకర్‌రావును ప్రశ్నించడానికి ప్రశ్నావళి సిద్ధం చేశారు. వీటి ఆధారంగా ఆయన్ను సుదీర్ఘంగా విచారించాల్సి ఉందని, అవసరమైతే ఆయన రెండు మూడుసార్లు విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. అరెస్ట్ నుంచి ఊరట ఇస్తూ పోలీసుల విచారణకు పూర్తిగా సహకరించాలని సుప్రీంకోర్టు ఆయనకు షరతు విధించింది. ఆగస్టు 5న ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను మరోసారి విచారించనుంది. ఈలోపు ప్రభాకర్‌రావు విచారణకు సహకరించకుంటే ఆ విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి కస్టోడియల్ విచారణకు అనుమతి కోరతామని పోలీసు ఉన్నతాధికారి ఒకరు అన్నారు.

హైదరాబాద్ చేరుకున్న ప్రభాకర్

శంషాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావు హైదరాబాద్ చేరుకున్నారు. పదిహేను నెలల తర్వాత ఆయన ఆదివారం రాత్రి 7.40 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనపై లుక్‌ఔట్ నోటీసులు ఉండటంతో ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. రాత్రి 10.30 గంటల వరకు కూడా అధికారులు విచారణ కొనసాగిస్తూనే ఉన్నారు. విచారణ అనంతరం సిట్ బృందం ఆయనను అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేసింది.

ఏపీలో మహిళలు, బాలికలకు భద్రత కరువు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు



సాక్షి, అమరావతి: చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. అనంతపురంలో ఇంటర్మీడియట్ చదువుతున్న గిరిజన బాలిక సాకె తన్మయి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా, రక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ హత్యా ఘటనకు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు రక్షణ, భద్రత లేకుండా పోయింది. శాంతి భద్రతల నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఫల్యం ఇలాంటి దారుణాల రూపంలో ప్రతిరోజూ కనిపిస్తూనే ఉంది. తన్మయి హత్య పూర్తిగా యంత్రాంగ వైఫల్యమే. ఒక అమ్మాయి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడ పోలీసులు ఏం చేస్తున్నారు? అసలు రాష్ట్రంలో కేసుల దర్యాప్తు మీద, నేరాల అదుపు మీద దృష్టి ఉందా? కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు, డైవర్షన్ పాలిటిక్స్ తప్ప.. ఈ ప్రభుత్వానికి ప్రజల రక్షణ పట్ల బాధ్యత అనేది ఉందా? తన్మయి హత్యా ఘటనకు ముఖ్యమంత్రి, ప్రభుత్వం బాధ్యత వహించాలి'అని నిప్పులు చెరిగారు.

గిరిజన విద్యార్థిని దారుణహత్య

అనంతపురం జిల్లాలో బీరుబాటిల్‌తో కొట్టి చంపిన దుర్మార్గులు?

అనంతపురం /కూడేరు: కూటమి సర్కారు పాలనలో మరో ఘాతుకం జరిగింది. అనంతపురం జిల్లా కూడేరు మండల పరిధిలోని ఎన్‌సీసీ నగర్ సమీపాన ముళ్ల పొదల్లో ఇంటర్ విద్యార్థిని తన్మయి(19) దారుణహత్యకు గురైంది. ఆమె తలపై బలమైన గాయం ఉంది. ఘటనాస్థలంలో బీరుబాటిల్ లభ్యమైంది. దీంతో దుండగులు బీరుబాటిల్‌తో కొట్టి చంపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనంతపురం నగరంలోని టీవీ టవర్ దగ్గర ఉన్న రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీపతి, అరుణ దంపతులకు కొడుకుతోపాటు కుమార్తె తన్మయి ఉన్నారు. తన్మయి ప్రస్తుతం ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని ఆకుతోటపల్లి వద్ద గల వివేకానంద జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తన్మయి ఈ నెల 3న అదృశ్యం కావడంతో మరుసటి రోజు తండ్రి లక్ష్మీపతి అనంతపురం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో కడుపు నొప్పిగా ఉందని కూల్ డ్రింక్ తాగడానికి బయటకు వెళ్లిందని, తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తుండగానే.. కూడేరు మండల పరిధిలోని ఎన్‌సీసీ నగర్ సమీపాన ముళ్ల పొదల్లో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. అప్పటికే కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని ఆదివారం తన్మయి తల్లిదండ్రులు చూసి తమ కూతురేనని గుర్తించారు. తలకు బలమైన గాయమైందని, దేనితోనో కొట్టడంతోనే తన్మయి మృతి చెందినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో విద్యార్థిని తన్మయి హత్యకు గురైనట్టు స్పష్టత వచ్చింది. మృతదేహం లభ్యమైన ప్రాంతంలో బీర్ బాటిల్ ఉండడంతో దాంతోనే తలపై కొట్టి చంపారేమో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.



పైరు పండగా.. పక్షులకు పండుగ

రైతు ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే దానిపై ఆధారపడి అనేక జీవరాశులు మనుగడ సాగిస్తాయి. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం సబ్‌జైల్ వద్ద ఉన్న పొలాల్లో వరి కోతలు పూర్తయిన తరువాత పొలంలో రాలిన గింజల కోసం పక్షులు గుంపులుగా వచ్చి ఆకలి తీర్చుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అలలపై సయ్యాట

ఉవ్వెత్తున ఎగసిపడే అలలపైనుంచి ఒడుపుగా దాటిపోయే సర్ఫింగ్ అంటే యువతలో మంచి క్రేజ్. విశాఖ తెన్నేటి పార్క్ బీచ్ వద్ద ఓ యువకుడు సర్ఫింగ్ ప్రాక్టీస్‌చేస్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సాగర యోగం

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ నగరం సర్వసన్నద్ధమవుతోంది. నగరవాసులు ఆదివారం పెద్ద సంఖ్యలో యోగా సాధన చేస్తూ కనిపించారు. అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో భారీ సంఖ్యలో ప్రజలు యోగా సాధనలో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

మెప్మాకు స్కోచ్ ప్లాటినం అవార్డులు

సాక్షి, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (ఏపీ మెప్మా)కు 9 స్కోచ్ ప్లాటినం అవార్డులు లభించినట్టు మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పేదరిక నివారణలో భాగంగా చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. మెప్మా 14 ప్రాజెక్టులను సమర్పించగా, అనేక వడపోతల అనంతరం 9 ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. వీటిలో పట్టణ నిరాశ్రయులకు సురక్షితమైన వసతి కల్పనకు ఉద్దేశించిన 'నివాసం', 'లైవ్లీహుడ్ ట్రాకర్', స్వయం సహాయ సంఘాల బ్యాంక్ లింకేజీ విధానం, వారు తయారు చేసే ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, వ్యవసాయ రంగంలో భాగస్వాములుగా మార్చడం, ప్రేరణ సఖీ కార్యక్రమాలు, స్ట్రీట్ వెండర్స్ మేనేజ్‌మెంట్, వృత్తి కార్మికులను సంఘటితం చేసి సాధికారత కల్పన విభాగాల్లో అవార్డులు వరించాయన్నారు. సెప్టెంబర్ 20న ఢిల్లీలో జరిగే స్కోచ్ సదస్సులో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

ఎంహెచ్ స్మారక అవార్డుల ఎంట్రీలకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: మోటూరు హనుమంతరావు (ఎంహెచ్) స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2025కు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవీఎస్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ వార్తా కథనాలు, ఫీచర్లు రాసిన వారిని ఎంపికచేసి, వారికి ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని అందించడం జరుగుతుందన్నారు. ఎంట్రీలను ఈ నెల 30లోపు "కార్యదర్శి, ప్రజాశక్తి సాహితీ సంస్థ, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా- 522501కు లేదా psmhaward@gmail.com"కు పంపాలన్నారు. కథనాలు 2024 జూన్ ఒకటి నుంచి 2025 మే 31 మధ్యలో తెలుగు పత్రికల్లో ప్రచురితమై ఉండాలన్నారు.

రేషన్ కోసం వెళ్తూ ప్రమాదంలో గాయపడిన మహిళ

రాయచోటి: కూటమి ప్రభుత్వం తెచ్చిన కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేసి డీలర్ల వద్దనే పంపిణీ చేయడంతో ప్రజలు కష్టాలు తిరిగి మొదలయ్యాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ మండల పరిధిలోని సిబ్యాల పంచాయతీ గొర్లకాడపల్లెకు చెందిన గొర్ల కాంతమ్మ (55) రేషన్ షాపు వద్దకు వెళ్తూ ప్రమాదానికి గురై ఆసుపత్రిపాలైంది. ఆదివారం మధ్యాహ్నం తమ గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోపాలకుంట గ్రామానికి కాంతమ్మ బియ్యం తెచ్చుకునేందుకు బయల్దేరింది. ఇంతలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు బైకుపై అటువైపు వెళ్తుండగా అతని బండి ఎక్కింది. కొంత దూరం వెళ్లాక బైక్ ప్రమాదానికి గురికావడంతో కాంతమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు కాంతమ్మను రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తిరుపతి తీసుకెళ్లారు. చౌక ధరల దుకాణం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

యాంత్రీకరణ విఫలం



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం గొప్పగా ప్రారంభించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఘోరంగా విఫలమైంది. అవసరం లేని పరికరాలను బలవంతంగా అంటగట్టాలని చూడటంతో ఈ పథకం కింద పరికరాలు తీసుకునేందుకు రైతులు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. పైగా ఆ పరికరాలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే బహిరంగ మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉండడం, జీఎస్టీతో పాటు రవాణా భారంగా మారడం, రాయితీ తక్కువగా ఉండటం వంటి కారణాలతో రైతులు ముందుకు రాలేదు. దీంతో అర్ధాంతరంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నిలిపి వేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

అంతన్నారు.. ఇంతన్నారు

కూటమి అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఏర్పాటైన యంత్ర సేవా కేంద్రాలను నిర్వీర్యం చేశారు. వ్యక్తిగత యాంత్రీకరణ పథకం అమలు చేయబోతున్నామని గొప్పగా ప్రకటించారు. కేంద్ర పథకమైన స్మామ్ (సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం సబ్సిడీపై 42,864 పరికరాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ.75.80 కోట్లు కేటాయించింది.

మార్కెట్ ధరలకు మించి ఉండటంతో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు కమిటీలు తాము కోరుకున్న పరికరాన్ని కోరుకున్న కంపెనీ వద్ద కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉండేది. పైగా బేరమాడుకుని తక్కువ ధరకు కొనుగోలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా ప్రభుత్వమే ధరలు నిర్దేశించింది. ఈ ధరలకు అదనంగా ప్రతి పరికరంపై 12% నుంచి 18% జీఎస్టీతో పాటు.. 2% ఆగ్రోస్ సేవా చార్జీలు చెల్లించాలని నిర్దేశించారు. అంటే దాదాపు పరికరంపై ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే 14% నుంచి 20% వరకు అదనపు భారం పడుతోంది. అంటే ఓ పరికరం ధర రూ.25 వేలు అయితే.. కనీస జీఎస్టీ, ఆగ్రోస్ రుసుం కలిపి 14% చొప్పున లెక్కేసినా రూ.3,500, అదే రూ.లక్ష విలువైన పరికరమైతే రూ.1.14 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అదే రైతు నేరుగా కొనుక్కుంటే డీలర్ల వద్ద బేరమాడుకుంటే తక్కువ ధరకే లభిస్తుంది. తైవాన్ స్ప్రేయర్ బహిరంగ మార్కెట్లో రూ.18 వేల నుంచి రూ.20 వేలకు లభిస్తుండగా, యాంత్రీకరణ పథకంలో రూ.26 వేలుగా నిర్ణయించి, అందులో రూ.10 వేల రాయితీ ప్రకటించారు. దీనిపై జీఎస్టీ, వ్యవసాయ ఆగ్రోస్ సేవా చార్జీలు అదనం. ట్రాక్టర్ ఆధారిత యంత్ర పరికరాలు కూడా రైతులు సొంతంగా కొనుక్కుంటేనే తక్కువకు వస్తున్నాయి. పైగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు కూడా రైతులకు ప్రతిబంధకంగా మారాయి.కమీషన్లకు కక్కుర్తిపడి రైతులకు అవసరం లేని, డిమాండ్ లేని, పనికి రాని పరికరాలను అంటగట్టాలని చూడటంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సాధారణంగా వ్యక్తిగత పరికరాలు సబ్సిడీపై ఇస్తామంటే రైతులెవరైనా ఎగబడతారు. అలాంటిది రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వం అమలు చేసిన ఈ యాంత్రీకరణ పథకం ఏడాదిలోనే అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఇందుకోసం కేటాయించిన మొత్తంలో చాలావరకు కమీషన్ల రూపంలో పక్కదారి పట్టినట్టు విమర్శలు వచ్చాయి. దీంతో పథకాన్ని 2024–25 ఏడాదికి అర్థంతరంగా నిలిపివేశారు.

తెల్ల బంగారం.. గుట్టుగా మాయం

అత్యంత విలువైన తెల్లక్వార్ట్జ్ ఖనిజాన్ని అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ రూ.కోట్లు గడించేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు కొండల్ని పిండి చేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతుండటంతో తెల్లరాయి గనులు కరిగిపోతున్నాయి. వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉండడంతో అధికార పార్టీ నేతల అండదండలతో రాత్రికి రాత్రే చెన్నై తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.


వైట్‌క్వార్ట్జ్ తవ్వుతున్న కొండ

- కొండల్ని పిండిచేస్తున్న అక్రమార్కులు
- యథేచ్ఛగా తవ్వకాలు
- చెన్నై మీదుగా విదేశాలకు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు

కురిచేడు: అక్రమార్కులకు వైట్‌క్వార్ట్జ్ కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రకాశం జిల్లాలోని దర్శి, కనిగిరి, గిద్దలూరు ప్రాంతాల్లో తెల్లరాయి గనులు ఉన్నాయి. కురిచేడు, పీసీ పల్లి, పామూరు, హనుమంతునిపాడు, సీఎస్ పురం, కొమరోలు తదితర ప్రాంతాల్లో తెల్లరాయి ఖనిజం అధికంగా లభిస్తోంది. ఈ ప్రాంతాల్లో అధికారికంగా, అనధికారికంగా సుమారు రెండు వందల క్వారీలున్నాయి. వీటి ద్వారా కోట్ల విలువైన ఖనిజం అడ్డదారుల్లో విదేశాలకు తరలిపోతోంది. జిల్లాలో నాలుగు రోజుల కిందట పీసీ పల్లి మండలం మురుగమ్మి సమీపంలో వైట్ క్వార్ట్జ్ ముడి ఖనిజాన్ని టీడీపీ నాయకుడు అడ్డగోలుగా తవ్విస్తున్నాడన్న ఆరోపణలు రావడంతో హడావిడిగా మైనింగ్ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రాయిని సీజ్ చేసి మమ అనిపించారు. ఇక, కురిచేడు మండలం బోధనంపాడు గ్రామం పక్కనే 227 సర్వే నంబరులో 943 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. కొండ చుట్టూ కొంత పోరంబోకు స్థలం కూడా ఉంది. గ్రామ సర్వే నంబరు 227లో 22.494 హెక్టార్లకు అమరం కమోడిటీ వెంచర్స్ కంపెనీ అనుమతి పొందింది. కానీ, దానిలో కేవలం 5 హెక్టార్ల విస్తీర్ణం కొండ ప్రాంతంలో 150 మీటర్ల లోతు వరకు మాత్రమే మైనింగ్ ఏరియా చేయాలనే నిబంధన ఉంది. అధికారులు అనుమతిచ్చింది కొంతవరకే కాగా, సర్వే నంబరు మొత్తం అనుమతి ఉందంటూ అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైట్ క్వార్ట్జ్‌ను ఇళ్ల నిర్మాణాల్లో, గాజు తయారీ పరిశ్రమలు, మెటల్ కాస్టింగ్, రబ్బర్, పెయింట్, సెరామిక్, పెట్రోలియం తదితర పరిశ్రమల్లో అవసరాలకు అధికంగా వినియోగిస్తారు.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి...

అధికారులు అక్రమార్కులతో చేతులు కలపడంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అంతా సక్రమ మార్గంలో వెళితే ప్రభుత్వానికి రూ.లక్షల్లో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎగుమతి సుంకం కూడా చెల్లించాలి. అలాగే తవ్వకాలు జరుగుతున్న పంచాయతీలకు సైతం టన్నుల ప్రకారం రుసుం చెల్లించాలి. అయితే వీటన్నింటికి తూచ్ అంటూ అంతా రాత్రివేళ అక్రమార్కులు చెన్నై తరలించేస్తున్నారు. దారిలో అధికారులెవరైనా తనిఖీలు చేస్తే వారికి ఎంతో కొంత ముట్టజెప్పి సరిహద్దులు దాటించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కురిచేడు మండలంలో కొన్ని శాఖల అధికారులకు నెలనెలా వాటా చేరుతుందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వైట్‌క్వార్ట్జ్ అక్రమ వ్యాపారులపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

విదేశాల్లో మంచి గిరాకీ...

నాణ్యతను బట్టి తెల్ల ఖనిజానికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఒక లారీకి సుమారు 40 నుంచి 50 టన్నులు లోడ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా నెల్లూరు మీదుగా చెన్నై, అక్కడి నుంచి విదేశాలకు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఒక లారీ వైట్ క్వార్ట్జ్ విలువ సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5.5 లక్షల వరకూ ఉంటుంది. మండలంలో ఒక్క బోధనంపాడు కాకుండా పెద్దవరం, పడమర వీరాయపాలెం, ఎన్ఎస్‌పీ అగ్రహారం రెవెన్యూ గ్రామాల పరిధిలో తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇదంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వేల టన్నుల వైట్ క్వార్ట్జ్ అక్రమ మార్గంలో తరలిపోతోంది. ఈ వైట్‌క్వార్ట్జ్ లారీలు మద్రాసు వెళ్తాయి. అక్కడి నుంచి షిప్పుల ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి జరుగుతోంది.


ఆతిథ్య రంగంలో అధిక విద్యుత్ వినియోగం

దేశవ్యాప్తంగా ఈ వేసవిలో 9.35 బిలియన్ యూనిట్ల వినియోగం

హోటళ్లు, పీజీ హాస్టళ్ల విద్యుత్ బిల్లుల్లో 10 శాతం పెరుగుదల

ఏఐ సాధనాలతో దాదాపు 20 శాతం విద్యుత్ బిల్లు ఆదాకు చాన్స్

'ఎనర్జీ ఎనలెటిక్స్' అధ్యయనం వెల్లడి



రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం రికార్డులు సృష్టిస్తోంది. ఈ ఏడాది వేసవిలో జాతీయ విద్యుత్ డిమాండ్ 270 గిగావాట్లకు చేరుకుంటుందని కేంద్ర విద్యుత్ శాఖ అంచనా వేసింది. పలు ప్రాధాన్యత రంగాల్లో విద్యుత్ వృద్ధి గణనీయంగా పెరుగుతోంది. అందులో ఆతిథ్య రంగం కూడా ఒకటి. ఈ రంగంలో ఈ ఏడాది వేసవి విద్యుత్ వినియోగం గతేడాది కంటే 10 శాతం పెరుగుతుందని 'ఎనర్జీ ఎనలెటిక్స్' సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, పీజీ హాస్టళ్లు ఈ వేసవిలో నెలకు రూ.7,400 కోట్ల మేర విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోందని తెలిపింది. ఈ రంగంలోనే నెలకు 9.35 బిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని పేర్కొంది. - సాక్షి, అమరావతి

కృత్రిమ మేధతో కాస్త ఊరట..

30 గదులున్న హోటళ్ల నెలవారీ విద్యుత్ బిల్లు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఉండేది. ఇది ఇప్పుడు రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వస్తోంది. పీజీ హాస్టళ్లకు రూ.30 వేలకు పైగా బిల్లులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత సాధనాలను వినియోగించడం ద్వారా హోటళ్లలో 20 నుంచి 25 శాతం, పీజీ హాస్టళ్లలో 23 శాతం విద్యుత్‌ను ఆదా చేయొచ్చని అధ్యయనంలో తేలింది. కృత్రిమ మేధ సాయంతో హోటళ్ల నెలవారీ విద్యుత్ బిల్లు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు, పీజీ హాస్టళ్లలో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ తగ్గించవచ్చని అంచనా. ఏసీలు, లైట్లు, వాటర్ ఫౌంటెయిన్లు, లిఫ్టులు, వాటర్ హీటర్లు వంటి విద్యుత్ సాధనాలను ఏఐ పరికరాలతో అనుసంధానించడం ద్వారా ఇది సాధ్యమవుతుందని అధ్యయనం పేర్కొంది.

కాలుష్య బడ'బాన'లం

బాయిలర్ల వినియోగం పర్యావరణానికి పెనుముప్పు

- దేశ వ్యాప్తంగా విడుదలయ్యే కాలుష్యంలో 7 శాతం వీటి నుంచే..
- ఏటా 182 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల
- భారీగా బాయిలర్లు వినియోగిస్తున్న టాప్–5 రాష్ట్రాల్లో ఏపీ

సాక్షి, అమరావతి: నగరాలు, పట్టణాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయని పర్యావరణం దెబ్బతింటుందని ప్రపంచ దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. 2030 నాటికి కర్బన ఉద్గారాలను 45 శాతం తగ్గించాలని, 2070 నాటికి సున్నా స్థాయికి తీసుకురావాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. ప్యారిస్‌లో అన్ని దేశాలూ కలిసి సమావేశమై ఈ విషయంపై తీవ్రంగా చర్చించి ఒప్పందం కూడా చేసుకున్నాయి. అయినా మార్పు సాధించింది మాత్రం నామ మాత్రమే. ప్రధానంగా పరిశ్రమలు, వాటిలోని బాయిలర్లు (కాగు బాన) విపరీతంగా కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడింగ్(డీపీఐటీ) తాజా అధ్యయనం తేల్చింది. రసాయనాలు, దుస్తులు తయారీ, ఆహార పదార్థాల ప్రాసెసింగ్ వంటి పరిశ్రమల్లోని బాయిలర్లు మరింత ఎక్కువగా కాలుష్యం ఉత్పత్తి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

పాతికేళ్ల నాటి బాయిలర్లే అధికం

దేశ వ్యాప్తంగా 42,500 బాయిలర్లు ఉన్నట్లు ఓ అంచనా. ఇవన్నీ కలిసి 1.26 బిలియన్ టన్నుల ఆవిరిని విడుదల చేస్తున్నాయి. పైగా ఇప్పుడున్నవన్నీ 20 ఏళ్ల నుంచి 25 ఏళ్ల పాత బాయిలర్లు కావడంతో సల్ఫర్ డయాక్సైడ్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా విడుదలయ్యే గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల్లో 7 శాతం బాయిలర్ల నుంచే వస్తుందని అంచనా. అంటే ఏటా 182 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను బాయిలర్లు విడుదల చేస్తున్నాయన్నమాట. ఇది రవాణా రంగంలోని అన్ని వాహనాల నుంచి వచ్చే కాలుష్యం కంటే ఎక్కువ. ఇతర పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యంలో నాలుగో వంతు కంటే అధికం. 40 శాతం బాయిలర్లు బొగ్గు, గ్యాస్, ఆయిల్ వంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడి నడుస్తున్నట్లు అధ్యయనంలో తేలింది.



ఏపీలో నియంత్రణ చర్యలు శూన్యం

ప్రమాదకర బాయిలర్లను వాడుతున్న మొదటి ఐదు రాష్ట్రాల్లో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. బాయిలర్లు అధిక స్థాయిలో కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లను ఉత్పత్తి చేయకుండా అడ్డుకోవడానికి ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. కానీ అది ఖర్చుతో కూడుకున్న పని కావడంతో దాని గురించి ఎవరూ పెద్దగా ఆలోచించడం లేదని అధ్యయనం తెలిపింది. ఈ పరిశ్రమల్లో 'గ్రీన్ బాయిలర్ మిషన్'ను అమలు చేయాలని సూచించింది. ఆ దిశగా ఉత్తరప్రదేశ్ ముందడుగు వేసింది. తాజాగా బాయిలర్స్ యాక్ట్ 2025ను ఆ రాష్ట్రం అమలులోకి తీసుకువచ్చింది. అలాగే శిలాజ ఇంధనాలకు బదులు వరి గడ్డిని బాయిలర్లు మండించడానికి వాడే పరిశ్రమలకు మూలధన రాయితీలను పంజాబ్ రాష్ట్రం ప్రకటించింది. టాప్ 5లో ఉన్న మన రాష్ట్రం మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.



సెవెన్ సిస్టర్స్ జలపాతం – మేఘాలయ

మేఘాల మధ్య విస్తరించిన మేఘాలయ.
ఛిల్ అవమని ఆహ్వానిస్తున్న షిల్లాంగ్.
నాలుగు వేల అడుగుల ఎత్తులో సరస్సు.
అంతకు వెయ్యి అడుగుల ఎత్తుల జలపాతం.
బౌద్ధంలా విస్తరించిన ప్రశాంత విహారం.
ఏడు పాయల సెవెన్ సిస్టర్స్ వాటర్ ఫాల్స్.
కేథడ్రల్ చర్చ్ వందేళ్ల చారిత్రక గ్రంథం.
సంతోషాల విలాసభవనం పునాఖ ద్జోంగ్.
భారత్ - భూటాన్ మౌంటెయిన్ టూర్...
వీటన్నింటినీ దండలా కూర్చి చూపిస్తోంది.

భారత్– భూటాన్ చిల్.. లాంగ్.. టూర్

భారత్ భూటాన్ మిస్టిక్ మౌంటెయిన్ టూర్...
ఇది 14 రోజుల యాత్ర. రైలు ఢిల్లీలో మొదలై గువాహటి, షిల్లాంగ్, చిరపుంజి, థింఫు, పునఖ, పారో మీదుగా ఢిల్లీకి చేరుతుంది. ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్, ఘజియాబాద్, అలీఘర్, తుండ్లా జంక్షన్, కాన్పూర్, లక్నో, వారణాసి స్టేషన్‌లలో రైలెక్కవచ్చు. ఈ టూర్ ఈ నెల 28వ తేదీన మొదలవుతుంది.

- టికెట్ ధరలు ఏసీ కూపేలో (డబుల్ షేరింగ్) ఒక్కొక్కరికి లక్షా అరవై వేలవుతుంది. ఏసీ క్యాబిన్‌లో సింగిల్ షేరింగ్ లక్షా డెబ్బయ్ ఐదు వేలు, డబుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి లక్షా నలభై ఐదు వేలు. డీలక్స్ (ఏసీ టూ టైర్)లో డబుల్ షేరింగ్ లక్షా ముప్పై వేలు, కంఫర్ట్ (థర్డ్ ఏసీ) కేటగిరీలో డబుల్ షేరింగ్ ఒక్కొక్కరికి లక్షా ఇరవై వేలవుతుంది.
- ఇవన్నీ ఉండాలి: ఈ టూర్‌లో విదేశీ పర్యాటక ప్రదేశాలు కూడా ఉన్నాయి కాబట్టి ప్రయాణికులు పాన్ కార్డు, పాస్‌పోర్టు (ఆరు నెలల కనీస గడువు ఉండాలి) లేదా ఓటర్ ఐడీ కార్డు (హోలోగ్రామ్ తప్పనిసరి), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు (వైట్ బ్యాక్ గ్రౌండ్) ఉండాలి.

1వ రోజు: మధ్యాహ్నం మూడు గంటలకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ స్టేషన్ నుంచి రైలు బయలుదేరుతుంది. రైలు బయలుదేరగానే ప్రయాణికులకు హై టీ, రాత్రి భోజనం అందిస్తారు. రాత్రంగా ప్రయాణం కొనసాగుతుంది.

2వ రోజు: ఈ రోజంతా కూడా ప్రయాణంలోనే గడిచిపోతుంది. ఉదయం టీ నుంచి రాత్రి భోజనం వరకు ఆహారపానీయాలను అందిస్తారు. ఆ రాత్రి కూడా ప్రయాణం సాగుతుంది.

3వ రోజు: మధ్యాహ్న భోజనం తర్వాత రైలు గువాహటికి చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్ అవ్వాలి. సాయంత్రం ఫ్రీ టైమ్. రాత్రి బస అదే హోటల్‌లో.

4వ రోజు

ఉదయం బ్రేక్ ఫాస్ట్ తర్వాత రూమ్ చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. కామాఖ్య ఆలయంలో ముఖ దర్శనం చేసుకుని షిల్లాంగ్ వైపు సాగిపోవాలి. ఉమియుమ్ లేక్ మీదుగా సూర్యాస్తమయాన్ని వీక్షించి హోటల్ గదిలో చెక్ ఇన్ అవ్వాలి. రాత్రి బస షిల్లాంగ్‌లో.





మేఘాల కింద విహారం

మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ప్రధానమైన నీటి వనరు ఉమియుమ్ లేక్. ఇది సముద్ర మట్టానికి సుమారు నాలుగు వేల అడుగుల ఎత్తులో ఉంది. ఈ సరస్సులో పడవ ప్రయాణం జీవితంలో మరిచిపోలేని అనుభూతి.



చిరపుంజిలోని మావ్‌సామాయ్ గుహలు



5వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత చిరపుంజి వైపు సాగిపోవాలి. సెవెన్ సిస్టర్స్ జలపాతంతో సేదదీరి మావ్‌సామాయ్ గుహలు, నొఖాలికాయ్ జలపాతాలకు వెళ్లాలి. మధ్యాహ్న భోజనం తర్వాత ఎలిఫెంటా జలపాతాన్ని చూసుకుని హోటల్ గదికి వచ్చి సేదదీరాలి. ఆ రాత్రి బస కూడా షిల్లాంగ్‌లోనే.

ఏడు జలధారలు

సెవెన్ సిస్టర్స్ జలపాతం మేఘాలయలో ప్రసిద్ధి. వెయ్యి అడుగుల ఎత్తు నుంచి జాలువారుతుంటుంది. ఇది ఏడు పాయలుగా జాలువారుతుండంతో ఆ పేరు వచ్చింది. స్థానికులు నోహ్‌స్ని గిథియాంగ్ జలపాతం అంటారు. సముద్రమట్టానికి నాలుగు వేల అడుగుల ఎత్తులో వెయ్యి అడుగుల పై నుంచి కొండ వాలు నుంచి జాలువారే జలపాతం కనువిందు చేస్తుంది. మన దక్షిణాది వాళ్లకు కర్నాటకలోని జోగ్ వాటర్‌ఫాల్స్ పరిచితం. ఇది నాలుగు పాయలుగా ఉంటుంది. ఇవి రెండూ దేశంలో టాప్ టెన్ జలపాతాల్లో చోటు చేసుకున్నవే.



షిల్లాంగ్‌లోని కేథడ్రల్ చర్చ్

6వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి సైట్ సీయింగ్‌కి సాగిపోవాలి. కేథడ్రల్ చర్చ్, వార్డ్స్ లేక్, డాన్ బాస్కో మ్యూజియం తర్వాత గువాహటికి ప్రయాణం. గువాహటిలో బ్రహ్మపుత్ర క్రూయిజ్‌లో విహరిస్తూ సూర్యాస్తమయాన్ని ఆస్వాదించిన తర్వాత ప్రశాంతంగా గువాహటి రైల్వేస్టేషన్‌కి చేరి రైలెక్కాలి. రాత్రి భోజనం రైల్లోనే. హాసిమరా వైపు ప్రయాణం రాత్రంతా సాగుతుంది.

ఏడంతస్థుల మ్యూజియం

షిల్లాంగ్‌లోని కేథడ్రల్ చర్చ్‌కి వందేళ్లకు మించిన చరిత్ర ఉంది. దీనిని 1913లో పూర్తిగా చెక్కతో నిర్మించారు. అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో తిరిగి కాంక్రీట్ నిర్మాణం చేశారు. ఇప్పుడు మనం చూస్తున్న నిర్మాణానికి 85 ఏళ్లు. యూరప్ దేశాలు పాటించి గోథిక్ శైలి నిర్మాణం ఇది. ఇంటీరియర్‌లో జర్మనీ శైలి కళాత్మకతలోని లాలిత్యం ఉంటుంది. ఇక డాన్ బాస్కో మ్యూజియం ఏడంతస్థుల భవనం. ఈశాన్య రాష్ట్రాల కళాకృతుల నిలయం. మనసు నిండుగా చూడాలంటే మూడు గంటల సమయం కేటాయించాల్సిందే. టూర్‌లో ఆ మేరకు సమయం ఇస్తారు. ఆవరణలో ఫొటోలు తీసుకోవడంలో ఎక్కువ సమయం గడిచిపోయిందంటే మ్యూజియంలోని కళాకృతులను సరగ్గా చూడలేం.



డాన్ బాస్కో మ్యూజియం



బ్రహ్మపుత్ర క్రూయిజ్

7వ రోజు

రైల్లోనే బ్రేక్‌ఫాస్ట్. హాసిమరా స్టేషన్‌లో రైలు దిగి రోడ్డు మార్గాన ఫుయెంట్‌షోలింగ్, తర్వాత థింపూకి సాగిపోవాలి. థింపూ కి చేరిన తర్వాత హోటల్ గదిలో చెక్ అని సాయంత్రం విశ్రాంతిగా గడపాలి. రాత్రి బస అక్కడే.

భూటాన్‌లో అడుగుపెట్టాం!

హసిమరా రైల్వేస్టేషన్ వెస్ట్‌బెంగాల్ రాష్ట్రంలో ఉంది. ఇక్కడ దిగి రోడ్డు మార్గాన వెళ్లాలి. భారత్ సరిహద్దు దాటి భూటాన్‌లో అడుగుపెట్టిన తర్వాత ఇరవై కిలోమీటర్ల దూరంలో ఫుయెంట్‌షోలింగ్ అనే చిన్న పట్టణానికి చేరుతాం. ఇక్కడ ఇమిగ్రేషన్ చెక్ చేస్తారు.



థింపూలోని బుద్ధ విగ్రహం

8వ రోజు



ఈ రోజంతా థింపూలో సైట్ సీయింగ్‌లో గడుస్తుంది. బుద్ధపాయింట్, మోతీతాంగ్ జూ, పెయింటింగ్ స్కూల్, నేషనల్ లైబ్రరీ, బౌద్ధ సంస్కృతికి సంబంధించి పురాతన గ్రంథాల సముదాయాన్ని వీక్షించడం, థింపూ హాండీక్రాఫ్ట్స్ మార్కెట్ పర్యటన, తాషి చో ద్జోంగ్ వీక్షణం తర్వాత హోటల్‌కి చేరి రాత్రి బస.

గ్రేట్ బుద్ధ

భూటాన్ రాజధాని నగరం థింపూ. ఈ నగర శివారులో బుద్ధ డోర్డెన్మా విగ్రహం ఉంది. 177 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహం ప్రపంచంలోని అత్యంత పెద్ద బుద్ధ విగ్రహాల జాబితాలో లిస్ట్ అయింది. ప్రపంచానికి శాంతి, సంపదలు దక్కాలని కోరుకుని దీనిని నిర్మించారు. గ్రేట్ బుద్ధగా వ్యవహరిస్తారు. ఇది ప్రాచీనమైనది కాదు. ఇరవై ఏళ్ల కిందట నిర్మాణం మొదలైంది. ప్రారంభించి పదేళ్లవుతోంది.

చిన్ని చిత్రాలయం


థింపూలో ఉన్న జాతీయ స్థాయి పెయింటింగ్ స్కూల్ పరిమాణంలో చిన్నది. కానీ ఇందులో పిల్లలకు పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, శిల్పకళ, స్కెచింగ్, ఉడ్ కార్వింగ్ వంటి అనేక కళల్లో శిక్షణనిస్తారు. విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలగని విధంగా పర్యాటకులు నిశ్శబ్దం పాటించాలి.

9వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి రోడ్డు మార్గాన పునఖా వైపు సాగుతుంది ప్రయాణం. దారిలో ఆగుతూ దోచులా పాస్, చోర్టెన్, మణివాల్, ప్రేయర్ ఫ్లాగ్స్‌ను చూసుకుంటూ మధ్యాహ్నానికి పునఖా ద్జోంగ్, మేల్ రివర్, ఫిమేల్ రివర్ వీక్షణం. సస్పెన్షన్ వంతెన మీద విహారం, ప్యాలెస్ ఆఫ్ హ్యాపీనెస్ సందర్శనం తర్వాత సాయంత్రం పునాఖాలో హోటల్‌కు చేరి చెక్ ఇన్ అయి రాత్రి బస చేయాలి.


సంతోష భవనం

ఈ భవనాన్ని స్థానిక వ్యవహారంలో పునాఖ ద్జోంగ్ అంటారు. పునాఖ నగరం భూటాన్‌కి రాజధానిగా ఉన్నప్పుడు రాజ్యపాలన ఇక్కడి నుంచే జరిగేది. ఈ భవనానికి చారిత్రక ప్రాధాన్యం ఉండడంతో రాజధాని థింపూకి మారిన తర్వాత పర్యాటక భవనంగా మార్చారు. టిబెట్ బౌద్ధం విలసిల్లిన ప్రదేశం ఇది. ఇప్పుడిది యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌ల పరిశీలన జాబితాలో ఉంది.



లంపేరీ రాయల్ బొటానికల్ పార్క్

10వ రోజు



బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పునాఖాలో హోటల్ గది చెక్ అవుట్ చేసి పారో వైపు సాగిపోవాలి. దారిలో లంపేరీ రాయల్ బొటానికల్ పార్క్, పారో నది మీదున్న తామ్‌చోగ్ లాఖాగ్ ఐరన్ బ్రిడ్జ్ విహారం, పారో ద్జోంగ్ (రిన్‌పుంగ్ ద్జోంగ్), కోట సందర్శన తర్వాత ద్జోంగ్‌ఖాగ్ సందర్శనం. రాత్రి బస పారోలోనే.

వంతెన మీద సూర్యాస్తమయం

పారో నగరంలో ఉన్న బౌద్ధ క్షేత్రం రిన్‌పుంగ్ ద్జోంగ్. ప్రాచీనకాలంలో ఈ ప్రదేశాన్ని పాలించిన రాజవంశాలు నివసించిన ప్రదేశం. వారు బౌద్ధాన్ని ఆచరించడంతో ఆ పరంపరగా వచ్చిన బౌద్ధక్షేత్రం ఇది. దీనిని యునెస్కో పరిశీలన జాబితాలోకి తీసుకుంది. నది కి ఇరు వైపులా రెండు భవనాలను కలుపుతూ ఉన్న వంతెన మీద నుంచి సూర్యాస్తమయాలను వీక్షించడం మధురానుభూతి.

11వ రోజు

రోజంతా పర్యటన పారోలో ప్రశాంతంగా సాగుతుంది. టైగర్ నెస్ట్ బేస్‌క్యాంప్ పాయింట్‌లో ఫొటో సెషన్, నేషనల్ మ్యూజియం సందర్శనం, తా ద్జోంగ్ (వాచ్ టవర్) నుంచి ప్రకృతి వీక్షణం, భూటాన్ సంప్రదాయ హస్తకళాకృతుల వీక్షణం, మధ్యాహ్న భోజనం తర్వాత భూటాన్ జాతీయ క్రీడ ఆర్చరీ సాధన, విన్యాసాలను వీక్షించడం, చివరగా ఔషధ నీటితో హాట్ స్టోన్ బాత్ చేయించుకుని హోటల్‌కి చేరడం. ఈ రాత్రి కూడా బస పారోలోనే.

రాతితో ఔషధ స్నానం

ఇది ఇక్కడ ఆయుర్వేద చికిత్స. యాభై రకాల మానసిక, శారీరక అనారోగ్యాలతోపాటు ఆధ్యాత్మిక భావనలను పెంపొందించే చికిత్స. హిమాలయ పర్వత శ్రేణుల్లో విస్తరించిన ఈ నేలకు ఔషధాల పుట్టిల్లు అని పేరు. ఇక్కడ నీటిలో ఔషధ పత్రాలను వేసి మరిగిస్తారు. రాళ్లను వేడి చేసి ఆ నీటిలో వేస్తారు. ఆ తరవాత ఆ రాళ్లను ఒక చట్రంలో అమర్చి ఒంటికి హాయి కలిగేటట్లు మర్దన చేయడమే హాట్ స్టోన్ బాత్. మోడరన్ లైఫ్ స్టైల్‌లో ఒత్తిడి, హైపర్ టెన్షన్, జీర్ణ వ్యవస్థ పని తీరు మందగించడం వంటి సమస్యలు సర్వసాధారణమయ్యాయి. వీటన్నింటి నుంచి ఉపశమనం పొందడానికి హాట్ స్టోన్ బాత్ దోహదం చేస్తుంది. కేరళలో తైలాలతో చేసే చికిత్స వంటిదే ఇది.



రాతితో ఔషధ స్నానం


12వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి రోడ్డు మార్గాన హసిమరా రైల్వేస్టేషన్‌కు సాగిపోవాలి. దారిలో లంచ్ తర్వాత స్టేషన్‌కి చేరి రైలెక్కిన తర్వాత ఢిల్లీకి తిరుగు ప్రయాణం మొదలవుతుంది. పదమూడవ రోజు మొత్తం రైల్లోనే. పద్నాలుగవ రోజు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ఎనిమిది గంటలకు రైలు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ స్టేషన్‌కు చేరడంతో యాత్ర పూర్తవుతుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



చిరపుంజి



పునాఖా – భూటాన్



మీ వ్యాపారాన్ని మెరుగుపరచుకోడానికి ముందు ఆర్థిక స్వేచ్ఛ అనేది దాన్ని గురించి తెలుసుకొని దాని కోసం మిమ్మల్ని మీరు మెరుగుపరచుకోండి. కష్టపడే వారికి మాత్రమే అందుబాటులో ఉంటుంది.
- ఇదోవు కొయెనికన్, ప్రఖ్యాత రచయిత
- రాబర్ట్ కియోసకి, అమెరికన్ వ్యాపారవేత్త, రచయిత

క్లుప్తంగా...

సెబీ పేరుతో మోసాలు

అలర్టుగా ఉండాలని ఇన్వెస్టర్లకు రెగ్యులేటర్ హెచ్చరిక



న్యూఢిల్లీ: మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తన పేరిట జరుగుతున్న మోసాల విషయంలో ఇన్వెస్టర్లను అప్రమత్తం చేసింది. సెబీ అధికారులమని చెప్పుకుంటూ కొందరు మోసగాళ్లు రెగ్యులేటర్ పేరు, లోగో, లెటర్‌హెడ్‌ను వాడుకుని, అమాయక ఇన్వెస్టర్లకు నకిలీ నోటీసులు పంపిస్తూ, మోసగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు వివరించింది. ఇన్వెస్టరు నిర్దిష్ట ఉల్లంఘనకు పాల్పడినందున చర్యలు తీసుకోకుండా ఉండాలంటే పెనాల్టీ కట్టాలంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా మోసగాళ్లు నకిలీ నోటీసులు పంపుతున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించాలని, తమకు ఇలాంటి సమాచారం వస్తే, సెబీ జారీ చేసిందా లేదా అనేది ధృవీకరించుకోవాలని తెలిపింది. తాము ఇచ్చే ప్రతి ఆర్డరుపైనా, పంపించే అన్ని లెటర్లు, నోటీసులు, షోకాజ్ నోటీసులు, సమన్లపైనా ఒక విశిష్ట రిఫరెన్స్ నంబరు ఉంటుందని సెబీ తెలిపింది. అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, ఆర్డర్లు, రికవరీ సర్టిఫికెట్లు అన్నీ తమ వెబ్‌సైట్లో ఉంటాయని పేర్కొంది.

ఎంసీఎక్స్‌లో విద్యుత్ డెరివేటివ్స్

సెబీ నుంచి అనుమతి



న్యూఢిల్లీ: ఎలక్ట్రిసిటీ డెరివేటివ్స్‌ను ప్రవేశపెట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతి లభించినట్లు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎంసీఎక్స్) తాజాగా వెల్లడించింది. వీటిని ప్రవేశపెట్టడం ద్వారా విద్యుత్ పంపిణీ రంగ కంపెనీలకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలియజేసింది. విద్యుత్ భారీ వినియోగదారులు ధరల హెచ్చుతగ్గులను తట్టుకునేందుకు వీలుగా హెడ్జ్ చేసుకోవచ్చని, తద్వారా ధరల రిస్కులను సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చని వివరించింది. దేశీయంగా పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ మార్కెట్లలో ఓపెన్ యాక్సెస్ పెరుగుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిసిటీ డెరివేటివ్స్ కీలకంగా నిలవనున్నట్లు ఎంసీఎక్స్ ఎండీ, సీఈవో ప్రవీణ రాయ్ పేర్కొన్నారు.

పారస్ హెల్త్‌కేర్‌లో 360 వన్ అసెట్ పెట్టుబడులు



ముంబై: ఆరోగ్య సంరక్షణ సేవల సంస్థ పారస్ హెల్త్‌కేర్‌లో రూ. 170 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు 360 వన్ డబ్ల్యూఏఎం అనుబంధ సంస్థ 360 వన్ అసెట్ వెల్లడించింది. పారస్ హెల్త్‌కేర్ ఉత్తరాదిలోని ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో ఎనిమిది ఆస్పత్రులను నిర్వహిస్తోంది. వీటిలో 2,000 పైగా పడకలుఉన్నాయి. భారత హెల్త్‌కేర్ సర్వీసెస్ సెగ్మెంట్లో ఇది తమకు ఏడో పెట్టుబడి అని 360 వన్ అసెట్ సీనియర్ ఫండ్ మేనేజర్ ఉమేష్ అగ్రవాల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-6-2025	
విశాఖ	545-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

వర్షపాతంపై మార్కెట్ల దృష్టి

ఆర్థిక, ధరల గణాంకాలు కీలకం

- రేట్ల కోత ఎఫెక్ట్ కొనసాగే చాన్స్
- విదేశీ గణాంకాలకూ ప్రాధాన్యం
- దేశీ స్టాక్స్‌పై నిపుణుల అంచనా

గత వారం ఆర్థికవేత్తలను ఆశ్చర్యపరుస్తూ ఆర్‌బీఐ వడ్డీ రేట్లకు కీలకమైన రెపోలో 0.5 శాతం కోత పెట్టింది. అంతేకాకుండా బ్యాంకుల నగదు లభ్యతను పెంచుతూ సీఆర్‌ఆర్‌ను 1 శాతం తగ్గించింది. దీంతో వారాంతాన మార్కెట్లకు జోష్ వచ్చింది. పాలసీ నిర్ణయాల ప్రభావానికితోడు పలు ఇతర అంశాలు ఈ వారం దేశీ స్టాక్‌మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..



బ్యాంకుల లిక్విడిటీ పెంపు, వడ్డీ రేట్ల తగ్గింపు నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం చివర్లో జోరందుకున్నాయి. ఈ ప్రభావం ఇకపైన సైతం కనిపించే వీలున్నట్లు స్టాక్ విశ్లేషకులు భావిస్తున్నారు. రియల్టీ, బ్యాంకింగ్, ఆటో, కన్జూమర్ రంగాలలో యాక్టివిటీ కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే రుతుపవనాల కదలికలు, దేశ, విదేశీ ఆర్థిక గణాంకాలు, యూఎస్, భారత్ వాణిజ్య చర్చలు తదితర పలు ఇతర అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు. ఈ ఏడాది మే చివర్లోనే ఆశలు రేపిన రుతుపవనాలు ప్రస్తుతం మందగించాయి. ఇకపై వీటి కదలికలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. దేశీయంగా వర్షాల ఆధారంగా పంటల సాగు, వ్యవసాయ పురోగతి నమోదుకానున్న సంగతి తెలిసిందే. ఇవి గ్రామీణ ప్రాంతాలలో డిమాండును ప్రభావితం చేయగలవని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా వివరించారు.

రిటైల్ ధరలు

గత నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) వివరాలు గురువారం(12న) తెలియనున్నాయి. వార్షిక సీపీఐ 2025 ఏప్రిల్‌లో 3.16 శాతంగా నమోదైంది. 2019 జులై తదుపరి ఇది కనిష్టంకాగా.. 2025 మార్చిలో 3.34 శాతానికి చేరింది. ఈ బాటలో మే నెలకు వాణిజ్య గణాంకాలు 13న వెల్లడికానున్నాయి. 2025 ఏప్రిల్‌లో దేశీ వాణిజ్య లోటు 26.42 బిలియన్ డాలర్లను తాకింది. ఏప్రిల్‌లో దిగుమతులు 64.91 బిలియన్ డాలర్లకు చేరగా.. ఎగుమతులు 38.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2024 ఏప్రిల్‌లో నమోదైన 19.1 బిలియన్ డాలర్లతో పోలిస్తే వాణిజ్య లోటు భారీగా పెరిగింది. యూఎస్, భారత్ మధ్య తొలి దశ వాణిజ్య చర్చలపై నిర్ణయాలు వెలువడే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. ఆర్‌బీఐ రేట్ల కోత, నిలకడైన జీడీపీ ఔట్‌లుక్ ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచనున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు.

విదేశీ గణాంకాలు

నేడు(9న) మే నెలకు చైనా వాణిజ్య, ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడికానున్నాయి. ఏప్రిల్‌లో చైనా వినియోగ ధరలు 0.1 శాతానికి చేరగా.. వాణిజ్య మిగులు 96.18 బిలియన్ డాలర్లను తాకింది. 2024 ఏప్రిల్‌లో నమోదైన 72 బిలియన్ డాలర్లతో పోలిస్తే చైనా వాణిజ్య మిగులు భారీగా ఎగసింది. ఇక మే నెలకు యూఎస్ ద్రవ్యోల్బణ గణాంకాలు 12న విడుదలకానున్నాయి. 2025 ఏప్రిల్‌లో 2.3 శాతంగా నమోదైంది. 2021 ఫిబ్రవరి తదుపరి ఇది కనిష్టంకాగా.. పీపీఐ ఏప్రిల్‌లో 0.5 శాతంగా నమోదైంది. ఇవికాకుండా గ్లోబల్ స్టాక్ మార్కెట్లలో పరిస్థితులు, యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ ముడిచమురు ధరలు, ప్రపంచ ప్రధాన కరెన్సీలతో డాలరు మారకం వంటి అంశాలకు సైతం ప్రాధాన్యత ఉన్నట్లు స్టాక్ నిపుణులు వివరించారు.

గత వారమిలా

అంచనాలను మించుతూ ఆర్‌బీఐ.. రెపో రేటులో 0.5 శాతం, నగదు నిల్వల నిష్పత్తి(సీఆర్‌ఆర్)లో 1 శాతం చొప్పున కోత పెట్టడంతో గత వారం(2-6) దేశీ స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ నికరంగా 738 పాయింట్లు(0.9 శాతం) పెరిగి 82,189 వద్ద నిలిచింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 252 పాయింట్లు(1 శాతం) పుంజుకుని 25,003 వద్ద ముగిసింది. వెరసి ప్రధాన ఇండెక్సులు సాంకేతికంగా కీలకమైన 82,000, 25,000 పాయింట్ల మైలురాళ్లను అధిగమించి స్థిరపడ్డాయి. ఈ బాటలో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 2 శాతం స్థాయిలో ఎగశాయి.

ఎఫ్‌పీఐల యూటర్న్

ఈ నెలలో నికర అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశీ స్టాక్స్‌పట్ల గత నెల(మే)లో ఆసక్తి ప్రదర్శించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల అమ్మకాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నెల(జూన్) తొలి వారంలో యూటర్న్ తీసుకుని నికరంగా రూ. 8,749 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. గత నెలలో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 19,860 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయగా.. అంతకుముందు ఏప్రిల్(చివర్లో కొనుగోళ్లవైపు మళ్లి) నికరంగా రూ. 4,223 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అయితే ప్రస్తుతం యూఎస్ బాండ్ల ఈల్డ్స్ బలపడటం, యూఎస్, చైనా వాణిజ్య చర్చలపై ఆందోళనలు ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా.. ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్స్ నుంచి 2025 మార్చిలో రూ. 3,973 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, జనవరిలో రూ. 78,027 కోట్లు చొప్పున పెట్టుబడులు వెనక్కి తీసుకున్న విషయం విదితమే. వెరసి 2025లో ఇప్పటివరకూ నికరంగా రూ. 1.01 లక్షల కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టడం గమనార్హం!


సాంకేతికంగా

సాంకేతికంగా చూస్తే ఈ వారం నిఫ్టీ 25,150 వద్ద అవరోధాన్ని(రెసిస్టెన్స్) ఎదుర్కొనే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ స్థాయిని అధిగమిస్తే ఇండెక్స్ 25,350వరకూ బలపడవచ్చని అంచనా వేశారు. అయితే లాభాల స్వీకరణ కారణంగా అమ్మకాలు ఊపందుకుంటే 24,850కు వెనకడుగు వేయవచ్చని తెలియజేశారు. ఈ స్థాయిలో నిఫ్టీకి సాంకేతికంగా మద్దతు(సపోర్ట్) లభించే వీలున్నట్లు విశ్లేషించారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఎయిర్‌క్రాఫ్ట్ అప్‌గ్రేడ్‌పై రిలయన్స్ ఇన్‌ఫ్రా దృష్టి

- దార్నియర్ యుద్ధ విమానాల కాంట్రాక్టు సొంతం
- 5-10 ఏళ్లలో రూ.5,000 కోట్ల వ్యాపారంపై కన్ను



న్యూఢిల్లీ: యుద్ధ విమానాల అప్‌గ్రేడ్ (నవీకరణ/ఆధునికీకరణ) వ్యాపారంలోని అవకాశాలపై అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రా కన్నేసింది. వచ్చే 5-10 ఏళ్ల కాలంలో రూ.5,000 కోట్ల వ్యాపార అవకాశాలను సొంతం చేసుకోవడం పట్ల కంపెనీ ఆశావహంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఓఈఎం కాకుండా సొంతంగా సమగ్రమైన ఎయిర్‌క్రాఫ్ట్ అప్‌గ్రేడ్ కార్యక్రమాలను నిర్వహించే తొలి దేశీ కంపెనీగా రిలయన్స్ ఇన్‌ఫ్రా గుర్తింపు తెచ్చుకోనుంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) నుంచి ఇప్పటికే 55 డార్నియర్ -228 ఎయిర్‌క్రాఫ్ట్‌ల అప్‌గ్రేడ్ కాంట్రాక్టును సొంతం చేసుకోవడంతోపాటు విజయవంతంగా అమలు చేసినట్లు కంపెనీకి చెందిన విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అమెరికాకు చెందిన జెనెసిస్ కంపెనీ సహకారంతో ఈ కాంట్రాక్టును అమలు చేసినట్లు తెలిపాయి. మొదట 37 ఎయిర్‌క్రాఫ్ట్‌లకు సంబంధించి ఆర్డర్ సొంతం చేసుకోగా, అనంతరం మరో 18 ఎయిర్‌క్రాఫ్ట్‌ల అప్‌గ్రేడ్ కాంట్రాక్టు సైతం లభించినట్లు వెల్లడించాయి. ఈ మొత్తం ఆర్డర్ విలువ రూ.350 కోట్లు ఉంటుందని తెలిపాయి. ఈ దార్నియర్ యుద్ధ విమానాలు ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్ గార్డ్ వినియోగిస్తున్నవి కావడం గమనార్హం.

భారీ మార్కెట్..

యుద్ధ విమానాలు, హెలీకాప్టర్ల జీవిత కాలం సాధారణంగా 30-40 ఏళ్లుగా ఉంటుంది. క్రమం తప్పకుండా వీటిని అప్‌గ్రేడ్ చేయడం అవసరం. ఎయిర్‌క్రాఫ్ట్ అప్‌గ్రేడ్, ఎంఆర్‌వో సేవల కోసం ఒక యుద్ధ విమానం కొనుగోలు ధరతో పోల్చితే 200-300 శాతం వెచ్చించాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా ఈ మార్కెట్ రూ.5 లక్షల కోట్లుగా ఉంటే, వచ్చే ఏడేళ్లలో రూ.7 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనాలు నెలకొన్నాయి. తొలుత దేశీ మార్కెట్‌తోపాటు తదుపరి అంతర్జాతీయ మార్కెట్లో అవకాశాలను సొంతం చేసుకోవాలన్న వ్యూహాత్మక దృష్టితో రిలయన్స్ ఇన్‌ఫ్రా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి పరిష్కారాలను అందించాలనుకుంటోంది. ఫ్రాన్స్‌కు చెందిన థేల్స్ భాగస్వామ్యంతో రిలయన్స్ ఇన్‌ఫ్రా ఇప్పటికే రఫేల్ ఫైటర్ జెట్స్‌కు సంబంధించి పనితీరు ఆధారిత లాజిస్టిక్స్ (పీబీఎల్) కార్యక్రమంలో కీలక సంస్థగా సేవలు అందిస్తోంది.

డిజిటల్ మోసాలపై కలసికట్టుగా పోరాడుదాం

- బ్యాంక్‌లు, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి ఎయిర్‌టెల్ పిలుపు
- అవగాహన, శిక్షణ కార్యక్రమాల పట్ల సంసిద్ధత



న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలను అరికట్టేందుకు కలసికట్టుగా పోరాడుదామంటూ 40కి పైగా బ్యాంకులు, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐని ఎయిర్‌టెల్ కోరింది. మోసపూరిత డొమైన్‌ల సమాచారంతో రిపాజిటరీ ఏర్పాటు చేయడంతోపాటు సన్నిహిత సహకారానికి పిలుపునిచ్చింది. హానికారక, మోసపూరిత వెబ్‌సైట్లను బ్లాక్ చేసే విషయంలో కలసి పనిచేద్దామని కోరుతూ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు రాసిన లేఖలో ఎయిర్‌టెల్ కోరింది. బహుళ అంచెల రక్షణ కవచం ఏర్పాటు ద్వారా డిజిటల్ మోసాలపై పోరాడుదామని కోరింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత భద్రంగా మార్చే విషయంలో ఎన్‌పీసీఐ, ఎయిర్‌టెల్ మధ్య భాగస్వామ్యానికి బలమైన అవకాశాలున్నట్టు పేర్కొంది. మోసాలను గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు ఎయిర్‌టెల్ అమలు చేస్తున్న చర్యలను ప్రస్తావించింది. హానికారక వెబ్‌సైట్లు, ఫిషింగ్ లింక్‌ల యాక్సెస్‌ను బ్లాక్ చేయడం ద్వారా యూజర్ల రక్షణ చర్యలు అమలు చేస్తున్నట్టు తెలిపింది. ఇదే మాదిరి ఆర్‌బీఐకి సైతం ఎయిర్‌టెల్ లేఖ రాసింది. నియంత్రణ పరమైన సంప్రదింపుల పట్ల సానుకూలంగా ఉన్నట్టు తెలియజేసింది. వినియోగదారుల రక్షణ (ముఖ్యంగా ఆర్థిక సమాచారం) విషయంలో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను జవాబుదారీ చేసే కార్యాచరణ విషయంలో సహకారం అందిస్తానంటూ ఆర్‌బీఐకి ఎయిర్‌టెల్ తెలియజేసింది. డిజిటల్ మోసాలు, రక్షణ చర్యలపై ఉమ్మడి అవగాహన ప్రచార, శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది. మోసాల నివారణకు ఉమ్మడిగా కలసి పనిచేద్దామంటూ ఎయిర్‌టెల్ లోగడ పోటీ టెలికం కంపెనీలైన జియో, వొడాఫోన్ ఐడియాలకు సైతం విడిగా కోరడం గమనార్హం. 2024 మొదటి తొమ్మిది నెలల్లో 1.7 మిలియన్ సైబర్ మోసాల రూపంలో వినియోగదారులు రూ.11,000 కోట్లు నష్టపోయినట్టు ఎయిర్‌టెల్ పేర్కొంది.

అమెరికా రెట్టింపు సుంకాలతో భారత్‌పై తీవ్ర ప్రభావం: జీటీఆర్ఐ



న్యూఢిల్లీ: స్టీల్, అల్యూమినియంపై అమెరికా సుంకాలను రెట్టింపు చేయడంతో భారతీయ ఎగుమతులు ప్రభావితం అవుతాయని ఆర్థిక మేథోసంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్(జీటీఆర్ఐ) తెలిపింది. ముఖ్యంగా వాల్యూ యాడెడ్, ఫినిష్డ్ స్టీల్ ఉత్పత్తులు, ఆటో విడిభాగాల రంగాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. యూఎస్ స్టీల్ పరిశ్రమ మనుగడ దృష్ట్యా తమ దేశంలోకి దిగుమతి అవుతున్న స్టీల్, అల్యూమినియంపై ప్రస్తుతం ఉన్న 25% టారిఫ్‌ను 50 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మే 30న ప్రకటించారు. సుంకాల పెంపు జూన్ 4 నుంచి అమల్లోకి వస్తాయన్నారు ''భారత్‌పై సుంకాల పెంపు పరిణామం ప్రత్యక్షంగా ఉంటుంది. ట్రంప్ నిర్ణయంపై భారత ప్రభుత్వం అమెరికా అధికారులతో ద్వైపాక్షిక చర్చలు జరపాలి. ఈ సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా ఎగుమతులపై భారత్ ప్రతీకార సుంకాలను విధిస్తుందో లేదో చూడాలి'' అని జీఆర్‌టీఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. గతంలో విధించిన ఉక్కు సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా ఎగుమతులపై ప్రతీకార సుంకాలను విధించే ఉద్దేశాన్ని సూచిస్తూ భారత్ ఇప్పటికే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో అధికారిక నోటీసు జారీ చేసింది. భారత్ 2024-25లో 4.56 బిలియన్ డాలర్ల విలువైన ఇనుము, ఉక్కు మరియు అల్యూమినియం ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసింది. వీటిలో 587.5 మిలియన్ డాలర్ల ఇనుము, ఉక్కు, 3.1 బిలియన్ డాలర్లు ఇనుము లేదా ఉక్కు ఉత్పత్తులు, 860 మిలియన్ డాలర్లు అల్యూమినియం సంబంధిత ఉత్పత్తులున్నాయి.

ధరల పోటీతత్వం తగ్గుతుంది: ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రల్హాన్

భారతీయ స్టీల్ ఎగుమతులైన స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులు, స్ట్రక్చరల్ స్టీల్ విడిభాగాలు, ఆటోమోటివ్ స్టీల్ భాగాలైన సెమీ ఫినిష్డ్, ఫినిష్డ్ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అధ్యక్షుడు ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. అధిక పన్నులు అమెరికా మార్కెట్లో ధరల పోటీతత్వాన్ని తగ్గించడంతో పాటు ప్రపంచ వాణిజ్యం, తయారీ సప్లై చైన్‌ను నిరాశపరుస్తాయన్నారు.

గడువు తేదీ పొడిగింపు

అందరూ.. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి అన్ని రకాలుగా సన్నద్ధులైన వేళ.. గవర్నమెంటు వారు రాతపూర్వకంగా గడువు తేదీని పొడిగించినట్లు సెలవిచ్చారు. ట్యాక్స్ ఆడిట్ కాని అన్ని కేసులకు గడువు తేదీ 2025 జూలై 31. అన్ని ఫారాలను వరుసగా నోటిఫై చేశారు. నోటిఫై చేసిన తర్వాత తీరా రిటర్న్ ఫైల్ చేద్దామని వెళితే.. అంతా రెడీగా లేదు. అందరి ఉత్సాహం నీరుకారింది. అటు అసెస్సీలకు, ఇటు వృత్తి నిపుణులకు అసహనం, అనుమానం రెండూ ఏర్పడ్డాయి. అంతలోనే ఈ పొడిగింపు వార్త వచ్చింది. ఆశ్చర్యం అనిపించలేదు.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఎందుకు పొడిగించారంటే..

1. ఫారాలు నోటిఫై చేశారు కానీ అప్‌డేటెడ్ ఫారాలు చాలా లేటుగా వచ్చాయి.
2. ఫైలింగ్ చేయడానికి ఉండే యుటిలిటీలు రెడీగా లేవు.
3. ఇక్కడ చేయవలసింది పొడిగింపు కాదు. ఈ చర్య అనివార్యం కాదు. దానికి బదులుగా యుటిలిటీలను రెడీ చేయాల్సింది.

ఎన్నో విషయాలు చకచకా చేసే ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీన వైఖరి ఎందుకు అవలంబించిందో అంతుపట్టడం లేదు. గత రెండు సంవత్సరాలుగా ఎటువంటి పొడిగింపు ఇవ్వకుండా/లేకుండా ఒక నిశ్చితమైన, నిర్దిష్టమైన వైఖరితో ఉంటూ ప్రభుత్వం ఒక మంచి సంప్రదాయాన్ని సృష్టించింది. అందరూ ఈ వైఖరిని మొదట్లో మెచ్చుకోకపోయినా, తర్వాత సర్దుకుని సద్దుమణిగారు. ఒక ముఖ్యమైన పని సకాలంలో జరిగిపోతుంది కదా అని సరదాపడ్డారు.

యుటిలిటీని ఎనేబుల్ చేసి, అసెస్సీలను ఆకట్టుకుంటే ఎంతో బాగుండేది. ఒక సత్సంప్రదాయాన్ని మూడోసారి ముచ్చటగా కొనసాగించిన ఘనత దక్కించుకునే పరిస్థితుల్లో.. ఏకంగా 45 రోజులు పొడిగించారు. కొంత మంది సంతోషపడ్డారు. మరికొందరు సంబరపడ్డారు.

కానీ పొడిగింపు అనేది పరిష్కారం కాదు. పని అలస్యం అవుతుందే తప్ప ఇంకేమీ ఉపయోగం లేదు. పొడిగింపు అనగానే అందరు అసెస్సీలు ఈ విషయాన్ని లైట్‌గా తీసుకుని పోస్ట్‌పోన్ చేస్తారు. ఆటోమేటిక్‌గా అన్నీ పోస్ట్‌పోన్ అయిపోతాయి. గత రెండు నెలల్లో చేయలేని యుటిలిటీలను ఎప్పుడు రెడీ చేస్తారు? ఎన్ని రోజుల్లో రెడీ చేస్తారు? డెవలప్‌మెంట్‌కి, ఇంటిగ్రేషన్‌కి, టెస్టింగ్‌కి వ్యవధి కావాలని సెంట్రల్ బోర్డ్ చెప్తోంది. అంటే వారికి నిర్దిష్టమైన ప్లాన్ ఉన్నా ఎప్పుడు రెడీగా ఉంటారో తెలియదన్నమాట. సాధారణంగా మే 31 తర్వాత టీడీఎస్ స్టేట్‌మెంట్లలో అన్ని పద్దులు కనిపిస్తాయి. అవి ఆలస్యం అవుతాయి. ఒకవేళ కనిపించినా, సిస్టమ్స్ రెడీగా లేవు.

ఇంకో సమస్య ఏమిటంటే, ట్యాక్స్ ఆడిట్‌కి గడువు తేదీ 2025 సెప్టెంబర్ 30. ఈ గడువు తేదీని కూడా పొడిగిస్తారా అనేదానిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. వృత్తి నిపుణులు జూలై 31 తర్వాత ట్యాక్స్ ఆడిట్ కేసులను చేపడతారు. ఇప్పుడు రెండు గడువు తేదీలకు పదిహేను రోజుల వ్యవధి మాత్రమే ఉంది. దీని వల్ల పని ఒత్తిడి. మానసిక ఒత్తిడి. టైం చాలకపోవడం.. తప్పులు దొర్లే అవకాశం.. ఇలా ఎన్నో ఉన్నాయి.

ట్యాక్స్ ఆడిట్ కేసుల విషయంలో పొడిగింపు లేదు. విద్యార్థులు పరీక్షలు నిర్వహించే తేదీ పొడిగించగానే ముందు సంతోషిస్తారు. కానీ ఆ తర్వాత తెలుస్తుంది. నిజానికి ఆ పొడిగింపు వల్ల వారి శ్రమ రెట్టింపైందని. ఈ పొడిగింపు కూడా అలాంటిదే. గడిచిన సంవత్సరానికి సంబంధించిన సమాచారాన్ని ఎంత కాలం సేకరిస్తూ కూర్చుంటారు. తినగ తినగ వేము తియ్యనుండులాగా ఇదేమీ పరిపక్వతకు సంబంధించిన విషయం కాదు. నైపుణ్యాలు, నాణ్యత పెరగవు. కానీ మీరు మాత్రం రెడీగా ఉండక తప్పదు. యుటిలిటీలు రెడీ కాగానే ఫైల్ చేయండి. వారు అడుతున్న సమాచారం మీ చేతిలో ఉందని బలమైన నమ్మకంతో ఉండండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పటిష్టమైన రాబడికి మార్గం

ఇన్వెస్కో ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్



రిస్క్ ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో బలమైన రాబడికి ఈక్విటీలు చిరునామాగా చెప్పుకోవచ్చు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో పనిచేస్తోంది. తలసరి ఆదాయం 2,800 డాలర్ల స్థాయిలోనే ఉంది. వచ్చే రెండు దశాబ్దాల్లో ఇది ఎన్నో రెట్లు పెరుగుతుందన్నది నిపుణుల అంచనా. తలసరి ఆదాయం పెరగడం ఆర్థిక వ్యవస్థకు బూస్టనిస్తుంది. వినియోగాన్ని మరింత అధికం చేస్తుంది. ఇవన్నీ కంపెనీలు మెరుగైన పనితీరు నమోదు చేసేందుకు దారితీస్తాయి. అంతిమంగా కంపెనీల షేర్ల ధరలు కూడా పరుగులు తీస్తాయి. ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నంత కాలం ఈక్విటీ మార్కెట్లు.. మధ్యమధ్యలో దిద్దుబాట్లను ఎదుర్కొంటూ భారీ రాబడులను తెచ్చిపెడతాయని నిపుణులు విశ్వసిస్తున్నారు. కనుక దీర్ఘకాల లక్ష్యాల కోసం ప్రతి ఒక్కరి పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీలకు తప్పకుండా చోటు కల్పించుకోవాలి. ఈక్విటీల్లోనూ లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ పెట్టుబడుల కలయికతో కూడిన ఫండ్స్ అయితే రిస్కును అధిగమించి మెరుగైన రాబడిని అందిస్తుంటాయి. ఈ విభాగంలో ఇన్వెస్కో ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది.

రాబడులు

గత ఏడాది కాలంలో ఈ పథకం పెట్టుబడులపై 19 శాతం రాబడిని తెచ్చి పెట్టింది. ఇదే కాలంలో బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ టీఆర్ఐ, మిడ్‌క్యాప్ విభాగంలో సగటు రాబడి 7 శాతంలోపే ఉంది. ఇక మూడేళ్లలో చూస్తే ఈ పథకం ఏటా 28.53 శాతం రాబడిని అందించింది. ఐదేళ్లలో 31.52 శాతం, ఏడేళ్లలో 19.62 శాతం, పదేళ్లలో 17.14 శాతం వార్షిక రాబడి చరిత్ర ఈ పథకానికి ఉంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా రిస్కును మరింత సమర్థవంతంగా అధిగమించొచ్చు.



పెట్టుబడుల విధానం.. పోర్ట్‌ఫోలియో

ఈ పథకం 100 శాతం వరకు ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంటుంది. వృద్ధికి అవకాశాలున్న మిడ్‌క్యాప్ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అదే సమయంలో లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనూ చెప్పుకోతగ్గ పెట్టుబడులు పెడుతుంటుంది. రంగాల వారీగా మారుతున్న పరిణామాలను గమనిస్తూ పెట్టుబడుల్లో మార్పులు చేస్తుంటుంది. తద్వారా అధిక రాబడులను తెచ్చిపెట్టే విధంగా పనిచేస్తుంటుంది. ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో 46 స్టాక్స్ ఉన్నాయి. నిర్వహణలో మొత్తం రూ.6,047 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99.94 శాతం మేర ప్రస్తుతం ఇన్వెస్ట్ చేసి ఉంది. ముఖ్యంగా 39.70 శాతం మేర పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఉండడం గమనించొచ్చు. మిడ్‌క్యాప్ కంపెనీలకు 49 శాతం కేటాయింపులు చేయగా, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో మరో 11 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. పెట్టుబడుల్లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. 26.34 శాతం మేర పెట్టుబడులు ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత హెల్త్‌కేర్ కంపెనీల్లో 18.64 శాతం, కన్స్యూమర్ డిస్క్రీషనరీ కంపెనీల్లో 18.33 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీల్లో 10.84 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 9.49 శాతం చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
బీఎస్‌ఈ	5.33
ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్	4.58
ప్రెస్టీజ్ ఎస్టేట్స్	4.31
డిక్సన్ టెక్నాలజీస్	4.23
మ్యాక్స్ హెల్త్‌కేర్	4.08
ఫెడరల్ బ్యాంక్	4.07
ట్రెంట్	3.77
జేకే సిమెంట్	3.65
మ్యాక్స్ ఫైనాన్షియల్	3.63
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ	3.18

70వ ప్రయత్నంలో ఒకరు... 52వ ప్రయత్నంలో మరొకరు

లేటు వయసులో గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ కల నెరవేర్చుకున్న గ్రానోలెర్స్‌- జెబలాస్ జోడీ

పారిస్: పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నిస్తూనే... ఎట్టకేలకు తమ గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ కలను నెరవేర్చుకున్నారు మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్), హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా). గెలవాలన్న కసి ఉండాలేగానీ వయసుతో సంబంధం లేదని వీరిద్దరూ నిరూపించారు. 39 ఏళ్ల గ్రానోలెర్స్ 2007 నుంచి... 40 ఏళ్ల జెబలాస్ 2009 నుంచి గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో పోటీ పడుతున్నారు. చివరకు ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో వీరిద్దరి గ్రాండ్‌స్లామ్ టైటిల్ స్వప్నం సాకారమైంది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ఐదో సీడ్ గ్రానోలెర్స్‌-జెబలాస్ ద్వయం 6-0, 6-7 (5/7), 7-5తో ఎనిమిదో సీడ్ జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జంటను ఓడించి తమ కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకుంది. తాజా ఫ్రెంచ్ ఓపెన్‌కంటే ముందు గ్రానోలెర్స్ 69 సార్లు... జెబలాస్ 51 సార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో బరిలోకి దిగారు. గతంలో గ్రానోలెర్స్... వింబుల్డన్ (2023, 2021), యూఎస్ ఓపెన్ (2019, 2014), ఫ్రెంచ్ ఓపెన్ (2014)లలో... జెబలాస్... వింబుల్డన్ (2023, 2021), యూఎస్ ఓపెన్ (2019)లలో ఫైనల్ చేరినా చివరకు రన్నరప్ ట్రోఫీలతోనే సరిపెట్టుకున్నారు. ఈసారి మాత్రం విజేతలుగా అవతరించి తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. చాంపియన్‌గా నిలిచిన గ్రానోలెర్స్‌-జెబలాస్ జోడీకి 5,90,000 యూరోలు (రూ. 5 కోట్ల 76 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించింది.


డబుల్స్ విన్నర్స్ ట్రోఫీతో జెబలాస్, గ్రానోలెర్స్


డబుల్స్ విన్నర్స్ ట్రోఫీతో పావోలిని-సారా ఎరాని

మహిళల డబుల్స్ విభాగంలో పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ జోడీ జాస్మిన్ పావోలిని-సారా ఎరాని (ఇటలీ) టైటిల్ సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో పావోలిని-సారా ఎరాని ద్వయం 6-4, 2-6, 6-1తో అనా డానిలినా (కజకిస్తాన్)-అలెగ్జాండ్రా క్రునిక్ (సెర్బియా) జంటను ఓడించింది. సారా ఎరానికిది ఆరో గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్. రొబెర్టా విన్సీ (ఇటలీ)తో కలిసి సారా ఎరాని గతంలో యూఎస్ ఓపెన్, వింబుల్డన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్స్ సాధించింది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ సారా ఎరాని ఇటలీకే చెందిన ఆండ్రియా వావసోరితో జతకట్టి టైటిల్ గెలిచింది. మహిళల డబుల్స్ టైటిల్ గెలిచిన పావోలిని-సారా ఎరాని ఖాతాలో 5,90,000 యూరోలు (రూ. 5 కోట్ల 76 లక్షలు) ప్రైజ్‌మనీగా చేరాయి.



400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో మెకింటోష్ ప్రపంచ రికార్డు

మాంట్రియల్: మహిళల స్విమ్మింగ్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. కెనడా జాతీయ ట్రయల్స్‌లో భాగంగా మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ సమ్మర్ మెకింటోష్ ఈ ఘనత సాధించింది. 400 మీటర్లను మెకింటోష్ 3 నిమిషాల 54.18 సెకన్లలో పూర్తి చేసి... 3 నిమిషాల 55.38 సెకన్లతో అరియార్న్ టిట్‌మస్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న వరల్డ్ రికార్డును బద్దలు కొట్టింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో 18 ఏళ్ల మెకింటోష్ 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ ఈవెంట్‌లలో స్వర్ణ పతకాలు సాధించింది. 'కొన్ని నెలలుగా పక్కా ప్రణాళికతో శిక్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నేను అద్భుతం చేస్తానని భావించాను. ప్రపంచ రికార్డు సృష్టించినందుకు అమితానందంగా ఉంది' అని మెకింటోష్ వ్యాఖ్యానించింది. ప్రపంచ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్ సింగపూర్ వేదికగా జూలై 11 నుంచి ఆగస్టు 3 వరకు జరగనుంది. ఈ మెగా ఈవెంట్‌లో మెకింటోష్ ఐదు విభాగాల్లో బరిలోకి దిగనుంది. ప్రపంచ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా స్విమ్మింగ్, వాటర్‌పోలో, డైవింగ్, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్, ఓపెన్ వాటర్ స్విమ్మింగ్, హై డైవింగ్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి.

ఇంగ్లండ్‌ను గట్టెక్కించిన కెప్టెన్ హ్యారీ కేన్



బార్సిలోనా: ఫుట్‌బాల్ ప్రపంచకప్-2026 యూరోప్ జోన్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో మాజీ విశ్వవిజేత ఇంగ్లండ్ జట్టు వరుసగా మూడో విజయం అందుకుంది. గ్రూప్ 'కె'లో భాగంగా అండోరా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1-0 గోల్‌తో గట్టెక్కి ఊపిరి పీల్చుకుంది. కేవలం 80 వేల జనాభ కలిగి, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 173వ స్థానంలో ఉన్న అండోరా జట్టు నుంచి ఇంగ్లండ్‌కు ఊహించని ప్రతిఘటన ఎదురైంది. ఒకదశలో మ్యాచ్ 'డ్రా' అవుతుందా అనే అనుమానం కలిగింది. అయితే ఆట 50వ నిమిషంలో కెప్టెన్ హ్యారీ కేన్ గోల్‌తో ఇంగ్లండ్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. ఇంగ్లండ్ తరఫున 106వ మ్యాచ్ ఆడిన హ్యారీ కేన్ తన ఖాతాలో 72వ గోల్‌ను జమ చేసుకున్నాడు. గ్రూప్ 'కె'లో ఇంగ్లండ్‌తోపాటు అల్బేనియా, లాత్వియా, సెర్బియా, అండోరా జట్లున్నాయి. ప్రస్తుతం ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఇంగ్లండ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. గ్రూప్ 'కె' విజేత జట్టు వచ్చే ఏడాది అమెరికా, మెక్సికో, కెనడాలలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

భారత్ గెలుపు బోణీ



ఆంట్‌వర్ప్: యూరోప్ పర్యటనను భారత జూనియర్ మహిళల హాకీ జట్టు విజయంతో ప్రారంభించింది. ఆతిథ్య బెల్జియం జట్టుతో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున గీతా యాదవ్ (11వ నిమిషంలో), సోనమ్ (40వ నిమిషంలో), లాల్‌థాట్లుయాంగి (45వ నిమిషంలో) ఒక్కోగోల్ చేశారు. బెల్జియం జట్టుకు మేరీ గోన్స్ (25వ నిమిషంలో), లూయిస్ వాన్ హెకీ (34వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఈ పర్యటనలో రెండో మ్యాచ్‌ను మంగళవారం బెల్జియం జట్టుతోనే భారత్ ఆడుతుంది.

ఇంగ్లండ్‌లో గిల్ బృందం ప్రాక్టీస్ షురూ

ఈనెల 20 నుంచి తొలి టెస్టు


జడేజా


బుమ్రా


గిల్

లండన్: ఇంగ్లండ్ చేరుకున్న భారత క్రికెట్ జట్టు అప్పుడే ప్రాక్టీస్ మొదలుపెట్టింది. కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అండ్ కో ప్రయాణ బడలిక నుంచి ఏమాత్రం విశ్రాంతి తీసుకోకుండా లార్డ్స్‌లో తమ ప్రాక్టీస్‌కు పదును పెడుతోంది. స్పీడ్‌స్టర్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్, అర్ష్‌దీప్‌లతో కూడిన పేస్ దళం గంటల తరబడి నెట్స్‌లో చెమటోడ్చింది. సారథి గిల్, వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలు బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో తలమునకలై శ్రమించారు. హెడ్ కోచ్ గంభీర్ పర్యవేక్షణలో భారత ప్రధాన బలగం అంతా ప్రాక్టీస్ చేసింది. గతేడాది టి20 ప్రపంచకప్‌తో పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఇటీవల సంప్రదాయ టెస్టు ఫార్మాట్‌కూ గుడ్‌బై చెప్పాడు. అతనితోపాటే 'కింగ్' కోహ్లి కూడా ఐదు రోజుల ఆటకు రిటైర్మెంట్ ప్రకటించడంతో సెలక్టర్లు శుబ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. దీంతో టీమిండియా 37వ టెస్టు కెప్టెన్‌గా అతను ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల సవాల్‌ను స్వీకరించాడు. 2007లో చివరిసారిగా ఇంగ్లండ్ గడ్డపై టెస్టు సిరీస్ నెగ్గిన భారత్ సుదీర్ఘ నిరీక్షణకు తన తొలి ప్రయత్నంలో తెరదించాలని గిల్ పట్టుదలతో ఉన్నాడు. ప్రధాన సిరీస్‌కు ముందు సన్నాహకంగా భారత జట్టు... భారత్ 'ఎ'తోనే వార్మప్ మ్యాచ్ ఆడనుంది. బెకెన్‌హమ్‌లో ఈ నెల 13 నుంచి 16 వరకు ఈ నాలుగు రోజుల పోటీద్వారా అందరూ మ్యాచ్ ప్రాక్టీస్ పొందనున్నారు. భారత్ కంటే ముందే భారత్ 'ఎ' ఇంగ్లండ్‌కు చేరుకుని ప్రస్తుతం ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో అనధికారిక టెస్టులో పాల్గొంటోంది. టీమిండియాలో భాగమైన పలువురు క్రికెటర్లు 'ఎ' తరఫున ఆడుతున్నారు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా లీడ్స్‌లో ఈ నెల 20 నుంచి తొలి టెస్టు మొదలవుతుంది.

ఇంగ్లండ్‌దే టి20 సిరీస్

రెండో మ్యాచ్‌లోనూ ఓడిపోయిన వెస్టిండీస్

బ్రిస్టల్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు... వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో హ్యారీ బ్రూక్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. జాన్సన్ చార్లెస్ (39 బంతుల్లో 47; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ షై హోప్ (38 బంతుల్లో 49; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), రోవ్‌మన్ పావెల్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జేసన్ హోల్డర్ (9 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆటతీరుతో ఆకట్టుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో ల్యూక్ వుడ్ 2 వికెట్లు తీయగా... బ్రైడన్ కార్స్, జేకబ్ బెథెల్, ఆదిల్ రషీద్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. 197 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు 18.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసి గెలిచింది. బెన్ డకెట్ (18 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (36 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (20 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), బెథెల్ (10 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు), టామ్ బాంటన్ (11 బంతుల్లో 30 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించి ఇంగ్లండ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. సిరీస్‌లోని చివరిదైన మూడో టి20 మ్యాచ్ మంగళవారం సౌతాంప్టన్‌లో జరుగుతుంది.


టామ్ బాంటన్

స్వప్నిల్ గురి అదిరేనా?

- రేపటి నుంచి ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ
- భారత్ నుంచి 36 మంది షూటర్లు బరిలోకి

మ్యూనిక్: పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వప్నిల్ కుసాలే ప్రపంచకప్ పతకాలపై గురి పెట్టేందుకు తాజాగా సిద్ధమయ్యాడు. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) వరల్డ్‌కప్‌లో అతనితో పాటు మహిళా షూటర్, ఒలింపియన్ ఇలవేనిల్ వలారివన్‌లపై భారత్ ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో జరుగుతున్న మూడో ప్రపంచకప్‌కు మ్యూనిక్ వేదిక కాగా... 78 దేశాలకు చెందిన 695 మంది మేటి షూటర్లు పాల్గొంటుండటంతో ప్రతీ ఈవెంట్‌లోనూ గట్టి పోటీ ఉండనుంది. గతేడాది పారిస్‌లో పతకాన్ని సాకారం చేసుకున్న కుసాలే ఈ ఏడాది దేశవాళీ సర్క్యూట్‌లో తన ఫామ్‌ను కొనసాగించాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో భారత ఆశాకిరణమయ్యాడు. రెండుసార్లు ఒలింపియన్ అయిన తమిళనాడు షూటర్ ఇలవేనిల్ పారిస్ మెగా ఈవెంట్ తర్వాత తిరిగి ఇప్పుడే అంతర్జాతీయ ఈవెంట్‌లో గురి పెట్టేందుకు సన్నద్ధమైంది. ఆమె గతంలో బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా), లిమా (పెరూ) ఈవెంట్లలో పాల్గొన్నప్పటికీ ఈ రెండు కేవలం ర్యాంకింగ్ పాయింట్ల (ఆర్‌పీఓ)కు పరిమితమైన పోటీలు మాత్రమే! వీటిని అంతర్జాతీయ షూటింగ్ పోటీలుగా పరిగణించరు. వీరిద్దరితో పాటు ఆసియా క్రీడల చాంపియన్ పలక్ గులియా మహిళల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో పతకాలపై గురి పెట్టనుంది. ఈ హరియాణా షూటర్‌తో పాటు కొత్తగా ఈ ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయబోతున్న జాతీయ ఎయిర్ రైఫిల్ చాంపియన్ అనన్య నాయుడు, పురుషుల ఈవెంట్‌లో ఆదిత్య మల్రా, నిశాంత్ రావత్ కొత్తగా వరల్డ్‌కప్ బరిలో దిగుతున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ షూటర్ల నుంచి వచ్చే సవాళ్లను ఏ మేరకు ఎదుర్కొంటారో చూడాలి. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ నుంచి 36 మంది షూటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మద్దినేని ఉమామహేశ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పోటీ పడనున్నాడు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు నెగ్గిన పిస్టల్ షూటర్ మను భాకర్ ఈ ఏడాది రెండోసారి ప్రపంచకప్ టోర్నీ ఆడనుంది. లిమాలో జరిగిన ప్రపంచకప్ టోర్నీలో మను 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రజత పతకాన్ని సాధించింది.

ఈ సీజన్‌లో ఇప్పటికే రెండు ప్రపంచకప్‌లు అర్జెంటీనా, పెరులో జరిగాయి. ఈ రెండు మెగా ఈవెంట్లలో కలిపి భారత్ ఆరు స్వర్ణాలు సహా 15 పతకాలు గెలుపొందింది. ఈ ప్రదర్శన ద్వారా అర్జెంటీనాలో రెండో స్థానం, పెరు ఈవెంట్‌లో మూడో స్థానంలో భారత్ నిలిచింది. అయితే మ్యూనిక్‌లో మాత్రం ఎక్కువ దేశాల నుంచి వందల సంఖ్యలో మేటి షూటర్లంతా బరిలో ఉండటంతో భారత్ ఏ స్థానంలో నిలుస్తుందో ఆసక్తికరంగా మారింది. చైనా తమ చాంపియన్ షూటర్లు జియి యు, లి యుహాంగ్ సహా 22 మందితో మ్యూనిక్‌కు చేరుకోగా... ఆతిథ్య జర్మనీ మాజీ ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ క్రిస్టియాన్ రిట్జ్, అన జాన్సెన్ సహా 27 మంది మేటి షూటర్లతో పతకాలపై గురి పెట్టింది. మరోవైపు ఫ్రాన్స్ తమ దిగ్గజ షూటర్ జీన్ క్విక్వాంపాయిక్స్‌తో పాటు 16 మందితో ప్రపంచకప్‌కు రెడీ అయ్యింది. ఇద్దరు ఒలింపిక్ చాంపియన్లు యంగ్ జిన్, ఒ యెజిన్‌లతో కూడిన 19 మంది కొరియన్ బృందం కూడా పతకాలు కొల్లగొట్టేందుకు సై అంటోంది. వీరితో పాటు పలువురు పారిస్ ఒలింపిక్ పతక విజేతలు, అమెరికా, ఇటలీ, కజకిస్తాన్ స్టార్ షూటర్లు మ్యూనిక్ వరల్డ్‌కప్‌కు వన్నెతెచ్చే రసవత్తరపోటీకి 'ఢీ అంటే ఢీ' అంటున్నారు.


మను భాకర్


స్వప్నిల్ కుసాలే

ఫ్రాన్స్‌కు మూడో స్థానం

మ్యూనిక్: నేషన్స్ కప్ యూరోపియన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఫ్రాన్స్ జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. జర్మనీ జట్టుతో ఆదివారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో కిలియాన్ ఎంబాపె నాయకత్వంలోని ఫ్రాన్స్ జట్టు 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆట 45వ నిమిషంలో ఎంబాపె గోల్‌తో ఫ్రాన్స్ జట్టు ఖాతా తెరిచింది. 84వ నిమిషంలో ఎంబాపె అందించిన పాస్‌ను మైకేల్ ఒలీస్ లక్ష్యానికి చేర్చడంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కు పెరిగింది. సెమీఫైనల్స్‌లో ఫ్రాన్స్ 4-5తో స్పెయిన్ చేతిలో, జర్మనీ 1-2తో పోర్చుగల్ చేతిలో ఓడిపోవడంతో మూడో స్థానం కోసం పోటీపడాల్సి వచ్చింది.



పద్మనాభునికి కుంభాభిషేకం



ఆదివారం తిరువనంతపురంలో ప్రఖ్యాత అనంత పద్మనాభస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక వేడుక కన్నులపండువగా జరిగింది. దీన్ని 270 ఏళ్ల అనంతరం నిర్వహించడం విశేషం.

రేడియో జోష్



ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్‌లో కమ్యూనిటీ రేడియో 'ఐబెక్స్ తరానా' సేవలను ప్రారంభించిన సందర్భంగా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

100 రోజుల పాలన



ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ఆదివారంతో 100 రోజులు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని 24 సెక్టర్ జేఎస్‌సీలో ఓ స్థానికురాలి నివాసంలో ఇలా భోజనం చేశారు.

తొలిసారి తుంటిమార్పిడి



యూపీలోని బరేలీలో తుంటి మార్పిడి శస్త్రచికిత్స అనంతరం చక్కగా నుంచున్న శునకం. కుక్కలకు ఈ తరహా ఆపరేషన్ మన దేశంలో ఇదే తొలిసారి.

లాస్ ఏంజెలెస్‌లో... ముదురుతున్న రగడ

రంగంలోకి నేషనల్ గార్డ్
- ఆందోళనల్ని అణచివేస్తాం: ట్రంప్
- నిరసనకారుల్ని అధ్యక్షుడే రెచ్చగొడుతున్నారు: మేయర్
- కొనసాగుతున్న వలసదారుల అరెస్టులు, ఆందోళనలు



నిరసనలో భాగంగా వాహనాల రాకపోకలను అడ్డుకుంటూ రహదారిపై వస్తువులను తగలబెడుతున్న ఆందోళనకారులు



పారామౌంట్ పట్టణంలో పోలీసులపైకి రాళ్లు రువ్వుతున్న నిరసనకారుడు

పారామౌంట్(యూఎస్): అమెరికాలోకి అక్రమంగా చొరబడిన వారిని పట్టుకునేందుకు ట్రంప్ సర్కార్ మొదలెట్టిన ఏరివేత కార్యక్రమం మరింత ఉద్రిక్తంగా మారింది. అక్రమ అరెస్టులను ఆపితే ఆందోళనలు తగ్గుముఖం పడతాయని, బలగాలను మోహరించి సమస్యను మరింత జటిలతరం చేయొద్దని విపక్ష డెమొక్రటిక్ పాలిత నగరాల మేయర్లు మొత్తుకుంటున్నాసరే ట్రంప్ ప్రభుత్వం 'నేషనల్ గార్డ్' బలగాలను రంగంలోకి దింపింది. ఒక్క లాస్ ఏంజెలెస్ పరిధిలోనే ఏకంగా 2,000 మంది కాలిఫోర్నియా నేషనల్ గార్డ్ సభ్యులు మోహరించారు. దీంతో వీరికి దీటుగా వందలాది మంది ఆందోళనకారులు తమ నిరసనలను ఉధృతంచేశారు. రెండో రోజూ రోడ్లపై చేరి ఫెడరల ఏజెంట్లు, ఎఫ్‌బీఐ, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పారామౌంట్ పట్టణంలోనూ..

లాస్ ఏంజెలెస్ సిటీ శివారులోని పారామౌంట్ పట్టణంలో హోంశాఖ వద్ద వందలాది మంది నిరసనకారులు గుమిగూడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేశారు. దీంతో వీళ్లను చెదరగొట్టేందుకు పోలీసులు అత్యంత తీక్షణ కాంతిని వెదజల్లే ఫ్లాష్ బ్యాంగ్ గ్రనేడ్లను విసిరారు. రబ్బర్ బుల్లెట్లను షూట్‌చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. లాస్ ఏంజెలెస్‌లో పలు ప్రాంతాల్లో ఆందోళనకారులపైకి పోలీసులు ఇలా భాష్పవాయు గోళాలు, పెప్పర్ బాల్స్, పొగ బాంబులను ప్రయోగించారు. పోలీసులు ప్రయాణిస్తున్న బోర్డర్ పెట్రోల్ వాహనాలపైకి ఆందోళనకారులు ఇటుకలు, రాళ్లు విసిరారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వాహనాల రాకపోకలు స్తంభింపజేస్తూ వలసదారులు రోడ్లపై టైర్లను కాల్చిపడేశారు. ఇటీవలికాలంలో లాస్ ఏంజెలెస్ పరిధిలో 118 మంది వలసదారులు, ఐదుగురు నేరస్తులను అరెస్ట్‌చేసినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకటించింది.

సైన్యాన్ని దింపుతాం: రక్షణ మంత్రి హెచ్చరిక

'అక్రమ వలసదారులు, నేరగాళ్లను పట్టుకునేందుకు ఫెడరల్ ఏజెంట్లు చేస్తున్న ముమ్మర గాలింపు చర్యలను ఆందోళనకారులు ఇలాగే అడ్డుకుంటే అనివార్యపరిస్థితుల్లో మేం సైన్యాన్ని రంగంలోకి దింపాల్సి ఉంటుంది. క్యాంప్ పెడల్టన్‌లోని మెరైన్‌లనూ రప్పిస్తాం' అని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. మరోవైపు పారామౌంట్, కాంప్టన్ పట్టణాల్లో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఒక కారుకు నిప్పంటించారు. పారామౌంట్ బిజినెస్ పార్క్ వద్ద ఇమిగ్రేషన్ అధికారులను ఆందోళనకారులు అడ్డుకున్నారు. బాణసంచా కాలుస్తూ, షాపింగ్ కార్ట్‌లను రోడ్లపై పడేశారు. బోర్డర్‌పెట్రోల్ వాహనశ్రేణిపై రాళ్లు రువ్వారు. లాస్ ఏంజెలెస్ ఫెడరల్ డిటెన్షన్ భవనం వద్ద సైతం గుమిగూడి అరెస్టయిన వాళ్లను విడుదల చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో వారిలో కొందరు పోలీసులు అరెస్ట్‌చేశారు. ''వారెంట్ల ప్రకారం సైతం చాలా మంది అక్రమవలసదారులను ఆదివారం సైతం అరెస్ట్‌చేశాం. డ్యూటీ నిర్వహణకు అడ్డుపడిన డజన్లకొద్దీ జనాలనూ అరెస్ట్‌చేశాం'' అని యూఎస్ అటార్నీ బిల్ ఈజీలీ ప్రకటించారు. అరెస్ట్ అయిన వారి ఫొటోలను తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు. అక్రమ వలసదారుల ఏరివేత వేళ ఇమిగ్రేషన్, కస్టమ్స్ అధికారులకు ఎన్‌జీ బలగాలు తాత్కాలికంగా రక్షణగా ఉంటాయని ట్రంప్ చెప్పారు.

నేషనల్ గార్డ్ రంగప్రవేశంపై అభ్యంతరాలు

రాష్ట్రాల్లో శాంతి భద్రతల అంశాన్ని రాష్ట్రాలే పరిష్కరించుకుంటాయి. కానీ ట్రంప్ ఇలా అధ్యక్షుడి అసాధారణ అధికారాలను ఉపయోగించి నేషనల్ గార్డ్‌ను రప్పించడంపై లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ బలగాలపై గవర్నర్‌కే అధికారాలుంటాయి. కానీ టైటిల్ 10 అధికారాన్ని ఉపయోగించి నేషనల్ గార్డ్ బలగాలను ట్రంప్ రప్పించారు. గతంలో పౌరహక్కుల ఉద్యమం సమయంలోనూ దేశాధ్యక్షుడు ఈ టైటిల్10ను వాడి నేషనల్ గార్డ్ బలగాలను ఆయా ఉద్యమప్రాంతాలకు తరలించారు. గత అధ్యక్షులు ఐసన్‌హోవర్, జాన్ ఎఫ్.కెన్నడీ, జాన్సన్‌లూ ఈ నిబంధనను ప్రయోగించారు. 1967 డెట్రాయిట్ ఆందోళనలు, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యానంతరం సైతం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎన్‌జీ బలగాలను రప్పించారు. 1970 న్యూయార్క్ పోస్టల్ ఉద్యమాన్ని అణచివేసేందుకు ఆనాడు ఎన్‌జీ రంగంలోకి దిగింది. చివరిసారిగా 1992లో ఒక నల్లజాతీయుడిని నలుగురు శ్వేతజాతి పోలీసులు దారుణంగా కొట్టినప్పుడు లాస్ ఏంజెలెస్‌లో అల్లర్లు చెలరేగినప్పుడు ఎన్‌జీ బలగాలొచ్చాయి.

ఢిల్లీలో స్వల్ప భూకంపం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో శనివారం అర్ధరాత్రి దాటాక స్వల్ప భూకంపం సంభవించింది. ఈ విషయం కాస్తంత ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి దాటాక 1.23 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 2.3 తీవ్రతతో స్వల్ప భూకంపం సంభవించింది. ఆగ్నేయ ఢిల్లీలో ఉపరితలం నుంచి 5 కిలోమీటర్ల లోతులో భూకంపకేంద్రాన్ని గుర్తించారు. భూమి కేవలం స్వల్పస్థాయిలో కంపించడంతో ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టంచేశారు. ఈ ఏడాది ఢిల్లీ కేంద్రంగా భూకంపం రావడం ఇది రెండోసారి. ఈ ఏడాది ఫిబ్రవరి 17వ తేదీ ఉదయం 5.36 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 4 తీవ్రతతో భూమి కంపించింది. ప్రస్తుతం ఢిల్లీ నాలుగో జోన్‌లో ఉంది. ఇది దేశంలోని భూకంపాల ప్రభావాలకు లోనయ్యే రెండో తీవ్ర ప్రమాదజోన్. హిమాలయాల కింద పొరలు తరచూ ఢీకొనే జోన్‌కు ఢిల్లీ దగ్గర్లో ఉంది. అదీకాకుండా ఢిల్లీ నుంచి కేవలం 250 కిలోమీటర్ల దూరం నుంచే హిమాలయ శ్రేణి మొదలవుతుంది. ఢిల్లీ–హరిద్వార్, సోహ్నా, మహేంద్రగఢ్–డెహ్రాడూన్ ఫలకాలు సైతం తరచూ కదులుతూ ఢిల్లీని భూకంపాల జోన్‌లోకి నెట్టేస్తున్నాయి. దీంతో ఢిల్లీకి భూకంపాల ముప్పు ఎక్కువైంది.

రాజకీయ జాతీయవాదం వద్దు: పోప్



వాటికన్ సిటీ: ప్రపంచవ్యాప్తంగా రాజకీయ జాతీయవాద పోకడలు పెరిగిపోతుండడం పట్ల పోప్ లియో–14 ఆందోళన వ్యక్తంచేశారు. రాజకీయ జాతీయవాదం వద్దని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ నుంచి సందేశం ఇచ్చారు. ఏవైనా వివాదాలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. విద్వేషాలు వీడాలని, అవరోధాలు తొలగించుకోవాలని, అడ్డుగోడలను ధ్వంసం చేయాలని పేర్కొన్నారు.

అవయవదానంలో వాయుసేన సాయం

న్యూఢిల్లీ: అవయవాల స్వీకరణ తర్వాత ఐదుగురు వ్యక్తులు కొత్త జీవితం ఆరంభించేందుకు భారత వాయుసేన తనవంతు సాయంచేసింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు అవయవాలను తరలించేందుకు కృషి చేసి శెభాష్ అనిపించుకుంది. శనివారం సంబంధిత ఫొటోలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేసింది. శుక్రవారం బ్రెయిన్‌డెడ్ కారణంగా జీవన్మృతుడిగా మారిన ఒక రోగి నుంచి సేకరించిన పలు కీలక అవయవాలను వాయుసేన విమానాల్లో తరలించి సమయానికి గమ్యస్థానానికి చేర్చారు. ఈ ప్రక్రియలో కమాండ్ హాస్పిటల్ ఎయిర్‌ఫోర్స్ బెంగళూరు (సీహెచ్‌ఏఎఫ్‌బీ) కీలకపాత్ర పోషించింది. బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరించిన ఒక మూత్రపిండం, కార్నియాను హుటాహుటిన విమానంలో ఢిల్లీలోని ఆర్మీ (రీసెర్చ్, రిఫెరల్) ఆస్పత్రికి తరలించారు. మరో కిడ్నీ, కార్నియా, స్కిన్‌ను బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రి వైద్యనిపుణుల సాయంతో సీహెచ్‌ఏఎఫ్‌బీకు తరలించారు. కాలేయంను గ్లెన్‌ఈగల్స్ బీజీఎస్ ఆస్పత్రిలోని మరో రోగిని విజయవంతంగా అమర్చారు. 'జీవన్‌సార్థకతే కర్ణాటక సంస్థ ఆధ్వర్యంలో ఈ పనిని దిగ్విజయంగా పూర్తిచేశాం. పౌరులకు సాయపడటంలో సాయుధ బలగాల వైద్యవిభాగ అకుంఠిత దీక్ష, పట్టుదలకు ఈ ఘటన అద్దంపడుతోంది'' అని ఐఏఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

జర్నలిస్ట్‌ను బెదిరించిన ఖలిస్తానీ మద్దతుదారులు

కెనడాలోని వాంకోవర్ సిటీలో ఘటన

- దుండగుల్లా వ్యవహరించారన్న కెనడా పాత్రికేయుడు



వాంకోవర్: కెనడా గడ్డపై తరచూ భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఖలిస్తానీవేర్పాటువాదులు తాజాగా కెనడియన్ జర్నలిస్ట్‌ను బెదిరించారు. ర్యాలీని తన కెమెరాలో రికార్డ్‌చేస్తున్నందుకు జర్నలిస్ట్ మోకా బెజిర్‌గన్‌ను కొట్టినంత పనిచేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన తాలూకూ వివరాలను మోకా తర్వాత వెల్లడించారు. ఉద్యమకారులంతా దుండగుల్లా వ్యవహరించారని, ఉద్దేశపూర్వకంగా తనను లక్ష్యంగా చేసుకున్నారని మోకా చెప్పారు. '' ఈ ఘటన జరిగిన రెండు గంటలవుతున్నా నా శరీరం ఇంకా వణికిపోతోంది. ఇండిపెండెంట్ జర్నలిస్ట్ అని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించారు. నన్ను చుట్టుముట్టి బెదిరించారు. నా ఫోన్ బలవంతంగా లాక్కున్నారు. గతంలో ఖలిస్తానీ ఉద్యమాలపై సొంతంగా రిపోర్టింగ్ చేసినందుకు నాపై కక్షగట్టారు. ఖలిస్తానీవేర్పాటువాదులపై నేను తటస్థ వైఖరిని ప్రదర్శించడం వాళ్లకు నచ్చలేదనుకుంటా. అందుకే నన్ను కొట్టినంత పనిచేశారు. కెనడా, బ్రిటన్, అమెరికా, న్యూజిలాండ్‌లలో ఖలిస్తానీయుల వైఖరిని నా రిపోర్టింగ్ ద్వారా ప్రపంచానికి తెలియజేశా. అందుకే గతంలో వీళ్లు నన్ను ఆన్‌లైన్‌లో ఇష్టమొచ్చిన పదజాలంతో తిట్టారు. ఆదివారం వాంకోవర్‌లో వాళ్ల ర్యాలీని నేను కెమెరాలో రికార్డ్‌చేస్తుంటే అడ్డుకున్నారు. టచ్ చేస్తే ఊరుకునేది లేదని బెదిరించారు. నా పనికి అడ్డురావొద్దని వారించినా వాళ్లు వినిపించుకోలేదు. పదేపదే నా వెనకాల పడ్డారు. ముఖ్యంలో వారిలో ఒకడు నన్ను బాగా ఇబ్బంది పెట్టాడు. అందుకే అతనిపై పోలీసులకు ఫిర్యాదుచేశా. గతంలోనూ అతనిపై ఫిర్యాదుచేశా'' అని జర్నలిస్ట్ మోకా తర్వాత ఒక వీడియోను విడుదలచేశారు. కెనడాలో ఖలిస్తానీవేర్పాటువాదుల ఆగడాలు ఎక్కువయ్యాయని అక్కడి అధికార యంత్రాంగానికి భారత ప్రభుత్వం పలుమార్లు ఫిర్యాదుచేసినా కెనడా సర్కార్‌లో ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం. దీంతో ఖలిస్తానీ సానుభూతిపరులకు కెనడా స్వర్గధామంగా తయారైంది.

11న ఇమ్రాన్ ఖాన్ విడుదల?


ఇస్లామాబాద్: అల్–ఖాదిర్ ట్రస్ట్ కేసులో బెయిల్ లభిస్తే జూన్ 11వ తేదీన పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ జైలు నుంచి విడుదలయ్యే వీలుందని పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ చీఫ్ గోహర్ అలీఖాన్ ప్రకటించారు. దాదాపు రూ.2,200 కోట్ల అల్–ఖాదిర్ యూనివర్సిటీ ట్రస్ట్ కేసులో ఇమ్రాన్ ఖాన్, అతని భార్య బుష్రా బీబీలకు పడిన శిక్షలను రద్దుచేయాలంటూ దాఖలైన పిటిషన్లపై ఇస్లామాబాద్ హైకోర్టు జూన్ 11న నిర్ణయం తీసుకోనుందని అలీఖాన్ ఆదివారం చెప్పారు. పదవి కోల్పోయాక 72 ఏళ్ల ఇమ్రాన్ 2023 ఆగస్ట్ నుంచి రావల్పిండి నగరంలోని అడియాలా జైలులో గడుపుతున్నారు.

ఇక ఇ-స్కూటర్ పెట్రోలింగ్



కొత్తగా సమకూర్చుకున్న సెల్ఫ్ బ్యాలెన్సింగ్ ఈ-స్కూటర్లపై జైపూర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ప్రఖ్యాత హవామహల్ మీదుగా ఇలా పెట్రోలింగ్ చేశారు


విమానం నుంచి కిసిక్



జమ్మూ కశ్మీర్‌లో రెండ్రోజుల క్రితం ప్రారంభమైన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వే బ్రిడ్జి అందాలను విమాన ప్రయాణికులు ఇలా తమ మొబైళ్లలో బందిస్తున్నారు. ఇందుకోసం పైలట్లు ప్రత్యేక అనౌన్స్‌మెంట్లు చేస్తుండటం విశేషం.

కాలుష్య కణాల గుట్టువిప్పిన గణితవేత్త

- వాతావరణ అంచనా సిద్ధాంతాల్లో లోపాలను సరిచేసిన మేథమెటీషియన్
- భిన్న ఆకృతుల్లోని కాలుష్య అణువులనూ లెక్కగట్టే సూత్రాల అభివృద్ధి



పరిశ్రమల నుంచి, వాహనాల నుంచి వెలువడుతూ భూతాపోన్నతికి కారణమవుతున్న పొగ, కాలుష్యకారక కణాల గురించి శాస్త్రవేత్తలకు ఇప్పటికే ఒక అవగాహన ఉంది. వీటి కారణంగా ఏ స్థాయిలో కాలుష్యం సంభవిస్తోందో, వాతావరణ మార్పులో వీటి ప్రభావ స్థాయిలను పర్యావరణ వేత్తలు ఇప్పటికే అంచనావేయగల్గుతున్నారు. అయినాసరే ఆకస్మిక వర్షాలు, వరదలు వంటి వాటిని ఇప్పటికీ సరిగా అంచనావేయలేని పరిస్థితి. వీటికి కారణంగా గోళాకృతిలో లేని ఇతర రకాల కణాలు కారణమని శాస్త్రవేత్తలు కనుగొన్నారుగానీ వీటి పరిమాణాన్ని, ప్రభావాన్ని గణించే విధానాన్ని అభివృద్ధిచేయలేకపోయారు. గత 15 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు ఆస్ట్రేలియాలోని మాక్వైరెటన్ విశ్వవిద్యాలయంలోని గణిత శాస్త్రవేత్త, అసోసియేట్ ప్రొఫెసర్ స్టార్ట్ హాకిన్స్ పరిష్కారం కనుగొన్నారు. దీంతో మరింత ఖచ్చితత్వంతో వాతావరణ అంచనా సుసాధ్యంకానుంది. 2008లో వాతావరణ భౌతికశాస్త్రవేత్త మైఖేల్ బాక్స్ చేసిన ఒక ప్రసంగాన్ని హాకిన్స్ విన్నారు. వాతావరణ మార్పులకు కారణమవుతున్న అన్ని ఆకృతుల కాలుష్యకణాలను లెక్కించకుండా మనం చేసే వాతావరణ అంచనాలు భవిష్యత్తులో అంత నిరుపయోగంగా మారే ప్రమాదంఉంది''అని మైఖేల్ బాక్స్ చేసిన ప్రసంగం హాకిన్స్‌ను ఆలోచనల్లో పడేసింది. ఈ గజిబిజి ఆకృతుల కణాలను లెక్కగట్టే విధానాన్ని అభివృద్ధిచేసి ఈ పొల్యూషన్ పొడుపు ప్రశ్నకు సమాధానం వెతకాలని నిశ్చయించుకుని ఎట్టకేలకు 15 ఏళ్ల తర్వాత ఆ పనిలో సఫలీకృతులయ్యారు.

ఏమిటీ కణాలు?

వాహనాలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడే ధూళి కణాలు గోళాకృతిలో ఉంటాయి. కానీ రాజస్తాన్‌లోని థార్‌ఎడారిసహా పలు గనుల తవ్వకం వంటి చోట్ల శిలలు క్రమంగా ఒరుసుకుపోయి, కోతకు గురై అత్యంత సూక్ష్మ శిలా కణాలు ఉద్భవించి గాల్లో కలుస్తున్నాయి. జీవఇంధనాలు మండించినప్పుడు వెలువడే కొన్ని రకాల నుసి సైతం భిన్నాకృతిలో ఉంటోంది. ఢిల్లీలో చలికాలంలో నిర్మాణ పనుల వేళ గాల్లో కలిసే పరిశ్రమల వ్యర్థాల నుంచి సైతం వేర్వేరు ఆకృతుల్లో ధూళి కణాలు వెలువడుతున్నాయి. వీటిని ప్రస్తుతమున్న వాతావరణ సిద్ధాంతాలతో గణించడం కష్టం. ఈ కణాలు గాల్లో అధికమై సూర్యరశ్మి భూమిపై పడకుండా అడ్డుకుని భూమిని చల్లబరచవచ్చు లేదంటే భూమి నుంచి వేడి బయటకు పోకుండా అడ్డుకుని భూతాపోన్నతికి కారణం కావచ్చు. ఈ రెండు దృగ్విషయాలను సైతం గోళాకృతియేతర కణాల కోణంలో లెక్కించాల్సి ఉంది. ప్రసరణ దిశలో ఏదైనా వస్తువు అడ్డుగా ఉంటే కాంతి దిశను మార్చుకుంటుంది. ఈ సిద్ధాంతాన్ని ఈ అసాధారణ ఆకృతి కణాలకు అన్వయిస్తూ కంప్యూటేషన్ మెథడ్‌ను హాకిన్స్ రూపొందించారు. ఇప్పుడీ గణిత సూత్రాలు భవిష్యత్తులో వైద్య ఇమేజింగ్ సాంకేతికతల ఆధునీకరణకూ ఉపయోగపడనున్నాయి. అల్ట్రాసౌండ్ , ఎంఆర్ఐ వంటి సాంకేతికతలు తరంగాలు మన శరీరంలో ఎలా ప్రయాణిస్తాయనే సూత్రాలపైనే ఆధారపడి పనిచేస్తాయి. కొత్త గణిత సూత్రాలతో అత్యాధునిక అల్ట్రాసౌండ్ , ఎంఆర్ఐ తీయొచ్చు. పలు రకాల కోటింగ్‌లలోనూ విరివిగా వాడొచ్చు. ఈ సూత్రాలను కాంతి విక్షేపణకు సంబంధించిన ప్రతి రంగంలోనూ ఉపయోగించవచ్చు. వడగాల్పులు, రుతుపవన అంచనాలు, కాలుష్య ప్రభావాలు వంటిలోనూ ఈ సూత్రాలను వాడొచ్చు. దీంతో వాతావరణ ముందస్తు హెచ్చరిక వ్యవస్థను మరింత బలోపేతం చేయొచ్చు. ఈ పరిశోధనా వివరాలు 'క్వాంటిటేటివ్ స్పెక్ట్రోస్కోపీ, రేడియేటివ్ ట్రాన్స్‌ఫర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

అంతరిక్షంలో అంతుబట్టని వస్తువు

దానినుంచి ఎక్స్, రేడియో తరంగాలు • ముప్పావు గంటకోసారి బలమైన సంకేతాలు



అంతరిక్షం అనంత రహస్యాల పుట్ట. మానవుడు ఇప్పటికీ గుర్తించని వింతలు, విడ్డూరాలకు అంతరిక్షంలో కొదవేలేదు. ఖగోళ శాస్త్రవేత్తలకు తాజాగా ఓ వింత అనుభవం ఎదురైంది. డీప్ స్పేస్‌లో ఓ గుర్తు తెలియని వస్తువును కనిపెట్టారు. అదేమిటన్నది వారికే అంతుబట్టడం లేదు. ఆ వస్తువు నుంచి రేడియో, ఎక్స్ తరంగాలు వెలువడుతున్నట్లు గుర్తించారు. అందులో తరచుగా పేలుళ్లు సంభవిస్తూ తరంగాలను ఉత్పత్తి చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ వివరాలను జర్నల్ నేచర్‌లో ప్రచురించారు. ఈ అంతుబట్టని వస్తువు నుంచి ప్రతి 44 నిమిషాలకోసారి రెండు నిమిషాల పాటు బలమైన సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది చాలా అసాధారణమని సైంటిస్టులు అంటున్నారు. ఇలాంటి పరిణామం మునుపెన్నడూ చూడలేదని స్పష్టంచేస్తున్నారు. ఇప్పటిదాకా అంతరిక్షంలో గుర్తించిన వస్తువుల్లో ఇలా తక్కువ సమయంలో తరచుగా సంకేతాలు వెలువడినట్లు తేలలేదు. ఈ కొత్త వస్తువును లాంగ్ పిరియడ్ ట్రాన్సియంట్(ఎల్‌పీటీ) కేటగిరీలో చేర్చారు. ఇది మ్యాగ్నేటర్ కావొచ్చని అంచనా వేస్తున్నారు. మృత నక్షత్రానికి చెందిన అత్యధిక అయస్కాంత శక్తి కలిగిన అవశేషాన్ని మ్యాగ్నేటర్ అంటారు. రాబోయే రోజుల్లో రేడియో, ఎక్స్–రే టెలిస్కోప్‌ల ద్వారా ఇలాంటి వస్తువులను మరిన్ని గుర్తించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. విశ్వం ఆవిర్భావం గురించి మరింత సమాచారం తెలుసుకోవడానికి ఇవి దోహదపడతాయని చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

74వ రాజ్యాంగ సవరణ

పట్టణ, నగర పాలక సంస్థలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

మన దేశంలో పట్టణ, నగరాల్లో పౌర సదుపాయాల కల్పనకు పట్టణ స్థానిక ప్రభుత్వాలున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8 రకాలైన పట్టణ స్థానిక ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి.

పట్టణ స్థానిక ప్రభుత్వాలు

1. మునిసిపల్ కార్పొరేషన్
2. నోటిఫైడ్ ఏరియా కమిటీ
3. కంటోన్మెంట్ బోర్డ్
4. పోర్ట్ ట్రస్ట్, 5. మునిసిపాలిటీ
6. టౌన్ ఏరియా కమిటీ
7. టౌన్‌షిప్,
8. ప్రత్యేక ప్రయోజన సంస్థలు

దేశంలో తొలిసారిగా 1687లో మద్రాస్‌లో మునిసిపల్ కార్పొరేషన్‌ను బ్రిటిష్‌వారు ఏర్పాటు చేశారు. 1726లో బాంబే, కలకత్తా కార్పొరేషన్లు ఏర్పడ్డాయి. 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 1993, జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది.

74వ రాజ్యాంగ సవరణ

పట్టణ స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలను రాజ్యాంగంలో 'IXA' భాగంలో ప్రకరణ 243P నుంచి 243ZG వరకు పొందుపరిచారు.

- మునిసిపాలిటీ: 243Q ప్రకరణ కింద ఏర్పాటైన స్థానిక స్వపరిపాలన సంస్థ.
- పంచాయతీ: 243B ప్రకరణ కింద పంచాయతీగా ఏర్పడిన ప్రాంతం.
- జనాభా: చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగి, నోటిఫై అయిన సందర్భంలో నిర్ధారించిన జనాభా.

243Q మునిసిపాలిటీల నిర్మాణం గురించి తెలుపుతోంది.

- గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా పరివర్తన చెందుతున్న ప్రాంతాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు.
- చిన్న పట్టణాల్లో మునిసిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు.
- పెద్ద పట్టణాల్లో మునిసిపల్ కార్పొరేషన్లు ఉంటాయి.
- పట్టణంగా పరివర్తన చెందుతున్న ప్రాంతం, చిన్న పట్టణం, పెద్ద పట్టణం వంటి అంశాలకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ సరైన అర్థ వివరణ ఇస్తారు.

మునిసిపాలిటీ ఎన్నికలు

ప్రకరణ **243R** మునిసిపాలిటీల నిర్మాణం, ఎన్నికల గురించి తెలియజేస్తోంది.

- మునిసిపాలిటీ సభ్యులను (అన్ని స్థాయిల్లో) ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.
- మునిసిపాలిటీ సభ్యుల కూర్పు, అధ్యక్ష ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ రూపొందిస్తుంది.
- నగర పంచాయతీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ అధ్యక్షుల ఎన్నిక రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ నిర్ణయించిన మేరకు ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో జరుగుతుంది.
- సంబంధిత మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా కొనసాగుతారు.

వార్డు కమిటీలు

- ప్రకరణ **243S** ప్రకారం 3 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన మునిసిపాలిటీల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వార్డులను కలిపి వార్డు కమిటీలను ఏర్పాటు చేయొచ్చు.
- వార్డ్ కమిటీ ఏర్పడినప్పుడు సంబంధిత వార్డ్ ప్రతినిధిని ఆ కమిటీకి అధ్యక్షుడిగా నియమించాలి. రెండు లేదా అంతకంటే ఎక్కువ వార్డులతో వార్డు కమిటీ ఏర్పాటు చేస్తే ఆయా వార్డుల ప్రతినిధులు తమలో ఒకర్ని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- కార్పొరేషన్‌లో వార్డ్ కమిటీల సంఖ్య 50కి తగ్గకుండా, 100కి మించకుండా ఉండాలి.

రిజర్వేషన్స్

ప్రకరణ 243T రిజర్వేషన్ల గురించి పేర్కొంటుంది.

- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో ఆయా వర్గాలకు చెందిన మహిళలకు 1/3 వంతు స్థానాలను రిజర్వ్ చేయాలి.
- మొత్తం స్థానాల్లో కనీసం 1/3 వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి.
- రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలి.
- రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని కలిగి ఉంది.

పదవీ కాలం, అనర్హతలు

ప్రకరణ 243U పదవీ కాలం గురించి తెలుపుతోంది. అన్ని స్థాయిల్లోని సభ్యులు, అధ్యక్షుల పదవీ కాల పరిమితి ఐదేళ్లు. ప్రకరణ 243V అనర్హతల గురించి పేర్కొంటోంది.

- పంచాయతీరాజ్ వ్యవస్థలో అన్ని స్థాయిల్లో అధ్యక్ష, సభ్యుల అర్హతలను నిర్ణయించే అధికారం రాష్ట్ర శాసన నిర్మాణశాఖకు ఉంటుంది.
- పార్లమెంటుకు, అసెంబ్లీలకు పోటీచేసే అభ్యర్థులకు వర్తించే అర్హత, అనర్హత నిబంధనలే స్థానిక సంస్థలకు పోటీ చేసే అభ్యర్థులకు కూడా వర్తిస్తాయి.
- స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కనీసం 21 ఏళ్లు ఉండాలి.
- 1995 సంవత్సరం తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగుంటే పోటీకి అనర్హులు.

అధికార విధులు

- ప్రకరణ **243W** అధికార విధుల గురించి వివరిస్తోంది.

12వ షెడ్యూల్‌లో 18 విధులను పట్టణ స్థానిక సంస్థలకు నిర్దేశించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీ చేస్తాయి. పన్నెండో షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధుల వివరాలు..

1. నగర ప్రణాళిక
2. సమర్థవంత భూ వినియోగం, భవన నిర్మాణాలపై నియంత్రణ
3. ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికలు
4. మురికివాడల నిర్మూలన, అభివృద్ధి
5. పట్టణ అడవులు, పర్యావరణ పరిరక్షణ
6. రహదారులు, వంతెనలు
7. ప్రజారోగ్యం, మురుగు నీటిపారుదల, చెత్త నియంత్రణ
8. అగ్నిమాపక వ్యవస్థ
9. పరిశ్రమలకు, గృహాలకు నీటి వసతి
10. బలహీన వర్గాల సంరక్షణ, వికలాంగులకు వసతి.
11. వీధి దీపాలు, బస్టాండుల నిర్వహణ
12. కబేళాలపై నియంత్రణ
13. నగర దారిద్ర్య నిర్మూలన పథకాలు
14. విద్య, సాంస్కృతిక అభివృద్ధికి చర్యలు
15. జంతువుల సంరక్షణ
16. ఆట స్థలాలు, ఉద్యానవనాల నిర్వహణ
17. శ్మశాన వాటికల నిర్వహణ
18. జనన, మరణాల నమోదు

ఆదాయ వనరులు, హక్కులు

ప్రకరణ 243X ప్రకారం స్థానిక సంస్థలు తమ ఆదాయం కోసం శాసనసభ నిర్ణయించిన మేరకు పన్నులు విధించడం, వసూలు చేయడం చేయవచ్చు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహాయ నిధులు అందిస్తాయి.

ప్రకరణ 243Y ప్రకారం ఫైనాన్స్ కమిషన్

- 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న ప్రకరణ 243Iలోని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ పట్టణ స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది.

ప్రకరణ 243Z ప్రకారం అకౌంటింగ్ అండ్ ఆడిటింగ్

పట్టణ, నగర కార్పొరేషన్ సంస్థల అకౌంట్‌లను పరిశీలించేందుకు రాష్ట్ర శాసనసభ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 243ZA ప్రకారం మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ

ప్రకరణ 243Kలో ప్రస్తావించిన విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుంది.

ప్రకరణ 243ZB ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు

74వ రాజ్యాంగ సవరణలోని అంశాలు కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తాయి. పార్లమెంటు చట్టం ద్వారా వీటిని వర్తింప చేస్తుంది.

ప్రకరణ 243ZC ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపులో మినహాయింపులు

- 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలు, 244(2) ప్రకారం షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో ఈ విభాగం వర్తించదు.
- పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలోని కొండ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన గూర్ఖాహిల్ కౌన్సిల్‌కు ఈ విభాగం వర్తించదు.
- ప్రకరణ 244(1), 244(2) ప్రకారం షెడ్యూల్డ్, ఆదివాసీ ప్రాంతాలకు ఈ విభాగాన్ని వర్తింపచేస్తూ పార్లమెంట్ శాసనాలను రూపొందించవచ్చు. అయితే వాటిని రాజ్యాంగ సవరణలుగా పరిగణించరు.

ప్రకరణ 243ZD ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీ

- ప్రతి రాష్ట్రంలో జిల్లా స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ పంచాయతీ, మునిసిపాలిటీలు రూపొందించిన ప్రణాళికలను సమీకరించి తుది ప్రణాళికలను రూపొందిస్తుంది. జిల్లా ప్రణాళిక కమిటీ నిర్మాణాన్ని రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.

గమనిక: జిల్లా ప్రణాళిక కమిటీ కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీకి వర్తించదు.

ప్రకరణ 243ZE ప్రకారం మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీ

10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటి నిర్మాణం, విధులు వంటి అంశాలను రాష్ట్ర శాసన సభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. నగర మేయర్ ఈ కమిటీకి చైర్మన్‌గా, మునిసిపల్ కమిషనర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. దీంతోపాటు కమిటీలో మునిసిపల్ పాలనలో అనుభవమున్న నలుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులను గ్రామ పంచాయతీ అధ్యక్షులు, మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రతినిధులు ఎన్నుకుంటారు.

ప్రకరణ 243ZF ప్రకారం పాత శాసనాల కొనసాగింపు

74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరం వరకు రాష్ట్రంలో అమల్లో ఉన్న పాత చట్టాలే కొనసాగుతాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలను అనువర్తింప చేసుకోవాలి.

పట్టణ స్థానిక సంస్థలు - నిర్మాణం

1992లో 74వ రాజ్యాంగ సవరణ తర్వాత పట్టణాల్లో కూడా మూడంచెల స్థానిక ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొదటి అంచె – నగర పంచాయతీ
రెండో అంచె – పురపాలక సంస్థలు
మూడో అంచె – నగరపాలక సంస్థలు

నగర పంచాయితీ

గ్రామీణ వ్యవస్థ నుంచి పట్టణీకరణ దిశగా మారుతున్న సుమారు 20,000 నుంచి 40,000 వరకు జనాభా గల చిన్న పట్టణ ప్రాంతాలకు నగర పంచాయతీ హోదా కల్పిస్తారు. నగర పంచాయతీని జనాభా మేరకు వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డు నుంచి ఓటర్లతో ఒక సభ్యుడు నేరుగా ఎన్నికవుతారు. ప్రతి నగర పంచాయతీలో గరిష్ఠంగా 10 మంది ఎన్నికైన వార్డు సభ్యులు, ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు.

- నగర పంచాయతీలో నివాసముంటున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా ఉంటారు.
- నగర పంచాయతీ సభ్యులు తమలో ఒకర్ని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- సర్పంచ్, ఉప సర్పంచ్‌లను తొలగించినట్లే వీరిని కూడా అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

పురపాలక సంస్థలు

1965లో సమగ్ర పురపాలక సంస్థల చట్టం ప్రకారం మునిసిపాలిటీలు ఏర్పడ్డాయి. 74వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో కొత్త చట్టాన్ని రూపొందించింది. 40,000 నుంచి 3,00,000 జనాభా ఉన్న పట్టణాల్లో పురపాలక సంస్థలను ఏర్పాటు చేస్తారు. వార్షికాదాయ, పరిమాణాల ఆధారంగా పురపాలక సంస్థలను ఐదు రకాలుగా వర్గీకరించారు. అవి..

1. సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం: వార్షిక ఆదాయం రూ.8 కోట్ల కంటే ఎక్కువ ఉన్నవి.
2. స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘం:వార్షికాదాయం రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల మధ్య ఉన్నవి.
3. గ్రేడ్-1 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల మధ్య ఉన్నవి.
4. గ్రేడ్-2 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.2 కోట్లు నుంచి రూ.4 కోట్ల మధ్య ఉన్నవి.
5. గ్రేడ్-3 పురపాలక సంఘం: వార్షికాదాయం కోటి రూపాయల నుంచి రూ. రెండు కోట్ల లోపు ఉన్నవి.

సూచన: ఈ వర్గీకరణను ప్రభుత్వం కాలానుగుణంగా మార్చవచ్చు.

ప్రతి పురపాలక సంస్థలో నాలుగు అంగాలు ఉంటాయి. అవి..

పురపాలక మండలి: పురపాలక సంస్థ చర్చా వేదికే పురపాలక మండలి. ఇందులో ఎన్నికైన సభ్యులు, కోఆప్టెడ్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉంటారు.

మున్సిపల్ కౌన్సిలర్లు: వీరిని ఓటర్లు వార్డు ప్రాతిపదికన ఎన్నుకుంటారు. జనాభాను బట్టి వీరి సంఖ్యను నిర్ణయిస్తారు.

- 40 వేల వరకు జనాభా ఉంటే 21 మంది కౌన్సిలర్లు ఉంటారు.
- జనాభా 40 వేల నుంచి లక్ష వరకు ఉంటే 21 మంది సభ్యులు, ప్రతి 10 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటే 27 మంది సభ్యులు, ప్రతి 15 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా రెండు లక్షల మించి ఉంటే 33 మంది సభ్యులు, ప్రతి 20 వేల అదనపు జనాభాకు ఒక అదనపు సభ్యుడు ఉండవచ్చు. గరిష్ఠంగా 45 సభ్యులకు మించరాదు.

మూడో వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
గణితం-ఎస్ఏ/ఎస్‌జీటీ కంటెంట్

భాగస్వామ్యం

- భాగస్వామ్యం: ఒక వ్యాపారాన్ని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉమ్మడిగా చేస్తే వారిని 'భాగస్వాములు' అని, ఆ వ్యాపారాన్ని 'భాగస్వామ్యం' అంటారు.
- భాగస్వాములందరి పెట్టుబడులు ఒకే కాలం వరకు ఉంటే, పెట్టుబడుల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.
- వేర్వేరు పెట్టుబడులు వేర్వేరు కాలాల్లో ఉంటే పెట్టుబడి, వాటి కాలాల పరిమితి లబ్ధాల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.

1. A, B అనే ఇద్దరు భాగస్వాములు వరుస గా రూ. 4,000, రూ. 6,000 పెట్టుబడులతో వ్యాపారం చేశారు. వారు సంవత్సరం వ్యాపారం చేయగా రూ.1500 లాభం వస్తే A, Bలకు వచ్చే లాభాల తేడా?
1) రూ.100 2) రూ.200
3) రూ.300 4) రూ.600

జ. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన కాలాలు సమానం అయితే లాభాల నిష్పత్తి = పెట్టుబడుల నిష్పత్తి
= 4,000 : 6,000 = 2:3
మొత్తం లాభం = 2+3 → 1500
⇒ 5 → 1500
$1 \to \frac{1500}{5} = 300$
A, B లకు వచ్చే లాభాల తేడా
= 3-2 = 1 → రూ.300

2. P, Q లు సమాన పెట్టుబడులతో వ్యాపారాన్ని ప్రారంభించారు. 9 నెలల తర్వాత Q వ్యాపారం నుంచి విరమించుకున్నాడు. ఏడాది చివర వచ్చిన లాభం రూ. 8540. అందులో Q వాటా?
1) రూ.1220 2) రూ.2440
3) రూ.4880 4) రూ.3660

జ. వ్యాపారంలో సమాన పెట్టుబడులు ఉంటే లాభాల నిష్పత్తి = కాలాల నిష్పత్తి
= 12 నెలలు : 9 నెలలు
= 4 : 3
వచ్చిన మొత్తం లాభం = 4+3 → రూ.8540
(సమస్య నుంచి)
7→ రూ.8540
$1 \to \frac{8540}{7}$ Rs.1220
Q వాటా = 3→ 3 × 1220 = రూ.3660

3. రూ.9000 పెట్టుబడితో A వ్యాపారం ప్రారంభించాడు. 5 నెలల తర్వాత రూ. 8000 పెట్టుబడితో B చేరాడు. ఏడాది చివర వారి లాభం రూ. 4100 అయితే A వాటా?
1) రూ. 2700 2) రూ. 1400
3) రూ. 4100 4) రూ. 1300

జ. వేర్వేరు పెట్టుబడులు, వేర్వేరు కాలాల్లో ఉండే లాభాల నిష్పత్తి =
పెట్టుబడి × కాలాల నిష్పత్తి
A, B ల లాభాల నిష్పత్తి =
9000 × 12 నెలలు : 8000 × 7 నెలలు
= 108:56 = 27:14
మొత్తం లాభం = 27+ 14 → 4100
41 → 4100
$1 \to \frac{4100}{41} = 100$
Aకు వచ్చే లాభం
27 → 27 × 100 = రూ. 2700

4. రూ. 8,000, రూ.4,000, రూ. 8,000 వరుస పెట్టుబడులతో రాజు, రమణ, రవిలు వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రాజు వ్యాపారం వదిలేశాడు. 8 నెలల తర్వాత రూ. 4005లాభం వచ్చింది. దానిలో రమణ వాటా?
1) రూ. 890 2) రూ.1335
3) రూ. 1602 4) రూ. 1780

జ. లాభాల నిష్పత్తి
= పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
=(8000×6):(4000×8):(8000×8)
= 48:32:64 = 3:2:4
∴ రాజు, రమణ, రవిల లాభాల నిష్పత్తి
మొత్తం లాభం = 3+2+4 → రూ. 4005
9 → రూ. 4005
$1 \to \frac{4005}{9}$
రమణ వాటా $2 \to 2 \times \frac{4005}{9} = 890$

5. రాముడు వ్యాపారం ప్రారంభించిన కొద్ది మాసాలకు రహీమ్‌ను వ్యాపారంలో చేర్చు కున్నాడు. అప్పుడు వారి పెట్టుబడుల నిష్పత్తి 4:5. ఏడాది చివరన లాభంలో రాముడు, రహీంల వాటాలు వరుసగా రూ.3300, రూ.2750 అయితే రహీం వ్యాపారంలో ఎప్పుడు చేరాడు?
1) 8 నెలల తర్వాత 2) 6 నెలల తర్వాత
3) 4 నెలల తర్వాత 4) 3 నెలల తర్వాత

జ. రాముడు పెట్టుబడి పెట్టిన కాలం 12 నెలలు రహీం పెట్టుబడి పెట్టిన కాలం x నెలలు అనుకోండి.
పెట్టుబడుల నిష్పత్తి = 4: 5
లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
3300 : 2750 = 4 × 12 : 5× x
$5x = \frac{2750 \times 4 \times 12}{3300} = 40$
x = 40/5 = 8
∴ రహీం పెట్టుబడి పెట్టిన కాలం = 8 నెలలు అంటే 4 నెలల తర్వాత (12–8=4) రహీం వ్యాపారంలో చేరాడు.

6. A, B, Cలు కలిసి వ్యాపారంలో రూ. 50,000 మూలధనం సమకూర్చుకున్నారు. B కంటే A రూ. 4,000 ఎక్కువ, C కంటే B రూ. 5,000 ఎక్కువ పెట్టుబడి పెట్టారు. మొత్తం లాభం రూ. 35,000 అయితే A వాటా ఎంత?
1) రూ. 8,400 2) రూ. 11,900
3) రూ. 13,600 4) రూ. 14,700

జ. C పెట్టుబడి = x అనుకోండి
B పెట్టుబడి = x + 5000,
A పెట్టుబడి = (x + 5000) + 4000
A, B, C ల మొత్తం పెట్టుబడి
= x + (x + 5000) +
[(x + 5000) + 4000] = రూ. 50,000
(సమస్య నుంచి)
⇒ 3x+ 14,000= రూ. 50,000
⇒ x = రూ.12,000
A, B, Cల పెట్టుబడులు
= (12,000 + 5000) + 4000,
12,000 + 5000, 12,000
A, B, Cల పెట్టుబడుల నిష్పత్తి
= 21,000 : 17,000 : 12,000
= 21 : 17 : 12
మొత్తం లాభం = 21 + 17 + 12
→ 35,000
50→35,000
$1 \to \frac{35000}{50} = 700$
A వాటా 21 → 21 × 700
= రూ. 14,700

7. భాగస్వామ్య వ్యాపారంలో A, Cల పెట్టుబడి 2:1గా, A,Bల పెట్టుబడి 3:2 గా ఉంది. సంవత్సరాంతాన మొత్తం లాభం రూ.3,900 అయితే A, C వాటాల తేడా ఎంత?
1) రూ.600 2) రూ.900
3) రూ.1200 4) రూ.1500

జ. A : C = 2:1, A : B = 3 : 2
$\frac{A}{C} = \frac{2}{1} = \frac{2 \times 3}{1 \times 3} = \frac{6}{3}$
$\frac{A}{B} = \frac{3}{2} = \frac{3 \times 2}{2 \times 2} = \frac{6}{4}$
A : B : C = 6 : 4 : 3(లేదా)
C : A = 1:2
A : B = 3:2
C : A : B = 1×3 : 2 ×3 : 2×2
= 3 : 6 : 4
మొత్తం లాభం
= 6 + 4 + 3 → 3,900
(సమస్య నుంచి)
13 → 3,900
$1 \to \frac{3900}{13} = 300$
A, C ల వాటాల తేడా = 6 – 3 = 3
→ 3 × 300 = రూ.900

8. డేవిడ్, గోపి పెట్టుబడుల మొత్తం రూ.40,400. ఏడాది చివర వచ్చిన మొత్తం లాభం రూ.10,000. పెట్టుబడుల నిష్పత్తిలో కాకుండా సమానంగా పంచుకుంటే డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. గోపి పెట్టుబడి?
1) రూ. 20,402 2) రూ. 19,998
3) రూ. 31,428 4) రూ. 26,868

జ. మొత్తం లాభం = రూ.10,000
సమానంగా పంచుకుంటే డేవిడ్, గోపిల లాభాలు రూ. 5,000 : రూ. 5,000
డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. కాబట్టి లాభాలను పంచాల్సిన విధానం
రూ.5050:రూ. 4950
లాభాల నిష్పత్తి = 5050 : 4950
= 101: 99
పెట్టుబడుల నిష్పత్తి = లాభాల నిష్పత్తి
= 101 : 99
పెట్టుబడుల మొత్తం
= 101+99 → రూ. 40,400
(సమస్య నుంచి)
200 → 40,400
$1 \to \frac{40,400}{200} = 202$
గోపి పెట్టుబడి
99 → 99 × 202 = రూ.19,998

9. అరుణ్, వరుణ్‌ల పెట్టుబడుల మొత్తం రూ. 65,000. సంవత్సర ఆదాయం రూ. 20,000. అందులో రూ.7,000 ఖర్చులకు పోనూ మిగిలింది పెట్టుబడుల నిష్పత్తిలో పంచుకోగా అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1,000 అధికంగా వచ్చింది. అయితే వరుణ్ పెట్టుబడి?
1) రూ. 30,000 2) రూ. 35,000
3) రూ. 25,000 4) రూ. 40,000

జ. సంవత్సర ఆదాయం = రూ. 20,000
ఖర్చులకు రూ. 7,000 పోను మిగిలిన ఆదాయం = 20,000– 7000 = 13,000
రూ.13,000ను అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1000 అధికంగా వచ్చేట్లు పంచుకొనే విధానం = రూ. 6,000, రూ. 7,000
= 6:7
పెట్టుబడుల మొత్తం = 6+7 → 65,000
(సమస్య నుంచి)
13→65,000
$1 \to \frac{65,000}{13} = 5000$
వరుణ్ పెట్టుబడి 7 → 7× 5,000
= రూ. 35,000

10. A, B, Cలు వరుసగా రూ. 2,500, రూ. 1,800, రూ. 2,000 పెట్టుబడి పెట్టి ఒక వ్యాపారం ప్రారంభించారు. 4 నెలల తర్వాత A తన పెట్టుబడి నుంచి రూ. 700 తీసుకొన్నాడు. తమ పెట్టుబడికి B రూ. 400, C రూ.300 కలిపారు. సంవ త్సరం చివర రూ. 945 లాభం వస్తే B, C లాభాల తేడా?
1) రూ. 10 2) రూ. 20
3) రూ. 30 4) రూ. 40

జ. A, B, Cల లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలం లబ్ధాల నిష్పత్తి
= 2500×4 + (2500–700)×8 :1800×4 +(1800+400)×8:2000×4+ (2000+300)×8
= 10000+14400:7200+17600:8000+ 18400 = 24400 : 24800 : 26400
= 61: 62: 66
మొత్తం లాభం= 61+62+66 →రూ.945
(సమస్య నుంచి)
$189 \to 945;\ 1 \to \frac{945}{189}$
B, Cల లాభాల తేడా = 66 – 62 = 4
$\frac{945}{189} \times 4$ = రూ.20

మాదిరి ప్రశ్నలు

1. గోపాల్, భూపాల్ వరుసగా రూ. 3,000, రూ. 5,000 పెట్టుబడితో వ్యాపారం చేశారు. సంవత్సరాంతమున వచ్చిన లాభం రూ. 1880 అయితే గోపాల్ వాటా?
1) 705 2) 1175
3) 1435 4) 1715
2. రాణి రూ. 2525 మూలధనంతో కూరల వ్యాపారం ప్రారంభించిన కొంతకాలానికి వాణి రూ. 1,200 పెట్టుబడితో వ్యాపారంలో చేరింది. సంవత్సరాంతాన వచ్చిన మొత్తం రూ. 1664 లాభంలో రాణి వాటా రూ. 1212 అయితే వాణి ఎన్ని నెలల తర్వాత వ్యాపారంలో చేరింది?
1) 3 2) 4
3) 5 4) 6
3. లాల్ వర్తకం ప్రారంభించి కొంత కాలానికి పాల్‌ను భాగస్తునిగా చేర్చుకున్నాడు. వారి పెట్టుబడుల నిష్పత్తి 3:4. సంవత్సరాంతమున వారి లాభాల వాటాలు సమానంగా ఉన్న పాల్ వ్యాపారంలో ఉన్న కాలం ఎన్ని నెలలు?
1) 3 2) 6 3) 9 4) 12
4. ఒక వ్యాపారంలో A రూ.6,000ను 5 నెలలు, B రూ.10,000ను 4 నెలలు, C రూ.15,000ను 6 నెలలు పెట్టుబడిగా పెట్టారు. వారికి వచ్చిన లాభం రూ.8000 అయితే A వాటా?
1) రూ.4,500 2) రూ. 2,000
3) రూ. 1,500 4) రూ. 3,000
5. రూ.15,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత రూ.10,000లతో B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంతమున లాభం రూ.6,000 అయితే B వాటా?
1) రూ.2,000 2) రూ.3,000
3) రూ.4,000 4) రూ.5,000
6. రూ.30,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంత మున లాభాలను సమానంగా పంచుకున్నారు. అయితే B పెట్టుబడి?
1) రూ.15,000 2) రూ.25,000
3) రూ.35,000 4) రూ.40,000
7. A, B వరుసగా రూ. 8000, రూ.12,000లతో వ్యాపారం ప్రారంభించారు. వారు 10% లాభాన్ని దానధర్మాలు చేశారు. సంవత్సరాంతమున కు A వాటా రూ. 5400 అయితే మొత్తం లాభం?
1) రూ.13,500 2) రూ.15,000
3) రూ.14,800 4) రూ.12,000
8. A, B వరుసగా రూ.20,000, రూ.30,000లతో వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రూ. 10,000లను A అదనంగా పెట్టుబడి పెట్టాడు. కానీ రూ. 5000లను B వెనక్కు తీసుకొన్నాడు. సంవత్సరాంతానికి వారికి వచ్చిన లాభం రూ. 8400 అయితే A వాటా?
1) రూ. 2,500 2) రూ. 4,000
3) రూ. 4,400 4) రూ. 5,200
9. A, Bలు 9:6 నిష్పత్తిలో వ్యాపారం ప్రారంభించారు. సంవత్సరం చివరలో వచ్చిన లాభం రూ. 6,800ను పొరపాటున 6:9 నిష్పత్తిలో పంచుకున్నారు. అయితే Bకు వచ్చిన అదనపు లాభం?
1) రూ.2,720 2) రూ.4,080
3) రూ.1,360 4) రూ.2,180
10. A, B, C లు 2:3:5 నిష్పత్తిలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం తమ పెట్టుబడుల నుంచి ఒక్కొక్కరు వరుసగా 20%, 25%, 30% వెనక్కు తీసుకున్నారు. రెండో సంవత్సరం వారు పంచుకునే లాభాల నిష్పత్తి?
1) 32: 45: 70 2) 4: 5:6
3) 12:17:21 4) ఏదీకాదు
11. ముగ్గురు రైతులు ఒక తోటను అద్దెకు తీసుకొన్నారు. మొదటి వ్యక్తి 30 ఆవులను మూడు నెలలు, రెండో వ్యక్తి 20 ఆవులను 4 నెలలు, మూడో వ్యక్తి 15 ఆవుల్ని 8 నెలలు ఉంచారు. తోట మొత్తం అద్దె రూ.580 అయితే 3వ వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?
1) రూ. 200 2) రూ. 240
3) రూ. 320 4) రూ. 360
12. ఉమ్మడి వ్యాపారంలో A, Bలు 3:5 నిష్పత్తి పెట్టుబడితో వ్యాపారం ప్రారంభిం చారు. B పెట్టుబడికి సమానంగా 6 నెలల తర్వాత C వాళ్లతో చేరాడు. ఒక సంవత్సరం చివర వచ్చిన లాభాన్ని వారు పంచుకొనే నిష్పత్తి?
1) 3: 5: 2 2) 1: 2 : 3
3) 3: 5: 5 4) 6: 10 : 5

<u>సమాధానాలు</u>

1) 1; 2) 1; 3) 3; 4) 3;
5) 1; 6) 4; 7) 2; 8) 2;
9) 3; 10) 1; 11) 2; 12) 4.

దేశంలో అతి పెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం ఖనిజాధార పరిశ్రమలు

ఖనిజాలు, లోహాలను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలను ఖనిజాధార పరిశ్రమలు అంటారు. ఇనుము-ఉక్కు పరిశ్రమ, అల్యూమినియం, సిమెంట్, ఎరువులు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు, రాగి పరిశ్రమ మొదలైనవి కొన్ని ముఖ్యమైన ఖనిజాధార పరిశ్రమలు.

ఇనుము - ఉక్కు పరిశ్రమ

ఏ దేశ ఆర్థికాభివృద్ధికైనా ఇనుము-ఉక్కు పరిశ్రమల అభివృద్ధి అతి ముఖ్యమైంది. అందువల్లే ఈ పరిశ్రమను 'మూల పరిశ్రమ' అంటారు. ఖనిజాధార పరిశ్రమల్లో ఇనుము-ఉక్కు పరిశ్రమ అత్యంత ప్రధాన, అతి పెద్ద పరిశ్రమ.

- భారతదేశంలో మొదటి ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని 1830లో తమిళనాడులోని పోర్టోనోవో వద్ద స్థాపించారు. 1866లో దీన్ని మూసేశారు.
- 1870లో పశ్చిమ బెంగాల్‌లోని కుల్టీ వద్ద 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ఇనుము-ఉక్కు పరిశ్రమను నెలకొల్పారు. ఇది దేశంలో మొట్టమొదటి ఇనుము-ఉక్కు పరిశ్రమ. దీన్ని బర్నాపూర్‌లోని ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (ఐఐఎస్‌సీవో)లో విలీనం చేశారు.

టాటా ఇనుము - ఉక్కు కర్మాగారం(టిస్కో): ఇది దేశంలోని మొదటి భారీ ఆధునిక ఇనుము-ఉక్కు కర్మాగారం. దీన్ని జార్ఖండ్‌లోని సక్చీ వద్ద 1907లో జంషెడ్‌జీ టాటా స్థాపించారు. ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన మొదటి కర్మాగారం ఇది. ప్రస్తుతం పనిచేస్తున్న అతి పురాతన ఇనుము-ఉక్కు కర్మాగారం. జంషెడ్‌జీ టాటా గౌరవార్థం సక్చీని 'జంషెడ్‌పూర్'గా వ్యవహరిస్తున్నారు.

- 1919లో పశ్చిమ బెంగాల్‌లోని 'బర్నాపూర్' వద్ద 'ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ' (ఐఐఎస్‌సీవో)ని స్థాపించారు. దీన్ని 1972లో కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- 1923లో కర్ణాటకలో షిమోగా జిల్లాలోని భద్రావతి వద్ద 'మైసూర్ స్టీల్ వర్క్స్' (మిస్కో) అనే ఇనుము-ఉక్కు కర్మాగారాన్నినిర్మించారు. అనంతరం విశ్వేశ్వరయ్య గౌరవార్థం ఈ పరిశ్రమకు 'విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్' (వీఐఎస్ఎల్) గా పేరు మార్చారు.

భిలాయ్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలోని 'భిలాయ్' వద్ద రష్యా సహకారంతో నిర్మించారు. కోర్బా ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఇది వినియోగించుకుంటోంది. దీని ఉత్పత్తి 1959లో ప్రారంభమైంది.

రూర్కెలా ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని ఒడిశాలో సుందర్‌గఢ్ జిల్లాలోని 'రూర్కెలా' వద్ద బ్రాహ్మణీ నది ఒడ్డున నిర్మించారు. దీనికి 'పశ్చిమ జర్మనీ' సహకారం చేసింది. ఇది 1959 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

దుర్గాపూర్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని పశ్చిమ బెంగాల్‌లోని బురద్వాన్ జిల్లాలో దామోదర్ నదీ ప్రాంతంలో దుర్గాపూర్ వద్ద నిర్మించారు. దీనికి బ్రిటన్ సహకారం చేసింది. ఇది 1962 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది. భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఇనుము -ఉక్కు కర్మాగారా లు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారు.

బొకారో ఇనుము - ఉక్కు కర్మాగారం: ఇది మూడో పంచవర్ష ప్రణాళిక కాలం (1964)లో ఏర్పాటైంది. దీన్ని జార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాలోని బొకారో, దామోదర్ నదుల సంగమ ప్రాంత సమీపంలో నిర్మించారు. అత్యధికంగా స్వదేశీ పరిజ్ఞానంతో, కొంత రష్యా సహకారంతో స్థాపించిన నాలుగో ప్రభుత్వరంగ ఇనుము-ఉక్కు కర్మాగారం.

- ప్రస్తుతం ఇది భారతదేశంలో అతిపెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం. 1972 నుంచి ఉత్ప త్తిని ప్రారంభించింది.

విశాఖ స్టీల్ ప్లాంట్: ఇది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉంది. దీన్ని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్.. రష్యా సహాయంతో నిర్మించింది. 1992 ఆగస్టు 1న నాటి ప్రధాని పీవీ నరసింహారావు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కర్మాగారం భారతదేశంలో అత్యాధునిక, తీరప్రాంతంలో ఉన్న ఏకైక ఇనుము-ఉక్కు కర్మాగారం.

- 1982లో తమిళనాడులోని 'సేలం' వద్ద ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఈ కర్మాగారం నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి. మరో కర్మాగారాన్ని కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలోని విజయనగ ర్ వద్ద నిర్మించారు.

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్): దీన్ని 1973లో న్యూఢిల్లీలో స్థాపించారు. ఇది పూర్తిగా ప్రభుత్వాధీన సంస్థ. దీనికి మహారత్న హోదా ఉంది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా, బొకారో, బర్నాపూర్, సమీకృత ఉక్కు కర్మాగారాలు మొదలైన వాటి నిర్వహణ బాధ్యత దీనిదే.

- భారతదేశంలో ఏర్పాటైన తొలి స్పాంజ్ ఐరన్ కర్మాగారం తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని పాల్వంచ (కొత్తగూడెం)లో ఉంది.

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో ఇనుము తర్వాత ఇది రెండో పెద్ద ఖనిజరంగ పరిశ్రమ. దీన్ని మన దేశంలో వార్‌బోర్న్ పరిశ్రమ అంటారు. 'అల్యూమినియం'ను విశ్వలోహం అంటారు. భారతదేశంలో 1937లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అసన్‌సోల్ సమీపంలో 'జాయక్‌నగర్' ప్రాంతంలో 'అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు.

- భారతదేశంలో 8 అల్యూమినియం శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. అవి..

1. ఇందాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ): దీనికి అలువాపురం(కేరళ), హీరాకుడ్ (ఒడిశా), బెల్గాం (కర్ణాటక)లో యూనిట్లు ఉన్నాయి.
2. హిందాల్కో(హిందుస్తాన్ అల్యూమినియం కంపెనీ): ఇది రేణుకూట్ (ఉత్తరప్రదేశ్)లో ఉంది.
3. బాల్కో(భారత్ అల్యూమినియం కంపెనీ): దీని కి కోర్బా(ఛత్తీస్‌గఢ్), రత్నగిరి(మహారా ష్ట్ర)లో యూనిట్లు ఉన్నాయి. బాల్కో మొదటిసారి లక్ష టన్నుల కెపాసిటీ సాధించింది.
4. నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ): ఇది దామన్‌జోడి(ఒడిశా)లో ఉంది.
5. మాల్కో(మద్రాస్ అల్యూమినియం కంపెనీ): ఇది మెట్టూరు (తమిళనాడు)లో ఉంది.

సిమెంటు పరిశ్రమ

భారతదేశంలో మొదటి సిమెంటు పరిశ్రమ 1904లో చెన్నైలో ప్రారంభమైంది. ప్రస్తుతం దీన్ని మూసివేశారు. పూర్తి స్థాయిలో 1912లో గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు.

- సిమెంటు ఉత్పత్తిలో భారత్‌ది రెండో స్థానం కాగా మొదటి స్థానంలో చైనా ఉంది.
- భారతదేశంలో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సిమెంటు ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. సిమెంటు పరిశ్రమకు ప్రధాన ముడి సరుకు సున్నపురాయి.
- ప్రస్తుతం మనదేశంలో 128 భారీ, 322 చిన్న సిమెంటు కర్మాగారాలున్నాయి.
- ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ సిమెంటు కర్మాగారాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీలు దాదాపు 65 శాతం సిమెంటును ఉత్పత్తి చేస్తున్నాయి. అసోసియేట్ సి మెంటు కంపెనీ(ఏసీసీ) లిమిటెడ్ అతి పెద్ద సి మెంట్ తయారీ సంస్థ కాగా దాల్మియా గ్రూపు రెండోది.

ఎరువుల పరిశ్రమ

దేశంలో మొదటి ఎరువుల పరిశ్రమను 1906లో తమిళనాడులోని రాణిపేటలో ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగంలో మొదట 1951లో బిహార్‌లోని సింద్రీ (ప్రస్తుతం ఈ ప్రాంతం జార్ఖండ్‌లో ఉంది) వద్ద ఆధునిక ఎరువుల కర్మాగారాన్ని నిర్మించారు. చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో ఎరువుల ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది.

- 1961లో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, 1974లో నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్‌ను స్థాపించడం ద్వారా ఎరువుల పరిశ్రమ అభివృద్ధి చెందింది.

గాజు పరిశ్రమ

భారతదేశంలో మొదటి గాజు పరిశ్రమను 1941లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో స్థాపించారు. ఈ పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలు.. ఇసుక, సున్నపురాయి, సిలికా, సోడా యాష్. ఫిరోజాబాద్ పరిశ్రమ గాజులు, పూసలకు ప్రసిద్ధి.

ఇంజనీరింగ్ పరిశ్రమలు

మనదేశంలో 1958లో హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ను రాంచీ(జార్ఖండ్)లో స్థాపించారు. దీని స్థాపనతో ఇంజనీరింగ్ పరిశ్రమ అభివృద్ధి ప్రారంభమైంది. ప్రస్తుతం దేశ అవసరాలకు కావాల్సిన అన్ని రకాల సామగ్రిని మన దేశం తయారు చేస్తోంది.

దేశంలోని ప్రధాన ఇంజనీరింగ్ పరిశ్రమలు

హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్: జార్ఖండ్‌లోని రాంచీలో ఉంది. ఇది ఉక్కు పరిశ్రమ. యంత్ర సామగ్రి, హెవీ క్రషింగ్, గ్రైండింగ్ యంత్రాలు, క్రేన్లు, రోలింగ్ యంత్రాలు, నూనె బావుల డ్రిల్లింగ్ రిగ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది.

మైనింగ్ అండ్ అలైడ్ మిషనరీ కార్పొరేషన్ లిమిటెడ్: ఇది దుర్గాపూర్ (పశ్చిమ బెంగాల్) ఉంది. రకరకాల ఖనిజ యంత్రాలను తయారు చేస్తోంది.

భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్: ఇది విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)లో ఉంది. పెట్రో రసాయనాలు, ఎరువుల యంత్రాలను తయారు చేస్తోంది. దీన్ని 2009లో బీహెచ్‌ఈఎల్‌లో విలీనం చేశారు.

తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్: ఇది కర్ణాటకలో ఉంది. గేట్స్, ట్రాన్స్‌మిషన్ టవర్స్, పెన్‌స్టాక్ పైప్స్ తయారు చేస్తుంది.

ఇతర పరిశ్రమలు

1. **హిందుస్తాన్ మెషీన్ టూల్స్(హెచ్ఎంటీ):** దీన్ని 1953లో కర్ణాటకలోని బెంగళూరులో స్థాపించారు. దీనికి అయిదు యూనిట్లు ఉన్నాయి. శ్రీనగర్ (జమ్మూకశ్మీర్), బెంగళూరు (కర్ణాటక), హైదరాబాద్, కాలమస్సేరి (కేరళ) యూనిట్లలో హెచ్ఎంటీవాచ్‌లు, పింజోర్ (హర్యానా) యూనిట్‌లో ట్రాక్టర్లను తయారు చేస్తారు.
2. **భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్):** దీన్ని 1956లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థాపించారు. దీనికి జగదీశ్‌పూర్, హరిద్వారా (ఉత్తరప్రదేశ్) తిరుచిరాపల్లి (తమిళనాడు), హైదరాబాద్‌లో యూనిట్లు ఉన్నాయి.
3. **ప్రాగా టూల్స్:** ఇది సికింద్రాబాద్ లో ఉంది. ఇక్కడ రక్షణ సామగ్రిని తయారు చేస్తారు.
4. **హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్):** దీనికి హైదరాబాద్, రూప్ నారాయణపూర్ (పశ్చిమబెంగాల్)లో యూనిట్లు ఉన్నాయి.
5. **హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ:** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
6. **హెవీ వెహికల్ ఫ్యాక్టరీ:** ఇది ఆవడి (చెన్నై) లో ఉంది.
7. **హిందుస్తాన్ హౌజింగ్ ఫ్యాక్టరీ లిమిటెడ్:** ఇది న్యూఢిల్లీ ఉంది.
8. **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్):** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
9. **హిందుస్తాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్:** ఇది పింప్రీ(మహారాష్ట్ర)లో ఉంది.
10. **హిందుస్తాన్ ఫొటో ఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్:** దీన్ని 1960లో భారత ప్రభుత్వం తమిళనాడులోని ఊటీ వద్ద ఏర్పాటు చేసింది.
11. **ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఐడీపీఎల్):** దీని కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది..

Is Hacker A Hero or Villain?



BANK EXAMS

COMPUTER AWARENESS

Hacker (Computer security)

Hacker is considered as hero of computer programs. In computer security, a hacker is someone who focuses on security mechanisms of computer and network systems. He is someone who lives and breathes computers, who know all about computers, who can get a computer to do anything. Equally important, though, is the hacker's attitude. Computer programming must be a hobby, something done for fun, not out of a sense of duty. Hackers are generally computer geniuses because it is due to the extraordinary computer knowledge and skills that they can conveniently break into other computer systems.

CRACKER

Cracker is considered as villain of computer programs. A cracker is someone who breaks into someone else's computer system, often on a network; bypasses passwords or licenses in computer programs; or in other ways intentionally breaches computer security. A cracker does this for profit, maliciously, for some altruistic purpose.

CLASSIFICATION OF HACKERS BASED ON THEIR ATTITUDE:

WHITE HAT

A "White hat" hacker breaks security for non-malicious reasons, perhaps to test their own security system or while working for a security company which makes security software. The term "white hat" in Internet slang refers to an ethical hacker.

BLACK HAT

A "Black hat" hacker is a hacker who "violates computer security for little reason beyond maliciousness or for personal gain". Black hat hackers break into secure networks to destroy, modify, or steal data; or to make the network unusable for those who are authorized to use the network. Black hat hackers are also referred to as the "crackers" within the security industry and by modern programmers.

GREY HAT

A grey hat hacker lies between a black hat and a white hat hacker. Grey hat hackers sometimes find the defect of a system and publish the facts to the world instead of a group of people. Even though grey hat hackers may not necessarily perform hacking for their personal gain, unauthorized access to a system can be considered illegal and unethical.

ELITE HACKER

A social status among hackers, elite is used to describe the most skilled. Newly discovered exploits circulate among these hackers.

SCRIPT KIDDIE

A script kiddie (also known as a skid or skiddie) is an unskilled hacker who breaks into computer systems by using automated tools written by others.

NEOPHYTE

A neophyte ("newbie", or "noob") is someone who is new to hacking or phreaking and has almost no knowledge or experience of the workings of technology and hacking.

BLUE HAT

A blue hat hacker is someone outside computer security consulting firms who is used to bug-test a system prior to its launch, looking for exploits so they can be closed.

PHREAKS

A phreak is a hacker who specializes in phone systems. These days, however, phreaking is more of a cracker activity. At one time, phreaks were enthusiastic about telephone networks and simply wanted to understand how they worked and explore them. Ethical phreaks didn't steal services or cause damage; they just used their technical skill to play with the system. Phone systems have changed and are less susceptible to technological hacks. As a result, modern phreaks intent on cracking the telecommunications systems often rely on criminal acts such as stealing phone cards and cloning cell phones.

HACKTIVISTS

The hacktivist is a gray hat or cracker who defaces Web pages to bring attention to a political agenda or social cause. Companies, organizations, and governments that engage in controversial practices or that have unpopular policies are likely targets of hacktivists. How ethical this behaviour is depends on whether or not you support the hactivist's agenda or believe in his cause.

MODEL QUESTIONS

1. Retail employees typically use ________ terminals to process sales transactions.
   1) Point of sale
   2)Transaction point
   3) Automatic teller
   4) Sales processing
   5) None of these
2. The simultaneous processing of two or more programs by multiple processors is _____
   1) Multiprogramming
   2) Multiprocessing
   3) Time-sharing
   4) Multitasking
   5) None of these
3. The ___ folder retains copies of messages that you have started but are not yet ready to send.
   1) Drafts 2) Sent Items
   3)Address Book
   4) Outbox
   5) None of these
4. Inheritance is the ability of an object to pass on its characteristics to its ________.
   1) Subclasses 2)off-spring
   3) Super classes 4) Parents
   5) None of these
5. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + Y
   3) Ctrl + A 4) Ctrl + W
   5) None of these
6. A program that converts high level language to machine Language is _______
   1) Linker 2) Assembler
   3) Compiler
   4) All of the above
   5) None of these
7. At a time how many operating system can be at work on a computer?
   1) Only one 2) Two
   3) Three 4) Four
   5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers_________
   1) Hybrid Computer
   2) Analog Computer
   3) Digital Computer
   4) Super Computer
   5) None of these
9. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called _______
   1) Multitasking 2) Switching
   3) Multiprocessing
   4) Multiprogramming
   5) Virtual storage
10. The maximum Zoom percentage in MS WORD is________
    1) 100% 2) 200%
    3) 400% 4) 500%
    5) None of these
11. The smallest memory size is?
    1) Byte 2) GigaByte
    3) KiloByte 4) MegaByte
    5) None of these
12. Android Operating system is an example of which kind of Source Model?
    1) Open Source
    2) Vertical Market Software
    3) Horizontal Market Software
    4) Shareware 5) None of these
13. Which process checks to ensure the components of the computer and operating are connected properly?
    1) Booting 2) Processing
    3) Editing 4) Saving
    5) None of these
14. Codes consisting of lines of varying widths or lengths that are computer-readable are known as?
    1) An ASCII code
    2) An OCR scanner
    3) A magnetic tape
    4) A bar code 5)None of these
15. What is the ultimate purpose of Defragmentation?
    1) Make the PC faster
    2) Create More Free Space
    3) Delete temporary files
    4) Reduce Power consumption
    5) None of these
16. Which input device cannot be used to work in MS Office?
    1) Scanner 2) Mouse
    3) Keyboard 4) Joy stick 5) Light pen
17. Storage that retains its data after the power is turned off is referred to as?
    1) Volatile storage
    2) Sequential storage
    3) Non-volatile storage
    4) Direct storage
    5) None of these
18. Accessing data on tapes is much ______ than that accessing data on disks?
    1) Same 2) Faster
    3) Slower
    4) All of the above
    5) None of these
19. IP-Address 192.5.48.3 belongs to-
    1) Class A 2) Class B
    (3) Class C 4) Class D
    5) None of these
20. Which type of web document is run at the client site?
    1) Static 2) Dynamic
    3) Active
    4) All of the above
    5) None of these
21. UDP (User Diagram Protocol) is-
    1) Connectionless
    2) Network Oriented
    3) Connection oriented
    4) a & b 5) None of these
22. Which of the following is NOT a Microsoft Internet tool or technology?
    1) Dreamweaver
    2) Silver light
    3) Internet Explorer
    4) Expression Web
    5) None of these
23. Which Software protects the resources of a private network from users from other networks?
    1) Cache server 2) proxy server 3) Firewall
    4) Router 5) None of these

KEY

1) 1; 2) 2; 3) 1; 4) 1;
5) 4; 6) 3; 7) 1; 8) 1;
9) 5; 10) 4; 11) 1; 12) 1;
13) 1; 15) 2; 14) 4; 16) 4;
17.3; 18) 3; 19) 3; 20) 1;
21.1; 22) 1; 23) 3.